భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

జూలై 1979

సంపుటము : 56 సంచిక : 7

విడిపత్రిక వెల రూపాయిన్నర

ప్రగతికి సంకేతాలు....

పరిశ్రమలు పెరుగుతున్నాయి.
వాటితోపాటు పట్టణాలూ పెరుగుతున్నాయి.
పట్టణాలకు వలస వస్తున్న వారల్లవరికి నివాసాలు కల్పించి
పట్టణాలను అందంగా, క్రమబద్ధంగా,
నివాసయోగ్యంగా రూపొందించాలి.
సజానికి శ్రమతో కూడిన కార్యక్రమమే !
ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పట్టణాలైన
హైదరాబాదు, విశాఖపట్నం, విజయవాడలలో
పట్టణాభివృద్ధి సంస్థలు పనిచేస్తున్నాయి.
ఈ పట్టణాలను సుందరంగా ప్రణాళికాబద్ధంగా
తయారుచేయడానికి కృషి చేస్తున్నాయి.
సమగ్ర పట్టణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా
బృహత్తర పథకాలను, మండల పథకాలను రూపొందిస్తున్నాయి.
పట్టణాలు ప్రగతికి సంకేతాలు !
భవిష్యత్తుకు బంగారు వాహనాలు !

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్.
No. 52.

విషయానుక్రమణిక

జూలై 1979

వంతెన

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

వ్రాలెడు ప్రొద్దుల మనమట
　　కూలంకష గౌతమీ ప్రకోపిత వీచీ
పాళుల చూచుచు గడపిన
వేళల స్మృతులెన్నడేని వెలయున మదిలో ?

అలల ఉద్రిక్త నృత్యలీలలు మనోజ్ఞ
మగుచు కనవచ్చినవి మన కాదినాల !
గుండియల త్రుళ్ళ బంగారు కోర్కెగుముల
మనమె తరగల రీతిగా మారినాము !

నలుబది ఏళ్ళనాటి కథనమ్మిది ! నీవును నేను అప్పుడే
అలరుల తావికో, పరభృతాంగన తీయని తేనె పాటకో,
మలయ సమీర భంగముల మాలలకో, హరిదంత నవ్యవీ
థులకొ, సదా ఏవో కలలతో మనినార మమాయికమ్ముగా !

కాలిని ముల్లుదూరిన, అకాలపు వానల చిక్కిపోయినన్
తేలికగా, అదేదో ఒక తీరగు తీరని నవ్వులాటగా,
హేలగ, కేళిగా తలచుటేగద పద్ధతి ! సంతతమ్మవా
తాల హతాంబు భాక్శకల ధోరణి కాలము బుచ్చినాములే !

మన స్నేహ మపూర్వమ్మని
మన మెప్పుడు బ్రదుకు బాట మరి విడివడ బో
మని ఏదో, వెర్రిగ మన
మనుకొంటిమి — కాని, కల్లలయినవి ఊహల్ !

విడివడినాము—పట్టితిమి వేరగు దారుల! ఏళ్ళు పూళ్ళనున్
గడచెను చల్లగా! ఇపుడు కట్టు ప్రయత్నము చిన్నివంతెనన్,
విడి విడి కాగితమ్ములను వేయుచు ముళ్ళిటు లక్కరమ్ములన్,
తడబడు భావనార్ద్ర చరణమ్ముల నీదరి జేరు కోర్కెతో !



శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

అష్టభాషా-బహిరీ-గోపాలరాయకవి

మహబూబునగరం జిల్లా వనపర్తి సంస్థానము ఏలిన రాజులలో ఆరవ రాజు గోపాలరావు. ఇతడు క్రీ॥ శ॥ 1648వ సంవత్సరములో రాజ్యము ఏలినాడు. ఈ రాజు కవి సాహితీ సమరాంగణ సార్వభౌమునివలె, రాజ్యపాలనము నందు–సాహిత్య–కవిత్వా గోష్ఠులందు మిక్కిలి సమర్థుడు.

ఇతడు ఆంధ్ర – సంస్కృత – పారశీకాది భాషలేకాక శౌరసేన – మాగధీ మొదలైన ప్రాకృత భాషలలో గూడ పండితుడు. ఎనిమిది భాషలు సమగ్రముగా తెలిసినవాడు కాబట్టి ఈ రాజ కవికి 'అష్టభాషా' అని ఆకాలమునందు బిరుదు లభించినది.

ఇతడు శత్రువుల పైన బహిరీ పక్షివలె పడి వారిని హతమార్చుచుండెను గనుక హైదరాబాదు కుతుబ్‌షాహీ నవాబు 'బహిరీ' అని బిరుదము ఇతనికి ఇచ్చి ఉండెను. బహిరీ అనగా పార్సీ భాషలో, డేగజాతి పక్షి యని అర్థము.

ఈ రాజుకు, తన తండ్రి వెంకటరెడ్డి, ఆయనపేర నిర్మించిన వెంకటాపురం గ్రామములో కోదండరామస్వామి ఆలయం కట్టించినాడు. ఆ దేవుని పేరనే గోపాలరావు 'రామచంద్రోదయః' అను యమక కావ్యము సంస్కృతమునందు అతి జటిలముగా వ్రాసి, అది అర్థమగుటకు దానికి 'విజ్ఞేయార్థ దర్పణము' అను వ్యాఖ్యానము గూడ వ్రాసెను.

ఇదిగాక, 'శృంగార మంజరీ భాణము' అను నొక రూపకము గూడ సంస్కృతములో రచించెను. ఈ విధముగా ఆ రాజకవి సంస్కృత శ్రవ్య – దృశ్య రచనలుచేసి ప్రసిద్ధుడాయెను. ఎందరో పండితులను పోషించిన విద్వత్కవి అతడు. తెలుగులో గూడ గ్రంథములు వ్రాసినట్లు ఆయన –

> ''సజో యథాంధ్రోక్తి మయ ప్రపంచాన్
> పరం శిరోభిర్ధ ధతే కవీంద్రాః''

అని స్వయముగా వ్రాసికొనినాడు.

గోపాలరావు, తాను ఆరు శాస్త్రములలో పండితుడనని, సాహితీ సార్వభౌముడనని, సంగీత విద్యా నిష్ణాతుడనని, దానశీలుడననియు ఈ శ్లోకములో వ్రాసికొనినాడు:–

''షట్శాస్త్ర పారదృశ్వా, సరస మృదువచ శ్శర్మణ్య నానాకవీంద్ర స్తుత్య స్వాశేష భాషా కృత బహు మధురోదార చిత్ర ప్రబంధః। సాహిత్యే సార్వభౌమః, సకల గుణనిధిః, సాంగ సంగీత విద్యా నిష్ణాతః, స్తూయతే యో దిశిదిశి విబుధైః చంద్రికాచారు కీర్తిః॥

తనది 'జనుంపల్లి' వంశము అని రామచంద్రోదయ యమక కావ్యము వ్రాసినానని, అది మిక్కిలి భవ్య కావ్యమని, దాని అర్థము సులభముగా తెలియని మందాత్ములకు అనుగ్రహించుటకు తానే దానికి వ్యాఖ్య వ్రాసినాననియు ఈ శ్లోకమునందు ఆ రాజకవి చెప్పినాడు :–

''శ్రీమాన్ గోపాలరాయక్షితి రమణమణిః 'జన్పతీ' వంశ చంద్రః న్వోక్త 'శ్రీరామచంద్రోదయ' యమక మహాకావ్య మత్యర్థభవ్యం। వ్యాఖ్యాతి ఖ్యాతిమిచ్ఛుః స్వయమయ మధునా సత్ప్రభూతానుభావః మందాత్మానుగ్రహార్థీ సతత వితరణన్య క్కృతామర్త్య భూజః''

అని వ్రాసినాడు రామాయణ కథ సంగ్రహముగా నిందు పొందుపరపబడినది.

'సర్వశాస్త్ర పండితులు ఈ వ్యాఖ్యానమును పరిశీలింతురు గాక'అని ఈ శ్లోకమునందు సవాలుచేసినట్లు రాజకవి వ్రాసెను:–

> వైయాకరణమూర్ధన్యాః నిఘంటూత్కర వేదినః।
> యేఽలంకారేషు నిష్ణాతాః వ్యాఖ్యాం పశ్యంతు తేత్విమాం॥

అని.

ఈ యమక కావ్యము భోజాస్థానము నందలి 'అభినవ కాళిదాసు' వ్రాసిన నవోదయమను యమక కృతికన్న మిన్నగా తాను వ్రాసినట్లు

> ''అకృత సనామాధీకం యమక కృతిం
> కాళిదాస నామాధీరం''

అను యమకములో వ్రాసినాడీ కవి.

ఈ కావ్యము నందలి నాందీ శ్లోకము యమకముతో ప్రారంభించెను .–

> ''శ్రేయో రామో దేయాత్
> సోఽస్మభ్యం దీక్షితో ధరామో దేయాత్,
> శ్రుతి శిఖరామో దేయాత్
> యత్పద పద్మే నతే వరామో దేయాత్.''

అని. అనగా, "ధరామోదము (భూమండల సంతోషము) కొరకు, దీక్షితుడై (దీక్షగొనినవాడై), సః రామః (ఆరాముడు), అస్మభ్యం (మా కొరకు), అయాత్ (స్థిరమైన), శ్రేయః (శ్రేయస్సును), దేయాత్ (ఇచ్చుగాక); శ్రుతి శిఖరామోదే (వేద శిరస్సులైన ఉపనిషత్తులను పరిమళింపజేయు), యత్పద పద్మే (ఏ శ్రీరామ చంద్రుని పాదకమలము) అయాత్ (సద్భాగ్యము వలన) నతేసతి (నమస్కరింపబడగా), వరా (శ్రేష్ఠమైన), మా (లక్ష్మి), ఉదేయాత్ (ఉదయించును).

ఈ వ్యాఖ్యానము సకల శాస్త్రార్థములు—రస భావాలంకారములు—ఛందశ్శాస్త్ర విశేషములతోను అతివిపులముగా, జిజ్ఞాసువులకు ఉపదేశకముగాను వ్రాయబడినది. ఈవ్యాఖ్య చదివినచో నీకవి, తాను 'షట్శాస్త్ర పార దృశ్వా' అని వ్రాసికొనిన మాట నిజమని తోచును.

ఈ విధముగనే దాదాపు 600 ఆర్యాగీతికలలో 5 ఉచ్ఛ్వాసములు గల అతిమనోహర యమక కావ్యము సవ్యాఖ్యానముగా నీ కవి వ్రాసినాడు.

ఈ కాలమునందు యమక రచనకు అంతగా ఆదరము లేకున్నను మధ్య యుగమునందు పాండిత్య పూర్ణములైన యిట్టి కృతులను ఆదరించుచుండిరి. వాస్తవముగా ఏ యుగమునందైనను పాండిత్యానికి గౌరవము ఉన్నది కదా!

ఈ గోపాలరాయ కవియే 'శృంగార మంజరీ భాణము' అను దృశ్య కావ్యము రచించి, 'నాటకాంతం కవిత్వం' అనుమాట నిలిపికొనినాడు.

ఆ భాణము అతి సరళ శైలిలో లలితలలితముగా వ్రాయబడినది. కర్కశమైన యమకము వ్రాయు నితడు లలిత పద విన్యాసములతో భాణమెట్లు వ్రాసెనను ప్రశ్నకు సమాధానముగా భాణమునందు :—

"చిత్రాది నిర్మితిషు కర్కశతాం దధాతు
కాలే భవత్యతి మృదుః కవితా కవీనాం।
ధార్ష్ట్యం చిరం వహతు నామ రతేషు బాలా
లజ్జామృదుర్భవతి కేవల మన్యథాసా॥

అని వ్రాసెను.

ఆ భాణము తన కుల దైవమైన శ్రీ రంగనాయక స్వామి వసంతోత్సవ వర్ణన పరముగా నున్నది.

ఆ భాణము నందు చివరకు :—

"శ్రీమజ్జనుంపతి కులాబ్ధి సుధాగ భస్తిః
గోపాలరాయ సుకవిః కవి సార్వభౌమః।
భాణం విధాయ కుసుమైరివ సద్వ చోభిః
శ్రీరంగ భర్తు రధమాల్యమివార్పయత్తాం॥"

అను శ్లోకముతో ముగించెను.

మురారి అనర్ఘ రాఘవ నాటకమును తెలుగు ప్రబంధముగా వ్రాసిన బిజ్జల తిమ్మారెడ్డి (తిమ్మ భూపాలుడు), ఈ గోపాల రావుకు మేనల్లుడే. అతడు అలంపూరురాజు.

అష్టభాషా బహిరీ గోపాలరావు రచించిన 'రామచంద్రోదయ — శృంగార మంజరీ భాణములు' క్రీ॥ శ॥ 1895 సంవత్సరములో, అప్పటి వనపర్తి రాజు రెండవ రామేశ్వరరావు, వనపర్తిలో తాను స్థాపించిన 'బ్రహ్మ విద్యా విలాస ముద్రాక్షరశాల' యందు ముద్రించి ప్రచురించెను. అప్పటి ఆస్థాన విద్వాంసులైన ఆచార్ల రంగాచార్లు — చేట్లూరు కంఠీరవార్ల సంపాదకత్వములో ఈరెండు సంస్కృత కృతులను ఆ రాజు ముద్రించెను.

ఆ రెండు ఇప్పుడు అతి శిథిలములై యుండుటచేత ఇప్పటి ఆ వంశపు రాజు మూడవ రామేశ్వరరావుగారు (లోకసభ సభ్యుడు) తెలుగు—దేవనాగరీ లిపులలో పునర్ముద్రణ చేయించుచున్నారు.

ఈ గ్రంథములను సమగ్రముగ పరిశీలించి వీటి సంపాదకత్వ భారము వహించుమని శ్రీ రామేశ్వరరావుగారు నన్ను కోరినారు. 4–5 నెలల్లో ఈ రెండు లిపులలోను ఈ కృతిద్వయమునకు సూర్యాలోక భాగ్యము కలుగనున్నది.



నగ్న వృక్షం

శ్రీ పాశం వేంకటేశ్వర్ రెడ్డి

రాబోవు వసంతం తెచ్చే
   రంగుల చీర కోసం
ముందుగానే ఆకులు రాల్చి
నగ్నంగా నిలబడ్డది నా పెరట్లోనిచెట్టు.

   వేల కళ్ళలోంచి దూసుకొచ్చే
   ముళ్ళను భరించలేక
   ఆలస్యం చేస్తున్న వసంతాన్ని గురించి
      ఆలోచిస్తున్నదది.

పచ్చరంగు చీరలో
అచ్చం పెళ్ళికూతుర్లాతప్ప
నేను నాటుకున్న చెట్టును
నేనలా నగ్నంగా చూడలేను.

   ఆకులు, పూలు, పిందెలు నిండుగా ఉన్నపుడు
   రాగాలుతీస్తూ, గారాలుపోతూ
   శాఖల సందుల్లోదూరి చక్కిలిగింతలు పెట్టి
   గల గలమని నవ్వించేది గాలి.
   అప్పుడు నాకు —
   కోయిల పాట ముగించాక
   ఆకులు చప్పట్లు కొట్టినట్లనిపించేది.

ఇప్పుడేమో, అదే గాలి

   ముస్తాబవ్వాలని ముచ్చట పడుతున్న నా చెట్టుకు
   రాబోవు వసంతం--రాలబోయే మేఘం
   వీటి సంగతి చెప్పకుండానే
   తప్పించుకొని పోతుంది.

ఎప్పుడో ఎండ పొద్దున వ్రాలే
ఒంటరి కాకి తప్ప
భ్రమరాలు, పావురాలు
      ఏవీ రావడం లేదు.

నడిపొద్దు ఎండ
ఆకుల్లేని కొమ్మలతో
భూమిపై పిచ్చిగీతలు గీస్తుంది !
పక్షులు తమ గాన కచ్చేరీకి
ఇక్కడ గుమి గూడ్డం మానేశాయి.

   నా కంట్లో దుమ్ముగొట్ట
   నా పెరట్లోని చెట్టుకు చేస్తున్న అన్యాయం చూసి
   నాకు తెలియకుండానే ఎప్పుడో
   నా ఎదలో రొద మొదలయ్యింది !

పిడికెడు గుండె
కొండలను మ్రింగి, సముద్రాన్ని త్రాగినట్లు
ఉరుము లురిమి —
కళ్ళ తూముల్లోంచి కన్నీరు కక్కింది.

   కోటి పాటలతో **నా** తోటను నింపే కోయిల
   ఇదివరకెన్నిసార్లు నా నగ్నవృక్షాన్ని చూసి
   ఇంకా వసంతం రాలేదని
   విసుగుచెంది వెళ్ళిపోయిందో !

కొన్ని రోజులు గడవనీ ...

   చిగుర్లు పుట్టుకొచ్చాక
   పసరాకుల పట్టుచీర చప్పుడు విని
   గొంతు సవరించుకొని
   గంతులేస్తూ వస్తుందదే.

అందాన్ని, అలంకరణను
ముస్తాబును, ముచ్చటను
అన్నిటినీ నా కొదిలేసిన వృక్షానికి
వసంతం ఎన్నటికీ మోసం చేయదు.

నా కవిత

కలలతో
రంగు రంగుల అలలతో
పొంగి పొరలుతుంది !
జలధి నా కవిత !!

చల్లని తలపులతో
తెల తెల్లని మెఱపులతో—విరుపులతో
స్ఫురిస్తుంది
రసధారలు కురుస్తుంది !
జలదం నా కవిత !!

గొంతు మూగపోయినా
గుండెతో పలుకుతున్న
గండు కోకిల పాటకు
నిండుగా బదులిస్తుంది !
పల్లవి నా కవిత !!

మోడువారిన రసాల శాఖలపై
మళ్లీ మొలుస్తుంది !
క్రొత్త కోకిలలను కోరి పిలుస్తుంది !
పల్లవం నా కవిత !!

అక్షరాలు

తడబడుతున్న కలం నుండి,
ముడి విడివడుతున్న గళంనుండి,
సుడివడుతున్న అశ్రుజలంనుండి,
విరిసిన హృత్కమల దళంనుండి,

నురగలుగా,
తరగలుగా,
గీతాలుగా,
ప్రమదాశ్రు జలపాతాలుగా
పెల్లుబికేవి !

ఉషస్సు షమూవహంగా,
పరిణమించేవి !
పరిమళించేవి !!

హృదయ విపంచిని సవరించి,
రసధ్వనులు పలికించేవి !
రసధునులై పులకించేవి !!

శ్రీ గడియారం శేషఫణిశర్మ



శ్రీ చందు సుబ్బారావు

మేధావి

ఇరవై ఏళ్ళ క్రితం—

అన్నయ్య యూనివర్సిటీలో లెక్చరర్‌గా పనిచేస్తుండేవాడు. అప్పటికి వాడికింకా పెళ్ళికాలేదు. ఇరవైనాలుగ్గంటలూ పుస్తకాల్లోనే గడిపేవాడు. అన్నయ్య చాలా తెలివిగలవాడనీ, 'మేధావి' అనీ అంతా అనుకునేవాళ్ళు. వాడా వయసుకే ఎంతో సాహిత్యం, సైన్సూ, తత్వశాస్త్రం చదివాడనీ, ప్రొఫెసరు కుండాల్సిన పరిజ్ఞానం వుందనీ, చాలా గొప్పవాడవుతాడనీ వాడి స్నేహితుల నోటి నుండే వినేదాన్ని.

నేను బియ్యే ప్యాసయింతర్వాత ఇంట్లో అంతా 'ఇంక చదువు చాల'న్నారు. నాకు ఎమ్మే చదవాలనుండేది. చిన్నప్పటినుండీ భాస్కరం అన్నయ్యలా పెద్ద పెద్ద పుస్తకాలు చదివి పైకి రావాలన్న కోర్కె పీడించేది. చిన్నన్నయ్య 'యసెల్సీ'తో ఆపి వ్యాపారం చేసుకుంటున్నాడు. తమ్ముడు తరగతులు 'ఢీ' కొడుతున్నాడు. నాన్నకెటూ చదువులేదు అసలు మా వంశంలో భాస్కరానికి తప్ప ఎవరికీ చదువబ్బలేదు. నేను కూడా చదువుకుంటే బావుణ్ణనిపించేది. ఈ బియ్యే డిగ్రీతో చదువుకు వీడ్కోలు కాబోలు, ఏ పురుషోత్తముడికో జీవితం అంకితం కాబోలు అనుకుంటుండగా భాస్కరం అన్నయ్య దగ్గర్నుండి టెలిగ్రామ్ వచ్చింది.

'మిలియన్ కిసెస్ టు కామూ — ఎమ్మే సీట్ రిజర్వ్డ్ హియర్' అని.

అన్నయ్య నా పాలిటి దైవంలా కనిపించాడు. వాడికి చిన్నప్పటినుండీ నా మీదున్న ప్రేమ ఎవరికి చెప్పినా విడ్డూరంగా వుంటుంది. పొట్టిగా, చిన్నగా ఉండే నన్ను, ఆరడుగుల ఎత్తున భారీగావుండే అన్నయ్య ఒక్కచేత్తో గాల్లోకి లేపి ఏడిపించేవాడు. అమ్మ విసుక్కునేది, 'ఇదేమిట్రా—అదేమన్నా పసిపిల్లా' అంటూ.

చిన్నన్నయ్య నాతో మాట్లాడటమే అరుదు. వాడికి నేనెప్పుడూ దెయ్యంలాగే కనిపించేదాన్ని. తమ్ముడికీ నాకూ అసలు పడేదికాదు. నాకు చదువొస్తుందని వాడికెప్పుడూ అసూయ. మా అమ్మ సంతానం నల్గురం ఒక్కొక్క ఏడు తేడాతో పుట్టాం. భాస్కరం పద్నాలుగో ఏటే ఎసెల్సీ పాసయ్యాడు. మిగతావాళ్ళం పదిహేడో ఏటకాని స్కూలుచదువు దాటలేదు.

భాస్కరం అన్నయ్యలా పెద్ద పెద్ద విషయాలు నేర్చుకోవాలి. ఎవరికీ తెలియని సంగతులు మాట్లాడాలి. వాడిలా అందర్నీ ఆకర్షించాలి. నా మనస్సులో ఎప్పుడూ ఇదే ఆలోచన. నేనేమో ఆడపిల్లను. అందులోనూ అతి చిన్న విగ్రహం. తెలివి తేటలు కూడా సాదా మార్కు. రాసిపెట్టి ఉన్నవాడికి తప్ప అన్యులకు అందగత్తెలా కనిపిస్తానని నమ్మకంలేదు. వాడిలా ఎలా అవ్వగలనో అంతు పట్టేదికాదు. ఇది కలలా మిగిలిపోవటం 'ఖాయం' అనుకుంటుండగా అన్నయ్య టెలిగ్రాం వచ్చింది.

తర్వాత రెండ్రోజులకు అన్ని వివరాలతో వాల్తేరునుండి ఉత్తరం కూడా వచ్చింది. 'కామేశ్వరి చదువుకయ్యే ఖర్చులు తానే భరిస్తాననీ, ఇద్దరం వండుకుతింటామనీ, తప్పక ఎమ్మేలో చేర్పించటానికి పంపించమనీ' ఉందందులో.

నాన్న కొంత తటపటాయించాడు 'ఎమ్మే ఎందుకు? వచ్చి ఏం చేస్తుంది. రాగా పోగా తేబోయే మొగుడు కూడా ఎమ్మే అయ్యుండాలి. అంతకంటే నిర్వాకం ఏముంది. ఇది ఉద్యోగాలు చెయ్యబోయిందా. ఈ లక్కపిడతకు ఎవ్వడే ఉద్యోగం ఇవ్వకూర్చున్నాడు. దీని చదువువంకపెట్టి వాడు ఆ పంపించే డబ్బుకూడా పంపించడు...'నాన్న ఆలోచన్లకు అర్థం లేకపోలేదేమో...ఆశలకూ, కోర్కెలకూ అర్థాలు ఇంత స్పష్టంగా చర్చించటానికి వీలులేకపోవచ్చు.

అమ్మ తటస్థంగా వూరుకుంది. 'దాని గీతలో ఏముందో' అంటూ. చిన్నన్నయ్య 'దానిష్టం' అన్నాడు. తమ్ముడు పెద్ద తెలిసినవాడిలా 'అనవసరం' అన్నాడు. వెధవనిచూస్తే తన్నబుద్ధేసింది. ఇంటర్‌తో మూడుసార్లుగా కుస్తీలు పడుతున్నాడు... అనవసరమట !

నాన్నకో బలహీనతుండేది. ఎన్నన్నా, అనుకున్నా భాస్కరం అన్నయ్య మాటకు చివరకు తలూపేవాడు. బలవంతం చెయ్యటానిగ్గాను నేను కూడా రెండుపూటలు అన్నం మానేసాను. వారం తర్వాత భాస్కరం రెండో ఉత్తరం రాసాడు, 'సీటుకి టైమయిపోతోంది. పంపించండి' అంటూ.

నాన్న వాల్తేరుకు టికెట్టుకొని అన్నయ్యకు 'టెలిగ్రాం' ఇచ్చాడు!

* * *

ఎమ్మే ఫిలాసఫీలో చేరాను.

నూర్రూపాయలకు అన్నయ్య ఓ చిన్న పోర్షన్ అద్దెకు తీసుకున్నాడు. ఇద్దరం వంట చేసుకుని తిని కలిసి యూనివర్సిటీకి పోయేవాళ్ళం. ఎత్తుగా, లావుగా కళ్ళద్దాలతో హుందాగా వంకర్ల జుట్టు ఊపుకుంటూ నడిచే అన్నయ్యప్రక్క నడవటం సరదాగా

వుండేది. స్టూడెంట్సూ, టీచర్లూ 'భాస్కరం చెల్లెలు' అని మెల్లగా గుసగుసలు చెప్పుకోవటం వినిపించేది. శాస్త్రిగారయితే మరీ చనువుగా పలకరించేవారు.

శాస్త్రిగారు అన్నయ్య ప్రధాన స్నేహితుల్లో ఒకరు. వాడి డిపార్ట్‌మెంట్‌లోనే రీసెర్చి చేస్తున్నారు. మంచి సంగీత జ్ఞానం కలవారు. ఎంతో బాగా పాడతారు. వాడి ఇతర స్నేహితులు చంద్ర, కృష్ణారావుగార్లు. చంద్రగారు కవి. రోజూ మా యింటికొచ్చి కవిత్వం వినిపించేవారు. కృష్ణారావుగారు మాటకారి. చమత్కారంగా మాట్లాడుతూ అందర్నీ నవ్వించేవారు. ప్రతిరోజూ రాత్రి భోజనాలయ్యాక మా యింట్లో సభతీర్చేవాళ్ళు. చంద్రగారి కవిత్వంతో ప్రారంభమయ్యేది సదస్సు. కృష్ణారావుగారు సుదీర్ఘంగా నవ్వించిన తర్వాత శాస్త్రిగారిని ఓ పాట పాడమని సభ అర్థించేది. ఆయనకు మహా సిగ్గూ, మొహమాటమూను. కాసేపు జంకినా, గొంతెత్తితే అంతా చెవులప్పగించి వినేవాళ్ళం.

'వండర్‌ఫుల్‌రా శాస్త్రీ, ఎనదర్ సైగల్ ఇన్ ది మేకింగ్' అనేవాడు అన్నయ్య.

'ఇన్ ది ప్రాకింగ్' అని చమత్కరించేవారు కృష్ణరావుగారు. అంతా నవ్వులు. ఎవరెన్ని మాట్లాడినా చివరకు అన్నయ్య కామెంట్‌కోసం కలవరించేవాళ్ళు. అన్నయ్య బిగించిన తీగలా కూర్చుండి ఎక్కడ రసస్పందన ఉందో అక్కడ పలుకుతుండేవాడు.

అన్నయ్య చంద్రగారి నొకసారి 'అరే కవీ, మా సిస్టర్‌మీద కవిత్వం చెప్పరా' అన్నాడు. చంద్రగారు నావంకోసారి చూసి ఆశువుగా

'తత్వశాస్త్ర మభ్యసించు చిట్టితల్లి కామూ,

ఆడపిల్ల కెందుకమ్మ కసరత్తూ సామూ'అన్నారు. అన్నయ్య పగలబడి నవ్వి

'మరో ఆరుద్రవిరా కవీ' అని అభినందించాడు

ఆదివారాలొస్తే అందరం బీచ్‌కి పోయేవాళ్ళం. వీళ్ళ మాటలజోరూ, సముద్రపు హోరూ ఎంతో సరదాగా ఉండేది. ఇసకలో నడవటంవలన ఒకరు ముందూ, ఒకరు వెనకా పడేవాళ్ళు. శాస్త్రిగారు మితభాషి కావటంచేత మాట్లాడటానికేం తొందర లేదన్నట్లు వెనక పడేవారు. వాళ్ళతో నడవలేక నేనూ వెనకపడేదాన్ని. శాస్త్రిగారు నా నడకనుచూసి ఓసారి 'ఆడపిల్లకెందుకమ్మ కసరత్తూ, సామూ' అని నవ్వేసారు. నేనూ నవ్వేసాను ఆయన నా కళ్ళలోకి తొలిసారిగా చూసారు. కొత్తగా ఉంది. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించింది.

శాస్త్రిగారు 'పాడవేల రాధికా' అనే పాట పాడినప్పుడూ 'అలనాటి కథలన్నీ కలలాయెనా' అనే పాట పాడుతున్నప్పుడూ 'ఇలా' కళ్ళలోకి చూడాలనిపించేది. కాని పాడేప్పుడు ఆయన గాతిలోకి తప్ప ఎవరివంకా చూడరు.

ఓసారి ఇలాగే అందరం బీచ్‌కిపోయాం. కాసేపు ఇసకలో తిరిగి అలిసిపోయాం. రామకృష్ణా మిషన్ కాంటీన్‌లో కాఫీలు తాగటానికి కూర్చున్నాం.

సర్వర్ అయిదు కాఫీలు టేబిల్‌మీదపెట్టి బిల్లుకోసం లోపలికెళ్ళాడు. శాస్త్రిగారు ఒక్కసారి కాఫీ సిప్‌చేసి, సుగర్ తగ్గిందని ప్రక్కనపెట్టి 'సడన్'గా లోపలికెళ్ళారు. అంతా కబుర్లలో ఉండి ఎవ్వరం గమనించలేదు. ఆయన తిరిగొచ్చి 'నా కాఫీ ఏది' అన్నారు. తీరాచూస్తే ఆయన కాఫీ నేను సగం త్రాగేస్తున్నాను. ఎక్స్ట్రా కప్పు కృష్ణారావుగారి ప్రక్కనే వుంది.

'అరే దాన్ని నేను ఎంగిలి చేసానే' అన్నారు శాస్త్రిగారు... నాకు చచ్చే సిగ్గేసిపోయింది

'కాఫీల మార్పిడి కావాలని కాదుకదా' అన్నారు కృష్ణారావుగారు. నా నగలు కుంచించుకుపోయాయి.

'తియ్యందనము తగ్గెనా' అన్నారు కవిగారు.

'There is every danger of సంప్రదాయమ్' అన్నాడన్నయ్య! ఒక్కక్షణం కాలం ఆగిపోయింది.

శాస్త్రిగారు డోంట్‌వర్రీ' అని మిగిలిన కప్పు అందుకున్నాడు సుగర్, స్పూన్ అవతలపెడుతూ

'పంచదార తగ్గిందేమో చెల్లీ, ఇది చేర్చు' అన్నారు కృష్ణారావుగారు. ఇంతవరకూ కథ రసం పుంజుకుని అన్నయ్య అన్న చివరి వ్యాఖ్యతో పతాకస్థాయికి చేరింది.

'అఖ్ఖర్లేదు. వాడినోట తియ్యటిపాటా, పంచదారా నస్తాయి' అన్నాడు. వాణ్ణి గొంతు పిసికేయాలనిపించింది. వాడి మాటలు ఎంత నగ్నంగా ఉన్నాయో తెలపటానికి ఆ తర్వాత సంభాషణ ఆగిపోవటమే నిదర్శనం.

* * *

అన్నయ్య నిష్కారణంగా నన్నూ శాస్త్రిగారినీ కలిపి ఏడిపించేవాడు. కావాలని వ్యాఖ్యానించేవాడు. మామధ్య లేని 'దాన్ని' ఉండాలనో, ఉందనో భావించి ఉత్సుకత సృష్టించేవాడు. కవిగారో, కృష్ణారావుగారో 'చెల్లాయ్, ఆర్ యు కమింగ్ విత్ అజ్ టు ఎ పిక్చర్' అంటే, వీడు

'నో, షి యీజ్ వైటింగ్ ఫర్ శాస్త్రీ' అనేవాడు

అన్నయ్య భావం చాలా కాలం అంతుపట్టలేదు. శాస్త్రిగారి పట్ల నాకు ఇతరులఎడల లేని ప్రత్యేకాభిమానం ఉన్నట్లు ఎప్పుడూ బయటపడలేదు. ఇహ శాస్త్రిగారంటారా ... వరూధిని వచ్చి పలకరించినా 'ఇదేమిటి ?' అని నిశ్చింతగా ప్రశ్నించగలరు. అన్నయ్య

అన్నిసార్లు విపరీత వ్యాఖ్యానాలు చేసినా, సరిహద్దులు దాటినా ఎప్పుడూ శాస్త్రిగారు నాదగ్గర ఆ అవకాశం వినియోగించుకోలేదు.

ఎన్నోసార్లు అన్నయ్య ఇంకా కాలేజీనుండి రాకా, లైబ్రరీలో ఉండిపోయా ఆలస్యం చేసేవాడు. శాస్త్రిగారూ, నేనూ ఒంటరిగా గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవాళ్ళం. ఎన్నడూ మాట పొల్లు పోలేదు. చూపులు వక్రించలేదు. చేతులు గిరి దాటలేదు. ఆయన హృదయంలో ఏముందో తెలుసుకోవాలన్న ఆరాటం నాకులేకపోలేదు. ఏ క్షణాన్నైనా ఆయన నా చెయ్యి పట్టుకుంటే గుండెల మీద వాలి పోయి అనుకున్నవన్నీ ఒక్కపెడిగా చెప్పాలనిపించేది.

నా జీవితంలో ఈమహదవకాశం కల్పించిన అన్నయ్య, తండ్రి గాని తండ్రి, ఎప్పుడూ సుఖపడాలని కోరుకునేదాన్ని. ఈపాటికి ఏ పల్లెటూళ్ళోనో మసి పూసుకుని అంట్లు తోముకోవలసినదాన్ని, ఇంతమంది పెద్దవాళ్ల మధ్య నిలబెట్టి బ్రతుక్కి అర్థం చూపించాడు. ప్రపంచ విజ్ఞానాన్ని పరిచయంచేసుకునే భాగ్యం కలిగించాడు. చల్లని సాయంత్రాల్లో సముద్రపు ఒడ్డునచేరి మంచి మాటలు వినే అదృష్టం కల్పించాడు. అందరికీ అన్నయ్య లుంటారు. కాని ఇలాంటి వాళ్ళుంటారా ...

అన్నయ్యకు కవిత్వం తెలుసు. కళలు తెలుసు. కమ్యూనిజం మీద అనర్గళంగా మాట్లాడగలడు పోప్‌పాల్ సందేశాన్నీ, జీన్‌పాల్ సార్త్రే సిద్ధాంతాన్నీ కూలంకషంగా విమర్శించగలడు బర్ట్రెండ్ రసెల్ అంటే అన్నయ్యకు ప్రాణం, బెర్నార్డ్‌షా అంటే అన్నయ్యకు దైవం. ప్రజాస్వామ్యంలో మనస్సూ, సామ్యవాదంలో హృదయమూ ఉన్నాయంటాడు తను. మావో సేటుంగ్ ప్రాధాన్యతా, వియత్నాం ప్రాముఖ్యతా ఎంతో వివరంగా చెప్పగలడు. షెల్లీకీ, కృష్ణశాస్త్రికీ, శ్రీశ్రీకి మయకోవిస్కీకి పోలికలమీద ఉపన్యసించగలడు. రవిశంకర్ సితారూ, సుబ్బలక్ష్మి గొంతూ ఎలాంటివో శ్లాఘించగలడు. బాల మురళి పాటలూ, మహమ్మదాలీ పోటీలూ విశ్లేషించగలడు. విశ్వ మానవతావాదంలో రాధాకృష్ణన్ పాత్రను సుదీర్ఘంగా వివరించగల అన్నయ్యలు ఎంతమంది కుంటారు ?

* * *

ఎమ్మే మొదటి సంవత్సరం ఇంకా రెణ్ణెల్లకయిపోతుందనగా నాన్న దగ్గర్నుండి అన్నయ్యకో ఉత్తరం వచ్చింది. 'నాకేదో మంచి పెళ్ళి సంబంధం కుదిరిందనీ, కుర్రవాడు ఆంజనేయులు ... భాషా ప్రవీణ ప్యాసై ఉద్యోగం చేస్తున్నాడనీ ... మంచి సుఫరద్రూపి అనీను.'

నా మనస్సెందుకో కెలికినట్లయింది. ఆనందంగా గడిచి పోతున్న కాలం, పరీక్షలు రాసి ఫైనలియర్‌లో ప్రవేశించాలనే తాపత్రయం, శాస్త్రిగారి వీక్షణాల్లో మురిసిపోయే ముచ్చటా ఒకొలిక్కి రాకుండానే నాన్న 'ఈ ఉత్తర మేమి'టనిపించింది.

మొదటిసారి చదివినప్పుడు భాస్కరం చాలా తేలిగ్గా తీసుకున్నట్లు అవతల పారేసాడు. రెండో రోజుదయం మళ్ళీ చదివి కాసేపు నా వంకా, ఉత్తరం వంకా చూసి, ముఖంలో భావంమార్చి 'ప్స్' అంటూ

'వెల్ కామూ, యు మేరీ శాస్త్రీ' అన్నాడు.

నా గుండె ఆగిపోయింది. వాడు లేచి ఎటో వెళ్ళిపోయాడు.

ఆ రోజుల్లా వాడన్న మాటల్లోని అక్షరాలు భేరీనాదాల్లా నాలో ప్రతిధ్వనించాయి వీడి ఉద్దేశ్యం ఏమిటి ? ఆయన ఒప్పుకున్నాడా...వీళ్ళిద్దరూ అంతా నిర్ణయం చేసారా...? అసలు నాకు శాస్త్రిగారిని చేసుకోవటం ఇష్టమో, లేదో అడిగాడా ...

'యూ ఈట్ ఐస్‌క్రీం' అన్నట్లు

'యూ మేరీ శాస్త్రీ' అంటాడేమిటి ?

ఆ రాత్రికి వాణ్ణి కడిగేయాలనిపించింది. మామూలుగా వాడికంటే ముందు శాస్త్రిగారొచ్చారు. ఆయన్ను చూసి వింతగా నవ్వాను. ఏం చలనం గోచరించలేదు. పలకరింపు అనుకున్నారేమో.

శాస్త్రిగార్కి కాఫీ యిచ్చి కూర్చున్న తర్వాత ముందుగా ఆయన్నే అడగాలనిపించింది. ఇలాంటి తీయని అవకాశాలెన్నో రావు. ఆయన ఏమన్నా అనుకుంటే ... ఏమనుకుంటారు ? యిది వరకు భాస్కరం అన్న మాటలకంటే తప్పయిందేముందీ...కనీసం కళ్ళలో కైనా చూస్తారు...అది చాలు...తర్వాత ఏమైతే అదవుతుంది ... ధైర్యం కూడదీసుకుని ...

'కాఫీ బావుందా' అన్నాను.

'బాగుంది మీరూ తీసుకోపోయారా' అన్నారు శాస్త్రిగారు !

'లేదు...ఇంకా భోంచేయలేదు...'

'చెయ్యండి...'

'అండీ, ఎందుకు ?'...తొలి సాహసం చేసాను !

శాస్త్రిగారు కళ్ళెత్తి చూసారు. మరోలా భావించినట్లు కన్పించలేదు.

'తప్పేముంది ?' అన్నారు.

'తప్పు గురించి కాదు... ఒప్పు గురించి...' శంకరాచార్యుడికి తత్వం బోధించే చంటిపిల్లలా మాట్లాడాను.

'నీవు అంటే బావుంటుందా...' శాస్త్రిగారికళ్ళల్లో ఏదో వెలుగు ...

'ఓసారి అని చూస్తే తెలుస్తుంది...'

శాస్త్రిగారు అర్థవంతంగా నవ్వారు...కాఫీ సగం సాసర్‌లో పోసి

'తీసుకో' అన్నారు.

మాట్లాడకుండా తీసుకున్నాను. నేను చేసిన కాఫీ నాకే ఎంతో రుచిగా వుంది.

*　　　*　　　*

వేసవి శలవలకు ఇంటికి వెళ్ళేముందు అన్నయ్యకు రెండేళ్ళ పాటు జర్మనీలో 'రీసెర్చి'కి స్కాలర్‌షిప్ వచ్చినట్లు తెలిసింది. అన్నయ్య తన స్నేహితులకు పెద్ద పార్టీ యిచ్చాడు. పార్టీలో శాస్త్రిగారు తన ప్రక్క కూర్చోవటం చూసిన కృష్ణారావుగారు

'సుభద్ర ఏదీ' అన్నాడు.

'లోపలుంది' అన్నాడన్నయ్య కించిత్తు సంశయం లేకుండా. నేను వింటూనే వున్నాను. నిండుగా, నిబ్బరంగా కూర్చున్న శాస్త్రి గారి ముఖంలో చిరునవ్వుకు మించి ఏమీ లేకపోవటం చూసాను.

శలవలకు ఇంటికి వెళ్ళేముందు అన్నయ్యతో

'నాన్నకేం చెప్పమంటావురా' అన్నాను.

'త్వరలో వస్తానని చెప్పు.'

'అదికాదు...ఆ విషయం...'

'జర్మనీ వెళ్ళేముందు మాట్లాడతానని చెప్పు.'

నాకెందుకో నిరుత్సాహం వేసింది. వాడి మాటలు సంతృప్తి కలిగించలేదు. శాస్త్రిగారు స్టేషన్ కొచ్చారు. అన్నయ్య ప్లాట్ ఫారమ్ మీద ఆయనతో 'జర్మన్ వే ఆఫ్ లైఫ్' మీద మాట్లాడు తున్నాడు. జర్మనీలో రైల్వే సిస్టమ్‌యొక్క విశిష్టత వర్ణిస్తు న్నాడు. కనీసం మా యిద్దరికీ ఓ క్షణం అవకాశం యివ్వాలని కూడా వాడికి తోచలేదు. టైమయిపోయింది.

బండి కదుల్తున్నప్పుడు

'గుడ్‌లక్ కామూ, కేరీ ఆన్' అన్నాడు భాస్కరం.

కిటికీలో ఉన్న నా చెయ్యి వేళ్ళలో ఒకటి రెంటికి తగిలే టట్లు శాస్త్రిగారు చెయ్యి వేసారు. బండి కదిలింది.

భాస్కరం అప్పుడే 'హిగ్గిన్ బాదమ్స్'వేపు నడుస్తున్నాడు.

శాస్త్రిగారు కనిపించినంతవరకు చూసారు.

*　　　*　　　*

శలవల్లో నాన్న ప్రతిరోజూ సతపోరాడు. 'భాషాప్రవీణ'గాన్ని చేసుకోమని. సంప్రదాయముందట. కావలసిన వాళ్ళట. కానీ పుచ్చుకోకుండా చేసుకోటాని కొస్తున్నారట.

నాకిష్టం లేదనీ, ఎన్నిసార్లు చెప్పినా వినటంలేదనీ గ్రహించి నాన్న చివరికోసారి ...

'ఆ శాస్త్రి కుర్రాణ్ణే చేసుకుంటావేమిటి? అన్నీ విచారిం చాన్లే...వాళ్ళ వంశం అడుక్కుతిన్నట్లుంది...వాళ్ళ వాళ్ళలో కప్ప దాట్లున్నాయంట కూడాను ... నువ్వోనిబ్బరం లేని మనుషులుగా తెల్సింది...'

'భాస్కరం అన్నయ్య...' అన్నాను. ఏమనాలో తోచక.

'నేను వివరంగా రాస్తే వాడు కూడా ఈ విషయం అంగీక రించాడు.'

'ఏమన్నాడు...'

'నామాటే కానిమ్మన్నాడు.'

ఆకాశం బద్దలయింది. భూమి కరిగిపోయింది. ఒంటిమీద నిప్పుల వర్షం కురిసింది. కన్నీరు తుడుచుకునే నా చెయ్యి నాకే త్రాచుపాములా అనిపించింది.

*　　　*　　　*

ఆంజనేయులుగారితో నా వివాహం జరిగిపోయింది.

జర్మనీ వెళ్ళేముందు అన్నయ్య ఇంటికి రాలేదు. నాన్నకూ తనకూ ఏం ఉత్తరాలు నడిచాయో నాకు తెలియదు. నా పెళ్ళికి రెండ్రోజులు ముందే అన్నయ్య జర్మనీ వెళ్ళేందుకు బొంబాయిలో విమాన మెక్కాడు.

శలవల్లో శాస్త్రిగారికి అన్నీ వివరిస్తూ ఉత్తరం రాసాను. శాస్త్రిగారు వెంటనే జవాబు రాసారు ...

''డియర్ కామేశ్వరీ,

భాస్కరంతో ఎంతోసేపు ఈ విషయంమీద చర్చించాలను కున్నాను. జర్మనీ వెళ్ళే హడావుడిలో ఎంతో ప్రయత్నంమీద రెండు ముక్కలు మాట్లాడాడు. సారాంశం 'ఈ పెళ్ళిలో తనపాత్రేమీ లేదనీ...అంతా మీ తండ్రిగారిదనీ...'

నాకో చెల్లెలుంది కామేశ్వరీ. ఇప్పుడు తను మద్రాసులో ఉంటుంది. ఆమె భర్త సినిమాల్లో పనిచేస్తున్నాడు. వాళ్ళు సుఖం గానే ఉంటున్నారు. వాళ్ళు తమ పెళ్ళికి లోకం అనుమతి పొందలే దన్నది నిజమే. ఎందుకు పొందాలో నాకూ అర్థం కాలేదు లోకం నుండి వాళ్ళాశించింది కూడా ఏంలేదు. ఇప్పటికీ ఆ సంఘటన నుండి మా యింటిని బయటపడ నీయటం లేదు. మా చెల్లి చేసిన నేరం (?) మమ్మల్ని శిక్షించాలనుకుంటే ఆశిక్షను తియ్యగా స్వీకరించ టానికి నేను సంసిద్ధుణ్ణే.

కాని లోకాన్ని ఎదిరించమనీ, స్వేచ్ఛ సంచరించమనీ, ధైర్యంగా జీవించమనీ పెద్దగా చదువుకొని మా బావకు భాస్కరం లాంటి వాళ్ళే చెప్పారు. కులం వంటి నీచ నియమాల్ని వదిలి ప్రేమించినమ్మాయితో వెళ్ళిపొమ్మని ఉపదేశించారు. ప్రబోధంనోరు జారిన తర్వాత అంశం తనకూ వర్తిస్తుందని భాస్కరాలు గమ నించారో, లేదో...జీవితం సైన్సు పాఠంలా చెప్పేయటానికి వీల్లేని దని భాస్కరం తెలుసుకున్నట్లు లేదు.

అన్నట్లు మొన్న భాస్కరం మరో ముక్క కూడా అన్నాడు. 'అరే శాస్త్రీ మేధావులమైన మనం బుర్రలతోనే కొట్టు కోలేక చస్తుంటే, ఈ హృదయాలతో ఎక్కడ బాధపడగలం అని.'

మన పెళ్ళి విషయానికీ వాడి మాటలకూ ఏదో సంబంధం ఉన్నట్లు తోస్తుంది. ఈనెల పదహారున వాడి ప్రయాణం.

నిన్ను పెళ్ళాడినా లేకపోయినా నువ్వే నా జీవితంలో మొదటి స్త్రీవి. ఆఖరి స్త్రీవి.

ఇది సత్యం. భాస్కరం మేధస్సుపై ఒట్టు.

ఉంటాను కామేశ్వరీ,

నీ

శాస్త్రి.''

* * *

ఇరవై అయిదేళ్ళ తర్వాత ..

అన్నయ్య ఢిల్లీ యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పని చేస్తున్నాడు. చాలాకాలానికి వాడి కూతురు 'నవత' పెళ్ళిలో కలుసు కున్నాను మళ్ళీ. నవతను ఎవరో బెంగాలీ అబ్బాయి ప్రేమించి చేసుకుంటున్నాడు.

పందిరంతా కోలాహలంగా వుంది. అన్నయ్య స్నేహితులు ఎంతోమంది వచ్చారు. వాళ్ళ మధ్యలోఉన్న అన్నయ్యకు బంధువుల్ని పలకరించే తీరిక కూడా కన్పించలేదు.

వాడితో నోరారా మాట్లాడి ఎన్నాళ్ళయిందో ... పలుకుల్లో పంచదార చిలికించే నా అన్నయ్యతో మాటలకైనా నోచుకోలేదను కున్నప్పుడు భోరుమని ఏడవాలనిపిస్తుంది.

మా పెళ్ళి తర్వాత వాడు నాతో మాటలు తగ్గించేసాడు.

కానీ...కానీ ..రెండు ముక్కలు అడగాలనుంది . నా పెళ్ళికి ముందు

అన్నయ్యా 'కామూ యూ మేరీ శాస్త్రీ' అన్నావు. 'యస్. అయామ్ మేరీయింగ్ ఆంజనేయ శాస్త్రీ' అని రాసాను. దానికి సమాధాన మేమంటాడో అడగాలనుంది .. శాస్త్రిగారు ఎక్కడున్నారో తెలుసుకోవాలనుంది.

'విశాఖ బీచిలో ముగ్గురం కలిసి నడిచిన రోజులు గుర్తున్నాయట్రా అన్నయ్యా' అని ఒక్కసారి వాణ్ణి అడగాలనుంది. అన్నయ్య పెద్దవాడు . హోదా కల్గినవాడు ... పల్లెటూళ్ళో కాపురం వుండే పంతులు భార్యను . వాడి కూతురు పెళ్ళిలో నిష్ఠూరాలు పలికి, కన్నీళ్లు పెట్టి వాడి కళుభం కోరలేను. వాడి కూతురు పండు వెన్నెల్లా ప్రకాశించే సమయం నవత నాలాంటిది కావాలని ఎక్క డుంది ఎందుకవుతుంది. దాని తండ్రి అన్నీ తెలిసినవాడు . అన్నీ తెలిసినవాడు .. !!

సముద్రం

కుమారి పురాణం ప్రభాతలక్ష్మి

ఎందుకు నేస్తం ! అందరూ సుదూర తీరాలకేసి
వింగి, నేల కలిసే ఒంపుకేసే చూస్తారు ?
వినీల సాగర తరంగాలకేసి ఉత్సుకతతో చూడడం ఎందుకు?
ఏముందని వెతుకుతారు సముద్రపుటలలలో !
ఏ జీవిత సత్యాలు తెలుసుకోవడానికి ?
ఏ మానవత్వపు విలువలాకళించుకోవాలనీ ?
ఒక్కసారి వెనుతిరిగి నేలకేసి చూస్తే,
ఎన్ని జీవాలు ! ఎన్నెన్ని జీవితాలు !
సముద్రపు టలలలాంటి కష్టాలలో చిక్కుకుని ఎగిసిపడుతూ,
సముద్రం కంటే లోతైన మనసుల నిండుగా
తీరని వ్యధలతో, బాధల బరువులతో
మనుగడ సాగిస్తున్న ఆర్తజీవనాదాలెన్నో,
సముద్రపు హోరును మించుతాయి, మనలని ముంచుతాయి.
సముద్రమే సానుభూతితో నేలను తాకి ఓదారుస్తుంటే,
ఎందుకు నేస్తం! అంతా సముద్రపు లోతుల్లోకి చూస్తారు?
ఒక్కసారి వెనుదిరిగి చూస్తే,
చూసి ఆలోచిస్తే,
మానవజన్మ కర్థం ఏర్పడదా ? పరమార్థం బోధపడదా?

నైరూప్యంలో నీ రూపం

కుమారి దినవహి లక్ష్మీ కామేశ్వరి

కాంతి పరిష్వంగంలో కాలి, కరిగిన
కర్పూరపు మరకల్లాంటి ఈ కళ్ళమీద
గరళంలాంటి గతం గరుకు కాయితం గరగరలు
గుండె గదుల్లో కాగే రక్తపు కుతకుతల్లా
వెలిగే హరికెన్ లాంతరు వదిలే వెచ్చటి నిశ్వాసాల్లా
నా మెదడు పొరల పరస్పర సంఘర్షణలు —
నిశ్శబ్దపు నల్ల ఉరికొయ్యల్లో ఆశల ఆర్తనాదాల్లా;
ఊహు ! ఆగదు ఈ అంపవృష్టి.
నువ్వే ఇచ్చి వెళ్ళావు - ఈ అక్షయతూణీరాన్ని
నా ఊహ రాక్షసుడికి, మనోభూతానికి.
అందమైన నా అనుభవాల్ని మింగేస్తూ
వాడు నామీద అవిరామంగా దాడిచేస్తూంటాడు.
వెన్నులోనే దిగిపోయి, వెంటాడి, వేటాడి
దిక్కులన్నిటిచుట్టూ ఉన్మత్తురాల్లా పరిగెట్టించేస్తాడు.
దారిలేదు, తెన్నూలేదు
దిక్కూ మొక్కూ దైవం దయ్యం ఏవీలేవు.
శరీరంలో ఈ కొసనుండి ఆ కొసదాకా
సచేతనంగా నవ్విన ఈ వెర్రిగాలి
ఊద్పులుగా, గాడ్పులుగా బయటకు పారిపోవడం తప్ప
సుషుప్తిలోకి ఇమిడిపోవడం మినహా,
నువేచెప్పు — మరోదారేదైనా ఉంటే
మనసుకంటుకొన్న ఈ నిప్పునార్పే
విధాన మేదైనాఉంటే
నైరూప్యంలోకూడా నీరూపాన్ని
ప్రతిష్ఠించుకొనే నా అంతఃచేతనను
ఈ భూమార్గానికి లాక్కొచ్చే ఉపాయమేదైనాఉంటే.

రంగుల ఆకాశం

శ్రీ తమ్మిశెట్టి రామారావు

నేను చూస్తున్నాను
నా కళ్ళిప్పిన దగ్గరనుంచీ
గడి గడికి ఎన్నో రంగులు మార్చే ఆకాశం
ఆకాశంనిండా ఎన్నో రంగుల బొమ్మలు
ఆ బొమ్మల్ని చూసేనా నీ కుంచె కదిలింది కళాజీవి
ఆ రంగుల్ని చూసేనా నీ గుండె కదిలింది కవీ !
ఆకాశమే లేకుంటే ఆలోచన్లకి పదునెక్కడిది
ఆలోచనే లేకుంటే ఆనందానికి తావెక్కడిది
ఇన్ని చిత్రమైన రంగుల్ని ప్రదర్శించే ఆకాశం
ఎందుకో ముఖం నల్లగా మాడ్చుకుంటుంది
అది చూస్తే నా గుండె గతుక్కుమంటుంది
తొలి సంధ్య గడిచిపోయిందనుకుంటాను
మలి సంధ్యకోసం మళ్ళీ నిరీక్షిస్తాను
అప్పుడు —
నల్లని ఆకాశం చుట్టూ
తెల్లని చుక్కలు పొడుచుకొస్తాయి.

శ్రీమతి చాగంటి తులసి

శ్రీమతి ఉపద్రష్ట అనూరాధ

పాలా

ఓఢ్ర దేశంలో పాలా, దాసకాఠియాలు జనప్రియమైనవి. దాసకాఠియా గంజాం జిల్లాది. పాలా ఉత్తర ఒరిస్సాది. దక్షిణ ఓఢ్ర దేశంలో దాసకాఠియా అంటే ఎలా చెవి కోసుకుంటారో ఉత్తర ఓఢ్ర దేశంలో ముఖ్యంగా కటక్, పూరీ జిల్లాలలో పాలా అంటే జనం వినడానికి విరగబడి వస్తారు.

పాలా జట్టులో ఒక గాయకుడు, ముగ్గురో నలుగురో వంత పాటగాళ్లు, ఒక వాద్యగాడు ఉంటారు గాయకుడే దీనికి నాయకుడు. ఆయన మంచి పండితుడై ఉంటాడు. సంస్కృత, ఓఢ్ర భాషల్లో నిష్ణాతుడే కాక శ్రావ్యమైన గొంతుకతో చక్కగా పాట పాడడంలో కూడా దిట్ట. కుడిచేత్తో తాళాలు వాయిస్తూ ఎడం చేత్తో చామరం పట్టుకుంటాడు చెవులకి బంగారు కుండలాలు, చేతులకి లావుపాటి వెండి ఖొడు (కడియాలు) దండలకి ఒనొంతా బొౌతా (తాయెత్తు) నడుం చుట్టూ రెండు పేటల వెండి మొలతాడు, ఎరుపు రంగుది కాని నీలం రంగుది కాని అంగరఖా, పింధా ఫెంటా (కుచ్చుల గూడారు), భుజంమీద పట్టుకండువా, జరీపాగా, కళ్లకి కాటుక, నుదుట సింధూరపు బొట్టుతో ఈ గాయకుడు అందర్నీ ఆకట్టుకుంటాడు. గాయకున్ని ఒరియాలో గాయొకొ అని లేదా గాహొకొ అని అంటారు.

గాయకుని కుడివైపున ఉండే పాటగాడు ముఖ్యమైన వంత పాటగాడు. అందుకే అతనిని శ్రీ పాళియా, శిరొపాళియా అనీ డహణొ పాళియా (కుడివేపు ఉండే వంతగాడు) అనీ అంటారు. శ్రీ పాళియా కూడా గాయకునికి ఏం తీసిపోడు. సమఉజ్జీవాడనాలి. ప్రతిభాశాలి, పండితుడు. సంగీతజ్ఞుడు. శ్రీపాళియా కాక మరొక పాళియా, ఇంకో ఇద్దరు పొచ్చొ పాళియా (వెనక నుండే వంతగాళ్లు) కూడా ఉంటారు. వీరందరూ గాయకునిలా అంగరఖాలు వేసుకుంటారు. పింధాఫెంటా కట్టుకుంటారు. అయితే వీరి దుస్తుల్లోకాని, అలంకరణలోగాని గాయకుని ప్రత్యేకత కనిపించదు. వీరు రెండుకాళ్లకి గజ్జెలు కట్టుకుంటారు. పాళియాలు అందరూ గాయకునిపాటకి వంతపాడుతూ చేత్తో ఝుంజొ (పెద్ద తాళాలు) వాయిస్తూ లయానుగుణంగ అడుగులు వేస్తారు. (మన హరిదాసులకి చిరతలు ఎలాగో వీరికి ఝుంజొ అలాటివి.)

పాలా జట్టులో ఉన్న వాద్యగాడిని ఓఢ్ర లో బాయొకొ అంటారు. బాయొకొ మృదంగం వాయించడంలోనే దిట్ట కాదు. పాలా పాట మధ్యలో చిన్న చిన్న పిట్ట కథలు చెప్పి శ్రోతలను కడుపుబ్బ నవ్వించడంలో ప్రావీణ్యం ఉన్నవాడు.

ఒరిస్సాలో దగ్గర దగ్గర ఇరవై రకాల పాలాలు బాగా ప్రచారంలో ఉన్నాయి. జన్మ పాలా, పద్మలోచన పాలా, మర్దగాజి పాలా, మర్దగాజి బిభాపాలా, బిద్యాధరపాలా, మదన సుందరపాలా సదానంద సౌదాగర పాలా, మనోహరఫస్యారా పాలా, (రంగలతాపాలా) శంకర గుడియాపాలా, దుర్జన సింహపాలా. హీరాచాంద్‌పాలా, కాఠురియా పాలా, లక్ష్మణకుమారపాలా, అభిన్న మదనపాలా, స్వర్గారోహణపాలా, శ్వేతవసంతపాలా అనే పదహారు పాలాలు బెంగాల్‌కి చెందిన కవి కర్ణుడు రచించాడు. ప్రఖ్యాతుడైన బెంగాల్ పాలాకవి భృగురాముడు రచించిన భ్రమరవరపాలా, లీలావతీపాలా, కళావతీ పాలాలు ఒరిస్సాలో పాడతారు. ఉగ్రతార పాలా రచించిన శంకరాచార్యుడు కూడా బెంగాలీవాడే. హరి అర్జున పాలాని కూడా ఒరిస్సా గాయకులు పాడుతూ ఉంటారు. స్కంద పురాణాన్ని ఆధారం చేసుకుని రాసిన కాఠురియాపాలా కథావస్తువు మన సత్యనారాయణ వ్రత కథావస్తువే.

పాలాలో ఎన్నో హిందుస్థానీ రాగ రాగిణులను ఆలాపిస్తారు. బంగాళ శ్రీ, ముఖారి, ధనాశ్రీ కళ్యాణ పడితాళ, ఘంటారవ, రసకుల్య, నళినీగౌడ, భటియారి, చింతా భైరవి, కాళి, మంగళ మొదలైన రాగాలు పాలా గాయకులు పాడుతూ ఆడుతూ ఉంటే శ్రోతలు పరవశంతో తమను తాము మరిచిపోతారు.

పాలా కథ మూడు నాలుగు గంటల కాలక్షేపం. ఇందులో సాహిత్య చర్చకి ఎక్కువ ప్రాధాన్యత యిస్తారు. బొళొ బొద్రొ, సాదానొందొ, రామొ గోబిందొ, నిత్యానొందొ సాహు, హృదానొందొ సాహు, బొంతొ పొండా మొదలైన కవుల చౌపదీలను ఎంతో కమనీయంగా పాడతారు. అష్టపదిలో ఎనిమిది చరణాలు ఉన్నట్టు చౌపదీలో నాలుగు చరణాలు ఉంటాయి. మేష యుద్ధం, సింహావలోకన, వ్యాఘ్ర గతి, మండూక ప్లుతి, యమక ఛొందొ, గీత శ్లోకాలను కూడా ఆలాపిస్తారు. గాయకుడు వీటిని మధురంగా పాడడమే కాకుండా పామరులకు వాటిభావం బోధపడే విధంగా సరళమైన భాషలో వివరిస్తాడు. వ్యాఖ్యానిస్తాడు. భావానుగుణమైన అభినయాన్ని చేసి చూపుతూ నవరసాలను చిందించి దర్శకులను, శ్రోతలను ఆనంద సాగరంలో ఓలలాడిస్తాడు. ప్రాచీన కవులు రచించిన పద్యాలను, చక్కటి పాటలను ఏరి కూర్చి ఈ గాయకుడు పాడడం వలన పాలా వినసొంపుగా ఉంటుంది. వివిధ అలంకారాలతో సమాసాలతో, కఠిన పద ప్రయోగాలతో, క్లిష్టమైన శైలిలో రచించిన కవిత్వాన్ని ఎంచుకుని ఈ గాయకుడు తన పాండిత్యాన్ని ప్రదర్శిస్తాడు. పాలాకి దాసకాఠియాకి ఇక్కడే వ్యత్యాసమున్నది. దాస కాఠియా జనానికి సులభంగా బోధపడుతుంది.

పాలా వలన ప్రాచీన ఒరియా కవిత్వం మారు మూల గ్రామాల్లో అక్షరజ్ఞానంలేని అతి సామాన్యులకు కూడా అందు బాటుకు వచ్చింది. దీనోకృష్ణో, యదుమొణి, కొబిసూర్యోగోపాళొ కృష్ణో వంటి ఉత్తమ ప్రాచీనకవుల కవిత్వము, సంగీత సాహిత్యాలు సర్వజన సాధారణమయినాయి.

పాలాలో గాయకుడే కాక పాళియాలు కూడా మధ్య మధ్య

రెగెడా భం భం భం బాయి
గిడి గిడి బాజె డంబరు

(డమ్ డమ్ అంటూ ఢమరుకం వాగుతోంది)

అనో,

కాళియా కి మొంత్రొ జాణె రే

(నల్లనయ్య ఏ మంత్రం ఎరుగునో)

అనో,

క్షియా బౌనె బౌనె జె కేతొకీ బౌనె బౌనె
కన్హాయి హాతె లాల బొయిఃశీ
బాజె ఘొనా ఘొనా

(కేతకీ మొగలి వనాల్లో కన్నయ్య చేతిలో ఎరుపు మురళి పదే పదే మోగుతోంది)

అనో,

చక్కని దుహోలనిపాడి శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేస్తారు.

భారతదేశ మంతటా సత్యనారాయణ వ్రతం చేస్తారు.అయితే ఒరిస్సాలోను, బెంగాల్‌లోనూ సత్యనారాయణుడు సత్యపీరుడుగా పేరు పొందేడు. మహమ్మదీయ పరిపాలనా కాలంలో ఓఢ్ర దేశంలో ఉత్కళుల ఆరాధ్య దైవం జగన్నాథుడి విగ్రహం కాల్చివేసారు. హిందూ దేవాలయాలు ధ్వంసం చేసారు. హిందువులను ఇస్లామ్ స్వీకరించమని నిర్బంధించారు. ఎన్నో చిత్రహింసలకు గురియైన హిందువులు ముస్లిమ్ పాలకుల్ని సంతృప్తిపరిచి తర్వాత శాంతిగా బతకడానికి ప్రయత్నించారు. ముస్లిమ్ పాలకుల దృక్పథమూ మారింది. హిందూమతంపట్ల కొద్దిగా ఆసక్తి కనపరిచి, హైందవుల యెడల సహనం చూపడం మొదలు పెట్టారు. హిందువులతో మైత్రి కోరడం, వారితో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకోడం జరిగింది. ఈ రెండు మతాలకు చెందినవారు సఖ్యతతో ఉండాలని ఆకాంక్షించారు. తమ మధ్య సమైక్యత పెంపొందాలని కోరుకున్నారు. ఆ కోరికకి రూపకల్పనే సత్యపీరుడు. హిందువుల సత్యనారాయణుడు, ముస్లిముల పీరు కలిసి 'సత్యపీర్' ఉద్భవించాడు.

పాలాలో ఈ సత్యపీరుణ్ణి పూజిస్తారు. అతని మహత్యాన్ని వర్ణించే గాథలు పాడతారు. సత్యపీరుని పూజ సత్యనారాయణ వ్రతమే! సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు అవతారంగా సత్యపీరుని హిందువులు భక్తితో కొలిచేవారు. మొక్కులు చెల్లించేవారు. పీరుగా భావించి భక్తితో ముస్లిములు పాలా చూసేవారు, వినేవారు, సత్యపీరుని ప్రసాదం 'శిరిణి' స్వీకరించేవారు.

ఆనాటి ప్రజలు ఈ రెండు మతాల సామరస్యాన్ని ఎంత గాఢంగా ఆకాంక్షించారో సత్యపీరుని కథ వలన అర్థమవుతుంది. సత్యపీర్ సహజీవనాన్ని ఆకాంక్షించే వారి ఆరాధ్య దైవం. సత్యపీర్ వారి ఆపదమొక్కుల దైవం.

సంధ్యావతి మాంచాల రాజైన మహిదానవుని కుమార్తె. అవివాహిత. నదిలో స్నానంచేస్తూ ప్రవాహంలో కొట్టుకునిపోతున్న ఒక పుష్పాన్ని వాసన చూసింది. దానివల్ల గర్భవతిఅయింది. కన్యగా గర్భవతి అయిన తమ కుమార్తెను తల్లితండ్రులు లోకోపవాదుకు వెరసి ఇంటి నుండి వెడలకొడతారు. గర్భంలోఉన్న శిశువు సంధ్యావతి కొరకు ప్రత్యేకంగా ఒక సౌధం నిర్మించాలని ఆదేశించాడు. ఈ విచిత్రానికి ఆశ్చర్యపోయి వెరపుకొద్ది ఆదేశాన్ని పాలిస్తారు. సంధ్యావతి నెలలు నిండాక ఒక రక్తపిండాన్ని ప్రసవించింది. దానిని నదిలో పారెయ్యగా ఒక తాబేలు మింగింది. ఆ తాబేటి గర్భం నుండి సత్యపీరు ఉద్భవించాడు ఆ తాబేలు స్వర్గాన్ని చేరుకుంది. నదీ ప్రవాహంలో కొంతదూరం కొట్టుకుపోయిన సత్యపీరు ఒడ్డుకు చేరాడు. మహి దానవుని పురోహితుడు కుశాల ఠాకురు ఆశిశువుని తీసుకుని పెంచుతాడు. మాలంబా నగరానికి పశ్చిమంగా ప్రవహిస్తున్న నూర్ నదీ తీరంలో సత్యపీర్ ఆడుకుంటూ ఓపుస్తకాన్ని చూస్తాడు. దానిని కుశాల ఠాకురుకు తెచ్చి యిస్తాడు. ఆ పుస్తకం కురాను. అది మ్లేచ్ఛుల మత గ్రంథం అని చెప్పి, హిందూ బ్రాహ్మణులు అపవిత్రమైన గ్రంథాలు చదవకూడదని దాన్ని ఎక్కణ్ణుంచితెచ్చాడో అక్కడే పెట్టి రమ్మని ఠాకురు సత్యపీరుణ్ణి ఆజ్ఞాపిస్తాడు. ఠాకురు మాటలని ఖండిస్తూ సత్యపీరుడు వాదనికి దిగి ఈరెండు మతాలు సమానమేనని రెండు మత గ్రంథాల్లో తేడా ఏమీలేదని నిరూపిస్తాడు. హిందూ ముస్లిముల మధ్య విరోధం కూడదని బోధిస్తాడు. ఇరు మతాల మధ్య సఖ్యత పెంపొందించటానికి అందరూ కృషి చెయ్యాలని చెప్తాడు. ఇదే సత్యపీరుని కథ.

పదిహేడవ శతాబ్దపు వ్రాతప్రతి ''సత్యపీర్ పాంచాలి''లోని ఈ పంక్తులు హిందూ ముస్లిముల సమైక్యతకి ఆనాటి కవులు ఎంత ప్రాముఖ్యం యిచ్చేరో తెలియచేస్తాయి.

దేఖొ జాకె పురాణొ కొరానొ దేఖొ
జొయి రామొ సాహి రహిమొ
దొనొహి ఏకొ

(చూడు చూడు కురాను. పురాణం చూడు చూడు. రహీమే రాముడు. రాముడే రహీము. ఇద్దరూ ఒకటే.)

ముస్లిము ప్రభువులు, ఉన్నతోద్యోగులు రాత్రివూట గానా బజానా కార్యక్రమాల్ని ఏర్పాటు చేసి ఆనందించేవారు. ముస్లిము సంప్రదాయాన్ని హిందువులు కూడా అనుకరించారు. భక్తిప్రధానమైన పాలా వంటి కార్యక్రమాల్లో పక్క వాయిద్యాలు వాడడం రాత్రివూట ఈ కార్యక్రమాల్ని ఏర్పాటు చెయ్యడం మొదలయింది.

పాలా గాయకులు ధరించేవి ముస్లిము దుస్తులే. ఆనాటి తురక రాజులను, ఉన్నత ప్రభుత్వోద్యోగులను తృప్తి పరచటానికి

అంగరఖాలు ధరించి హిందూ పాలా జట్టువారు పాలా పాడేవారుట. దేశకాల పరిస్థితులు మారినా పాలా జట్టుగాళ్ళ వేషభాషలు మారలేదు.

ఏ శుభకార్యానికైనా నాయీ బ్రాహ్మణుని చేత ప్రారంభం చేయించడం ఆచారం. సత్యపీర్ బైఠకీపూజ జరిగేరోజున రంగల ఇసుకతో ఒక చిన్న వేదికని చేస్తాడు. దానిమీద ఇత్తడిది కాని కర్రది కాని సింహాసనాన్ని అమరుస్తారు. సింహాసనంలో సత్యనారాయణ విగ్రహాన్ని ఉంచుతారు. వేదికకు నలుపక్కలా ధనుస్సు బాణం, చామరం, కటారి, నెమలి ఈకల కట్టలు పెట్టి పంచ దేవతలు గణేశుణ్ణి, నారాయణ్ణి, రుద్రుణ్ణి, అంబికని, భాస్కరుణ్ణి, ఆహ్వానిస్తారు వరుణుడు, లోకపాలకులు, నవగ్రహాలు, బ్రహ్మ, ఇంద్రుడు, చంద్రుడు మొదలైన అరవై నాలుగు దేవతలను ఆవాహన చేస్తారు. పురోహితుడు సంస్కృత మంత్రాలను పఠిస్తూ ఆవాహనాది షోడశోపచారాలతో సత్యపీరుని పూజ జరిపిస్తాడు. పూజ పూర్తైన తర్వాత స్కంద పురాణంలో చెప్పిన తీరులో

రంభా ఫలం, ఘృతం, క్షీరం
గోధుమస్య చ చూర్ణికం
అభావే శాలీ చూర్ణంవా
శర్కరా వా గుడస్తథా

అరిటి పండు, నెయ్యి, పాలు, గోధుంపిండి లేక బియ్యం పిండి, పంచదార లేక బెల్లం — ఈ ఐదింటితో చేసిన 'శిరిణి' నైవేద్యం పెడతారు.

తెలుగు దేశంలో పూజ అయేక పురోహితుడు ఐదు అధ్యాయాల వ్రత కథను చెప్తాడు. ఒరిస్సాలో ఉదయం పూజచేసి రాత్రి కథని పాడతారు. పూజ చేయించేవాడు పాలా గాయకుడే. పాటకి తగినట్టు రకరకాల పక్క వాద్యాలు కూడా ఉంటాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో రాత్రిపూట సత్యపీరుని పూజచేసి పూజ అయిన వెంటనే పాలా పాడే పద్ధతీ ఉన్నది.

శంఖం ఊది, తప్పెటలూ తాళాలూ వాయిస్తూ, ''హరి బోల్, హరి బోల్'' అని హరి నామ సంకీర్తన చేస్తారు. స్త్రీలు హుళ హుళి వేస్తారు.[1] గాయకుడు

బొందె దేబొ గొణొనాధొ గౌరీ సుతొ
గొజొ మొఖొ దేబో లొంబో దొరొ

(గౌరీ సుతుడు, గణనాధుడు, గజ ముఖుడు, లంబోదరుడు దేవుడికి వందనం.)

బొందొనొ (దైవ స్తుతి) తో పాలా మొదలు పెడ్తాడు. పాలా కథ పాడడం పూర్తయ్యాక చుడా ఘొసా[2] ఉఖుడా[3] రకరకాల పళ్ళు నైవేద్యం పెడ్తారు.

పాలా చేస్తామని మొక్కుకుంటారు. మనోరథం సిద్ధించాక మొక్కు చెల్లించుకుంటారు. సంతానం కోసం — సత్యన్నారాయణ దేవం, వందేహం, కామదం ప్రభుం లీలయా వితతం విశ్వం తేన తస్మై నమోనమః అంటూ సత్యపీరునికి మొక్కుకుంటారు.

ఒరిస్సాలో పుత్ర సంతతి కలిగితే షోలపాలా (పదహారు పాలాలు) చేయిస్తామని మొక్కుకోవడం అతి సామాన్యమైన విషయం. పుత్రుడు పుడితే ప్రతి సంవత్సరం ఏడాదికొక పాలా చొప్పున చేస్తూ పదహారు ఏళ్లలో షోల పాలా చేస్తారు. వీలుకాకపోతే పుత్రుడి పదహారవ ఏట షోల పాలాలని ఒకేసారి చేస్తారు.

ఒరిస్సాలో ప్రచారంలో ఉన్న ఏ పాలాలోనైనా ఇంచుమించు ధనికవర్గపు అహంకారం, సత్యపీరునిపట్ల వారి నిర్లక్ష్యభావం, తత్ఫలితంగా దైవాగ్రహానికి వారు గురిఅయిన వైనం వర్ణించబడ్డాది. రాజులు, రాణులు, సామంతులు, మంత్రులు, వర్తకులు మొదలైనవారు తమ అహంభావంవలనా, సత్యపీరుని పట్ల నిర్లక్ష్యం

---

1 హుళ హుళి:— నాలికని నోట్లో అడ్డంగా ఆడిస్తూ, పెదవులను స్పృశిస్తూ ఈ మంగళ ధ్వనిని చేస్తారు దీనిని ఉళ ఉళ పొయ్యడం అంటారు. పూజా సమయాల్లో, శుభ కార్యాల్లో, పండగ సమయాల్లో స్త్రీలు ''హుళ హుళి'' వేస్తారు.

2 చుడా = అటుకులు, ఘొసిబా = రుద్దడం, పామడం, అటుకులను బాగా నెయ్యివేసి కలుపుతారు. తర్వాత బాగా ఎక్కువగా కొబ్బరికోరు, తగు పాళ్లలో ఏలకపొడి, మిరియాలపొడి, పంచదార వేసి, చేతులతో వాటిని రుద్ది బాగా కలుపుతారు. దానినే చుడా ఘొసా అంటారు.

3 పేలాలని, వేయించిన కొబ్బరి ముక్కలని బెల్లం పాకంలోగాని పంచదార పాకంలోగాని వేసి చేసినదానిని ఉఖుడా అంటారు.

వలనా అష్టకష్టాలు పడడం చివరకి సత్యపీరుని దైవముగా గుర్తించి వ్రతంచేసి ప్రసాదాన్ని స్వీకరించి పాపవిముక్తులవడమే పాలాలోని కథావస్తువు. పాలా గాయకులు ఈ కథలని ప్రజల మనస్సులో గాఢంగా నాటుకునేటట్లు చక్కని వర్ణనలతో నాటకీయ ఫక్కీలో చెప్తారు. సత్యపీరుడు ఘటనా ఘటన సమర్థుడు. సర్వ శక్తి సమన్వితుడు. దుష్టశిక్షణా, శిష్టరక్షణా ఆయనలక్ష్యం. ఈ దేవుణ్ణి భక్తితో కొలిచి శిరిణి నైవేద్యం పెడితే కష్టాలు కడతేరి పాపాలనుండి ముక్తిదొరుకుతుందని ఓఢ్రుల విశ్వాసం.

పాలాలు రెండురకాలు. ఒకటి బాదీ పాలా. రెండోది భైఠకీ పాలా. బాదీపాలాలో పాలా పాడే రెండుజట్టుల పాటగాళ్లకి పోటీ జరుగుతుంది. దీనిని జవుళిపాలా (జంటపాలా) లొఢాయి పాల (దెబ్బలాడే, లడాయిచేసేపాలా) అని కూడా అంటారు. 'బాదా' అంటే వాదించడం, పంతం పట్టడం అని అర్థం. బాదా నుండి వచ్చినది బాదీపాలా. ఈ పాలాలోనూ సత్యనారాయణ స్తోత్రంతో పాలా మొదలుపెడ్తారు. దీనిలో వ్రతకథకన్నా సాహిత్య చర్చకి ప్రాముఖ్యం ఎక్కువ. ఒక జట్టు పాటగాళ్లు ప్రశ్నిస్తూ ఉంటే రెండవజట్టు పాటగాళ్లు సమాధానాలు యివ్వాలి. పాడడం లోను, వంతపాడడంలోను, పక్కవాద్యాలు వాయించడంలో హోరా హోరి పోటీ జరుగుతుంది. ఈ వాగ్యుద్ధంలో పాండిత్యంతోపాటు అసమాన ప్రతిభ కలిగిన జట్టుకే గెలుపు.

ఈ వాదోపవాదాలు తీవ్రమై రెండు జట్లవారు అసలు సంగతి వదిలి ఒకరి జుట్టు ఒకరు పుచ్చుకుని కొట్లాటకి కూడా సిద్ధపడ్డం కద్దు. అందువల్లే ఎక్కడన్నా కోలాహలంగా ఉన్నప్పుడు, ఎక్కువగా వాదోపవాదాలు చెలరేగినప్పుడు "పాలా లాగిచి" (పాలా జరుగుతోంది) అనే ఒరియా జాతీయం పుట్టింది.

"భైఠకీ"[1] పాలాకన్న బాదీపాలా ఆసక్తికరంగావిజ్ఞానదాయకంగా ఉంటుంది. ఒకజట్టు గాయకులు రెండవజట్టు గాయకుల జ్ఞానాన్ని, స్మరణశక్తిని, సమయస్ఫూర్తిని, బుద్ధికౌశలాన్ని పరీక్షిస్తారు. మధురమైన సంగీతంతో సుస్పష్టమైన ఉచ్చారణతో చక్కిలిగింతలుపెట్టే హాస్యంతో, చక్కని భావప్రకటనతో పాలా గాయకులు శ్రోతలను ముగ్ధుల్ని చేస్తారు.

ఒక పాలా ఏర్పాటు చేయడానికి నూరురూపాయిలనుండి రెండువందల రూపాయిలవరకు ఖర్చుఅవుతుంది. ఈ డబ్బులో నాలుగవవంతు గాయకుడు, తతిమ్మాది మిగిలినవారు పంచుకుంటారు. బాదీపాలాలో రెండుజట్లు ఉంటాయి కనక రెండింతలు ఖర్చు అవుతుంది. రెండు మూడు వీధులవాళ్లు కలిసి చందా వేసుకుని పాలాని ఏర్పాటు చేస్తూఉంటారు.

వంగదేశం పాలా పుట్టుకస్థలం. వంగదేశపు కొబీర్‌గాన్, పాంచాలీ లకి ఓఢ్రదేశపు పాలాకి చాలా పోలికలు ఉన్నాయి. వంగదేశాన్ని పాల్ వంశపు రాజులు పాలించేవారట. వారి ఆస్థానంలో భట్టులు రాజుగారి గుణగణాలను శ్లాఘిస్తూ వింజామరలతోవీస్తూ పాడేవారట. కాలక్రమేణ రాజులను కీర్తించడం మాని, చామరాలు పడుతూ, భగవన్నామ సంకీర్తన, లీలాగానములు పాడడం మొదలు పెట్టారుట. పాల్ రాజుల ఆస్థానంలో ఆరంభమైన కారణంచేత దీనిపేరు 'పాలా' అయిందని కొంతమంది అభిప్రాయం. అయితే ఈ అభిప్రాయం సరియైనదని చెప్పడానికి లిఖిత పూర్వకమైన ఆధారాలేమీలేవు.

క్రీ. శ. 1936లో ఒరిస్సా రాష్ట్రం ఏర్పడింది. అంతకు పూర్వం ఒరిస్సా, బెంగాల్, బీహార్ రాష్ట్రాలు కలిసే ఉండేవి అన్న విషయం మనం గుర్తుచుకోవాలి. 18వ శతాబ్దపు ప్రారంభంలో ఒరిస్సాలో సుజావుద్దీన్ మహమ్మద్‌ఖాన్ సుబేదారుగా ఉండేవాడని, అతని కాలంలో ఓఢ్రదేశంలో పాలా' మొదలయిందని కృపాసింధు రచించిన "ఉత్కళ యితిహాసా"వల్ల తెలుస్తుంది. అప్పటికే బెంగాల్‌లో మారు మూల గ్రామాలవరకు సత్యపీర్ పాంచాలీ ప్రజాదరణ పొందే ఉంది ఓఢ్రులు తమ మాతృభాషలో పాలాలను అనువదించుకున్నారు. కొన్ని పాలాలలో బెంగాలీ, ఒరియా, హిందీభాషలు కలగలుపుగా వాడబడేవి.

ఆర బోల్తా కెహు నహి సున్తా
కెహు నాహిరె చిన్తా హమారా దిల్‌రె లజా

అలాంటి కలగా పులగపు పాటకి చక్కని ఉదాహరణ.

ఒరియావారు ఒరియాలో పాలా రాయడానికి ప్రయత్నించి; అన్యభాషా పదాలకు స్వస్తిచెప్పి దోషభూయిష్టమైన ఒరియా ప్రయోగాలను దిద్ది పాలాలను తయారుచేసారు. ఆ నోటా ఆ నోటా ప్రచారంలో ఉన్న ఈ పాలాను ఎంతో శ్రమపడి సంగ్రహించి దోషాలను పరిహరించి 1910వ సంవత్సరంలో శ్రీ గోబిందొ రొథొ పుస్తక రూపంలో ప్రచురించారు.

పాలా గాయకులు పురుషులే. ఒరిస్సాలో ఘోషా ఉండడం నుండి, ఈ రకమైన కార్యక్రమాలన్నీ పురుషులవే. సాహీనటొ, దొండొ నాటొ, గామొలీలా మొదలైన అన్ని కార్యక్రమాల్లో పురుషులే ఉంటారు. అబ్బాయిలే స్త్రీల వేషాలు ధరిస్తారు. గత ముప్ఫై నలభై ఏళ్లబట్టి ఒరిస్సాలో మార్పు కనపడుతోంది. అన్ని రంగాలలో స్త్రీలు ముందంజ వేస్తున్నారు. ఇప్పుడు ఒరిస్సాలో గాయనీమణుల పాలాజట్లు రెండు ఉన్నాయి.

పాలా గాయకులు తమ శిష్యుల్లో ప్రతిభాశాలియైన శిష్యుడికి విద్య నేర్పుతారు. లేదా ప్రతిభాశాలియైన తమ పుత్రుడికి నేర్పుతారు. ఈ శిష్యులు తమకే బాదీపాలాలో ప్రతిద్వంద్వులుగా తయారవడానికి సావకాశం ఉంది కాబట్టి శిష్యుల ఎన్నిక చాలా జాగ్రత్తగా చేసుకుంటారు. పుత్రులులేక, యోగ్యులైన శిష్యులు దొరకక కొంతమంది గాయకుల విద్య వారితోనే అంతమైపోతుంది.

సంగీతం, నృత్యం, అభినయంలో ప్రధానమైనవి పాలా, దాసకాతియాలు. సంభాషణలు భావానుగుణమైన అభినయంతో కూడినవైన కారణంచేత వీటిని ఒరియా నాటకానికి ప్రారంభదశగా నాటక వికాసానికి తొలిమెట్లుగా చెపుతారు

---

1 భైఠకీ (వాదనలేని పాలా)

శ్రీ ఇ. సాయిబాబా

కాళిదాసు కాలము

కవికుల గురువు — మహాకవి శ్రీకాళిదాస కాలము ఇప్పటికినీ స్పష్టముకాని ప్రహేళిక. అసలు జీవిత వృత్తాన్తమే దంతి కథలమయము. నాకు లభించిన లేక నాగవేషణ సారాంశమునుబట్టి కాళిదాసుకాలమును ఖచ్చితము కాకపోయినను, ఉజ్జాయింపుగనైనను లెక్కకట్టుటకు వీలయినది.

౧. ౧౯౭౭ జూన్ నెలలో 'ఘర్‌కాళికా' (ప్రాచీన ఉజ్జయినీ నగర ప్రదేశం) ప్రాంతంలో లభించిన మృణ్మయ ఫలకములను బట్టి విక్రమాదిత్య చక్రవర్తి అస్తిత్వము స్థిరపడినది. క్రీస్తుపూర్వం ఒకటవ శతకము సంబంధించిన బ్రాహ్మీలిపిలో 'కృత' అని వ్రాయబడినది. మొదట విక్రమ శకమును 'కృతశకము' అనెదువారు.

౨. రెండవ మృణ్మయఫలకం పయి ఒక బాలుడు తెఱచి యుండబడిన సింహము నోటని పరీక్షించుచున్నట్లు ఒక చేయి సింహపు కోఱలపై ఉన్నట్లు చిత్రము కలదు. ఇది అభిజ్ఞాన శాకున్తలములోని సప్తమాంకములోని సర్వదమనుని దిగువ మాటలకు ఆ ఫలకం మూర్తిత్వమును ఒసంగుచున్నది.

> బాలః—జింభ జింభ లే
> సింఘ। దంతాఇం దే గణయిస్సం।
> (ఛాయ — జృమ్భస్వ జృమ్భస్వ రే సింహ।
> దన్తాః తే గణయిష్యే।)

౩. కాళిదాసకవి ప్రాకృతములు ఆర్షములు. సంపాదకుల అవిచారకరమగు చేర్పు—మార్పులవలన ఆర్షత్వము కోల్పోయినవి. ఇంకను ఒకమాట పద్య గద్యములలో శౌరసేనియే తప్ప ఇతర ప్రాకృతములు లేనేలేవు. విక్రమోర్వశీ నాల్గవ అంకములోని అపభ్రంశము చిరంతనమైనది. భాషాశాస్త్రవేత్తలు దీనిని జాగ్రత్తగ గమనించవలెను.

౪. విక్రమోర్వశిలోని 'విక్రమ' శబ్దబాహుళ్యము (నాటకము మొత్తముపయి ముప్పదిమూడు పర్యాయములు) తప్పక విక్రమాదిత్యుని రాజ్యారోహణ సన్దర్భములో అభినయించబడినదని ఊహించుట అసంజసము ఎంతమాత్రము కానేకాదు.

౫. కాళిదాసకవిని ఆదరించినది విక్రమాదిత్యుడు. విక్రముని తండ్రి మహేంద్రాదిత్యుడు. ఇక కాళిదాసుని గుప్తకాలములోనికి లాగుకొని వచ్చిన రెండవ చంద్రగుప్తుడు 'విక్రమాదిత్య' బిరుదుతో ప్రసిద్ధి చెందినవాడు. ఇక తనయుడు కుమారగుప్తుడు 'మహేన్ద్రాదిత్య' ప్రతాప నామముతో ప్రఖ్యాతిగాంచెను. కాన ఇవి పెట్టుడు పేరులు గాని, సహజముగ ఏర్పడినవికావు. కాన పూర్వపు మాళ్వ చక్రవర్తుల నామములను అభిమానముతో స్వీకరించినవని స్పష్టమగుచున్నదిగదా!

౬. కొందఱు ఆధునిక విద్వాంసులు—రాసులు గ్రీకులనుండి భారతీయులకు సంక్రమించినవని తలచుచున్నారు. ఇది అసంబద్ధమే రాసులు రామాయణమునసే గాక, బౌధాయన గృహ్యశేషసూత్రములలో పేర్కొనబడి యుండుట విమర్శకులు గమనించగలరు. (వివరములకు—తిలకు 'గీతారహస్యములు' చూడ ప్రార్థన.)

౭. కుమారసంభవములోని ఎనిమిది సర్గలు మాత్రమే కాళిదాసు రచితము. ఇది సంభవమేగాక సముచితము కూడ. పూర్వ కాలమున 'సయ్యువము' అనగా దమ్పతుల సమాగమమునకు ముందు చేయు సమావేశము అని తాత్పర్యము.

(చూడు గొభిలీయ గృహ్యసూత్రము ౨—౫—౫౦; ఖాదిర గృహ్యసూత్రము ౧—౪—౧౬) పుట్టుట అని లౌకికార్థము.

కాన ప్రాచీనుడగు కాళిదాసు తనకు గల కామశాస్త్రమును పిండి రంగరించిన మనోహర కవితా గుళిక 'కుమారసంభవము.'

౮. వైదిక పదములు 'ఆస', 'కామయాన', 'దాశ్వాన్' 'త్రియమ్బక', మున్నగునవి; తపః షడ్భాగ, దుఃఖోత్తరా, ముష్టం, మున్నగు వ్యాకరణ దోషములు—క్రీస్తుపూర్వమువాడై యుండుటను తేటతెల్లము చేయుటలేదా? 'ఉషస్' పదము వేదములలోను, కాళిదాసు రచనలందు స్త్రీలింగము. గుప్తకాలమునాటి సంస్కృత రచనలనుండి నపుంసకముగ ప్రయుక్తము. వేరు ఎచ్చటను కానరాని వైదిక ఛందము (అభిజ్ఞానశాకున్తలం ౪—౮) కాళిదాసునిలో ఉండుట గమనించనైనది.

ఉపసంహారం

కాళిదాస నాటక త్రయమునకు సర్వంకష ప్రజ్ఞాధురీణులగు వారు సుసంస్కృత ముద్రణలు వెలయించిన ఎడలగాని, ఆ మహాకవి ప్రజ్ఞ తేటతెల్లముగాదు. ముద్రిత నాటకములలోని ప్రాకృతములకు, వ్రాత ప్రతులయందలి ప్రాకృతములకు చాల భేదముగలదు. (వివరములకు శ్రీ మోనియర్ విలియమ్స్ ముద్రణలోని నోట్సు చూడగలరు.) ఒక ఉదాహరణ గమనించగలరు. భరతుడు, అభినవ

గుప్తుడు, సాగరనంది చెప్పని 'భరతవాక్యం' పదం (వారి వ్రాత లతో ప్రబన్ధ సంహారం—ప్రశస్తి కలవు.) ముద్రిత ప్రతులలో ఉండుట వింత. వ్రాత ప్రతులలో పెక్కింట 'భరత వాక్యం' పదం లేదు. 1962లో శ్రీమతి శివాని దాసగుప్త పరిష్కరించిన ఆర్య క్షేమీశ్వరుని 'చణ్డకౌశికం'లో కూడ భరతవాక్యం పదం లేదు.

గుప్తచక్రవర్తుల శాసనములలోని భాషను, కాళిదాస రచనను తులనాత్మకంగా పరిశీలించిన, గుప్తకాలమునకు పూర్వుడుగనే తోచును. గుప్తుల శాసనములలోని శబ్దాడంబరము, అన్వయ కాఠిన్యము కాళిదాసు రచనలలో మృగ్యముకదా! న్యాయ సిద్ధాన్తమును కాళిదాసు పేర్కొనకపోవుట చిరంతనత్వమునకు మఱియొక ఉదాహరణ. "శబ్దగుణ" (రఘువంశం ౧౩–౧) పదము (ఆకాశను అను అర్థమున) సాంఖ్యులనుండి గ్రహించి యుండవచ్చును.

అనుశీలించిన గ్రన్థములు

౧. అభిజ్ఞాన శాకున్తలమ్
సం॥ శ్రీ మోరేశ్వరకాలే
బొంబాయి-౧౯౪౭.

౨. అభిజ్ఞాన శాకున్తలమ్
సం॥ శ్రీపాద బేల్వాల్కర్
ఢిల్లీ—౧౯౬౫.

౩. విక్రమోర్వశీ
సం॥ హరి వేలంకర్
ఢిల్లీ—౧౯౬౧.

౪. కున్దమాలా
దిఙ్నాగ కృతం
సం॥ కాళీకుమారదత్త
కలకత్తా-౧౯౬౪.

౫. Bhava : A study
Dr. Acyuta Pusalkar
Sec. Edition, Delhi 1968.

౬. Meghaduta
Ed: Dr. Susila Kumara De
Delhi 1957.

శరజ్జ్యోత్స్న!!

శ్రీ బులుసు వెంకటేశ్వర్లు

ఈ శరజ్జ్యోత్స్న నన్ను బంధించివైచె;
ఔను!! కాకున్న కుటిల గాఢాంధకార
పథ విలగ్నమూర్తిని నేను పరమ మృదు శ
శాంక దీధితిలో నెట్లుసాగుచుంటి?? 1

ఈ శరజ్జ్యోత్స్న నాకుఁ గన్పించె మాతృ
దేవతా స్నిగ్ధ దరహాస దీప్తివోలె!!
కాకయుండిన యింతట కరుగునే? మ
దీయ పాషాణ హృదయమ్ము దీనినిగని?? 2

ఈ శరజ్జ్యోత్స్న నీలకంఠేశ జటల
పొంగులెత్తిన గంగా ప్రపూరమటుల
నాకుఁ దోచును! కొండకోనలనుఁగూడ
తను, చైతన్యసీమలుఁగా నొనర్చి!! 3

ఈ శరజ్జ్యోత్స్నలో పులకించి తడియు
చుంటి మిర్వురము!! కుటీరమంటి ప్రాకు
మల్లికయు--నేను!! చైతన్య మంజువార్ద్ర
కలిత నిశ్శబ్ద భావమూర్తులము మేము!! 4

ఈ శరజ్జ్యోత్స్న నాకు తేయెల్ల నెన్ని
గీతములు పాడి విన్పించెనో తెలియదు!!
మౌన గీతములవి యెల్ల మరల మరల
యెదను మొదలంట నూపి రహించు నెపుడు!! 5

శ్రీ శ్యామల ప్రకాశరావు

సాహిత్య అకాడమీ అవార్డుపొంది గాలిరథం - ఒకపరిశీలన

ఈ సంపుటంలో మొత్తం తొమ్మిది కథలున్నాయి. ఇందులో ఏడుకథలు మృత్యువునకు సంబంధించినవే. అనుభూతి ప్రధానంగా వ్రాయబడిన ఈ కథలన్నింటిలోను ఏదో హృదయాన్ని కదిలించిన ఒక సంఘటనను ఆధారం చేసుకొని వసుంధరాదేవిగారు దానికొక ఆకారం ఏర్పరచినట్లు అనిపిస్తుంది, కాబట్టి ఎక్కువ పాత్రలను ప్రవేశపెట్టి పాఠకుని గజిబిజి చేయవలసిన అవసరంకాని, సామాన్యుని మెదడులో ఇమడని ఒక పెద్ద 'కాన్వాసు'పై ఇతివృత్తాన్ని చిత్రించవలసిన అవసరం కాని రచయిత్రికి కలగలేదు. అందుకే పుబ్బలో పుట్టి మఖలో మాడిపోయే కొన్ని కథలవలె గాక వసుంధరాదేవిగారి కథలు హృదయాన్ని కదిలించి స్మృతిపథంలో ఒక గాఢమైన ముద్రవేస్తాయి. జీవితానికి చాలా దగ్గరగా, జీవితానుభవంలో నుంచి వెలికితీసిన ప్రబల సత్యంగ కథాకథనంలోని విషయం స్ఫుటంగ కనిపిస్తుంది. రచయిత్రి చదువుకున్న శాస్త్ర విజ్ఞానాన్నీ, అనుభవంవల్ల గడించిన తాత్త్వికదృష్టినీ జోడించి, ప్రస్తుతం తన చుట్టూ ఉన్న సమాజాన్ని విశ్లేషించడం పెక్కు కథల్లో వినిపిస్తుంది. నిత్యం సంఘాన్ని పరిశీలిస్తున్నా ఈమెకు గాఢమైన అనుభూతి కలిగితే తప్ప కథలు వ్రాయకపోవడంవల్ల ఏడాదికి రెండు మూడు కథలచొప్పున ఇప్పటికి నలుబది మాత్రమే వెలువరించగలిగారు శ్రీమతి వసుంధరాదేవిగారు.

ఈమె కథలు భారతి, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక వంటి కొన్నింటిలోనే ప్రచురింపబడడంవల్ల ప్రత్యేకమైన ఒక పాఠకలోకానికే వసుంధరాదేవిగారు తెలుసు. సామాన్య పాఠకుల కీమె పేరు తెలియదన్నా అతిశయోక్తిలేదు. అదికూడా ఆమెకున్న ఒక ప్రత్యేకతయే !

ఈ ప్రత్యేకతను గుర్తించి మన సాహిత్య ఎకాడమీవారు ఆమె సంపుటీకరించిన 'గాలి రథం' అవార్డుకు అర్హమైనదిగా ప్రకటించడం చాలా ముదావహం.

ఇందున్న కథలలోని విశేషాలు విహంగ వీక్షణంతో తెలుసుకుందాం.

మొట్టమొదటిదీ, ప్రప్రథమంగా ప్రశంసింపదగినదీ 'పెంజీకటి కవ్వల...' అనే కథ. డా. సీతారామారావు భార్య జయలక్ష్మి. నిరాడంబరంగా ఏ బాదరబందీ లేకుండా జీవించడం ఆమె కిష్టం. ''క్షీరార్ణవశాయి అయిన విష్ణువులాగా దుఃఖ సము అందరాకుండా నిలిచివున్న 'అది' అనేది పట్టుకోవాల ఆరాటం. అయినా భర్త, పిల్లలూ అందరూ కావాలి ఉండాలి. తన ఆశయాలకనుగుణంగా పెద్దపిల్ల రాధిక సంసారాన్ని పట్టించుకోని భర్తనూ, నికృష్టపు జీవి తున్న చిన్నపిల్ల చంద్రికనూ తలచుకున్నప్పుడల్లా ఆమె కలిగి తన 'ఆలోచనా, బ్రతుకూ, ప్రపంచం' అన్నీ 'చావు బ్రతుక్కి చాలా దగ్గరగా ఉన్నట్ల'నిపిస్తుంది. తన తాతగారు చనిపోయినప్పుడు కలగని భయం ఇప్పు తోంది. దానికితోడు ఇంటి దగ్గరి శ్మశానం నుంచి కంపు జీవితం ముగింపును అనుక్షణం గుర్తుచేస్తున్నది

జయలక్ష్మికి 'ఎక్కడికి వెళ్ళినా దుఃఖపడడానికి కనబడింది.' సర్కసులో పిల్ల ఫీట్సూ, పక్కయింటి బలవంతపు చావు, భర్త చిన్నాయన వెంకటప్ప కేన్సరు ఆమె హృదయాన్ని పిండేశాయి. జీవన్మరణ సంఘర్ష మిట్టాడుతున్న కేన్సరు రోగుల్ని చూసి ఎందుకు వా లనుకుంటున్నారా అని ఆశ్చర్యపోయింది. జీవించడాని ఆశకు విస్తుపోయింది. ''జీవమూ మృత్యువూ రెండ జంటగానే ఉంటాయనీ, శరీరమూ మనసు కొన్ని లోబడి ప్రవర్తిస్తాయనీ'' భర్త చెప్పిన మాటలు నిజ ఆమెకు గుండె నొప్పి రావడం, విశ్రాంతి తీసుకోవడం తనకు చావు దగ్గరవడం, తన లేమిని ఇంట్లో వాళ్లం అలవాటు చేసుకోవడంగా అనిపించింది. 'నేను' అ సంగతి ఇంకా ఆమె కంతు పట్టలేదు కాని 'చావు బ్రతుకు విలువ తెలిసింది.' 'నాది అనుకుంటున్న ఏ నేను అనుకుంటున్న ఈ మనిషికీ ఏమీ శక్తిలేదు. మ లతో కోరికలతో నిమిత్తం లేకుండా స్థితులు ఏర్ప ఏర్పడ్డాకనే అవి మనిషిలోని భాగాలవుతున్నాయి (40 జీవితం ఒక ఆట. ఈ ఆటను ఆడించేది, ఆడేదీ నేనే' (42 పే.) 'మనిషికుండే పరిమితులు, జీవిత స్వేచ్ఛ – అన్నీ ద్వంద్వ స్వరూపమైన మనసుకు ప్రశ్నలు, అనవసరమైన ఆలోచనలు కాలం కూడ సంబంధించిందేగాని సత్యం కాదు. మనిషికి ఈ క సత్యం. కాలం అనేది ఊహ. కాలం లేదు. అనేకమై

వున్నాయి. ఒక క్షణానికీ మరో క్షణానికీ మధ్య ఏ సంబంధం లేదు. ఆ సంబంధాన్ని కల్పించేది మనస్సే' (42 పే.) 'ఈ జ్ఞాపకాన్ని నిలుపుకోవటమే తపస్సు. ఈ స్పృహను సజీవం చేసుకోవడమే ముక్తి' (43 పే.) అని క్రమంగా జయలక్ష్మి తెలుసుకున్నది. 'పుట్టుక వేర్పాటుకు నాంది. చావు ఐక్యతకు చిహ్నం. జీవితంలో వుండే సత్యం మార్పు. ఆ మార్పుయొక్క పరాకాష్ఠ చావు . ప్రపంచ స్థితి ఈ ద్వంద్వాల మీదనే నిలచివున్నది' (43పే.) అనే జగత్ సత్యాన్ని దర్శించగలిగిన జయలక్ష్మికి ఇక చావంటే భయం పోయి ఆనందం వెల్లుబికింది. దానికి తోడుగా ''ఢిల్లీ పట్నం చూడండం''టూ 'అందాల లోకంలో ద్వంద్వాల శోకం' చూపించా డొకడు. దాంతో 'పెంజీకటి కవ్వలి' స్థితిగతులను సంపూర్ణంగా యెఱిగిన జయలక్ష్మి తాను పోయినా యిదంతా ఉంటుందని లోకం పోకడను పసిగట్టింది. 'పెంజీకటి' చావు కొక ప్రతీక.

ఈ కథలో జయలక్ష్మి ఊహల నెపంతో, జీవన్మరణాలనే ద్వంద్వ జగత్ సత్యాలపై రచయిత్రి తనకు కలిగిన సందేహాలనూ, తరవాత అనుభవం ద్వారా, 'సుదర్శనం' మూలంగా కనుగొన్న పరిష్కార మార్గాలనూ కన్నులకు గట్టించింది. కలిగిన తాత్త్వికాను భూతిని కేంద్రంగా చేసుకొని సృజించినవే ఇందలి పాత్రలూ వాటి సంభాషణలు. కథ నామమాత్రం, కాని కలిగే అనుభూతి శాశ్వతం. చేసిన తత్త్వసంబంధమైన చర్చ పరిశీలనార్హం. అందుకే ఈ కథ సంపుటి మొత్తంలో ఒక ఆణిముత్యం.

వసుంధరాదేవిగారు తమ కథలకు పేర్లు పెట్టడంలోకూడా ఏదో విశేషం కనిపింపచేస్తారు. మొదటి కథకువలెనే రెండోకథ పేరు 'బ్రిడ్జిక్రింద'. మొదటిది 'పెంజీకటి' అయిన చావుచుట్టూ మలచబడినట్లే ఈ కథంతా 'బ్రిడ్జి' చుట్టూ తిరుగుతుంది.

పోతప్ప తండ్రిచేసిన అప్పు తీర్చవచ్చునే అపోహతో పల్లె నుంచి పట్నంచేరి రిక్షా తొక్కసాగాడు. చలపతి మరో రిక్షావాడు. లోకాన్ని బాగా చదివినవాడు. తండ్రి ఇప్పించిన బంట్రోతు ఉద్యోగం చట్రంలో ఇమడలేక చెప్పకుండా వచ్చి రిక్షా తొక్కుతూ పెళ్లి చేసుకొని కాలం వెళ్లబుచ్చుతున్నవాడు. రాజకీయాలగురించీ, సమాజం గురించీ విమర్శించగలవాడు. దొరికినచోటల్లా అప్పు చేసినా, రిక్షాబేరాల్లో ఆతడన్నదే మాట. పోతప్ప కమీషనుకు రేషనుబియ్యం అవీ అమ్మడం పేదలనోట్లో మట్టికొట్టడమేనని వాదించిన అభ్యుదయశీలి. పోతప్పలాంటి గొర్రెలు డబ్బుకూ అధికారానికీ లొంగడంవల్లనే సమాజం 'కాటావాళ్ల'ను తయారు చేయ గల్గుతున్నదని దుయ్యపట్టగల ధైర్యశాలి. అందుకే పోతప్ప దృష్టిలో ఆతడొక 'తిక్క'మనిషి.

పోతప్ప డబ్బు కూడబెట్టి అప్పు తీర్చడమే ధ్యేయంగా పెట్టుకున్నాడు. కాబట్టి పట్నపు అలవాట్లలో కనీసం 'టీ' కూడా తాగలేదాతడు. అన్ని శ్రమలకూ ఓర్చాడు. కమీషనుకు అన్నీ అమ్మాడు. తన చెల్లెలి భర్త అంజనప్ప త్రాగుబోతుగా తిరుగుతుండగా చెల్లెలి కాపరం తాను మోయాలసి వచ్చినందుకు బాధ పడ్డాడు. మళ్లీ ఆమె వేరింటి కాపురం పెట్టి వ్యాపారం చేసుకుంటుంటే గొర్రె నొకదానిని కొని చూస్తూ వుండమన్నాడు. ఇవన్నీ ఆతని స్వార్థాన్ని పట్టి చూపుతున్నాయి. అందుకే తన గొర్రె పిల్ల నమ్మిన బావను చితకబాది జైలుకెళ్లాడు. లంచమిచ్చి విడిపించిన భార్యమాట విని మతిపోయి మొదటిసారిగా తాగి శంకరరెడ్డిగారి ఇంటిమీదికిపోయాడు. మళ్లీవచ్చిన పోలీసువాళ్ల ధాటికి ఉన్న బిందే చెంబూ కూడా తాకట్టుకుపోయాయి. దాంతో ఇల్లు ఖాళీ అయింది. ఉన్నడబ్బు, పరువు, ఆత్మవిశ్వాసం నశించాయి పోతప్పకు.

ఈ కథలో 'బ్రిడ్జి'కిందిభాగం బీదాబిక్కి కొక సత్రవలాగ ఉంటుంది రకరకాలవాళ్ళు చేరి తమ కాలాన్ని వెళ్లపుచ్చుకొని మటుమాయమవడం కనిపిస్తుంది. సంఘంలో సామాన్య మానవుల జీవితాలు ఎలా ఉంటాయో ఈ చిన్న కథలో విమర్శనాత్మకంగా నిరూపించబడింది. నిజాయితీగా బ్రతుకుదామనుకున్నా పరిస్థితుల ప్రభావంవల్ల మానవుడెలా దానవుడవుతాడో తెలుపబడింది ఈ కథలో.

మూడవది 'పండగ'. ఈ కథ పెద్దగా చెప్పుకోదగింది కాదు. ఉత్తమ పురుషలో చెప్పబడిందిది. ఒకప్పుడు తల్లిదండ్రులతో, తన ఇద్దరు చెల్లెళ్లతో తెలివిగా ఆశాసౌధాలు నిర్మించుకొన్న ఒకామె నిర్జీవంగా, నిరాశతో సామాన్యపు సంసారపక్షంగా బ్రతకవలసి రావడం, వచ్చిన సంవత్సరాది పండగ చేసుకోకూడదనుకున్నా భర్తతో ఇద్దరు పిల్లలతో ఏదో అయిందనిపించి, భర్త బలవంతంపై తన పెదనాన్న కొడుకింటికి బయలుదేరి వెళ్ళడం, జమీందారీ హాయిదాలోఉన్నా వాళ్ళకు సుఖశాంతులు లోపించినాయని గ్రహించి వాళ్లను జొన్నవాడ కామాక్షమ్మను దర్శించమని చెప్పగా పెద్దమ్మగారికి కోపంవచ్చి తమను గెస్ట్‌రూమ్‌కు పంపడం, అక్కడ ఆమె భర్త ఇద్దరు పిల్లలతో ఉండడమే పండగేనేమో అనుకోవడంతో కథ ముగుస్తుంది. ఇందులో జొన్నవాడకు చేరటం గూర్చి చెసిన వివరణ అనవసరమనిపిస్తుంది.

అలాగే డార్మిటరీలో కక్కును దొడ్డినిగూర్చి చేసిన ప్రసంగం జుగుప్సాకరంగా ఉండటమేకాక, కథానాయికకు తాతగారి వెర్రి వార సత్వంగా వచ్చిందేమోనని పాఠకులకూ అనిపిస్తుంది. పెద్ద వారందరూ 'కమోడ్'లో చిక్కుబడిపోయారని విమర్శించడమే ఇందులో కనిపిస్తుంది. ఈ కథ రచయిత్రి శైశవావస్థను చాటుతున్నది అని చెప్పక తప్పదు.

నాల్గవకథ 'తోలుబొమ్మలు'. మానవులంతా భగవంతుని చేతిలో తోలుబొమ్మలనీ, ఆయన ఆజ్ఞానుబద్ధులుగా ఆడవలసిందే నని ఈ కథ నిరూపిస్తుంది. శంకరయ్య భార్య వనమ్మ చాలా చాకచక్యంగా సంసారాన్ని నడుపుకొంటూ పిల్లలను కట్టుదిట్టంగా పెంచింది. మిగతా ఊరివాళ్లతో సంబంధం లేకుండా మెదిలింది. పిల్లల చదువులకోసం పట్నం చేరడానికి భర్తనొప్పించింది. కాని దురదృష్టవశాత్తు పొలం అమ్ముడు పోకపోగా సుబ్బరామయ్య కూతురు పారేసుకున్న బంగారుగాజులు శంకరయ్య తీశాడని అపవాదు

రావడం, అది భరించలేక ఆతడు ఎండ్రిన్ తాగి మరణించడం జరిగాయి. దాంతో వనమ్మ ఆశలు అడియాస లయ్యాయి, బ్రతుకు బండలయింది. ''ఒస్తా ఒట్టిదె పోతా ఒట్టిదె ఆశ ఎందుకంటా... పంచభూతములు తోలుబొమ్మలతో ప్రపంచమాయెనటా'' అని రామయ్య పాడినతత్వం నిజమయింది. అపవాదుకు జడిసిన ఒక మనిషి జీవితం వల్ల కలిగిన అనుభూతి ఈ కథకు మూలం. ఇందులో కూడా పెద్ద విశేషం లేదు.

ఐదవది 'చెరువుదగ్గర...'అనే కథ. ఇది కూడా మొదటి రెండు కథల పేర్లులాగా ఉండి అనంతపురం చెరువు దగ్గర సంభవించిన దుర్ఘటనవల్ల ఒక శీలవతి జీవితం ఎలా బుగ్గిపాలయిందో తెలిపేది. సుశీలమ్మ ఒక ఉత్తమయిల్లాలు. భర్తలేని జీవితం ఆమెకు లేదు. భర్త గోపాలరావు కమర్షియల్ బ్యాంకు నడిపి బాగా సంపాదించినా పిల్లలు లేనిలోటు ఆమెను బాధిస్తూనే ఉంది. అయితే బ్యాంక్ వాచ్‌మన్ లింగప్ప తన ఎనభైఏళ్ల జీవితంలో పొందిన అనుభవాలు చెప్తూ కాలక్షేపం కలిగించడంతో సుశీలకు సంతోషం, ఆ ముసలివాడిమీద సానుభూతీ కల్గినాయి. అందుకే భర్త ఆతడిని ఉద్యోగంనుంచి తీసేస్తానన్నా అడ్డుపడింది.

చెరువు దగ్గరున్న గణేశుడి గుడిలో భర్తచేయించే పూజలకు వెళ్లింది సుశీల. తరవాత చెరువుగట్టుమీద కూర్చున్నది భర్తతో బాటు. కనుచీకటి పడింది. ఎవరో నలుగురు మనుష్యులొచ్చి భర్తను కట్టేసి నగలతోబాటు సుశీలమ్మ శీలాన్ని కూడా దోచుకున్నారు. మైలపడిపోయిన శరీరం నశించాలనీ, భర్త తనను పూర్వంలా చూడడు కాబట్టి చావడాని కేదైనా మందు లింగప్పను తెమ్మంటుంది. కాని ఆతడు ధైర్యం చెప్తాడు.

ఆతడు లేనప్పుడు సుశీలమ్మ లేచి చెరువుగట్టు చేరింది. చుట్టూ కలయచూసింది. ఈ విశ్వానికి తానే కేంద్రంగా కనిపించింది. తనకే తప్పు అంటలేదనీ ప్రాణం భగవంతుడు కాబట్టి ఆయనకు తప్పూ ఒప్పూ లేవనీ అనుకున్నది. ఇంతలో 'అష్టమి చంద్రుడు చచ్చిపోయాడు. ఆమెకు చీకట్లో ఎదుర్రాయి తగిలింది. బోర్లాపడి క్రిందికి దొర్లిపోయింది...ఏమీ తెలియని స్థితిలోకి వెళ్లిపోయింది' అనడంవల్ల సుశీలమ్మ ప్రాణంపోయినట్లు తెలుస్తుంది.

ఈ కథలో దుండగుల దుశ్చర్యవలన ఒక నిండు సంసారం బండలవడం హృదయాన్ని కదిలిస్తుంది. అయితే లింగప్ప అనవసరమైన స్థానాన్ని ఆక్రమించినట్లనిపిస్తుంది.

ఆఱవకథ 'పిచ్చిగీతలు'. పరమేశ్వరరావు, కామరాజు, చైతన్య ప్రభువు – ఈ ముగ్గురూ కలిసి చదువుకొనడమే కాక మిత్రులు. చదువయ్యాక పరమేశ్వరుడు రెవెన్యూ డిపార్టుమెంటులో, చైతన్య ఫారెస్టు డిపార్టుమెంటులో, కామరాజు స్కూలుమాష్టరుగా స్థిరపడ్డారు. అంతేకాక పెళ్లిళ్ళు కావడం, పిల్లలు కలగడం కూడా జరిగింది.

అనుకోకుండా ఉద్యోగరీత్యా చిత్తూరులో పరమేశ్వరుడూ, చైతన్య కలుసుకున్నారు. రోజూ సాయంత్రం కలుసుకుని కాలక్షేపం చేసేవారు. కామరాజు కూడా అప్పుడప్పుడూ వచ్చేవాడు కాని వారిద్దరి భావాలతో ఏకీభవించేవాడుకాదు. దానికితోడు ఏదో ఉత్తరం వ్రాసి దాని కాపీలు 14 మందికి పంపమనీ లేకపోతే పెద్ద ఆపద వస్తుందనీ తెలిపాడు. కాని పిల్ల పెళ్లి హడావిడిలో ఉండి దానిని చింపి పారేశాడు చైతన్య. తరవాత వనభోజనానికి వెళ్లిన సందర్భంలో అపాయానికి లోనయి చైతన్య చనిపోయాడు. కామరాజు చైతన్య నిధిపేరుతో డబ్బు వసూలు చేయసాగాడు. ఆత్మాభిమానంగా బ్రతికిన చైతన్య ఆత్మ దీనికి క్షోభిస్తుందనీ, అది జరగకూడదనీ యోచిస్తూ 'మనసును కేంద్రీకరించి తీవ్రంగా అతణ్ణే భావిస్తూ కళ్లు మూసుకు కూర్చున్నాడు' పరమేశ్వరుడు. నిద్రపట్టింది. లేచి చూసేసరికి 'మెరుపూ ఎండాలేని యీ ప్రపంచం తపస్సమాధిలో ఉన్న యోగిలాగా ఉన్నది.' అన్ని వస్తువులు స్వీయ నిర్మల కాంతితో ప్రకాశించాయి.

పక్కకు తిరిగి చూసేసరికి ఎరిగిఉన్న ఒక మనిషి కనిపించాడు. పేరడిగితే ''మీకు బాగా తెలుసు మరిచిపోయారేమో'' అంటూ ఒక మడిచిన కాగితం ఇచ్చి మాయమయ్యాడు చూసేలోపుగా. ఆతడే చైతన్య. తన నిజాన్ని నిరూపించుకోవడానికి వచ్చాడు. మడతవిప్పి చూస్తే అన్నీ పిచ్చిగీతలే!

అందుకే ''ఈ పిచ్చిగీతల్ని నా కివ్వడానికే వచ్చాడా చైతన్య? అర్థంలేకపోవడమే అర్థమా ఈ ప్రపంచానికి? అర్థంలేనిది కనిపిస్తుందా? ఎవరు నాక్కనిపించింది?'' (127 పే.) అనుకున్నాడు కాని తెలియలేదు పరమేశ్వరుడికి.

ఈ ముగింపు సామాన్య పాఠకుల్ని గందరగోళంలో పడేస్తుంది. స్వప్నావస్థలో వచ్చి స్నేహితుడు ఒక కాగితం ఇచ్చాడంటే ఏ గోలా లేకపోయేది. కాని నిద్రావస్థనుంచి లేచిన తరవాత ఈ విశేషం జరిగింది. అయితే 'ప్రపంచం తపస్సమాధిలో వున్న యోగిలాగా' కనబడడంవల్ల అసాధారణమైన వెలుగులీనడంవల్ల, తీవ్రంగా మనసును కేంద్రీకరించి ఆ 'చైతన్య' స్వరూపాన్నే స్మృతిపథంలో ఆవిష్కరించుకోవడంవల్ల ఆ సమాధ్యవస్థలో ఆ రూపమే వచ్చి మాటాడి ఒక కాగితమిచ్చినట్లయింది. ఆవిశేషానుభూతియే దీనికి మూలం.

''అకస్మాత్తుగా అతనెవరో నాలో తోచింది. అతను చైతన్య 'ఆ లోకం నుంచి నాకు నిజం చెప్పాలని వచ్చాడు' ... ఎవరు నాక్కనిపించింది . నిజం నాకు తెలియలేదు ఇప్పటికీ.'' (127 పే.) ఈ వాక్యాలు చూస్తే చైతన్య ఒక మనిషి మాత్రమే కాదనీ ప్రపంచంలో అజరామరంగా వెలుగొందే ఒక చైతన్య శక్తికి ప్రతీక అనీ, పరమేశ్వరుడు సామాధ్యవస్థను పొందగల ఆ విశ్వనాథుడనీ వీరిద్దరికీ మధ్యగా కామానికి ప్రతీక అయిన కామరాజు నిలిచాడనీ అనిపిస్తుంది. కాబట్టి గాఢానుభూతితో స్మృతిపథంలో తోచిన వ్యక్తి ప్రత్యక్షమవడంలో వింతలేదు. సమాధ్యవస్థలో ఇటువంటివి జరుగుతాయని యోగశాస్త్రం నిరూపిస్తున్నది కూడా. ఈ కథ ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నది.

ఏడవ కథ అయిన 'గాలి రథం' బట్టే ఈ సంపుటి కిపేరు ఉంచబడింది. ''రాయి రాయీ కరిగే వేళన దేవతలు గాలి రథం ఎక్కి తిరుగుతార''ని తల్లి ఫతిమాబీ చెప్పిన మాటలు వల్లీకి గుర్తున్నాయి. తండ్రి బాబాసాబ్ త్రాగుబోతు. అక్క మెహర్. ఆమె భర్త రసూల్ త్రాగుబోతు, జూదరి, దొంగ. తల్లికి జబ్బు చేయడంవల్ల మామ యింటికి చేరాడు వల్లి తల్లితోబాటు. ఆశ లేదని తల్లిని బయట ఉంచారు. తామూ డబ్బు సంపాదించి తల్లిని బ్రతికించుకోవాలని బస్సుస్టాండుకుపోయి సామానుమోసి లైసెన్సు కూలీతో తన్నులు తిన్నాడు వల్లి. ఏడుస్తూ వచ్చి చూసేసరికి అంతా అయిపోయింది. దర్గాకాడికెళ్లి బ్రతిమలాడినా పెట్టె ఇవ్వక పోవడంతో తండ్రి తెచ్చిన ఒక ఎర్రనిగుడ్డలో మూటగట్టి జట్కా మీద తల్లి శవాన్ని తీసుకుపోయారు వల్లి ఏడ్చి వెంటబడ్డాడు. దారిలో బావ తనను హోటలులో సర్వరుగా చేర్పించుతానన్నాడు. గాలి దుమారం లేచింది. ''గాలి రాతికీ రాతికీ మద్దెనపుట్టే చెట్టుకు ఎవరు పోషణ చేస్తారు? ఆ గాలీ, ఆ దేవుడూనూ '' (135 పే.) అని జ్ఞాపకం వచ్చింది వల్లికి. దుమ్ము గాలిలో జట్కా కనపడకుండా పోయింది క్షణంలో.

ఈ కథ సంపుటానికి పేరు పెట్టడానికి తగినంత గొప్పగా లేకపోయినా ఒక పిల్లవాడు తల్లి మరణానికి పడే ఆవేదన ఒక గాఢమైన అనుభూతిని కలిగిస్తుంది.

తరువాతి కథ 'ఇంతేలే పేదల ఆశలు' అనేది. మాల కొండయ్య భార్య గౌరి. నలుపయినా చురుకయినది. ఆమెకొక ఇల్లూ వాకిలీ కావాలనీ, ఒకరి కింద బ్రతకకూడదనీ ఆశ. అందుకే చిన్నప్పటి నుంచీ పెంచి పెద్దచేసిన రాజమ్మకు దూరంగా భర్తను తీసుకునిపోయి వేరే కాపరం పెట్టింది. భర్తతోపాటు కష్టపడి కూలీ నాలీ చేసి సంపాదించి కొంత డబ్బు వెనకేసింది. ఇల్లు బేరమాడే లోపుగా తాను గర్భవతి కావడంవల్ల కాన్పు కష్టమయి, పుట్టిన పిల్లడి అనారోగ్యంవల్ల చాలా డబ్బు ఖర్చయింది. అందుకే తాను పాచిపని చేస్తూ భర్తకొక ఉద్యోగం చూసింది. తన కొడుకు సుబ్బడిని కూడా చదివించాలనుకున్నది.

కాని తాము పచ్చగా ఉన్నామని తెలిసి అత్త ఎంకమ్మ వచ్చి నెత్తి కెక్కడంతో, మధ్య మధ్య బంధువుల రాకపోకలతో డబ్బు వచ్చేదే సరిపోని పరిస్థితి ఏర్పడింది. బావగారు డబ్బు సర్దమంటూ ఉత్తరం వ్రాశాడు. కష్టాల్లో ఆదుకోక తప్పలేదు. కేన్సరువ్యాధితో అత్త మంచంపట్టి, ఉన్న కాస్త డబ్బు ఊడ్చి 'హరీ' అంది. ఒక రోజు పొలంలో గౌరికి దెయ్యం పట్టింది. పక్కఊరి చిన్నమ్మతల్లి దయవల్ల బయటపడ్డది.

దాంతో ఇప్పుడు గౌరి కొడుకు చదువును గూర్చి కాని, ఇంటిని గూర్చి కాని ఆలోచించడం లేదు. అంతా చిన్నమ్మ తల్లి దయ అనీ, ఏది ఎట్లా జరగాలో అలాగే జరుగుతుందనీ అనడం

మొదలెట్టింది. ఈ కథ పేదవాళ్ల ఆశలు నీటిమీది వ్రాతలని నిరూపిస్తుంది.

చిట్ట చివరిది 'బదిలీ'. చింతలూరుకు బదిలీ అయి ఎంత ప్రయత్నించినా మరో ఊరికి పోలేక, ఉన్న ఆరోగ్యం పాడుచేసుకొని రోగాలతో రొష్టులతో బాధపడి చివరకు బంతిలా ఆడుకొనే 'ఆనంద' అనే కొడుకును కూడా కోల్పోయిన ఒక అభాగ్యుడయిన ఉద్యోగస్థుని భార్య మనసులో ఏర్పడిన సంఘర్షణయే ఇందలి ఇతివృత్తం.

స్టేషనుకు దూరమయిన ఊరది. భూతగృహంలా కనిపించే యిల్లు. వచ్చినప్పటి నుంచి పిల్లలకూ, భర్తకూ ఆరోగ్యం చెడినా ధైర్యంగా ఉంది ఆ యిల్లాలు. రాజకీయ నాయకులు లంచాలు తిని బదిలీలు చేయిస్తున్న కారణంగా వారికి ఎన్నిసార్లు అప్లికేషను పెట్టుకున్నా బదిలీకాలేదు. 'ఈ ప్రపంచంలో బదిలీ బదులు అనేవిలేవ'నీ, 'పరిస్థితులతో రాజీపడడమే జీవితమ'నీ అనిపించింది ఆమెకు.

నాలుగేళ్లు గడిచినా బదిలీ కాలేదు. ఒక శనివారం సాయంత్రం తల్లి కోసంగా తిట్టిందని ఇంటి వెనుక చెరువులోపడి చనిపోయాడు ఆనంద. దాంతో "ఆనందతో గడిపిన ఆనందక్షణాలు గడిచిపోయాయి. ఇంక బదిలీ అయినా కాకపోయినా ఒకటే" అనీ, "నాకు ప్రపంచం లేదు. బదిలీ అయిపోయింది. నాలోకి బదిలీ అయిపోయింది. ఇప్పుడు నేనే ప్రపంచాన్ని" అని ఆ తల్లి అనుకోవడం హృదయాన్ని కుదిపి వేస్తుంది. ఈ కథ చివరలో ఉండి ఒక గాఢానుభూతిని కలిగిస్తుంది.

మొత్తంమీద వసుంధరాదేవిగారి కథలను పరిశీలిస్తే అందరి రచయిత్రుల వలెకాక ఒక ప్రత్యేకమైన బాణీలో, సాఫీగా సూటిగా సాగే శైలిలో, గాఢానుభూతితో హృదయాన్ని కదిలించేటట్లు దేశీయతా ముద్రగల వర్ణనలతో ఆమె కథలు నడిపిస్తారు అనే అభిప్రాయం కలుగుతుంది. కథాకథనంలో వైవిధ్యంతోపాటు, రాయలసీమ మాండలికాలు ప్రయోగించడం వసుంధరాదేవిగారి మరో ప్రత్యేకత.

ఇలాగే మరెన్నో కథలు పాఠకలోకానికి ఆమె అందించాలని ఆశిద్దాం!

శైశవం ప్రతి గచ్ఛతి...

శ్రీ కొంపెల్ల రామకృష్ణమూర్తి

దూరంగా నిలబడి చూస్తే
అందంగా కనిపించిన జీవికా చంద్రగోళం
అనుభవాని కందేసరికి —
నిమ్నోన్నతాల భయదగోళ మనిపిస్తోంది.
ఈ చక్రనేమికి ఢీకొని
వికలాశయమానస సరస్తీరాన
దేనికోసమని — ఇలా ఎదురుచూడటం?
పువ్వు పూస్తుందా —
ఎవ్వరో నన్ను పరీక్షగా చూసినట్లనిపిస్తుంది!
పూర్ణిమ వస్తుందా —
జీర్ణదేవాలయంలో అదృశ్యహస్త మొకటి
హారతి పట్టినట్లనిపించి — ఒళ్లు జలదరిస్తుంది!
ఎన్ని భాషలు! ఎన్ని పాటలు!
వాటిలో ఎన్నెన్ని రక్తపు చారలు!
భూమిమీద పరచుకునే ప్రతీ మానవదృష్టిలోనూ
అనుమానం! దురభిమానం — వంచన!
భూకంపాలు పుట్టవామరి?
ఆ క్రౌర్యం అలాంటిది! ఆ కాఠిన్యం అంటువంటిది!
ఆకుపచ్చగా; నీలంగా
దట్టమైన రంగులు — శిరోవేదనలు
సౌందర్యం పట్ల ఆబ!
రసహృదయానికి కేన్సర్!
తుమ్మముళ్లమీద కసిగా విసిరేసిన మల్లెపూలు —
గిల గిలా తన్నుకుంటున్న సమస్యలు ...
వద్దు తండ్రీ! వద్దు — ఈ గంధక ధూమం.
నా కోసం ఒక్క 'లోయ' నిర్మించు
అక్కడ సప్తస్వరాలూ సప్తవర్ణాలుగా
మెరిసే శక్రధనుస్సు ఏర్పాటు చేయించు
పల్లటీలు కొడుతూ
స్వచ్ఛంగా నవ్వుకుంటూ
నాలోకం నాదిగానే ఉండేందుకు అనుమతించు.

పూలజల్లు

శ్రీ పోచిరాజు శేషగిరిరావు

మతిహితమైన మాట - గుణ
  మాన్యత మెచ్చు మనః ప్రవృత్తి - సం
తతమును నీశ్వరేశ్వరు
నుదారపదమ్ముల గొల్చు రక్తి - దీ
ధితులు వెలార్చు నెమ్మొగము -
తీయని మాయని దృగ్విలాస - మ
ప్రతిమము నీదు రూపము
పరాత్పరు తేజమె నేల వ్రాలెనా !

లోకము శోకమున్ కనులలోఁగల కాంతులు త్రోసివేయు న
ఱ్ఱాకలఁబెట్టు జీవిత కలాపమునం దిది పూలజల్లునౌ,
వాకలుగట్టు ప్రేమరస వాహిని నీవలె ! ధర్మతత్త్వ వి
ద్యాకలితమ్ము త్వాదృశ మహత్త్వము-సత్త్వమె రూపుపొందెనా?

జీవిత మాధురీ రుచి విశేషము సర్వము నిర్వికల్పసం
భావితరీతి సల్పెదవు మంజుల శింజిని మ్రోతలుంబలెన్
భావనసేయ నీవు రసభాండము కాదొకొ ! తద్రసమ్ము నే
జీవనమున్న యంతకును జెన్నువు దొప్పల త్రావఁగోరెదన్.

నా యెదలోని వీణియ రణించెడు నాదసుధా స్రవంతిలోఁ
బాయక నీదులాడెదను పారము ముట్టిన రక్తితోడుతన్
హాయిగ హాయిగా మనసునందొక కల్పక మున్నయట్టులై
దోయిలిఁబట్టి నీవు చనుత్రోవలలోఁ బయనింపఁగోరుదున్.

యోగము భోగము నొకటై
సాగఁగ-జీవితము ధర్మసాధన కొఱకై
దూగఁగఁ జరింతువయ్యా !
వాగమృతము జల్లు యోగవారాన్నిధివై.

వరమునఁబుట్టినాఁడవు - ప్రవర్ధిత యోగవిశేషసాధనో
త్కరమున దివ్యశక్తుల ప్రకాస్తి వహించితివయ్య! ధైర్యసా
గరుఁడవు - చిద్విలాస రసగంధిలమూర్తివి స్వామి ! జ్ఞాన శీ
కరములు చల్లి మా హృదయకంజములన్ వికసిల్లఁజేయవో!

నిండిన కుండవోలెఁ గననేర్తువు ధ్యానమయైకమూర్తివై
పండిన చేనువోలె కనవత్తువు కన్నుల విందుగా - సుధా
భాండము నీ వచస్సున ప్రవర్తిలి నంచుఁ దలంతు-కానిచో
నుండునె ఇంత తీయదన మొక్కెడ వాక్కుల కందరానిదై

జ్ఞాన భాస్కర ! నీదు వచస్సులోన
మునుక లెత్తు త్రయీవేద పుంజమెపుడు;
తద్గళిత కాంతి కళ్ళఁగోలఁ దలఁతు, నెపుడు
తద్గతానందమయుఁడనై తనుపుగొందు.

ఒక మహోల్లాసమ్ము నొదవు నిన్ గనుగొనఁగ;
ఒక మహా దృశ్యమ్ము నికటమునఁగాన్పించు;
అదిచూచి తన్మయుఁడనై యుండిపోవుదును;
హృత్కవాటము తెఱచి చిత్కళలు వెదజల్ల.

నందన సుందరమ్మగుచు
నా హృదయమ్ము మనోహరమ్ముగా
చిందును తద్విలాసములు -
చిక్కని చక్కని తత్పరీమళ
స్పందనతోడ స్నాయువులు
జాగరితమ్మవు - తోడు తోడుతన్
మందగతిన్ జరింతు రస
మార్గమునన్ సుగుణైక వర్తికై.

శ్రీ మాదిరాజు రంగారావు

శేషేంద్రశర్మ మన దేశం-మన ప్రజలు ఒక పరిశీలనం

ఈ కావ్యాన్ని కవి ఆధునిక ఇతిహాసం అంటాడు. ఇందులో కథ అంటూ లేదు. ఇది భావ ప్రధానమైంది. వస్తువు భావ రూపంలో పరంపరగా ఆద్యంతమూ ఉన్మేషాన్ని పొందింది.

"సమ కాలికులకు అపరిచితమైన
పదార్థాలతో పద్యాలల్లుతున్నా"

పదార్థం అంటే వస్తువు. పదం యొక్క అర్థమూ కావచ్చు. ఇందులోని వస్తువు మనకు పరిచయం లేనిదే· ఎందుకంటే మనకు పరిచయమైన వస్తువు కథ, పాత్రలు, నిర్వహణంతో కూడింది. ఇందులో మనకు ఇలాంటిదేదీ కన్పించదు మనిషి, శ్రమ, ప్రకృతి, సమాజం అన్న వివిధాంశాల భావస్పర్శతో, ఏర్పడిన పదార్థ రూపం అపరిచితమైందే. ఇతిహాసంలో అనేక సంఘటనలూ వ్యక్తులూ వీర కృత్యాలూ విషాదమూ ఆనందమూ చిత్రించే సన్నివేశాలతో వస్తువు ఉంటుంది. అయితే ఇందులోని మానవుని చిత్రణం అందునా శ్రమజీవన పరంగా ఆలోచనాత్మకమూ, అనుభూతి పరమూ ఐంది. అక్కడ కొందరు వ్యక్తుల్ని ఆశ్రయించి కథా వలయం తిరిగితే ఇక్కడ వ్యక్తుల సమాహారభూతమైన ప్రజ చుట్టూ ప్రకృతి భూమికలో భావ చిత్రాలు రేఖలుగ కన్పిస్తాయి. ఇందులో 'నేను' స్థానీయుడు నిఖిల మానవుని రూపంలో ఆనాటి నుండీ ఈనాటి వరకూ సంక్రమిస్తూ వచ్చే సంస్కార ప్రభతో రూపొందిన వ్యక్తిగామూ, ఒక్కొక్కప్పుడు వైయక్తికాంశంతో కవి రూపంలోనూ కన్పిస్తారు. ఈ రచనలో కాల్పనిక చిత్రాల పరంపర సర్వప్రపంచంతో ఆలోచనాగతమైన అనుబంధాన్నీ, అనుభూతిపరమైన తాదాత్మ్యాన్నీ కలిగి గతం, వర్తమానపార్శ్వాలతో భవిష్యత్తువైపు ఉన్ముఖీకృతమై కన్పిస్తుంది.

శ్రమజీవియైన కర్షకుడు ప్రధానంగా ఆపైన కార్మికుడు, కవి, శిల్పి మొదలుగా, శ్రమజీవన సౌందర్యాన్ని ఆవిష్కరిస్తూ కావ్యం ఆరంభమౌతుంది. ఆది మానవుని జీవితం, నగర ప్రభావానికి లోనుగాని స్వచ్ఛమైన వాతావరణం సీమలు దాటిన దృగంచలాల్లో దర్శితమైంది. మనిషిలోని ఆవేదనాగ్నితో విషాద చ్ఛాయలతో, శీర్ణమైన మనస్స్థితి చిత్రణం అక్కడక్కడా వైయక్తికమైన అనుభూతితోనూ కన్పిస్తుంది. సృష్టి ప్రదర్శన శాలలో చేతనా చేతన జగత్తుపై పరిశీలనమూ జరిగింది. విప్లవానికి దారితీసే సామాజిక పరిస్థితులు దైన్యంతో క్రుంగి ప్రజలూ, వారిలో ఉత్సాహాన్ని ఆశనూ ఉజ్జీవింప జేసే ప్రయత్నమూ కన్పిస్తుంది. పీడితుల ఆర్తిని హరింపజేసే ప్రయత్నంలో వారు పోగొట్టుకున్న భూమిని సంపాదించి, ఉషస్సును దర్శింపజేసే స్థితి భావితమైంది.

ఈ ఉత్సాహంలో, పురోగమించే వేళ, మధ్యన భయంకర స్వప్నం, తరువాత నవోదయ కిరణావిష్కారం జరుగుతుంది. చివరకు ఆశాలోకనంతో, చేతుల్లో కొడవళ్ళు ధరించి పరిక్రమించడమూ చూడవచ్చు. మానవత్వపు విలువలకు ప్రాధాన్యంతో శాంతిచేకూరిన సుస్థితితో, ఈ శతాబ్దిలో ప్రేమ, మానవత, ఆనందంతో చివరకు మానవ విజయం సూచితమైంది.

శ్రమ: జీవన ప్రపంచంలో శ్రామికుడు, సూర్యుడు, సృష్టికర్త మొదలుగా కంఠస్వరాలు వినిపిస్తాయి. వర్తమాన సంఘటనలు మానవేతిహాసంలోని సన్నివేశాలు సంయోజితమై అక్కడక్కడా ఉపనిషద్భావన వ్యంగ్య విలసితంగా తీర్చబడి, రచన వస్తుపరమైన పుష్టిని పొందింది. మొత్తం మీద మానవతా వాదంతో సామాజిక దర్శనంతో రూపొందిన సూత్రాన్ని శక్తివంతమైన భావ చిత్రాల పరంపరతో అందంగా దండలాభాసింపజేయడంలో రచనా శిల్పం పరాకాష్ఠనందింది.

2

కావ్యారంభంలోనే స్థగితమైన దృశ్యంలో వస్తువు సమున్మీలితమైంది.

"లేస్తోంది ఉషః కాంతుల్లోంచి ఒక హస్తం
ఆ హస్తం కాలం అనే నిరంతర శ్రామికుడి హస్తం"

చీకటి తొలగిపోతూ సనసన్నగా పల్చని వెలుగు ప్రసరించే సమయం. ఈ స్థితిలోంచి వచ్చే సూర్యబింబం ఆధునిక భావనకు ప్రతీకగా ఎన్నుకోవడం జరిగింది. సూర్యబింబం, కాలం అనే శ్రామికుని హస్తంగా భావితమైంది. నిరంతరం శ్రమించే వ్యక్తి శ్రామికుడు. కాలం అవిచ్ఛిన్నమైంది. నిరంతరమూ గతిశీలం కలది. ఇక్కడ వ్యక్తిత్వ రేఖలు సంతరించుకుంది. ఈ హస్తం శ్రమకు సాధనం.

ప్రకృతిలోని వస్తువును గ్రహించి మానవ జీవితానికన్వయం చేస్తూ కల్పన జరిగింది. సూర్యుని ఉదయంతో జగత్తుకు ప్రేరణ కలుగుతుంది. సర్వమూ నిరంతర కార్య వ్యగ్రమౌతుంది. శ్రమ జీవితానికి అస్తిత్వమూ ఆనందమూ — అధికమైన ప్రయోజనమూ కలిగించే ప్రయత్నంలోని భాగం ఈ రచన శ్రమజీవి జీవితంలో అనాది నుండే నేటి వరకూ చరిత్రలో వివిధ దశల్లో ఎదురయ్యే అనుభవ పరంపరను స్పృశిస్తూ, ఆశాదర్శనంతో సమాప్తమౌతుంది. ఆయా సందర్భాల్లో కవి మాటల్లో వినిపించే 'నేను' కంఠస్వరంలో మధ్యమధ్య వస్తువుకు సంబంధించిన మానవ ప్రపంచంలోని కర్షకుడు, కార్మికునితో పాటు ప్రకృతి పరమైన చెట్లు పక్షులు పూలు మొదలైనవి వర్ణితమైనాయి. ఇవి జీవితంలోని ఆశలకూ ఆశయాలకూ ప్రతీకలుగా కన్పిస్తాయి. ఇంకా జీవితంలోని ఎగుడు దిగుళ్ళూ ఆటుపోటులూ గల సాధారణ స్థితి చిత్రణమూ మధ్య మధ్య కన్పిస్తుంది. అనేక భావచిత్రాలతో మధ్యమధ్య వ్యాఖ్యానంతో మనల్ని క్రొత్త అనుభవానికి తీసుకవెళ్ళే ప్రయత్నం చేయబడింది. భావరూపంలో నున్న వస్తు నిర్వహణలో కవి అవలంబించిన శిల్ప స్వరూపం ఇది.

3

''నేను ధాన్యంలోంచి పుట్టాను
ధాన్యం కోసమే బ్రతుకుతాను
మరణించి ధాన్యంలోకి పోతాను''

ధాన్యానికీ మనిషికీ గల అనుబంధం, జీవనానికి సంబంధించింది. పై పంక్తులు చదువుతూంటే మనస్సులో ఉపనిషద్వాక్యాలు మెదలుతాయి.

''అన్నాద్ ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే
అన్నేన జాతాని జీవన్తి అన్నం ప్రయన్త్యభిసంవిశన్తి''
(తైత్తిరీ II భా. II అధ్యా. 1)

అన్నంనుండే భూతాలు పుడుతున్నాయి అన్నంచేతనే జీవిస్తున్నాయి. పుట్టినవన్నీ అన్నం వైపే పయనించి అన్నంలోనే కలసిపోతాయి. ఉపనిషత్తుల్లో సర్వభూత సమర్పకంగా ఉంది, ఈ కావ్యంలో వ్యక్తిపరంగా సాగింది. ఇందులోని మొదటి వాక్యం మూడో వాక్యం ఉపనిషద్భావనకు దగ్గరలో ఉన్నాయి. ధాన్యం కర్షక జీవితానికి బీజభూతమైందీ, మౌళిభూతమైందీ. వస్తువు ఎన్నికను బట్టి భావప్రపంచం నిర్మితమౌతుంది. ఈ ఉపనిషద్భావన శేషేంద్రశర్మ రచనల్లో విశ్వభావనతో మానవతా రూపంగా పర్యాప్తమైంది.

సౌందర్యం, ప్రకృతిలోనూ మానవ జీవితంలోనూ ఉంటుంది. దీన్ని సూక్ష్మదృష్టి గల రచయిత దర్శించి రచనలో కొంత కల్పనతో కళాత్మకంగా ఆవిష్కరిస్తాడు. మానవ జీవితం అంటేనే ఏదో ఒక రూపంలో శ్రమ శ్రమ అనగానే చప్పున మనకు స్ఫురించేది శారీరకమైంది మాత్రమే. స్థూలంగా జానపద జీవితంలో కర్షకుడుగా, నాగరక జీవితంలో కార్మికుడుగా, తక్కిన వాళ్ళూ శ్రమపడతారు. వాళ్ళ శ్రమనూ కవి గుర్తిస్తాడు ఈ దృష్టితో కవి శ్రామిక రూపాన్ని పొలం దున్నేవాడు మొదలుకొని సృష్టికర్త వరకూ అందరినీ స్పృశించి ఆవిష్కరిస్తాడు. వీరందరిలో అంతర్లీనమై ఉన్న క్రియాత్మకత, శక్తిరూపంపై దృష్టితో, పొలంలో పనిచేసేవాడూ, బట్టలు నేసేవాడూ, రస్తాలు వేసేవాడూ, పద్యాలు రాసేవాడూ, నావలు చేసేవాడూ, నడిపేవాడూ, శిలలు చెక్కేవాడూ ఇంకా ఎందరో శ్రమజీవులు చిత్రితమైనారు. ఈ విధంగా సర్వమానవ జీవితాన్ని దర్శించడానికి ప్రవృత్తిస్తాడీ కవి. శ్రమ, సృజనశక్తి, ప్రకాశనంలో భాగంగా భావితమైంది. జీవితం యొక్క సమగ్రతకు ప్రపంచంలో వీరందరి అవసరమూ ఎంతో ఉంది. ఇది కవి దృష్టిలో ఉండడం విశేషం. దీన్ని ఆధారంగా, సామాజిక వ్యవస్థాపరమైన అంశంపై దృష్టి ప్రసరిస్తుంది.

''నేను మానవ జీవిత పొలాలు దున్ని
ఆ చేత్తో ఏ అందాన్ని సృష్టించలేదు!
కాని ఈ చెయ్యి ఖాళీగానే ఉండిపోయింది''

శ్రమ జీవి కర్షకుడు, పొలాలు దున్ని పంటలు పండించాడు., కాని అతని చేతిలో చివరకు ఏమీ మిగలదు. అంతా మరొకరి అధీనమైందన్న అంశంతో కవినుండి ఆర్థికమైన స్థితి వైపు మరలి సామాజిక వ్యవస్థలోని యథార్థ్యాన్ని స్ఫురింపజేస్తుంది.

తమస్సునుండి ఉద్భవించిన సూర్యుడు, సుత్తెలు కొడవళ్ళ లాంటి కిరణాలు మిలియన్ల మిలియన్లు ప్రదానం చేస్తున్నాడు. సుత్తె, కొడవలి కార్మికుల కర్షకుల శ్రమసాధనం. సూర్యుడు వీళ్ళను కార్యోన్ముఖులను చేసే తేజోమూర్తిగా కన్పిస్తాడు. ఇలా సూర్యోదయం నుండి ఉత్సాహంతో శ్రమించే మానవ జీవితం, వెనుకనుండి ప్రకృతి చిత్రం ప్రవృత్తమైంది.

''సూర్యుడు కిరణాల బండ్లు
తోలుకొని వస్తున్నాడు''

అన్న మరొకటి గ్రామీణ వాతావరణాన్ని స్ఫురింపజేసేదీ ఇలాంటిదే. కిరణాలపై బండ్ల రూపం ఆరోపితమైన భావ చిత్రం ఇతని దృష్టిలో, వాస్తవ రూపం వెనుకనుండి ప్రకాశిస్తూ వర్ణనలో ప్రకృతి ప్రధానమైన స్థానాన్ని పొందుతూంది.

''అలసినపుడు నా ప్రయాణంలో
ఒక చెట్టు నీడ నా కుటీరం
రాలిన పూవు, నా అతిథి''

ఇలా మధ్యమధ్య ప్రకృతిలో అనుబంధాన్ని స్థాపిస్తూ పోవడమూ ఉంది. మొదటి సర్గలో ప్రవర్తిల్లిన శిల్ప మర్యాదలు మిగతా సర్గలో పరచబడి కావ్యాకృతిని ఆకర్షవంతం చేస్తున్నాయి.

4

కవి, పురా మానవ సమాజం వైపుకు దృష్టిని మరల్చి, తొలి మానవుని చరిత్రను ఒక్కమారు అవలోకింపజేస్తాడు. క్రింది దంతాలతో చీల్చుకొని తిని, ఆకలి తీర్చుకునే లక్షణంతో ఎన్నో ఘట్టాలను నగర జీవితంలోకి ప్రవేశించిన మానవుని ప్రవృత్తి చిత్రణం చూడవచ్చు ఎన్ని శతాబ్దాలు గడిచాయి ! ఇంతవరకూ అదే సముద్రం ! అదే ప్రకృతి ! అదే మానవుడు ! అయితే భౌతిక జీవనంలో జీవన సాధనాల్లో ప్రవర్తనలో ఆలోచనలో ఎంతో స్ఫుటంగా కన్పిస్తుంది. అన్ని దశల్లోనూ అక్షతంగా వచ్చేది, ఏదో ఒక రూపంలో శ్రమ - అను స్యూతంగా కన్పించేది, వివిధ శిఖరాలతో మానవత ! ఒక దశలో పరివర్తనగా వచ్చి నిలిచిపోయిన శ్రమ సాధనం మాత్రం (సుత్తె, కొడవలి) అలాగే ఉండిపోయిందీ దేశంలో. ఇక్కడినుండి ముందుకు అడుగు వేయలేదు !

"కొడవళ్ళు తీసుకొని పోదాం
ఆ వరి కోతల పండుగలో కలుద్దాం"

ఎన్ని కష్టాలనైనా మరపించే, ఆ శ్రమ ఫలాన్ని చేరుకునే దశ — ఈ దశలో జరుపుకునే పండుగ వాళ్ళ ఆనందానికి ప్రతీక. ఈ సమయం మనస్సు అన్ని బాధలనూ మరచిపోయి, ఒక తృప్తిని ప్రసాదించేది ఇలా అనాదినుండీ వచ్చే శ్రమ — అనుభవం — ప్రయోజనం — ఆనందం — అన్నభావ పరంపర అంతటా కన్పిస్తుంది !

"లిల్లీలు పెదవులు విప్పాయి
నీ కథలు చెప్పడానికి
ఆకులు గుసగుసలాడుతున్నాయి
నీ గుండెలో వ్యథలు విప్పడానికి"

ఇలా రచనలో ప్రకృతీ సమాజమూ, అను భావంతో బింబ ప్రతి బింబంగా కన్పిస్తాయి. ఇందులో మానవుని ప్రస్థానంలోని వివిధ నన్నివేశాల్ని చిత్రించే సందర్భాలనేకం.

నగర జీవితం ఇతనికి చెరసాలలా కన్పిస్తుంది. దీన్ని భయంకరంగానూ ఒక దశలో చిత్రిస్తాడు. ఉదాహరణకు హైదరాబాదు వీధుల్లో నడుస్తూంటే "అప్పుడే పేలబోయే అగ్ని పర్వతంలా మారిపోతా" నంటాడు ఇన్నాళ్ళు ఏలా బ్రతికిందీ తనకే ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది, నగర వాతావరణం స్వచ్ఛమూ సుందరమూ ఐన మనస్సును ఏలా వికలం చేసి వ్యక్తిని ఉద్రేక పరచేదీ, భయాన్ని ఆవహింపజేసేదీ స్పష్టంగా చూడవచ్చు !

"హైదరాబాదును వదలిపెట్టి గాలిలో వెళ్ళిపోవడం
ఎంత విశ్రాంతి ! నా ఆత్మ ఊపిరితిత్తులకి"

నగర జీవితం పట్ల నిరసనతో తిరిగి ప్రకృతిలోకి వెళ్ళిపోవాలన్న అభిలాష వేదనామయమై ఉద్గమిస్తుంది.

"విధి నా చేతికిచ్చిన
విషపాత్రిక ఈ నగరం"

సమకాలీనమైన అనుభవ ప్రభావం లేదా వ్యక్తిగతమైన అనుభవ చింతన, ఉద్వేజిత స్థితికి కారణం కావచ్చు. ఏమైనా ఇక్కడినుండి అడవిలోకి తోటలోకి వెళ్ళడం ఇతని మనస్సుకు ఎంతో విశ్రాంతి నిచ్చే విశిష్టమైన అనుభవం.

జీవయాత్రలో మనిషినుండి దృష్టి వేరుగా ఇతర ప్రాణులు, ప్రాణేతర వస్తు సమితిపై ప్రసరించి ఆత్మభావనతో దర్శించిన అంశాలనేకం ఇందులో ఉన్నాయి.

"చెట్టనుకునే నేను
పండనుకునే నేను
రెండూ ఒకటే—"

ఈ మాటలు వినగానే బ్రహ్మమూ, జీవరూపమూ రెండూ మన మన దృష్టికి వేరుగా కన్పిస్తాయి కాని పరమార్థంలో ఒకటే నన్న ఉపనిషద్భావన స్ఫుటంగా అవగాహనకు వస్తుంది.

ఇదొక ప్రదర్శనశాల ! క్షణంలో ఎన్నో నిష్క్రమిస్తూంటాయి. క్షణంలో ఎన్నో ప్రవేశిస్తూంటాయి. ఇది అవ్యాహతంగా సాగిపోయేది మృత్యువు — సృష్టి, గతం — భవిష్యత్తు, అస్త

మయం - సూర్యోదయము, నిరంతరమూ వర్తమానంలో అనుభవంలోకి వచ్చేవే. ప్రాణులు క్రిమికీటకాదులమండి మనిషి వరకూ ఆయా మేరల్లో శక్తినిబట్టి దేని కది పురోగతికై ప్రయత్నిస్తూంటాయి. ఈ ఆరోహణక్రమంలో మానవుని సాధన లోని భాగమే ఈ సంస్కృతీ శిఖరాలు !

మరో విషయం ఇందులో ప్రేయసి, కాల్పనిక జగత్తుకు ప్రతీకగా, అనుభవంలో భాగస్వామిగా, ఇతని సామాజిక స్పందనకు అంచలంగా, ఇతనిలో ఉరకలెత్తి పొంగే ప్రవాహానికి మర్యాదగా మలచబడింది.

ఇందులో రెండు విధాలైన వాతావరణం నిర్మితమైంది. అడవి, చెట్టు—పక్షి—పూవు, పండు, మొదలుగా ఒక విధమైంది. ప్రకృతి సంబంధించింది. కొడవలి, సుత్తె — క్షేత్రం, స్కూలు — జైలు, మొదలుగ మరో విధమైంది. కవి మానసికంగా మొదటి వాతావరణానికి ఆకర్షితుడౌతూ, రెండో వాతావరణం చిత్రించాలనే స్పృహతో కన్పిస్తాడు. ఈ మనస్తత్వంవల్ల రెండూ బింబ ప్రతి బింబంగా, మొదటిది రెండోదానికి ప్రతీకగా సంయోజితమైనాయి. ఇదే మరో విధంగా యోచన చేస్తే (1) కాల్పనికం - ప్రకృతి పరమూ వ్యక్తిగతమూ అయింది, (2) వాస్తవికం — మానవ ప్రవృత్తి, విశ్వభావనతో రూపొందింది.

ఇది సాధారణమైన పరిశీలనం మాత్రమే. ఇంకా శేషేంద్ర శర్మ రచనలోని వివిధాంశాలను పురస్కరించుకొని సహృదయులు ఈ క్రింది విధంగా విశ్లేషించి ఆలోచన చేయడానికి అవకాశంఉంది. 1. శ్రామికుని చిత్రణం, 2. విప్లవ లక్షణం, 3. ప్రకృతితో అనుబంధం, 4. పురా సంస్కార ప్రభావం, 5. ఆధునికత, 6. మానవతావాదం, 7 కాల్పనికత, 8. ఆవేదన—అనుభూతి, 9. వైయక్తికాంశాలు, 10. రచనా శిల్పం. ఇవి విడివిడిగా దేని కదిగా కాక, ఒకదాని కొకటి ఉపస్కారకంగా సంపూర్ణమైన భావానికి దోహదకారులై విశిష్టమైన ఆకృతి పొందిన విషయం విస్మరించరానిది. ఇది ఇటీవల వెలసిన ఆధునిక కవిత్వంలో అనుభవ పారమ్యాన్ని కలిగించే ఉత్తమ కృతి.

విషాద దీపం

శ్రీ నందిని సిధారెడ్డి

తల బాదుకుని తను ఏడుస్తూ
గుండె బాదుకునేలా నన్ను ఏడిపించే
ఈ తీగ
ఎంత విషాదాన్ని నింపుకుని ఉండాలి ?
వాగుపక్క ఇసుకలో
పెరిగిపోయిన నల్లపూసల కోసం
చేతులు నయనాలైన ముసలి అవ్వ
కన్నీటి చుక్క విషాదం —

నిర్మలంగాఉన్న నీళ్లను నమ్మి
ఆడుకోబోయి కాళ్లకింద 'దరి' జారిన
ఈతరాని పిల్లాడి మాటరాని
ఆర్తనాదం విషాదం —

ఈ తీగ నన్నెంత కలచి వేస్తుందీ ?
స్మశానంలో పదోనాడు కూడా
తెంచుకుని వచ్చే అరవయ్యేళ్ల దుఃఖంలా
ఎదురయిన 'రాయి' కల్లా
తలబాదుకుని గాలి ఏడుస్తున్నట్టు ... ...

కట్టేసినాక
దెబ్బలకింద నలిగే కుక్కపిల్లలా
తగిలిన రేడియం అంకె కల్లా
తల్లడిల్లిపోతూ 'కాలం' ఏడుస్తున్నట్టు ... ...

ఆరిపోకుండా ఒకటే విషాద దీపం !
విరిగిపోతూ నీళ్లలో కలిసి పోతున్న మట్టిలా.
నేను
విరిగిపోతున్నానేమిటీ ?
నా కనుమానం —

ఈ తీగ ఒక్కొక్క అణువూ
ఒక్కొక్క దుఃఖంతో తయారైందని !
ఈ తీగ ప్రతి పలుకూ
ఒక్కొక్క జీవితం వడబోసిందనీ !

కళాధర్

విలేఖరి దృష్టిలో సినిమా!!!

చలన చిత్రాలను నిర్మించే వారందరికీ విలేఖరి అంటే గౌరవం వున్నట్లు కనిపించుతుంది అయితే, అది ఎలాంటి గౌరవం అంటే మూడుముక్కలలో చెప్పడం కష్టమే. కాఫీ తీసుకుంటారా? టీ తీసుకుంటారా? అనడం వరకే పరిమితం కాదు ఆ గౌరవం. కాని, చాలా మంది నిర్మాతలు సాధారణంగా విలేఖరిని అలాగే ఆదరిస్తారు. ఆ తర్వాత ఇక విలేఖరి ఆలోచన ప్రారంభమవుతుంది. ఆ నిర్మాత మాట్లాడే ప్రతి మాటనూ శ్రద్ధగా వింటాడు ఆయన ఎంత సమర్థుడో అంచనా వేయాలని యత్నిస్తాడు కాని, ఏ నిర్మాతనూ ఒక విలేఖరి అంచనా వేయలేడు — వేయరాదు కూడానేమో! ఎందుకనంటే ఫలానా నిర్మాత ఫలానా చిత్రం ఫలానా ఫలానా తారాగణంతో నిర్మించుతున్నాడని తెలుసుకొనేకదా విలేఖరి నిర్మాతను కలుసుకొనడం జరుగుతుంది! అలాంటప్పుడు ఆ నిర్మాత శక్తి సామర్థ్యాలను మదింపు చేయాలని విలేఖరి యత్నించడమే శుద్ధ పొరపాటు.

ఆ నిర్మాత దగ్గరకు విలేఖరి వెళ్ళిన పనేమిటి? ఆయన నిర్మించే చిత్రం వివరాలను సేకరించడమయినా కావాలి — లేదా పరిశ్రమ గురించిన యేదయినా ప్రత్యేక సమస్య గురించి ఆయన అభిప్రాయం తెలుసుకోవడమయినా కావాలి 'ఫలానా పని మీద'అని స్పష్టంగా ముందు తనలో అనుకొనకుండా ఒక నిర్మాతను ఒక విలేఖరి కలుసుకొనరాదనుకొంటాను ఎందుకనంటే సినిమా ప్రపంచం అంతా హడావుడిగా వుంటుంది. అందునా నిర్మాత బాధ్యతలూ, విధులూ ఒక ఆడపిల్ల పెళ్ళిచేసే తండ్రి బాధ్యతల కంటే — ఒక పత్రికా సంపాదకుని విధుల కంటే గురుతరంగా వుంటయ్. అందువల్ల ఏ నిర్మాతా కూడా తన కాలాన్ని వ్యర్థం చేయజాలడు—బాధ్యత నెరిగిన నిర్మాతకు ప్రతి నిముషమూ విలువయినదే! మరి నిజమయిన విలేఖరికి కూడా అంతేగదా! అలాంటి పరిస్థితులలో ఎలా వున్నారో చూద్దామనో లేదా సరదాగా కాలక్షేపం చేయవచ్చుననో ఒక నిర్మాతను విలేఖరి కలుసుకొనడం ఉభయులకూ నష్టమే.

అంత మాత్రానవే నిర్మాతలతో ముఖా ముఖి పరిచయం విలేఖరులకు ఉండరాదని కాదు. కాని, ఆ పరిచయాన్ని సద్వినియోగం చేయగలగాలి

కొంతమంది నిర్మాతలు కటా పెట్‌గా మాట్లాడుతారు ప్రారంభంలో. సంభాషణ జరిగిన కొద్దీ నిర్మాత వైఖరి మారుతుంది. తన దగ్గరకు వచ్చిన విలేఖరి తనచిత్రం గురించి పత్రికలో చాలా బాగా రాస్తాడనే అభిప్రాయం కలుగుతుంది. అలా వ్రాసేట్టు విలేఖరి దృష్టినీ, ఆలోచనలనూ మార్చాలని కొంతమంది నిర్మాతలు యత్నిస్తారు కూడా. ఈ వైఖరిని విలేఖరి అర్థం చేసుకొనగలగాలి. ఆ నిర్మాత నిర్మించే చిత్రంలోని కథావస్తువు ఎలాంటిదో, తెరమీద ఆ కథ ఎలా కనిపిస్తుందో, ప్రేక్షకులు దాన్ని ఎలా స్వీకరిస్తారో మదింపు చేసుకొన గలిగితేనే గాని నిర్మాత తనమీద పెట్టుకొనే ఆశలను నెరవేర్చగల స్థితిలో విలేఖరి వుండడు అందుకు సినిమా గురించిన సాంకేతికాంశాలు — ప్రేక్షకుల అభిరుచుల వంటి వన్నీ కొంతవరకయినా విలేఖరికి తెలిసి వుండాలి.

తన చిత్రం గురించీ, మొత్తం తెలుగు చలనచిత్ర పరిశ్రమ గురించీ ఏకధాటిగా మాట్లాడే నిర్మాతనుచూచి విలేఖరి హడలిపోరాదు ఆయన మాట్లాడే అంశాలలో ఏది ఎంతవరకూ తన పత్రికకు అవసరమో గుర్తుంచుకొని ఆయా అంశాలను వ్రాసుకొనగలిగితే చాలు. నిర్మాతలను ప్రశ్నలు అడగవచ్చుగాని, వారు మాట్లాడేప్పుడు అడ్డ ప్రశ్నలు వేయరాదు. ఆయన చెప్పే మాటలు విలేఖరికి కొన్ని సందేహాలుకలిగేట్టు చేసేవిగానే వుంటయ్. అయినా, ఎదురుప్రశ్నలు వేస్తే చక్కగా, నిదానంగా సమాధానాలు చెప్పే నిర్మాతలు తెలుగు చలనచిత్ర పరిశ్రమలో కొలది మంది మాత్రమే వున్నారేమో! సినిమా ప్రపంచమంతా హడావుడి ప్రపంచమన్న సంగతిని విలేఖరి ఏ నిముషంలోనూ విస్మరించరాదు. అది ఎలాంటి హడావుడో మరి!

కథను గురించి గానీ, చిత్రీకరణ గురించి గానీ, సంగీతం గురించి లేదా ఇతర అంశాలను గురించి విలేఖరి ప్రశ్నలు వేస్తే కొంతమంది నిర్మాతలు చాకచక్యంగా తమ దర్శకుని అడగమంటారు. ఇలాంటి నిర్మాతలు ఈ పరిశ్రమలో ప్రస్తుతం చాలామందే వున్నారు. వారు అలా చెప్పడానికి కారణం ఆయా ప్రశ్నలకు సమాధానాలు ఆ నిర్మాతకు తెలియకపోవడమేనని విలేఖరి అనుకొనడం పొరపాటు. అయితే అలా ఎందుకని చెప్తారూ? అది అంతే. ఈ పరిశ్రమలో అలాగే జరుగుతూంటుందని విలేఖరి గ్రహించగలగాలి నిర్మాతలు వ్యాపారం చేస్తారు. డబ్బు పెట్టుబడిపెట్టి లాభాలు సంపాదిస్తారు. ధర్మార్థ కామ మోక్షాలలో ఒకటయిన ధనం సంపాదించాలనే కోరిక నేరంకాదు గదా!

దర్శకులకు తీరిక వుంటుందా?

దర్శకుని కలుసుకుందామని వెడితే ఒక్కొక్కసారి — ఫలానా సమయానికి రమ్మనమని ముందు చెప్పికూడా — ఆ దర్శకుడు దర్శనం ఇవ్వకపోవచ్చు. అందుకు బాధపడి ప్రయోజనం లేదు. ఎందుకనంటే దర్శకుల పరిస్థితి అలాంటిది. సప్లయ్ — అండ్

డిమాండ్ వాణిజ్యసూత్రమే వారికికూడా వర్తించుతుంది. చక్కటి చిత్రం తీస్తాడని పేరున్న దర్శకునికి అసలు తీరిక వుండదు. కావాలని పత్రికా విలేఖరుల సమావేశం ఏర్పాటుచేసే సందర్భాలలో వినా సాధారణంగా నిష్ణాతుడయిన దర్శకుడు ఒక విలేఖరితో కాలక్షేపం చేయజాలడు. కనుకనే తన చిత్రానికి సంబంధించిన వివరాలను పత్రికల వారికి తెలియజేసేందుకు అలాంటి దర్శకులు ప్రచారశాఖోద్యోగిని ఏర్పాటు చేసుకొంటారు. వారు చెప్పే వివరాలూ, విడుదల చేసే కరపత్రాల వంటివి అన్ని పత్రికలకూ ఒకే విధంగా ఉంటయ్ గదా! అలా కాదు. సినిమా రంగంలో పోటీలాగానే పత్రికా ప్రపంచంలో కూడా పోటీ వున్నది గదా — తన పత్రిక కోసమని ప్రత్యేక సమాచారం సేకరించుదామని యే విలేఖరి అయినా యత్నించదలిస్తే అందుకు కొంత శ్రమ పడడానికి కూడా సిద్ధపడాలి. అది ఎలాంటి శ్రమ అయినా కావచ్చు. అందునా చలనచిత్ర నిర్మాణ కేంద్రాలు కానట్టి పట్టణాలలో ఈ పనిచేసే విలేఖరి ఒక్కొక్క దర్శకుని దర్శనం కోసం అర్ధరాత్రిదాకా వేచి వుండవలసి వచ్చినా అందుకు వెనకాడరాదు. విసుక్కోనరాదు.

అయితే ఇక్కడ ఒక్క సంగతి గమనార్హం. వార పత్రిక తరపున, లేదా సినిమా పత్రిక తరపున సినిమా సారథులను కలుసుకొనే విలేఖరులకు కొన్ని సౌకర్యాలుంటయ్. దినపత్రిక తరఫున పనిచేసే విలేఖరికి అలాంటి సౌకర్యాలుండకపోవచ్చు. సినిమా పత్రిక తరఫు విలేఖరులనే ప్రచారం కోసం సినిమా సారథులు పిలిపిస్తూంటారు సకల మర్యాదలతో — లాంఛనాలతో—; ఈ వైఖరి నిర్మాతలలోనూ, దర్శకులలోనూ ఎక్కువగానే కనిపించుతుంది. ఇది అంత సహేతుకమయిన వైఖరి కాదన్న అవగాహన సినిమా పరిశ్రమకు సంబంధించిన వారిలో ఇప్పుడిప్పుడే కలుగుతూండడం ముదావహం. తెలుగు సినిమా పత్రికలన్నింటికీ కలిపి ఎంత అమ్మకం వున్నదీ? దినపత్రికలన్నింటికీ కలిపి ఎంత అమ్మకం వున్నదీ? ఈ రకం ఆలోచన నిర్మాతలకూ, దర్శకులకూ కలిగిన ఫలితంగానే వాణిజ్య ప్రకటనలను వార్తా పత్రికలకు విరివిగా యిస్తున్నారు. శుభం!!! ఈ అంశానికీ, ఒకదినపత్రిక విలేఖరి ఒకదర్శకుణ్ణి కలుసుకొని కొంత భోగట్టా సేకరించడానికీ సంబంధం లేదు.

ఈ స్థితికి నిర్మాతలనూ, దర్శకులనూ నెపమెన్నడం వివేకవంతుడయిన విలేఖరి చేయవలసిన పనీ కాదు — వృత్తి ధర్మమూ కాదు. విలేఖరి సత్తాగలవాడు. చిన్న చిన్న ప్రయోజనాలను ఆశించడు అనే సద్భావం నిర్మాతలకూ, దర్శకులకూ వుంటే తన వృత్తిని ఆ విలేఖరి హాయిగా చేయగలడు.

ఎలాయితేనేం! దర్శకుని దర్శనం లభించినతర్వాత ఒక్కొక్కసారి విలేఖరికి నిరాశా కలుగవచ్చు. మరొకసారి దిగ్భ్రాంతుడూ కావచ్చు. సర్వజ్ఞులయినట్టు మాట్లాడే దర్శకులూ వున్నారు. చేసే పని నిజంగా క్షుణ్ణంగా తెలిసిన దర్శకులూ వున్నారు. ఒక తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించడం అంటే అది ఒక ఆటగా పరిగణించే దర్శకులూ వున్నారు. మొత్తంమీద దర్శకుల దృష్టికూడా వ్యాపారదృష్టియే ననిపించుతుంది విలేఖరికి. దర్శకునికి వ్యాపారదృష్టి వుండడం పెద్దలోపం కాకపోవచ్చు గాని దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వ్యాపారం చేయగలవారు చాలా కొలదిమంది దర్శకులే వున్నారనిపించుతుంది. ఒక దర్శకుడు చలనచిత్ర రంగంలో పదికాలాలపాటు కాకపోయినా నాలుగు కాలాల పాటయినా నిలవగలగాలంటే ఆయన నిర్మించే చిత్రం ప్రజాదరణ పొందడం అవసరంకదా! నిర్మాతకు లాభాలు రావాలిగదా! నిర్మాతకు రావాలంటే ప్రేక్షకులు చిత్రాన్ని ఆదరించాలి. ప్రేక్షకుల పరిజ్ఞానం కూడా పెరిగిందేమోననిపించుతుంది. భారీ సెట్టింగులతో, శ్రవ్యపేయంగావుండే సంగీతంతో, కనులకు విందుచేసే దృశ్యాలతో నిర్మించిన కొన్ని చిత్రాలను కూడా ప్రేక్షకులు తోసేస్తున్నారు. ఎందుకనో సినిమా విలేఖరికిమాత్రం తెలియదు. దర్శకుణ్ణి అడిగితే చాలా కారణాలు చెబుతాడు. కాని, అవేవీ విలేఖరికి నచ్చకపోవచ్చు; సంతృప్తి కలిగించకపోవచ్చు.

దర్శకుడు నటుడు మాత్రమే కాకుండా సినిమాకు సంబంధించిన అన్ని సాంకేతిక విషయాలు తెలిసినవాడయి వుంటాడు. కనుకనే దర్శకునితో మాట్లాడేప్పుడు విలేఖరికి భయంవేస్తుంది. భయం ఎందుకంటారా! తన అజ్ఞానం ఎక్కడ బయట పడిపోతుందోననండి!! దానికితోడు దర్శకుడు తన మాటలలో సాంకేతిక పదజాలం విరివిగా దొర్లిస్తాడు. కౌంటర్స్ అంటాడు. యాంటీ సెంటిమెంట్ అంటాడు—డూప్ అంటాడు. ఇంకా యేమేమి మాటలనో ప్రయోగిస్తాడు. ఆ మాటలన్నీ సినిమా విలేఖరికి తెలిసినవే అయినా, వాటి అర్థం కూడా తెలిసివుండాలనేమీలేదు. తెలిసి వుండవలసిన అవసరం ఎంతవరకూ వున్నదోమరి? ఇవన్నీ ఎందుకండీ—మీ సినిమా ప్రేక్షకులకు నచ్చలేదని అది వసూలు చేసిన డబ్బే చెబుతోంది అని విలేఖరి చెప్పరాదు. ఎందుకనంటే తను విలేఖరేగాని దర్శకుడూ కాదు—ప్రేక్షకులలో ఒకడూకాదు!!!! నిర్మాత వ్యాపారదృష్టికీ, దర్శకుని వ్యాపార దృష్టికీ తేడా వున్నదనిపించుతుంది విలేఖరికి.

ఇంకా యింకా ఎక్కువ చిత్రాలకు దర్శకత్వం వహించి, ఇంకా యింకా డబ్బు సంపాదించాలనే దృష్టి దర్శకునిది. నిర్మించిన చిత్రం బాగా ధనం సంపాదించలేకపోతే మరొకచిత్రం సంగతి ఆలోచించలేని వ్యాపారదృష్టి చాలామంది నిర్మాతలదని విలేఖరికి అనిపించుతుంది.

మా చిత్రంలో కథాబలం వున్నది. ''ట్రీట్‌మెంట్'' బాగా చేసాం అంటాడు దర్శకుడు. ట్రీట్‌మెంట్ అంటే యేమిటండీ? అని అడిగితే ''ఈ చిన్న విషయమే తెలియదా? వీడేం విలేఖరి?'' అనుకోవచ్చు దర్శకుడు. కాబట్టి తెలిసినా, తెలియకపోయినా 'శభాష్' అనాలి విలేఖరి అలా అనడం చేతకాకపోతే మరేం ఫర్వాలేదు— ఆ విషయం గురించి తరచకుండా వుండడమే వివేకమనిపించుకొంటుంది. అలాగే యాంటీ సెంటిమెంట్ లేకుండా తీసాం మా చిత్రం అంటాడు దర్శకుడు — మెలోడ్రామా బాగా వున్నది మా చిత్రంలో అంటాడు. మెలోడ్రామా అంటే యేమిటని అడిగితే

పెద్ద వివరణ చెబుతాడు. అయినా విలేఖరికి అర్థంకాకపోతే అతనికి ''సినిమాసెన్స్'' లేదన్నమాట!!!

పైన ఉదహరించిన పరిభాషయేకాదు—''ఫిలిమ్ లాంగ్వేజ్'', ''యాంటీ క్లయిమాక్స్'', ''ఇమేజ్'', ''డబ్బింగ్''వంటి పదజాలం **కూడా** వినిపిస్తుంది దర్శకుని ప్రసంగంలో. దిగ్భ్రాంతుడు కారాదు విలేఖరి. ''మాస్ కమ్యూనికేషన్ మీడియా'', ''సోషల్ పర్పస్'' **వంటి మాటలకు విలేఖరికి తెలిసిన అర్థాలకూ, దర్శకుడుచెప్పే అర్థాలకూ పొంతన కుదరకపోతే విలేఖరి తెల్లపోరాదు!!**

ఇన్‌డోర్ (షూటింగ్) వర్క్ పూర్తయింది. ఇక అవుట్ డోర్ వర్క్, డబ్బింగ్ జరగవలసి వున్నాయి అంటాడు దర్శకుడు. అంటే ఆ చిత్ర నిర్మాణం ఏ దశలో వున్నదో విలేఖరి మదింపు చేసుకొనగలగాలి.

మా చిత్రంలో కామెడీట్రాక్ మెయిన్ ట్రాక్‌లో మెర్జి అయింది. కామెడీయే మా చిత్రానికి బలం అంటాడు దర్శకుడు. కాని, ఆ చిత్రంలో కనిపించిన హాస్యానికి, వినిపించిన హాస్యానికీ కథకూ సంబంధం యేమిటో విలేఖరికి అర్థంకాకపోయినా ఇబ్బందేమీలేదు కాని అమాట దర్శకునికి చెప్పరాదు.

రచయిత పాత్ర ఎంత ?

పూర్వం ఒక రచయిత సినిమాకోసం ఒక కథ వ్రాసి, ఒక నిర్మాతకు ఇస్తే, ఆ నిర్మాత, దర్శకుడూ, ఇంకా కొంతమంది సినీ అనుభవజ్ఞులూ ఆ కథలోని ఇతివృత్తం గురించి క్షుణ్ణంగా చర్చించేవారు. ప్రతి ఒక్క దృశ్యంలో ఏ పాత్రచేత ఎలా మాట్లాడించాలో, ఏమి మాటలనిపించాలో ముందుగానే వివరంగా వ్రాయించేవారు. ఆ రోజులు పోయాయి. స్థూలంగా కథను నిర్ణయిస్తారు. కథా రచయితయే మాటలు వ్రాయడం సకృత్తుగా జరిగేపని.

సినిమాలోని దృశ్యాలను వివరంగా వ్రాసేపనీ, నాటకీయంగా కథను వ్రాసేపని, ఈ రోజుల్లో దర్శకుడే చేస్తాడు. ఆయా పాత్రల హావభావాలన్నింటివన్నీ దర్శకునికి తెలిసినంత క్షుణ్ణంగా రచయితకు తెలియకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. దీన్నే 'ట్రీట్‌మెంట్' ''స్క్రీన్‌ప్లే'' అంటారని విలేఖరి అభిప్రాయం కావచ్చు. అంటే కథ, దాన్ని సినిమాగా చూపించవలసిన తీరు తెన్నులు రచయిత చేతులలోనుంచి — ఆలోచనలలోనుంచి దర్శకుని మేధాశక్తికి బదిలీ అయాయన్నమాట. అంతటితో పని ప్రారంభమవుతుందా? అని విలేఖరి అడిగితే ఆయన నవ్వి ''భలేవారండీ — డైలాగ్స్ వ్రాయించవద్దా?'' అంటాడు. అంటే కథ వ్రాసిన రచయితకాక మరొక రచయిత అవసరమవుతాడన్నమాట.

సినిమాకు డైలాగ్స్ వ్రాసే రచయితకు ప్రత్యేక నైపుణ్యం అవసరం అనిపించుతుంది విలేఖరికి. ఎందుకనంటే రెండర్థాలు వచ్చే మాటలు బాగా తెలిసివుండాలి. మాటలలోనే కాదు పాటలలో కూడా అవసరం ద్వంద్వార్థ పదజాలం. కాబట్టి వివిధ సన్నివేశాలలో వివిధ పాత్రల తరఫున నేపథ్యగానంగా ఆలపించే పాటలు వ్రాయగల మరొక రచయిత లేక కొందరు రచయితలు అవసరమవుతున్నారు. ''ఈ రెండర్థాల పదాలు ఛలోక్తులా సార్'' అని విలేఖరి అడిగితే నవ్వుతాడు దర్శకుడు. ఆ నవ్వుకు అర్థం విలేఖరికి తెలియకపోతే అతను తెలివితక్కువ వాడన్న మాట!! ''మాస్ అట్రాక్షన్'' అంటే యేమిటో విలేఖరికి బొత్తిగా తెలియదన్నమాట.

డబ్బుపెట్టి టిక్కెట్టుకొని సినిమా చూడటంద్వారా పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతున్న ప్రేక్షకులను ''మాస్'' అంటారేమిటండీ? అని విలేఖరి ప్రశ్నించరాదు. ''తెలుగు చలన చిత్రాలను చూచేవారిలో క్లాసూ, మాసూ లేవు. అందరూ ''మాసే'' అనే అభిప్రాయం వినిపించినప్పుడు ''ఎంతమాట సెలవిచ్చారు!'' అని అనుకోవలసి వస్తుంది విలేఖరి. వెరసి, యీ చలన చిత్రాల పుణ్యమా అని రచయితలకు గిరాకీ కొంచెం పెరిగినట్టే కనిపించుతుంది. ఎందుకనంటే ఒక చిత్రం నిర్మాణానికి కథారచయిత ఒకరూ, సంభాషణల రచయిత మరొకరూ, లేదా కొంతమందిని, పాటల రచయితలూ, ఆ చిత్రం గురించి ప్రచారం చేయడానికి ఒక రచయిత అవసరమవుతున్నారుగదా. ఈ పనులన్నీ ఒకరిద్దరు రచయితలచేత పూర్తి చేయించరాదా—సాధ్యం కాదా అనే ధర్మసందేహం విలేఖరికి కలుగరాదు. ఒకవేళ కలిగినా అది ''కుశంక'' అనిపించుకొంటుంది.

''మా చిత్రాన్ని స్కోప్‌లో నిర్మిస్తున్నాం'' అంటాడొక నిర్మాత. ''మా చిత్రాన్ని ''టాడ్–ఏ–ఒ''లో నిర్మించాం'' అంటాడు మరొక నిర్మాత. ఏ టెక్నిక్‌లో నిర్మించారో ప్రేక్షకులకు అనవసరం వారికి కావలసింది మంచి చిత్రం. ఏది మంచి చిత్రం అని అడిగితే డబ్బు బాగా సంపాదించిన చిత్రమే మంచి చిత్రం అంటారు. డబ్బు బాగా రావాలంటే ప్రేక్షకులు అధిక సంఖ్యలో కొన్ని వారాలపాటు ఒక సినిమాను పోషించాలి. ఎలాంటి చిత్రాన్ని ప్రజలు చూస్తారు? అని విలేఖరి ఆడిగితే 'అదేనండీ మంచి కథ–సెట్టింగులు–మంచిపాటలూ–నృత్యాలు–సెక్సు–ఫైటింగులలాంటి హంగులన్నీ వుండే చిత్రాలను చాలామంది చాలారోజులు చూస్తార'ని నిర్మాతలూ, దర్శకులూ కూడా చెబుతారు. ఈ హంగులన్నీ వున్న చాలా చిత్రాలు దెబ్బతిన్నయ్యని విలేఖరి చెప్పరాదు సుమా!

నటీ నటుల సమస్యలు

సూపర్ స్టార్స్‌గా పేరందిన నటీనటులు విలేఖరికి చాలా గొప్పవారుగా భూలోక దేవతలుగా కనిపిస్తారు. వారి జీవిత విధానం కట్టూ, బొట్టూ వంటి వన్నీ ఫ్యాషన్లకు ఒరవడి అవుతాయి. కొంతమంది తారలపేరున చీరలూ, జాకెట్లూ, ప్యాంటులూ, స్లాక్స్ వంటివి దుకాణాలలో అమ్మకమవుతూన్న పరిస్థితులలో ఆ తారలను విలేఖరి కలుసుకొన్నప్పుడు కలిగే అనుభూతి అయోమయంగా వుంటుంది. తారలు కూడా మనుషులే గదా! అలంకరణతో తెర

మీద ప్రేక్షకులకు దర్శనమిస్తారు విలేఖరి కలుసుకొనడానికి వెళ్ళినప్పుడు కూడా పెద్ద పెద్ద తారలు (నటీమణులు) అలంకరణతోనే వుంటారు.

అడిగే ప్రశ్నలకు ముక్తసరిగా సమాధానం చెబుతారు అలాంటి అగ్రశ్రేణి తారలు. పోతే కొంతమంది చిన్న తారలు చాలా హాయిగా మాట్లాడతారు. తమ సమస్యలను చెబుతారు. భరతనాట్యం బాగా చేయగలవారూ, చక్కగా పాడగలవారూ, దాదాపు రెండు దశాబ్దాలుగా అన్నిరకాల నాటకాలలోనూ నటించి బహుమతులను గెలుచుకొంటున్నవారూ యీ చిన్న తారలలో వున్నారు. అయినా వారికి— అదేమి దురదృష్టమో గాని-తెలుగు చలనచిత్ర రంగంలో సముచిత గౌరవమర్యాదలు లభించడంలేదు ఇతర భాషాచిత్రాలలో వారు చక్కగా నటించి, ప్రేక్షకుల మన్ననలను పొందుతున్నారు మన సినీ పెద్దలేమో ఇతర భాషల తారలను రంగంలోకి దించుతున్నారని పించుతుంది విలేఖరికి. మరొక విచిత్రమేమిటంటే ఇలాంటి తారలను పొరుగు భాషాదర్శకులూ, నిర్మాతలూ, గుర్తించి తెలుగులో వారు నిర్మించే చిత్రాలలో వారికి అవకాశం ఇవ్వడం. ''ఇది నిజంగా తెలుగుజాతి సిగ్గుపడవలసిన విషయం'' అన్నదొక యువనటీమణి.

ఈ స్థితికి నిర్మాతలనూ, దర్శకులనూ నెపమెన్ని ప్రయోజనమేమిటని విలేఖరి అడిగితే 'నెపమెన్నడం నా ఉద్దేశంకాదు. నాటకరంగ కళాకారులను గుర్తించవలసినదిగా వారిని కోరడానికే నా యీ ఘోష' అన్నది మరొక యువనటీమణి.

తెలుగు చిత్రాలలో తమకు తగినంత గుర్తింపు లభించడం లేదన్న ఆందోళనే తప్ప ఇలాంటి నటీమణులకు అన్యభాషలనుంచి వస్తున్న నటీమణులపట్ల ఎలాంటి ద్వేషంగాని, అసూయగాని కనిపించవు. ఎందుకనంటే ఆయా భాషా చిత్రాలలో ఇలాంటి తెలుగు యువనటీమణులు నటించి, పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తూనే వున్నారుగదా. కాబట్టి వారిది సంకుచితదృష్టి అనిపించదు విలేఖరికి. కళాభివృద్ధికి భాష సరిహద్దుకాని, పెద్ద అవాంతరం అని గాని వారు అనుకొనడంలేదు.

తెలుగు నాటకరంగంలో పేరుప్రఖ్యాతులు సంపాదించి, అన్య భాషా చిత్రాలలో నటించి ప్రేక్షకుల మన్ననలు పొంది ఇంతవరకూ తెలుగు చలనచిత్రరంగంలో మాత్రం రాణకు రాలేకపోయిన యువ కళాకారులు ఎంతమందో వున్నారు. ఈ విషయం తెలిసినప్పుడు విలేఖరికి కూడా కొంత విచారం కలుగుతుంది.

మెలడీ అంటే?

సంగీతం బాగున్నది అని అనడంతో విలేఖరి ఆగితే బాగుంటుంది. అంతేగాని సంగీత దర్శకుణ్ణి ప్రశ్నలేమయినా అడిగాడో చాలా అయోమయంలో పడ్డాడు. ఉదాహరణకు ఒక సంగీత దర్శకుడు ''ఫలానా పాటలో ఫలానా 'ట్యూన్' వాడాను. అందుకు ఇన్ని వాద్యాలను ఉపయోగించి ఎఫెక్టు తీసుకొచ్చాను'' అంటాడనుకోండి. ఆయన మాటలలో సాగా, మెలడీ, సాకీవంటి పరిభాషా పదజాలం వినిపించుతుంటే మెలడీ యేమిటని అడిగితే ''సైగల్ పాటలు వినలేదా? సోంబ్ మోడ్ రికార్డులు వినలేదా? నౌషథ్ సంగీతం వినలేదా'' అని సంగీత దర్శకుడు ఎదురు ప్రశ్నలు వేయవచ్చు. కీర్తిశేషుడు ఘంటసాల వెంకటేశ్వరరావుగారి పాటలు గుర్తు చేయవచ్చు. అలా కాకుండా మెలడీ అంటే ఇలా వుంటుంది అని ఒక పాట వినిపించే సంగీత దర్శకునికి విలేఖరి నమస్కరించవలసి వస్తుంది.

ఏ వాక్యాన్నయినా ఒకానొక రీతిలో లయజ్ఞానంతో పలికితే అది సంగీతం అవుతుందేమో ననిపించుతుంది విలేఖరికి. అయితే మరి గాయకులందరూ సంగీత దర్శకులు ఎందుకని కాలేక పోతున్నారో?

''నన్నేం చెయ్యమంటారూ?''

ఒకనాడు ఒకచోట ఒక చిత్రం తాలూకు షూటింగ్ జరుగుతున్నది. ఆ చిత్రంలోని సూపర్ స్టార్స్‌ను చూచేందుకు వచ్చిన జనంతో అంతా కోలాహలంగా వున్నది. దర్శకుడు విలేఖరులను చూచి నవ్వాడు. దర్శకుడు సాదరంగా తీసుకెళ్ళి కాఫీ టిఫిన్ ఇప్పించాడు.

అంతలో షూటింగ్‌కు అంతా రెడీ అయింది. ఒక ఆసామీ తన చేతులలోని కాగితాలను నిర్మాతకు ఇచ్చాడు. వాటిని ఆయన దర్శకునికి ఇచ్చాడు. ఆయన వాటిని నిదానంగా పరిశీలించి పెన్సిలుతో అక్కడక్కడ ఏమేమో మార్పులు చేసి తన అసిస్టెంట్‌కు ఇచ్చాడు. ఆయన వాటిని పట్టుకొని తారల దగ్గరకు పరుగెత్తాడు.

ఇంతకూ అవి డైలాగ్స్ వ్రాసివున్న కాగితాలు. మరి సౌండ్ రికార్డింగ్ ఆదివరకే అయిపోయి వుండాలిగదా! అక్కడ ఆ సంభాషణల ప్రయోజనమేమిటి? అని ఆ కాగితాలను తొలుత నిర్మాతకు ఇచ్చిన రచయితను అడిగితే ''ఆఖరు నిముషంలో యీ సీనులో మార్పులు జరిగాయి. దాని కనుగుణంగా వ్రాసిన డైలాగ్స్ అవి. ఓమూల కూర్చుని వ్రాసి ఇచ్చాను. చూచారుగదా. ఇంతకంటే నేను చేయగలిగిన దేమున్నదీ! నన్నేం చెయ్యమంటారో చెప్పండి'' అన్నాడు ఆ రచయిత గర్వంగానో, దర్పంగానో! విలేఖరికి మాత్రం అదంతా అయోమయ ప్రపంచమేసుమా!

శ్రీ బి. వెంకటేశ్వర్లు

మండల యోని : ఆధునిక అంతర్జాతీయ రాజకీయాలు


ప్రాచీన హిందూ రాజనీతి తత్వ గ్రంధాలలో కౌటిల్యుని అర్ధశాస్త్రం అత్యంత ప్రాముఖ్యమైన స్థానాన్ని కలిగి వుంది. రాజ్య కార్యకలాపాలకు సంబంధించిన సమస్త విషయాలూ అర్ధశాస్త్రంలో కూలంకషంగా చర్చించబడ్డాయి. ఆ విధంగా అర్ధశాస్త్రం రాజనీతి తత్వానికి సంబంధించిన ప్రాచీన గ్రంధాలన్నింటిలోకి సమగ్రమైన గ్రంధం. దీనిలోని ఆరవ అధికరణం (మండల యోని) వివిధ రాజ్యాల మధ్యవుండే సహజ రాజకీయ సంబంధాలను క్షుణ్ణంగా విశదీకరిస్తుంది. దాదాపు 23 వందల సంవత్సరాలకు పూర్వం కౌటిల్యుడు ప్రతిపాదించిన ఈరాజ్య సంబంధాల సిద్ధాంతం దేశ, కాల పరిస్థితులకు అతీతమైన సిద్ధాంతంగా అధునాతన పండితుల చేత అంగీకరించబడుతున్నది. మండలయోనిలో విశదీకరించబడిన రాజమండల సిద్ధాంతాన్ని, 18 వ శతాబ్దం మొదలుకొని మొదటి ప్రపంచ యుద్ధకాలం వరకూ ఖండాంతర ఐరోపా దేశాలతో ఇంగ్లండ్ నిర్వహించిన రాజకీయాలకు, సూక్ష్మంగా పరిశీలించి అన్వయించే ప్రయత్నమే ఈ వ్యాసం వుద్దేశ్యం. ఇట్టి అధ్యయనంవలన రాజ్యాల మధ్య సంబంధాలను నిర్దేశిస్తున్న శక్తుల స్వరూప స్వభావాలను విశ్లేషించే వీలుకలుగుతుంది సతతం యుద్ధ భయంతో బ్రతుకుతున్న ప్రస్తుత ప్రపంచ దేశాలలో శాంతిని నెలకొల్పే ప్రయత్నానికి రాజ్యాల మధ్య సంబంధాలను నిర్దేశిస్తున్న శక్తుల మౌలిక స్వరూప స్వభావాలను తెలుసుకోవడం తప్పనిసరి.

మండల యోని : సిద్ధాంత వివరణ :-


మండల యోనిలో సంక్లిష్టమైన రాజ మండలాన్ని కౌటిల్యుడు సృష్టించాడు. రాజ్యావతరణ మొదటి దశలో చిన్న చిన్న రాజ్యాలు పెద్ద రాజ్యాలుగా రూపొందడం కొరకు సంఘర్షణలు, యుద్ధాలు తప్పనిసరి అయినాయి. చిన్న చిన్న రాజ్యాలు పెద్ద రాజ్యంగా ఏర్పడవలెననే కాంక్షకు కారణం సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సుస్థిరమైన, దృఢమైన రాజ్యంగా ఏర్పడవలసిన ఆవశ్యకతను ప్రజలు గుర్తించడమే. ఆ విధంగా భారత దేశంలో మౌర్య సామ్రాజ్యస్థాపన రాజ్యపరిణామాభివృద్ధిక్రమంలో అత్యంత ప్రాముఖ్యమైన దశ. వర్ణధర్మం ప్రబలంగా విస్తరించి రాజు యుద్ధంలో వీరమరణం పొందకుండా రాజభవనంలో మరణించడం అవమానకరంగా భావించే కాలంలో యుద్ధం అనివార్యం కావడం అనేది రాజ్య విస్తరణకు ఒక ప్రేరణ మాత్రమే. వీటన్నిటినీ దృష్టిలో వుంచుకొని మండలయోనిలో రాజ్య విస్తరణను (**Political Aggrandizement**) సాధించడమే కాక అలవికానప్పుడు వివిధ రాజ్యాల మధ్య రాజ్యాధికార సమతౌల్యతను (**Balance of Power**) సాధించడం ఎట్లో కౌటిల్యుడు వివరించాడు.

మండల యోనిలోని రాజ్యమండల సిద్ధాంత చక్రాన్ని సూక్ష్మంగా ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

వివిధ రాజ్యాలతోకూడిన రాజమండలంలో బాహ్యంగా ఏకాంతరంగా వున్న రాజ్యాలను 'నేమి' గా, తదనంతర రాజ్యాలను ఆకులుగా, విజిగీషులైన నేత తనను నాభిగా చేసుకుని నలుదిక్కులకు వ్యాపించవలెను[1] ప్రకృతి మండల వృత్తములలో నాభిగావున్న విజిగీషులైన[2] రాజును లేక రాజ్యమును, వెంటనే చుట్టివున్న రాజులు లేక రాజ్యములు[3] విజిగీషుకు సహజ శత్రువులు. వీరియెడల నాభిగా వున్న విజిగీషులైన రాజు అత్యంత జాగరూకుడై యుండాలి.



సహజ శత్రువులలో కూడిన వృత్తమునకు వెంటనే ఆవరించి వున్న బాహ్య వృత్తములోని రాజ్యములు విజిగీషుకు సహజ మిత్ర రాజ్యములు. అంతేకాక విజిగీషును ఆవరించివున్న రెండవ వృత్తములోని రాజ్యములకు (విజిగీషుకు మిత్ర రాజ్యములు) వీరు సహజ శత్రువులు.



X = విజిగీషు ; 1,2,3,4,5 = శత్రురాజ్యములు
A,B,C,D,E,F = మిత్రరాజ్యములు

ఈ విధంగా విజిగీషు నాభిగా, సహజ శత్రువులు ఆకులుగా, సహజ మిత్ర రాజ్యములు నేమిగా ప్రకృతి మండల చక్రం అతి సంక్లిష్టమై అంతర్ రాజ్య సంబంధాలను విజిగీషు అతి జాగరూకతతో నిర్వహించవలసి వుంటుంది. మండల రాజ్యములు యుద్ధములతో సతమతమై వుండటం అతి సహజం.


రాజమండలంలో 'రాజకీయ యథాతథస్థితి'కి ఏ క్షణంలోనూ తావులేదు.

ఈ ప్రకృతి రాజమండలం అతి సంక్లిష్టమైన 'రాజకీయ రేఖాగణిత చిత్రం.' ఈ రేఖా చిత్రంలోని ప్రతిభాగమూ చలిస్తూ 'శమవ్యాయామికము'[4] ను పాటిస్తూంటాయని కౌటిల్యుడు పేర్కొన్నాడు.

ఐరోపా రాజమండలంలో విజిగీషుగా ఇంగ్లండ్ నెరపిన శమవ్యాయామికము

18వ శతాబ్దం మొదలుకొని ఐరోపా రాజకీయాలలో బ్రిటిష్ రాజనీతిని పరిశీలిస్తే ప్రకృతిమండల సిద్ధాంతం ఎంత విశ్వజనీనమైందో బోధపడుతుంది.


ఫ్రెంచి దేశపు 14వ లూయీ తన మనుమడైన ఫిలిప్‌ను స్పెయిన్‌కు రాజుగా చేసినప్పుడు ఇంగ్లండ్ ఐరోపా రాజకీయాధికార చిత్రాన్ని సమతౌల్యం చేయడం కొరకు నెదర్లాండ్స్, జర్మనీ, పోర్చుగల్, డెన్మార్క్, హాప్స్‌బర్గ్ కుటుంబంతో చేతులు కలిపి ఫ్రెంచి సామ్రాజ్య విస్తరణకాంక్షను 1701–1714 మధ్య కాలంలో స్పానిష్ యుద్ధాలలో దెబ్బతీసింది.[5]



X = ఇంగ్లాండ్ ; Y = ఫ్రాన్స్

1701-14 స్పానిష్ యుద్ధాలు.
ఐరోపా రాజమండలంలో విజిగీషుగా ఇంగ్లండ్


మరలా ఫ్రాన్స్ 1756–63 మధ్యకాలంలో ఆస్ట్రియా, రష్యా, స్వీడన్ దేశాలతో చేతులుకలిపి ప్రష్యాదేశపు ఫ్రెడరిక్‌ను బెదరించినప్పుడు ఇంగ్లండ్ ప్రష్యావైపు తన బలాన్ని తిప్పి ఫ్రెంచి సామ్రాజ్యకాంక్షను తీవ్రంగా అడిచివేసి (సప్తసంవత్సరయుద్ధం) తన సామ్రాజ్యానికి కెనడాలోనూ, భారతదేశంలోనూ పునాదులు వేసుకుంది.



X = ఇంగ్లాండ్ ; Y = ఫ్రాన్స్

1756–'63 సప్తసంవత్సర యుద్ధాలు
ఐరోపా రాజమండలంలో విజిగీషుగా ఇగ్లండ్


మళ్ళీ 1804-'14 మధ్యకాలంలో ఇంగ్లండ్ నెపోలియన్‌ను ఓడించడం కొరకు పోర్చుగల్, స్పెయిన్‌తోనేకాక, రష్యా, ఆస్ట్రియా, ప్రష్యా, నెదర్లాండులతో చేతులు కలిపి వాటర్లూ యుద్ధంలో ఫ్రాన్సును చివరిసారిగా చిత్తుగా ఓడించింది.[6]



X = ఇంగ్లాండ్ ; Y = ఫ్రాన్స్

1815 వాటర్లూ యుద్ధం.
విజిగీషుగా ఇంగ్లండ్


కాని క్రిమియన్ యుద్ధంలో[7] (1854-56) ఇంగ్లండ్ రెండువందల సంవత్సరాల తర్వాత రష్యా ప్రాబల్యాన్ని తగ్గించడం కొరకు మొట్టమొదటిసారిగా ఫ్రాన్స్‌తో చేతులు కలపడం 'యథార్థ రాజకీయం' (Real politik) తెలిసినవారికి అంత ఆశ్చర్యాన్ని కలిగించదు.




X = ఇంగ్లాండ్ ; Y = రష్యా

1854-56 క్రిమియన్ యుద్ధం. విజిగీషుగా ఇంగ్లండ్.
మొదటిసారిగా ఫ్రాన్స్‌తో పొత్తు.

1903లో రష్యా ప్రాబల్యాన్ని అడచడం కొరకు జపాన్‌తో చేతులు కలిపిన ఇంగ్లండ్ మొదటి ప్రపంచయుద్ధంలో రష్యాతో చేరింది.



1903లో రష్యా ప్రాబల్యాన్ని తగ్గించడం కొరకు
ఇంగ్లండ్ జపాన్‌తో చేతులు కలిపింది



మొదటి ప్రపంచయుద్ధం. జపాన్‌ను దెబ్బతీయడంకోసం
రష్యాతో మైత్రి.

ఐరోపా రాజమండలంలో ఇంగ్లండ్‌యొక్క శమ వ్యాయామికం వూహాతీతం. వివిధ రాజ్యాలమధ్య రాజకీయ సంబంధాలు శాశ్వతంగా ఒకేవిధంగా వుండవనీ, అధికార ప్రాబల్యంకొరకు ప్రచ్ఛన్న రాజకీయం అవశ్యమనీ ఇంగ్లీషు రాజకీయం విరూపిస్తున్నది.

ముగింపు

ఆధునిక అంతర్జాతీయ రాజకీయ సంబంధాలను పరిశీలిస్తే కౌటిల్యుడు వివరించినట్లు నే రాజకీయ సిద్ధాంతాలు గాని, మత విషయాల గాని రాజకీయ సంబంధాలను ప్రభావితం చేస్తున్నట్లుగా కనిపించదు. మండలయోనిలో కౌటిల్యుడు వివరించిన రాజ్య విస్తరణ సిద్ధాంతమే ప్రస్తుత సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయంగా భావిస్తే,[8] నైతిక విలువలకు గాని, మతసంబంధమైన విషయా

లకుగాని, రాజనీతి సిద్ధాంతాలకు గాని రాజ్యసంబంధాలను ప్రభావితం చేయగల శక్తి వున్నట్టుగా తోచదు. కౌటిల్యుడు వివరించిన విజిగీషుయొక్క రాజ్యవిస్తరణ కాంక్షకు, ప్రస్తుత సామ్రాజ్యవాదానికి స్పష్టమైన సామ్యాన్ని చూడవచ్చు. ఈ రెంటికి ప్రేరణ ఆర్థిక పరిస్థితులేననీ మౌర్యసామ్రాజ్య స్థాపన, ఇంగ్లీషు సామ్రాజ్యవాదమూ రుజువు చేస్తున్నాయి. వివిధ రాజ్యాలమధ్య ఆర్థిక అసమానతలున్నంతకాలమూ యుద్ధాలులేకుండా శాంతి యుత సహజీవనమంటే మత్స్యన్యాయాన్ని అంగీకరించడమే. మండల యోనిలో నాభిగావున్న విజిగీషుకు మాత్రమే ప్రపంచాధిపత్యం లభిస్తుంది.

NOTES

1 నేమి మేకాన్తరాన్ రాజ్ఞః కృత్వాచానంతరా నరాన్
నాభి మాత్మాన మాయచ్ఛేన్నేలూ ప్రకృతి మండలే!

2 రాజాత్మ ద్రవ్య ప్రకృతి సంపన్నో
న యస్యాధిష్ఠానం విజిగీషుః।

3 కౌటిల్యుడు తన కాలంనాటి నీతి శాస్త్రవేత్తలందరి వలెనే రాజ్యానికి ప్రభుత్వానికి తేడాగమనించలేదు. అతనికి రాజ్యమే ప్రభుత్వము, ప్రభుత్వమే రాజ్యమూ. రెండూ వేరు వేరుగాదు.

4 శమ మనగా శాంతి — ఇతర రాజులతో శాంతియుతమగు సంబంధములు కలిగియుండుట. వ్యాయామిక మనగా పని— యుద్ధాలు చేయుట, రాయబారము, దూతలను పంపుట మొదలైనవి.

అర్థశాస్త్రము : అను. మామిడిపూడి వెంకట రంగయ్య, హైదరాబాదు, 1968, పే. 364.

5 ఇవి —

1706 రొమిల్లా యుద్ధం (Romilla War)

1708 ఔడెనార్డ్ యుద్ధం (War of Oudenarde)

1709 మాల్‌ప్లాకెట్ యుద్ధం (Malplaquet)

1712 డెనాయిన్ యుద్ధం (Denain) మొదలైనవి.

6 హాలెండ్‌కు, స్విట్జర్లండ్‌కు స్వాతంత్ర్యమనే సాకుతో ఐరోపాలో నానాటికి పెరుగుతున్న ఫ్రెంచి ప్రాబల్యాన్ని తగ్గించడం కొరకు ఇంగ్లండ్ నెరపిన ప్రచ్ఛన్న రాజకీయం 1805లో ట్రాఫాల్గర్ యుద్ధానికి దారితీసి నెపోలియన్‌ను తిరుగులేని దెబ్బ తీసింది. దీని కొరకు ప్రష్యా, ఆస్ట్రియా, స్వీడెన్లతో చేతులు కలిపింది ఇంగ్లండ్. మరలా 1813లో రష్యా, ప్రష్యా, ఆస్ట్రియాలతో చేతులు కలిపి 'లీప్ జిగ్' యుద్ధంలోనూ, 1815 లో వాటర్లూ యుద్ధంలోనూ ఫ్రాన్స్‌ను ఓడించింది. దీనితో ఐరోపాలో ఫ్రెంచి ప్రాబల్యాం పూర్తిగా తగ్గిపోవడమే కాక, యుద్ధ ఫలితంగా 1815లో జరిగిన 'వియన్నా సెటిల్‌మెంట్' ఐరోపా ఖండంలోని అన్ని దేశాల మధ్య రాజ్యాధికార సమతౌల్యతను సాధించడమే కాక ఫ్రాన్స్‌ను కేవలం అన్నిరాజ్యాలలో ఒక రాజ్యంగా మిగిల్చింది. దీనితో ఐరోపా అగ్రాధిపత్యం కొరకు ఫ్రాన్స్‌ను ఆయా దేశాల మధ్య తలమున్కలుచేసి, తన వినియోగ వస్తువులకు ఆసియా, ఆఫ్రికా, కెనడా దేశాలలో మార్కెట్టును సంపాదించుకోవడంలో ఫ్రెంచి పోటీని విజయవంతంగా ప్రచ్ఛన్న రాజకీయంతో దెబ్బ తీసింది ఇంగ్లండ్. దీనివల్ల ఇంగ్లీషు సామ్రాజ్యవిస్తరణ ఖండాంతర ఐరోపా దేశాలమధ్య రాజ్యాధికార సమతౌల్యతను సాధించడంపై ఆధారపడి వుందనేది స్పష్టమౌతుంది.

7 క్రిమియన్ యుద్ధ కాలం నాటికి రష్యా తన ప్రాబల్యాన్ని పెంచుకుని టర్కీని కబళించ ప్రయత్నించడం, భారతదేశంలోని తన వునికికి భంగకరమనీ, రష్యా టర్కీని లొంగదీసు కోగలిగితే బాల్కన్ ప్రాంతాల్లో రష్యా ప్రాబల్యం పెరిగి మధ్యధరా సముద్రం నుండి తన నౌకలు భారతదేశం చేరటానికి టర్కీని తనచేతుల్లో పెట్టుకోవలసిన అవసరం ఏర్పడి, ఇంగ్లండ్ క్రిమియన్ యుద్ధంలో ఫ్రాన్సుతో మైత్రి కలిపి టర్కీ పక్షాన నిలిచింది.

ఈ యుద్ధంలో బ్రిటిష్ సైనికులు చూపిన ధైర్య సాహసాలకు ముగ్ధుడై కవిత రాశాడు ఇంగ్లీషు కవి టెన్నీసన్. మా రాజనీతి శాస్త్ర విద్యార్థులు కొందరు ఈయన్ని 'సామ్రాజ్య వాద కవి' అంటూంటారు.

8 క్రీ. పూ. 3, 4 శతాబ్దాలలో ఆర్థిక పరిస్థితులకు మూలాధారమైన భూమి, దానిని సాగుచేసే ప్రజలు, దానిపై పన్నులు, భూమిని ఆవరించివున్న తరు, జల, ఖనిజాది సమస్త సంపదలూ మొదలైనవాటి సంపాదనా నిర్వహణయే రాజకీయం. మౌర్యసామ్రాజ్య స్థాపనకు తోడ్పడిన శక్తులు ఆర్థిక శక్తులేననీ రొమిలా థాపర్ భావిస్తూ కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని ... ... a treatise on Government & Economics అని నిర్వచిస్తున్నారు ఆమె.

చూడు : A History of India : Romila Thapar
Penguin Books 1976 PP. 75-77.

తన గ్రంథానికి అర్థశాస్త్రమన్న పేరు ఎలా తగియున్నదో కౌటిల్యుడు పదిహేనవ అధికరణంలోని ఒకటవ అధ్యాయంలో ఈ విధంగా వివరించాడు.

"మనుష్యుల జీవితమునకు మూలము అర్థము. లేదా మనుష్యులతో కూడిన భూమియే అర్థము. అట్టి

భూమిని సంపాదించు ఉపాయములు—వీనిని గురించిన శాస్త్రము.''

చూడు : అర్ధశాస్త్రం : అను మామిడిపూడి వెంకట రంగయ్య, హైదరాబాదు పే.600

విడదీయ వీలులేని 'రాజకీయార్థిక శాస్త్రాన్ని' (Political Economy) రాజనీతిశాస్త్రం, ఆర్థిక శాస్త్రంగా విడదీసిన ఫలితంగా ఏర్పడిన గందరగోళం యిది.

REFERENCES

1 హెన్రిక్ జిమ్మర్ : ఫిలాసఫీస్ ఆఫ్ ఇండియా, సంపాదకుడు: జోసెఫ్‌కాంప్‌బెల్, రోట్లెడ్జ & కెగాన్‌పాల్ లిమిటెడ్, లండన్, 1951.

2 మామిడిపూడి వెంకట రంగయ్య : అర్ధశాస్త్రము, తె. అను. సికిందరాబాదు, 1968.

3 ఎ. యస్. ఆల్టేకర్ : స్టేట్4 గౌర్నమెంట్ టు ఏన్షెంట్ ఇండియా, మోతీలాల్ బనారసీదాస్, ఢిల్లీ, 1958.

4 హెచ్. ఎ. ఎల్. ఫిషర్ : ఎ హిస్టరీ ఆఫ్ యూరప్, ఎడ్వర్డ్ ఆర్నాల్డ్ లిమిటెడ్, లండన్, 1957.

5 రొమిలా థాపర్ : ఎ హిస్టరీ ఆఫ్ ఇండియా (ఒకటి), పెంగ్విన్ బుక్స్, 1976.

ఆగంతుకుడు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

నీవు దొంగిలించిన నవనీత హృదయ
కబళములు రాతిముద్దలై కఠినమయ్యె
నీవు వంశిపై నూదిన భావరాగ
శకలములు వ్యర్థ జీవిత ఝురులదేలె.

నీ కురులపై నిలిచియాడు నెమిలికంటి
సప్తవర్ణములు తెలతెల సాగిపోరె.
నీ చరణ లాస్యములు రోహిణీ నిదాఘ
వేళ కన్నులోపని కాంతివేలయయ్యె.

నీవు చేరదీసిన వెఱ్ఱి నేస్తములకు
తెలివి ముదిరి బుద్ధులు పెడతలను జేరె.
నీవు లాలించు పాలించు గోవులన్ని
చిక్కిశల్యాన శిష్టమై చెదరిపోయె.

సాంద్రగంభీరమై నీటిజడుల గురియు
విరహిణీ తమాల హృదయ విపినసీమ
నీ ప్రణయ రహస్య నిభృత నీపవనము
పత్రవిరహిత కాష్ఠమై ప్రజ్వలించె

రాసలీలల వెన్నెలరాత్రి శోభ
నగ్ననృత్యాల కామ్యోపమగ్నమయ్యె
నీవు జలకములాడి పునీతమైన
యమున కలుషిత, దూషిత యయ్యె నేడు.

అభ్యుదయగామి విలుకాని అమ్ముదగిలి
తనువు చాలించితివి యుగాంతమ్మునందు
భూమిపై లేవు నీ పాద ముద్రలైన;
ఏల వచ్చి నిల్చితివి నా హృదయమందు ?

సాగరయాత్ర

ఈ దుఃఖ సాగరంలో ఈదుతున్ననేను
ఆవలి సౌఖ్య తీరాన్ని చేరుతానో లేదో
ఇప్పుడు మాత్రం నేను చీకట్లో సముద్రతరంగాల్ని చీలుస్తూ
ఎదురీదుతున్న యాత్రికుణ్ణి

జలధిలో పడిన నాతల ఇంకా పైననే ఉండడంచూచి
చావాలని అందినన్ని రాళ్ళూ విసిరేస్తోందీ పాడులోకం
అనుక్షణం వాటిని తప్పించుకునేందుకు
అంబుధిలో మునుగుతూ తేలుతూ పయనిస్తున్నాను

ఈరకం జనానివి నల్లరాతి గుండెలు
వాటికి కన్నీళ్ళ బ్రతుకులు తెలియవు
ఈ శ్రీనాధులవి ఖరీదైన జీవితాలు
వాటికి కల్లోలిత హృదయాలు అర్థంకావు

తీరంమీద షికారుచేసే ఈ విలాస పురుషులు
చేయిజారి కాలుజారి సింధువులోపడి గిలగిలలాడే
దురదృష్ట జీవులు మునకలువేస్తూ
నీళ్ళు మింగుతూవుంటే
పరమానంద భరితులవుతారు
దౌర్భాగ్యులు పోతేపోనీ అనుకుంటూ వెళ్ళిపోతారు
ఈ మున్నీటిలోకి జారిన నేను
కన్నీరు విడుస్తున్నా

ఆవలి తీరానికెలాగైనా చేరుకోవాలన్న దీక్షతో
కొండంత సాహసంతో గుండెలో ధైర్యజ్యోతి వెలిగించుకొని

కదలిపోతున్నాను
కడలిని ఈదుతున్నాను

ఆవలి తీరానికి చేరాలని
చీకట్లో తరంగాల్ని చీలుస్తూ
సముద్రం ఈదుతున్న
సాహసికుణ్ణి నేను.

యాత్ర

జీవితం
సైబీరియా ఎడారి
సుఖాల ఒయాసిస్సుల్ని
వెదుక్కుంటూ సాగిపోవాలి

బాధాగ్రీష్మ నిదాఘాలలో
తల చుర్రుమంటున్నా తరలివెళ్ళాలి
కష్టాలమంటలకు కాళ్ళు బొబ్బలెక్కుతున్నా
ఓర్చుకుంటూ ఒక్కొక్కడుగే ముందుకు వెయ్యాలి

నీ సహనం ఒంటె
దారి పొడవునా నీకు దోస్తు
నీ ఆత్మబలం డేరా
ఎడారి ప్రయాణంలో ఎప్పుడూ నీకు ఛత్రి.

శ్రీ తిరునగరి

శ్రీ సోమసుందర్

ఆధునిక ప్రపంచ స్పృహలో నేటి అభ్యుదయ కవితారీతులు

అభ్యుదయ సాహిత్యోద్యమం తెలుగు జాతికి ఎన్నో అమూల్య సంపదలు చేకూర్చింది. వేయేళ్ళ తెలుగు సాహిత్య స్వరూప స్వభావాలనే సంపూర్ణంగా మార్చివేసింది. తెలుగుభాషలో నైసర్గికంగా పెంపొందిన కవిత్వానుకూల వాతావరణాన్ని మరింత పటిష్టమొనర్చింది. భాషను మరింత నాగరీకం చేసింది. అంతర్జాతీయ కవిత్వ స్థాయికి తెలుగు కవిత్వాన్ని ఉన్నతీకరించింది. రక్తనిష్ఠమైన అనూన సంప్రదాయాన్నీ, అమేయ వారసత్వాన్నీ పోకార్చుకోకుండా కాపాడుకోవడమే కాక, శైథిల్యతను తొలగించుకుంది. మతబంధాల గుడిసుళ్ళనుంచి సముద్ధరించుకొని, మానవతా ధర్మాలను పతాక సన్నిభ మొనర్చుకుంది. తెలుగు భాషకు సహజంగా లభించినమాధుర్య గుణాన్ని పెంపొందించుకొని, ఎంత క్లిష్టమైన భావాన్నయినా అవలీలగా అభివ్యక్తం చేయగల నిశిత సాధనంగా రూపొందించుకుంటూ పురోగమిస్తోంది. తెలుగు భాషాపరిధిలో ఆధునిక కవిత్వమంటేనే అభ్యుదయ కవిత్వానికి పర్యాయపదమన్నంత ప్రబలశక్తిగా స్థిరపడి, రూపురేఖలను వెలార్చుకుంటోంది.

ఐతే కొందరు మేధావులు భావిస్తున్నట్లు దాని చారిత్రకపాత్ర ముగిసిపోలేదు. అభ్యుదయ కవిత్వ పరంపరలో క్షీణత్వమూ ఏర్పడలేదు. ఉద్యమంలో ఆటుపోట్లు సంభవించడంవేరూ, కవితా జీవన స్రవంతి కుంఠితమైపోవడం వేరూను! ఈ రెంటినీ కలగాపులగం చేసి మాట్లాడేవారు — యథార్థ పరిశీలనతోకాక, దురుద్దేశ పూర్వకంగా కావించుతున్న అంచనాలుగా తేటతెల్లం కాగలవు.

ప్రస్తుతం అభ్యుదయవాదులైన రచయిత లందరినీ ఏకోన్ముఖ మొనరించి, అభ్యుదయ సాహిత్యోద్యమాన్ని దీప్తివంతంగా పురోగమింప చేయవలసి వుంది. సాహిత్యోద్యమం కలిగించవలసిన ప్రభావంతో మోసులువారే సామాజిక శక్తిని ఆశాంచలాల వరకూ విస్తృత మొనరించవలసిన పరమ బాధ్యత వర్తమాన తరంపై ఎంతో ఉంది. సామాజిక పునర్నిర్మాణ దశలో దాని అవసరమూ, పాత్రా, ప్రాధాన్యతా ఇంకా సంపూర్ణం కాలేదు. పైగా వర్తమాన విషమ సంధ్యలో దాని ఆవశ్యకత మరింత పెరిగింది. అభ్యుదయ సాహిత్యోద్యమం కాలం చేసిందనీ, కవిత్వ ధర్మం విశుష్కమైందనీ అంచనాలు వేసే వైద్యులు నిదానం లేనివారు. తమ నేత్ర కుసుమావరోధాన్ని అంగీకరించలేని కురుచ బుద్ధులేనని సార్వత్రికంగా చెప్పవచ్చును.

తెలుగుజాతికి అభ్యుదయ సాహిత్యోద్యమం అందించిన ఎన్నో వెలుగులతోపాటు, అల్పమైనవైనా చీకటి నీడలు కూడా కొన్ని ఉన్నాయి. ఈ సత్యాన్ని అంగీకరించడంగాని, ఆ ఛాయా దోషాలను తొలగించుకోవాలనడం గాని, యువ రచయితల సృజనశక్తిని నిందించడం కాదు. పొంగే పాలపై నీళ్ళు చల్లడమూ కాదు. సార్వత్రిక సాహిత్య స్వరూపంలో మొగ్గులే వెదకడం అంతకన్నాకాదు. పైగా దోషాలను పేర్కొంటున్నపుడు—అవి కేవలం యువతరంతోమాత్రమే పుట్టి పెరుగుతున్నట్లు నేరారోపణ చేసేవాడు పరిశీలకుడు కాలేడు. నేటి యువతరంలోగల అసంఖ్యాక దోషాలు క్రమక్రమంగా వచ్చి, వారికి వారసత్వంగా అందుతున్నవే! అరసం ఏర్పడిన తొలి రోజులలో బాధ్యతనంతా తమ భుజస్కంధాలపై మోపుకొన్న తొలి తరానికి చెందిన అస్మదాది కవులూ రచయితలే ఎన్నో దోషాలకు ఆకరమయ్యారనడమూ సత్యదూరం కాదు. కనక దోషాల గురించి మనమిక్కడ చెప్పకోవడమంటే — ఆత్మ విమర్శగా మాత్రమే! ఆత్మస్తుతీ పర నిందలతో ఆత్మ వంచనకు పూనుకోవడమూ కాదు.

రచనాపరమైన దోషాలుగాని, అవగాహనా పరమైన దోషాలుగాని, ఎన్ని ఉన్నప్పటికీ — తొలితరం రచయితలలో నిరంతరం అధ్యయన, అభ్యసన ధారణాదులతో కవితా సాధన సలిపినవారు ఉత్తమ సాహిత్యాన్ని సృష్టిస్తూనే ఉన్నారు. అట్టివారు మాత్రమే ఆధునిక సాహిత్య చరిత్రలో నిలచిపోయారు. లేనివారు నామమాత్రావశిష్టులైనా కాకుండా కాలగర్భంలో కలసిపోయారు. ఐతే ఆ తరం యావత్తూ తమకు తాముగా భూమికను రూపొందించుకొన్నవారు. నిష్కంటకంగా నవ పథాలు తీర్చిదిద్దుకొన్నవారు. ప్రజా హృదయ క్షేత్రంలో తమ నవ్యోద్యమ మూలాలను బలంగా నాటుకొనేటట్లు దోహదం చేసినవారు. వారికానాడు సిద్ధాంతపరమైన ఆదర్శాలేతప్ప, రచనాపరమైన ఆదర్శ శిఖరాలెన్నో లభించి ఉండలేదు. యుగకర్త వీరేశలింగం, సృజనాత్మక కళాశీలి మహాకవి గురజాడ, భాషాసంస్కర్త

గిడుగూ, తొలి అభ్యుదయ కవితా ప్రవక్తలు శ్రీశ్రీ, నారాయణ బాబూ, పురిపండాలు మాత్రమే!

ద్వితీయ ప్రపంచ సంగ్రామం — జగజ్జన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న తొలినాళ్ళలో, ప్రపంచ మేధావుల ఏకైక ధ్రువ తార సోవియట్ రష్యాను నాజీ నరహంతలు కబళిస్తున్న దశలో తొలి తరం అభ్యుదయ రచయితలు సంఘటితమయ్యారు. యావద్భారత స్థాయిలో అరసం 1936లోనే ప్రాదుర్భవించింది. ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం 1942 ద్వితీయార్థంలో నిర్మాణమైంది.

యుగకర్తల విషయంలో, వారెవరూ అప్పటికి సజీవులు కానందువల్ల ఏ విధమైన పేచీలూ ఎదురు కాలేదు. సజీవులైవున్న అభ్యుదయ రచయితల విషయంలోమాత్రం—ఎన్నో షరతులు, సందేహాలు, మార్పులు ఏర్పడకపోనూలేదు. ఉదాహరణలుగా కొందరినైనా పేర్కొనదలిస్తే శ్రీ చలంపేరు ఎవరికేనా ముందుగా జ్ఞాపకం రాకతప్పదు. ఆయన అహర్నిశం సమాజాభ్యుదయాన్ని కోరారు. వీరేశలింగం తర్వాత స్త్రీ జనాభ్యుదయానికై పరితపించిన వ్యక్తి మరొకరు లేరన్నా అతిశయోక్తి కాదు; సూచించిన మార్గాలు భిన్నించవచ్చుగాక; అంతమాత్రాన అభ్యుదయ సాహిత్యోద్యమం ఆయనతో వైరుధ్యం పెట్టుకోవలసిన పనిలేదు. కాని ఆయన్ని వేర్పరచడానికి కారణం—దేశభక్తిపట్ల, రాజకీయ చరమాశయాలపట్ల ఆయన అసహనం ప్రకటించడమే! అలాగే శ్రీరంగం నారాయణబాబు, పాలగుమ్మి పద్మరాజుగార్లు తమ తమ రాజకీయ అభిప్రాయాలు కారణంగా అరసం ఆహ్వానాన్ని పొందలేకపోయారు. ఇప్పుడిదంతా చెప్పడమెందుకంటే — ఆనాటికన్న ఈనాడు విశాల ప్రాతిపదికపై ప్రజాతంత్ర భావాలుగల — మతాతీత రచయితలనందరినీ ఏకోన్ముఖం చేయాలని మనమంతా సంకల్పిస్తున్నాం కనక!

ఒక ఉద్యమ నిర్మాణం విషయంలో ఇలాంటివి కొన్నయినా విచక్షణలుండటం తప్పకాదు; కాని అభ్యుదయ రచయితలుగా పేర్కొనబడుతున్నవారి విషయంలోమాత్రం ఉద్యమం మొదటి నుంచీ విమర్శ చూపలేకపోవడం విచారకరమే! ఒక రచన ఉత్తమాదర్శ ప్రేరితమైతే చాలు ఉత్తమ కళాఖండంగా పేర్కొనబడుతూ, అభ్యుదయ కావ్యవస్తువుకు నిరవధిక ప్రాధాన్యత యిస్తూ వచ్చింది. దీని ఫలితంగావస్తు నిక్షిప్త భండారాలుగా మాత్రమే మన రచనలు రూపొందాయి. చిచ్చుకిగా ప్రజ్వలితం కాలేకపోయాయి. మన విమర్శక వ్యాపారం—బొత్తిగా కేటలాగు పట్టికల స్థాయికి దిగజారి, సునిశిత పరిశీలన పోకార్చుకుంది. ఇష్టమైన దానిని జండాగా మోయడం, కాని దానిని చాకిరేవు బల్లకువేసి బండగా బాదడంగా తయారైంది. ఈవిధంగా మొదటినుంచి రచయితల సంఖ్యాబలపు వాపుకే తప్ప-గుణాత్మకమైన బలుపుకు దోహదం చేయలేకపోయింది!

ఒక రచయిత పీడితవర్గంపట్ల వత్తాసు పలికితే చాలు—అతని రచన ఎంత లోపభూయిష్ఠంగా ఉన్నా, ఎంత కళావిహీనంగాఉన్నా ఔదార్యం ప్రదర్శించవలసిందేనన్న వెసులుబాటు ధోరణి ప్రదర్శింపబడింది. అంటే రచనకు ప్రధానమైనది వస్తువేగాని, సంవిధానం కాదని కంఠోక్తిగా చెప్పినట్లే అయింది. దీనివల్ల కవితా రచనలో శిల్పం మృగ్యమైంది. వస్తువు ప్రాణతుల్యమైతే సంవిధానం శరీరంవంటిది. ఆరోగ్యవంతమైన శరీరంలోనే ప్రాణశక్తి దీపించగలదు. శరీర విరహిత ప్రాణం దయ్యమైనట్లే—ప్రాణ రహిత శరీరం శవమవుతుంది. రెండూ విడివిడిగా విసర్జనీయాలే! రెండూ అవిభాజ్య సౌందర్యపోషకాలే' ప్రపంచ అభ్యుదయ రచయితలకు నాయకమణులైన గోర్కీ, మయెకొవిస్కీ, రోమారోలా, జాక్ లండన్ ప్రభృతులు పదే పదే చెప్పిన కళామూల్యాలు — పై సత్యం ఉపేక్షింపబడటంవల్ల, వైఫల్యం చెందుతూవచ్చాయి!

తెలుగుజాతి హృదయక్షేత్రంనుంచి మొలిచి, పెరిగి, ప్రౌఢ నిర్భరవయః పరిపాకం అందుకొన్న అభ్యుదయ సాహిత్యోద్యమం 36 ఏళ్ళదైంది. అంటే ఈ ఉద్యమం త్రిదశత్వం అనుభవిస్తోందే తప్ప—కొందరు కుహనా రాజకీయ మేధావులు 'సిద్ధాంతు'లూ మదింపు చేస్తున్నట్లు వార్ధక్య పక్షవాత పీడిత కాలేదు. ఎందరో నవయువకులు ఈ సాహిత్యోద్యమంలోనికి తమంత తాముగా ప్రవేశిస్తూనే ఉన్నారు. ఎన్నో నవనవోన్మేష ప్రతిభాన్విత రచనలందిస్తూనే ఉన్నారు. ఎంతో చిత్తశుద్ధిని ప్రోదిచేసుకుంటున్నారు. కొత్తనీరు వస్తున్నది కనుకనే కొత్తచేప ఎక్కివస్తోంది

ఐతే, ఇక్కడే ఒకలోపంగురించి కూడా ముచ్చటించుకోవాలి ప్రస్తుతం యువరచయితలు తమకు గత మూడున్నర దశాబ్దాల కాలంలోనూ పెంపొంది వారసత్వంగా సంక్రమించిన సాహిత్య సంవిధానాన్నీ, అభివ్యక్తి రీతినీ, కవిసమయాలనూ గుణదోష విచికిత్స చేయకుండా అనుసరించడం పరిపాటిగా జరుగుతోంది. ఉత్తమాశయాలను ఉపదేశించి, తక్షణ కర్తవ్యాల నెత్తిపోసి, కేవల కవిత్వ స్వరూపాన్ని మాత్రమే సంతరించుకొన్న రచనలన్నీ ఉత్తమ కవిత్వమేనన్న భ్రాంతిలో, అశిక్షిత యువహృదయం మొలకలు వేస్తోంది. ఈ అవలక్షణంనుంచి వర్తమాన అభ్యుదయ సాహిత్యం, ముఖ్యంగా కవిత్వం పూర్తిగా మొగం త్రిప్పుకోవలసి ఉంది. సాహిత్య ప్రయోజనం కేవల ఔపదేశికత్వమూ, ఔపయోగికత్వమూ మాత్రమే అనుకొనే భ్రమ ఆరోగ్యదాయకంకాదు.

సాహిత్యం ప్రధానంగా ఉత్కృష్ట కళాస్వరూపం. అందునా కవిత్వం పరమ రమణీయ హార్దిక కళాస్వరూపం. కనక సాహిత్యంలో ఔపదేశికత్వం ఔపచారికంగానే ఉండాలి. అంటే సందేశం గౌణంగానూ, సత్కళా స్వరూపం ప్రథమ గణ్యంగానూ ఉండాలి అపురూప హార్దిక అనుభూతుల స్వరమేళనగ కవిత్వం అమరవలసిందే తప్ప—స్థూల సిద్ధాంతాల పటాటోపం దురాక్రమించకూడదు.

అంటే బుద్ధి పెడతలకు చేరి వివేచనాశక్తి లుప్తమైన కొందరు మేధావులు భావిస్తున్నట్లు—ఉపదేశం గర్భీభూతమైతేనే కవిత్వం మైలపడిపోతుందని వాదించడం కావాలనే చేసే మూర్ఖ వాదమే! కవిత్వం—కేవలం వైయక్తిక, స్వాత్మక ఐకాంతిక అనుభూతుల, రహస్య వేదనల సంభారాలకు ఆకరం కావాలనడం సంకుచిత స్వార్థబుద్ధితో చేసే మృషా ప్రచారమే!

ఈ చైతన్యం వర్తమాన కవులందరికీ తప్పనిసరిగా కలగాలి. తద్వారా శోభస్కర సృజనోత్సవానికి ముందంజవేయాలి. సాహిత్యం కేవలం ఉత్తమాశయాలు దాచుకొనే బొక్కసమనుకుంటే సరిపోదు. అదే ప్రధాన చరమాశయమైతే — లోపలికి వెళ్ళకలిగిన వాళ్ళ మొగాలకి బూజూ బుగ్గీ మిగిల్చే స్టోరు రూముగా తయారవుతుంది. పలువురిలో ఇంకా ఈ శ్రోత్రియ భావం వేరు తన్నుకునే వుంది. ఉదారాశయాలూ, ఉత్తమాదర్శాలూ, సాహిత్యం ద్వారానే ప్రేరేపించబడాలనీ ముఖ్యంగా కవిత్వ ప్రేరణ ఆ స్థాయిలోనేననీ, భావించేవారి వ్రాతలు ఎంతవరకూ పోతున్నాయంటే — తాత్కాలిక పార్టీ తీర్మానాలను సైతం కవిత్వీకరించడం వరకూ మితిమీరిపోతున్నాయి. మన సాహిత్య రంగంలోనికి విరసం ప్రవేశించాక ఈ విపరీత వైఖరి మరీ మితిమీరి పోతోంది.

హృదయతలంలో రసస్పర్శ జరపని కేవల కవితా స్వరూపాలు అకవితలుగా వెంటనే శుష్కమైపోతాయి. ఒక కవితను చదవడానికి పట్టినంత కాలమైనా ఆ కవిత చదువరి హృదయంలో నిలవలేక పోయిందంటే — తోడుకోని పెరుగు వడ్డించినట్లుగా, ఆ కవితకు అభోక్తవ్య లక్షణం సంసిద్ధ మవుతోందన్న మాట!

కవితా రచనలో బలిసిన అకవిత్వ వైఖరి ఎంత మాత్రం గర్వ కారణం కాదని అంతర్జాతీయ అభ్యుదయ మహాకవులు నొక్కి వక్కాణిస్తున్నారు. మయొకొవిస్కీ, పాబ్లోనెరూడా, లూయీ ఆరగో, పాల్ ఎలార్డు, అలెగ్జాండర్ టోమా, గర్సియా లోర్కా వంటి కవులను ఎవరిని క్షుణ్ణంగా అధ్యయనం చేసినా అచ్చమైన కవితా ధర్మమేదో అవగతం కాకమానదు. ఇంతవరకూ ప్రచలితమవుతున్న శుష్క ప్రచార ధోరణి — ముఖ్యంగా కవిత్వాన్ని నినాదాల బోర్డుగా మార్చే వైఖరి — ఎంత లోప భూయిష్టమో అర్థం కాకపోదు.

ఐతే మన కవిత్వానికి ఈ దారి ఏర్పడ్డం కూడా ఈనాడు కొత్తగా జరిగింది కాదు. గతంలో మూడున్నర దశాబ్దాలకాలంలో మన కవిత్వం ఇదే దారి పట్టింది. ట్రాఫిక్ ఎక్కువైపోవడంతో ఈదారి శిథిలమైంది. గోతులూ గుంటలూ రొచ్చూ దుర్వాసనలతో నిండిపోయింది. అందుకే ఈ దారిని కొత్తశక్తితో పునర్నిర్మించుకోవలసిన అవసరం ఏర్పడుతోంది. ఐతే అలవాటయిన దారినే పడిపోవడం ఎవరికేనా కష్టరహితమే! శ్రమదమాదులకోర్చి అధ్యయనశీలిగా, అభ్యసనశాలిగా మారి పురోగమించే అభ్యుదయ రచయిత నుంచే ఏ ఉత్తమ ప్రయోగమైనా ఆశించగలం. సమస్త దేశాల కవిత్వాలనూ అధ్యయనం చేయని వర్తమాన కవి ఆధునిక ప్రపంచ స్పృహ కలవాడుగా భాసించలేడు. ఉత్తమ కవిగా రూపొందనూ లేడు. ఈ మాట మన రాజశేఖరుడన్నదే అయినా, లేక ప్రపంచ అభ్యుదయ సాహిత్యానికి పితృత్వం వహించే మాక్సిమ్ గోర్కీ అన్నదే అయినా—మనం మన రచయితలకు తలలో ఇల్లు కట్టుకొని మళ్ళీ చెప్పవలసిన కొత్త మాటే!

నిన్నటిదైనా వేయేళ్ళ నాటిదైనా ప్రయోగశీలతకు దూరమయ్యే సంప్రదాయం జడమయమవుతూనే ఉంటుంది. సంప్రదాయాన్ని అంధ విశ్వాసాలతో యథా మాత్రకంగా ఆరాధించే వారి ప్రతిభ నవనవోన్మేషశాలిని కాలేదు. కనుకనే మన కవులనూ రచయితలనూ ఈ సంప్రదాయానుకరణ దోషం నుంచి సంరక్షించుకోవలసిన అవసరం ఉంది. సంప్రదాయ జడత్వం ప్రయోగశాలితను అణచే ఛాయాగ్రహం!

[కాకినాడలో జరిగిన (78 డిసెంబరు 24, 25) ఎనిమిదవ ఆ. ప్ర. అభ్యుదయ రచయితల మహాసభ తొలి సమావేశంలో సమర్పించిన ప్రసంగ వ్యాసం — రచయిత]



దుత్తలో విప్లవం

శ్రీ ములుపూడి ప్రసాదరావు

శరత్పూర్ణిమనాటి వెన్నెలలో
  చల్లని, తెల్లని గిన్నెలలో
గృహలక్ష్మికర పల్లవాలలో
హాయిగా విహరించిన క్షీరం —

పడమట సంధ్యారాగం పాడమగానే
పసిబిడ్డడు ఆవులించగానే
అర్ధ నిమీలిత నేత్రాలతో
అణగారిన ఆశలతో
అనాసక్తంగా ఎక్కింది
ఉరికంబంలాంటి ఉట్టిమీదికి
నల్లని తెరమాటుకి; దుత్తలోనికి.

కీచు కీచు ధ్వనులమధ్య
కప్పల బెక బెకలగోల
కళ్ళు పొడుచుకున్నా కనిపించని
కటిక చీకటిలో
నిట్టూర్చింది నిరాశగా
నినదించిన నిశ్శబ్దంగా.

మ్యావ్ మ్యావ్ మంటున్న బక్కపిల్లి
మూసి తెరుస్తున్న కళ్ళు
చీకటి గుహకు నియోన్ లైట్లు.

ఎక్కడో అట్టడుగు లోయలలో
కల్లోల సాగరం మధ్య
రేగింది విప్లవం

మండింది గుండె
జనించింది ఆశ.

పసిపాప ఏడ్చినప్పుడూ, తమ
పొట్టలలో ఆకలి రగులుకొన్నప్పుడూ
నా సాయంతో తృప్తిపడ్డవాళ్ళు
యిప్పుడిలా బంధిస్తారా? నన్ను
ధూరంచేసి, నాకు సంకెలలు
విధిస్తారా?

ఏమిటి నా నేరం?
దీనికి ప్రతీకారం
విరిగిపోవడమే తక్షణం
అప్పుడే తెలుస్తుంది నా అవసరం!
అని నిర్ణయించిన క్షీరం;
కన్నులెత్తి చూసేంతలో
రానే వచ్చింది సమయం
అరుణారుణ సుమతోరణం
ఉజ్జ్వల తేజోమయ ఉషఃకిరణం.

ఉయ్యేలలో పసిపాపయేడుపు
అంగలతో కన్నతల్లి పరుగు.

కారుచీకటి కబంధహస్తాలలో
ఉరిత్రాళ్ళ ఉట్టిమీద—జీవచ్ఛవంలా
ఊగిసలాడిన క్షీరం
ఊరడిల్లింది ఉషఃకాంత ఒడిలో
ఊపిరి పీల్చుకుంటూ దండిగా, ఆశతో ...

శ్రీ విరించి

మనసు లేని మనసు

శేఖర్ రైలు స్టేషనుకు వెళ్లాడు.

రైలు రావడానికి యింకా ఒక గంట విరామం వుందని తెలిసింది.

గంట విరామం అంటే ప్లాట్‌ఫారమ్‌మీద యిట్టే గడిపి వేయడానికి వీలులేనిది.

రైలు ఆలస్యంగా రావడాన్ని గురించి రెండు విమిషాలు విసుక్కున్నాడు.

ఏం విసుక్కుంటే యేం లాభం?

ఈ రైలు తనకు కావాలనుకుంటే గంటసేపు వేచివుండడం తప్ప యింకో మార్గంలేదు.

ఈ గంటయినా విలకడగా అలాగే వుంటుందని అనుకుందుకు లేదు.

స్టేషన్లో నోటీస్‌బోర్డుమీద మటుకు రాస్తారు:

"ట్రెయిన్స్ ఆర్ లైక్లీటు మేకప్ టైమ్" అని.

ఊరికే రాయడంమటుకే అనుకున్నాడు శేఖర్.

గంట క్రమంగా గంటన్నర అవుతుంది.

ఇంతవరకు అది సహజం.

ఇంకా తాను లేచినవేళ మంచిది కాకపోతే పూర్తిగా రెండు గంటలవుతుంది.

ఎన్ని గంటలయినా వేచివుండడం తప్ప యింకేమీ చేయగలది లేనప్పుడు, యీ ఆలోచనలన్నీ అనవసరం అనుకున్నాడు శేఖర్.

రైళ్లతో అవసరం వున్నప్పుడు వాళ్లను అనుసరించి వెళ్లవలసిందేగాని, మనం చెప్పినట్లు వింటాయా అవి? వాటి యిష్టాను సారమే అవి నడవనప్పుడు యింక మన యిష్టం అంటూ యెక్కడ వుంది?

అందుకనే రైలు ప్రయాణం అంటే భయం పుడుతుంది.

దగ్గర ప్రయాణం అయితే కారు నయం అనిపిస్తుంది.

దూరం అయినప్పుడు రైలుతప్ప యింకో మార్గంలేదు.

ఒకరకంగా చూస్తే—పూర్వకాలంలోలాగ రైళ్లు అంటూ వుండకపోతే యీ ఆలస్యం అవడం అనే బెడద వుండదు. కాని అసలే రైళ్లు లేకపోతే యీ విశాల ప్రపంచంలో బ్రతకడం యెలా?

శేఖర్ ప్లాట్‌ఫారమ్ టిక్కట్టు కొనుక్కున్నాడు.

చిల్లరలేదని బెదిరిస్తే రూపాయి కాగితం కౌంటర్లోనే వదిలేశాడు.

అవును మరి. అసలు టిక్కట్టే యివ్వకపోతే ఆనక ఎంత యిబ్బంది!

ప్లాట్‌ఫారమ్ చిన్నది.

చిటికలో ఒకసారి పచారుచేసి రావచ్చును.

ఇలా ఎన్నిసార్లుచేస్తే రైలు రావాలి?

ఈ దిక్కుమాలిన ఊళ్లో తను వుండవలసిరావడమే గొప్ప దోషం.

దీనికితోడు తన్ను చూడడానికంటూ అప్పుడప్పుడు స్నేహితులు, బంధువులు వగైరా రావడం, వాళ్లకోసం తను స్టేషన్‌కు వస్తూ వుండడం, తను వచ్చినప్పుడల్లా పగబట్టినట్లుగా రైళ్లు ఆలస్యంగా వస్తూవుండడం...యిదంతా గొడవగానే వుంది. కాని దీన్నుంచీ విడివడడం ఎలా? తప్పదు...

ఇదో రకమయిన శిక్ష.

ఇంతకంటె మరేం లేదనుకున్నాడు శేఖర్.

కనుచీకటి పడుతోంది.

స్టేషన్లో గుడ్డిలాంతరు వెలిగిస్తున్నాడు పోర్టర్.

శేఖర్ సిగరెట్ వెలిగించుకున్నాడు.

స్టేషన్ మాష్టర్ గదిలోనుంచి బయటకు వచ్చాడు.

మెడలో ఉత్తరీయం సవరించుకుంటూ గందరగోళంగా ప్లాట్‌ఫారమ్ అంతా కలయచూచాడు ఎందుకో.

సరిగా ఆ సమయానికే శేఖర్ ఆ దగ్గర్లో పచారు చేస్తున్నాడు.

'హల్లో. శేఖర్‌గారు! నమస్తే! రైలుకోసమే వచ్చినట్లున్నారు.'

'నమస్తే, అవునండీ! రైలుకోసమే...'

రైలుకోసం కాకపోతే తన గుడ్లగూబ ముఖం చూడడానికి వచ్చాననుకుంటున్నాడా — స్టేషన్ మాష్టర్?

పైకిమాత్రం మర్యాద కనిపింపచేశాడు.

ఈమాత్రం మర్యాద లేకపోతే ఈ లోకంలో నెగ్గుకురావడం కష్టం.

పాపం, ఈ స్టేషన్ మాష్టరు—శ్రీరాములు. మంచివాడే.

కాకపోతే యితని ముఖం మంచిదికాదు.

అంటే చూడడానికి బాగుండదు. అంతే

'అయితే శ్రీరాములుగారూ! ఈ పూట రైలు వస్తుందంటారా?' అనడిగాడు శేఖర్; ఎందుకయినా మంచిదనే ఉద్దేశ్యంతో.

'అమ్మమ్మ! ఎంతమాట! రైలు రాకపోవడమా? అలా ఎన్నడూ జరగదులెండి. కాకపోతే కాస్తో కూస్తో ఆలస్యంగా వస్తుంది. అంతే' అన్నాడు శ్రీరాములు, నిజమయిన విశ్వాసపాత్రుడి ధోరణిలో.

'అయితే యింతవరకు యెంతలేటు తేలింది?'

'ఎంత? వందనిమిషాలు—అంతే!'

'అట్లాగ? బోర్డుమీద 60 నిమిషాలుఅని వ్రాసివుంది...!'

అందుకనే బయటకు వచ్చా. పాయింట్‌మాన్‌తో చెప్పి దిద్దించాలి. లేటు పెరిగిందని యిప్పుడే వార్త వచ్చింది.'

'భగవాన్!' అన్నాడు శేఖర్ నిరాశగా!

'ఏమిటోనండి! ఒక్కరైలూ టైముకు రావడంలేదు. జనానికి జవాబులు చెప్పలేక చచ్చిపోతున్నాము. ఉద్యోగం కాదుగాని—' అనుకొంటూ శ్రీరాములు మనిషిని వెదుక్కుంటూ వెళ్లిపోయినాడు.

శేఖర్‌కు గట్టిగా నిట్టూరుద్దామనిపించింది.

కాని ధైర్యం చాలిందికాదు.

రైలు అన్నప్రకారం వందనిమిషాలు ఆలస్యంగా వచ్చిన తరువాత కదా తాను 'అమ్మయ్య' అనుకోవలసింది!

శేఖర్ యింటికి వెళ్లిపోదాం అనుకున్నాడు.

రైలు రావడమంటూ యింకో గంట పైచిలుకుమాట.

ఈ లోపల యిక్కడ తారట్లాడడంకంటె యింటికివెళ్లి భోజనంచేసి తాపీగా కునుకుతీసి తీరుబడిగా వస్తే యెలావుంటుంది? అయినా యింకా తన భోజనం సమయం కాలేదు. అదీగాక రెండు మైళ్లదూరం వెళ్లి మళ్లీ యింతదూరం యీ చీకట్లో యీదులాడుకుంటూ రావాలంటే అదేమన్నా సాధ్యమయే పనేనా?

కష్టమో నిష్ఠూరమో యిక్కడ పడివుండడమే మంచిపని.

ఏదో యిట్లాగే ఆలోచించుకుంటూ కాలక్షేపంచేస్తే గంట అనేమాటేమిటి, రెండు మూడు గంటలయినా చులాగ్గా గడిచిపోతాయి.

అప్పుడు రైలు రానే వస్తుంది. అందుచేత అంతవరకు వేచివుండడమే బుద్ధిమంతుని లక్షణం అనిపిస్తుంది.

అప్పటికి బాగా చీకటి పడిపోయింది.

ఆకాశంలో నక్షత్రాలు అక్కడక్కడ అగుపిస్తున్నాయి.

ఆవేళ తిథి యేమిటో శేఖర్‌కు తెలియదు.

కాని వెన్నెలమటుకు యేమాత్రంలేదు.

బయట వెలుగుతున్న గుడ్డిలాంతరు తప్పితే వేరే వెలుగు అనేదిలేదు.

ఈ చీకట్లో, ఈ స్టేషన్లో ఒంటరిగా తను యీ షికార్లు యేమిటి?

ఏమిటో ఒక్కొక్కమారు యిలా తటస్థపడుతుందని మనకు తెలీదు.

కనీసం యిట్లా జరుగుతుందని ఎవరేనా ముందుగా చెప్పినా నమ్మబుద్ధికాదు.

నలుగురయిదుగురు మనుషులు తప్పించి నరసంచారం లేదు.

వాళ్లెవరూ తనకు తెలీదు.

బహుశా వాళ్లకు తను తెలిసి వుండవచ్చు.

వాళ్లది యీవూరే అయితే తనను యెరిగేవుంటారు. ఎరిగితేనేం, ఎరక్కపోతేనేం రైలుమాత్రం సకాలానికి రాదు.

కనీసం అనుకున్న ఆలస్యాని కయినారాదు.

నాలుగయిదు సిగరెట్లు ఒక్కబిగిని పీల్చేశాడు. నోరంతా వెగటుగా, చేదుగా వుంది. పెదవులు బిగిసిపోయాయి. ఏమిటో అలవాటు కానిపనులు చేస్తే యిలాగే వుంటుంది కావును.

శేఖర్ తనలో తను నవ్వుకున్నాడు.

సీత జ్ఞాపకానికి వచ్చింది. ఒక్క జ్ఞాపకానికే అని ఎందుకు? కాస్త నిదానంగావుంటే రైలుబండిలో రానే వస్తుందిగా!

సీతను తలుచుకుని శేఖర్ నవ్వుకున్నాడు.

పిచ్చిపిల్ల.

ఈపిచ్చిపిల్లకోసం తను స్టేషన్‌కు వచ్చాడు.

రైలు ఆలస్యం.

విసుగు.

చీకటి.

అన్నీ భరిస్తూ రైలుకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. రైల్లో వచ్చే సీతకోసం ప్లాట్‌ఫారమ్‌మీద పచార్లు చేస్తున్నాడు.

సీతకోసం తను యిలా స్టేషన్‌కు రావలసి వస్తుందని తనకు తెలీదు.

ఇవాళ ఉదయంవరకూ తెలీదు. అయినా సీత యిలా ఎందుకు రావాలి?

అన్నీ అఘాయిత్యం పనులే చేస్తుంది. రైల్లో ఎందుకు ఒంటరిగా ప్రయాణం?

ఆలస్యంగావచ్చే ఈ రైళ్లలో సీత ఎందుకు ఒంటరిగా ప్రయాణం చేయాలి ?

ఉదయం కాఫీ తాగుతూవుంటే ఎవరో కవరు పట్టుకు వచ్చారు.

సంతకం పెట్టించుకు వెళ్లాడు.

విప్పిచూస్తే సీత నుంచి టెలిగ్రామ్. 'ఫలాన బండిలో ఫలానా వూరు వెడుతున్నాను. నీ ఊళ్లో స్టేషన్‌లో కలుసుకో. మాట్లాడుకుందాం' యిదీ భాష ! ఖర్మ ! ఈ ఊళ్లో రైలుబండి రెండు నిమిషాలు ఆగుతుంది. ఈ రెండు నిమిషాలలో సీత తనతో యేం మాట్లాడుతుంది? సీతతో తనేం మాట్లాడతాడు? కంపార్ట్‌మెంటు వెదుక్కునేసరికి పుణ్యకాలం కాస్తా పూర్తి అవుతుంది. ఒక్కోసారి, అందుకూ్కడా అవకాశం లేకపోవచ్చును బోలెడన్ని పెట్టెలున్న రైలుబండిలో ఎక్కడని వెదకడం ? ఎలా వెదకడం ?

తన భయాలన్నీ తనకే !

సీత అఘాయిత్యం మనిషి. తంతి యిచ్చింది. వెళ్ళకుండా ఎట్లా? చూడకుండా ఎట్లా? మాట్లాడకుండా ఎట్లా?

టెలిగ్రాం అందుకున్నప్పటి నుంచి తనకు సీతను గురించే ఆలోచనలు. వేరే యే ఉద్యోగము లేనట్లు ఒక్కటే ఆలోచన. అది మొదలు ఎట్లా అయిందో అర్థంకాదు. ఆఖరు అవదు. ఈ ఆలోచనకు ఒక స్వరూపం కూడా వున్నట్లు లేదు. ఒట్టి వెర్రిఆలోచన. వెర్రి మొర్రి ఆలోచనలు తప్ప తనకు యింతకంటే వేరే వ్యావృత్తి లేదు.

నిజానికి సీత తనకు యేమిటి ?

గట్టిగా చెప్పాలంటే యేమిటీ కాదు. స్నేహితురాలు. అంతే. కాలేజిలో చదువుకునేటప్పుడు పరిచయస్తురాలు. అంతవరకే.

తను అంతవరకే అనుకుంటున్నాడు. అంతకంటే తనకేం తెలియదు. కనీసం తెలియదని అనుకుంటున్నాడు.

సీతకు యింకా చాల తెలుసునని తనకు అప్పుడప్పుడు అనిపిస్తుంది.

'వెన్నెట్లో కూర్చున్నప్పుడు యెప్పుడూ యిలాగే వుండిపోతే యెంత బాగుంటుంది' అంటుంది సీత. కాని తనకు మట్టుకు భయం.

భోజనం...నిద్ర...యివన్నీ ఎట్లా ?

ఊరికే వెన్నెల్లో కూర్చుంటే తన భోజనం, తన నిద్ర యేమయిపోతాయి ? ఎట్లా తనకు నిద్ర లేకపోతే? సీతకు యివన్నీ యేమీ తట్టవు.

చెప్పినా అర్థం చేసుకోదు.

ఇవన్నీ తుచ్ఛమయినవిట !

ఏం మాట ?

భోజనం తుచ్ఛమయినదంటే తను ఒక్కనాటికీ నమ్మడు.

అయినా ఆ పిల్లతో గొడవ పెట్టుకోవడం యిష్టంలేదు.

పోనీలే. ఇష్టం వచ్చినట్లే అనుకోనీ !—అని ఊరుకున్నాడు.

ఇట్లా అనేక సందర్భాలు. తనకు యిదంతా గొప్ప విషయం కాదు.

ఊరికే రోజులు గడిచిపోతున్నాయి. తనక్కావలసింది అంత వరకే.

కాలం గడిచిపోవటానికి యేదో ఒకటి చేయాలి.

ఎవరితోనయినా మాట్లాడుతూవుంటే కాలం యిట్టే గడిచిపోతుంది. మనకు తెలియకుండానే ముందుకు నడిచిపోతుంది. కాని ఎవరితో మాట్లాడడం ? ఎవరున్నారు ? ఎవరున్నారు తనతో యిష్టాగోష్టి చేయడానికి ?

స్టేషన్ మాష్టర్ శ్రీరాములు—ఎంతసేపూ రైళ్లలో రద్దీని గురించి,తన ఉద్యోగం గురించి — తను కాబట్టే యిన్నాళ్ళుగా దానిని నిలుపు కుంటూ వస్తున్నాననీ ఊః చెప్పకుపోతాడు. పెద్దవాడు యేదో చెబుతాడు— అనే ధోరణిలో వినవలసిందే తప్ప యింతకంటే తనకేం 'యింటరెస్ట్' వుండదు.

నిజానికి అసలు విసబుద్ధే కాదు.

అంతకన్నా కాలక్షేపం కోసం యెవరితోనన్నా పోట్లాట పెట్టుకోవడం మేలు.

అట్లా పోట్లాడదామనుకున్నా యింకా ఎవరున్నారు ?

ఉన్నవాళ్లు నలుగురూ తనతో పోట్లాడరు.

తను కావాలని గిల్లి కజ్జా పెట్టుకున్నా ... 'పోనీలే, మతి చలించిందేమో, తెల్లవారేసరికి మామూలు మనిషి అవుతాడు' అనుకుని తమదారిని తాము వెడతారు. అందుచేత ఇదేమీ ప్రయోజనం లేదు.

అమ్మయ్య—అనుకున్నాడు శేఖర్.

ఇంతవరకు కాలక్షేపం చేసింది ఒకఎత్తు. ఇప్పుడు జరగబోయే సమయం ఒక ఎత్తు. నిజానికి సీతతో తను మాట్లాడే 'ఒక్క నిముషం' ఒక ఎత్తు; మిగతా టైమంతా ఒక ఎత్తు కావచ్చును.

కాని—చీకటిలో, కాస్త కూస్త చలిలో ఒంటరిగా తను యిక్కడ వుండడమే ఒక పెద్ద ఎత్తు!

శేఖర్ ప్లాట్‌ఫారమ్ మళ్లీ ఒక్కమారు చుట్టి వచ్చాడు.

దూరంగా స్తంభం దగ్గర ఎవరో భోజనం చేస్తున్నారు.

పులుసు వాసన ఘాటుగా కొడుతోంది.

ఇంతసేపూ నిద్రపోతున్న ఆకలంతా ఒక్కమారు పైకి వచ్చింది.

ఒక్క అరగంట ఆగాలి.

ఆ తరువాత యింటికివెళ్లి హాయిగా భోజనంచేసి వేపచెట్టు గాలి కింద నులక మంచంమీద మేను వాల్చుకుని ... మళ్లీ అరుణోదయం అయ్యేవరకూ నిద్రపోవచ్చును.

శేఖర్‌కు మెళుకువ వచ్చి గడియారం చూచు ఎనిమిది గంటలయింది.

అబ్బ. అప్పుడే ఎనిమిది అయింది.

పక్కమీద నుంచి లేవబుద్ధి కాదు.

ఇట్లాగే ఎంతసేపయినా పడుకోగలిగితే బాగుండు కుదరదు.

తెల్లవారిన తరువాత బోలెడన్ని పనులు

ఎంతకూ తెమలని పనులన్నీ చేయడానికి తను ఆరు గంటలకే లేవవలసి ఉంది.

అప్పుడే ఎనిమిది గంటలయిపోయింది.

ప్రయత్నంమీద శేఖర్ లేచి కూర్చున్నాడు.

రెండు మూడు క్షణాలు కళ్లు మూసుకుని ప కూర్చున్నాడు.

ఈ కొద్దిసేపట్లో అతని మనస్సు ఖాళీగా వుంట

నిరామయంగా, మనసును విశ్రాంతిగా వుంచడం కొన్ని సంవత్సరాల నుంచి అభ్యాసం చేసుకున్నాడు. తరు నిలుచున్నాడు.

అమ్మయ్య—అనుకున్నాడు శేఖర్.

ఇంతవరకు కాలక్షేపం చేసింది ఒకఎత్తు. ఇప్పుడు జరగబోయే సమయం ఒక ఎత్తు. నిజానికి సీతతో తను మాట్లాడే 'ఒక్క నిముషం' ఒక ఎత్తు; మిగతా ప్రేమంతా ఒక ఎత్తు కావచ్చును.

కాని—చీకటిలో, కాస్త కూస్త చలిలో ఒంటరిగా తను యిక్కడ వుండడమే ఒక పెద్ద ఎత్తు!

శేఖర్ ప్లాట్‌ఫారమ్ మళ్లీ ఒక్కమారు చుట్టి వచ్చాడు.

దూరంగా స్తంభం దగ్గర ఎవరో భోజనం చేస్తున్నారు.

పులుసు వాసన ఘాటుగా కొడుతోంది.

ఇంతసేపూ నిద్రపోతున్న ఆకలంతా ఒక్కమారు పైకి వచ్చింది.

ఒక్క అరగంట ఆగాలి.

ఆ తరువాత యింటికివెళ్లి హాయిగా భోజనంచేసి వేపచెట్టు గాలి కింద నులక మంచంమీద మేను వాల్చుకుని ... మళ్లీ అరుణోదయం అయ్యేవరకూ నిద్రపోవచ్చును.

శేఖర్‌కు మెళుకువ వచ్చి గడియారం చూచుకునేసరికి ఎనిమిది గంటలయింది.

అబ్బ. అప్పుడే ఎనిమిది అయింది.

పక్కమీద నుంచి లేవబుద్ధి కాదు.

ఇట్లాగే ఎంతసేపయినా పడుకోగలిగితే బాగుండును. కాని కుదరదు.

తెల్లవారిన తరువాత బోలెడన్ని పనులు

ఎంతకూ తెమలని పనులన్నీ చేయడానికి తను పొద్దున్నే ఆరు గంటలకే లేవవలసి ఉంది.

అప్పుడే ఎనిమిది గంటలయిపోయింది.

ప్రయత్నంమీద శేఖర్ లేచి కూర్చున్నాడు.

రెండు మూడు క్షణాలు కళ్లు మూసుకుని పక్కమీదవే కూర్చున్నాడు.

ఈ కొద్దిసేపట్లో అతని మనస్సు ఖాళీగా వుంటుంది.

నిరామయంగా, మనసును విశ్రాంతిగా వుంచడం, అతను కొన్ని సంవత్సరాల నుంచి అభ్యాసం చేసుకున్నాడు. తరువాత లేచి నిలుచున్నాడు.

తలుపు తీసుకుని దొడ్లోకి వెళ్లాడు.

పనిమనిషి సిమెంట్ తొట్టినిండా నీళ్లు పెట్టి రేకుమూత పడేసి వెళ్లిపోయింది.

హాయిగా ముఖం కడుక్కుని స్నానం చేయవచ్చును.

ఈరోజు చేయవలసిన పనిని మననం చేసుకున్నాడు.

ఈరోజు యేమీ ప్రత్యేకించి పనిలేదు.

ఒకరోజు మటుకు గొప్పగా చెప్పుకోతగ్గ పనేం వుంది?

స్నానంచేసి ముందు గదిలోనికి వచ్చి కూర్చున్నాడు.

బట్టలు వేసుకున్నాడు.

ఎటన్నా వెడదామా అనిపించింది. మామూలు ధోరణిలో యిలా అనిపించినా నిజంగా వెళ్లదలుచుకుంటే మటుకు, యీ కుగ్రామంలో — మహానగరంలో — ఎలా వెళ్లేట్లు ?

ఊరంతా చుట్టిరావటానికి అరగంట పట్టదు.

పనిమనిషి వచ్చింది.

'అయ్యగారూ !'

ఏం అన్నట్లు చూచాడు.

'కాఫీ తెమ్మంటారా ?'

'ఊఁ.'

లోపలకు వెళ్ళింది.

ఫ్లాస్కు తీసుకుంది.

డబ్బుకోసం నిలబడింది. శేఖర్ పర్సుతీసి యిచ్చాడు.

పనిమనిషి వెళ్లిపోయింది.

కాఫీ తాగాలని నియమం లేదు.

కాని పనిమనిషి వచ్చి అడిగింది గనుక తెప్పించుకోవడం !

రోజూ యిలారాదు.

ఇవాళ ఎందుకో తనమీద దయకలిగినట్లుంది. ఎందుకో ?

పనిమనిషి కాఫీ తెచ్చి యిచ్చింది.

ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో పోసుకున్నాడు.

చప్పరిస్తున్నాడు.

పనిమనిషి వెళ్ళిపోలేదు.

అడ్డదిడ్డంగా పడివున్న పుస్తకాలు, గుడ్డలు వాటి వాటి స్థలాల్లో సద్దుతోంది.

తన ధ్యాసలో తను కాఫీ తాగుతున్నాడు.

పానకం. శ్రీరామనవమి గుర్తువచ్చింది.

పనిమనిషి గది ఊడవడం అయింది.

చీపురు తలుపుమాటున వోరగా వుంచింది.

'వెడుతున్నాను అయ్యగారూ' అంది.

'ఊఁ.'

'అయ్యగారు యివాళ ఆలస్యంగా లేచారు' అంది.

'ఊఁ.'

'దోమల బాధకు రాత్రి నిద్ర పట్టలేదు కాబోలు.'

'ఉహు. రాత్రి స్టేషన్‌కు వెళ్లాను. ఆలస్యం అయింది. అందుకు—'

'చుట్టాలు ఎవరయినా వచ్చారా ?'

'ఉహు. రైల్లో ఊరికివెడుతున్నారు. చూడడానికి వెళ్లాను.'

'అమ్మగారు వచ్చారేమో అనుకున్నాను...అమ్మగార్నిఎప్పుడు తీసుకొస్తారు ?'

'అమ్మగారెవరు?' — గతుక్కుమన్నాడు.

పనిమనిషి ముఖంలోకి చూచాడు, లోతుగా సూటిగా.

ఆ మనిషి ముఖం నవ్వుతో నిండివుంది.

పువ్వులా విచ్చుకుని వుంది.

ఆ ముఖం చూచాక శేఖర్‌కు ప్రశ్న అర్థం అయింది.

సిగ్గు అనిపించింది.

ఈ మనిషి యేమనుకుంటోంది ?

తనకు పెళ్లి అయిందనుకుంటోంది ?

తను యివాళో రేపో తన పెళ్లాన్ని యిక్కడికి కాపురానికి తీసుకువస్తాడనుకుంటూంది, ఇంకానయం. తనకు పిల్లలుగూడా వున్నారనుకుంటూందేమో !

ఎట్లా చెప్పాలి, యీ పనిమనిషికి తనను గురించి?

ఏమని చెప్పాలి?

అయినా యీ మనిషికి లేనిపోని ఆరాలన్నీ యెందుక్కావాలి?

ఇంతకూ తను ఆలస్యంగా లేవడం యీ ప్రశ్నలన్నిటికీ కారణం.

'నాకింకా పెళ్లికాలేదు' అన్నాడు ముఖం కిందకు దించుకుని.

పనిమనిషి ముఖంలో ఆశ్చర్యం నిండింది.

శేఖర్ అటు చూడడంలేదు.

'నిజంగానా— అయ్యగారూ?' అన్నమాటలు వినిపించాక శేఖర్ ఉలిక్కిపడ్డాడు.

తన మాటలు అబద్ధం అని యీ మనిషి ఎందుకు అనుకుంటూంది ?

తన ముఖం అబద్ధాలు చెప్పేవాడిలాగ అనిపిస్తోందేమో!

తన ముఖం ఎలావుందో తనకు కనిపిస్తే బాగుండును.

పనిమనిషి ముఖంలోనికి చూచాడు.

అంత విచిత్రంగాలేదు.

మామూలుగానే వుంది.

అందులో పరిపరివిధాల ప్రశ్నలులేవు.

'ఇంకా చేసుకోలేదు—' అన్నాడు మళ్ళీ తలదించుకుని.

'పోనీలెండి. ఈ సంవత్సరం చేసుకుంటారా?' అనడిగింది—అమాయకంగా.

'ఊ—చూడాలి.'

'తప్పకుండా చేసుకోండి అయ్యగారూ. అమ్మ లేకపోతే యింటికి శోభలేదు. ఆమెవుంటే యిల్లంతా చక్కగా అమర్చి పెడతారు—'

శేఖర్ మామూలుగా విన్నాడు.

కాని పనిమనిషి యిన్నిమాటలు యెందుకు చెబుతోంది?

'ఇంకా పోదేం?' అనుకున్నాడు.

బల్లమీద వున్న 'పేపర్' తిరుగవేస్తున్నాడు.

విన్నటిది.

ఈ ఊళ్ళో సాయంత్రం నాలుగు గంటలగ్గాని పేపరురాదు.

తన ఊళ్ళోకంటే యిరవయినాలుగు గంటలు ఆలస్యంగా వార్తలు అందుతాయి యిక్కడికి.

ఈ విచిత్రమయిన వాతావరణంలో యిక్కడ యేమిటో తమాషాగా కొన్నాళ్ళు గడపాలని వుందితనకు. తప్పదు.

పనిమనిషి 'నేను వెడుతున్నాను' అంది.

ఈసారి నిజంగానే కదిలివెళ్ళింది.

శేఖర్ యీ విషయం అంతగా పట్టించుకోలేదు.

పనిమనిషి వెళ్ళిపోయిన తర్వాత ఆ మనిషి గురించి ఒకతెరగా ఆలోచన వచ్చింది.

పాపం, యిరవై—యిరవైరెండు వుంటాయేమో !

ఏ కులస్తులోగాని చూడడానికి ముచ్చటగా ఎర్రగా బాగానే వుంటుంది.

కాని అనవసరంగా యెందుకో మాట్లాడుతోంది యివాళ.

తన పని తను చేసుకుపోతే చాలు.

పనిమనిషి కబుర్లు చెప్పనక్కర్లేదు.

తన యోగక్షేమాలు విచారించనవసరంలేదు.

శేఖర్ విసుక్కున్నాడు. ఎప్పుడయినా తను యీ సంగతులన్నీ విచారించాడా?

తనకేం అవసరం?

తను అనవసరంగా ఒక్కమాటయినా అడతాడా? లేదు.

పోనీలే—యేదో అడిగింది—చెప్పాను.

కొత్త మనిషి గనుక ఆరాతీసింది.

అంతే అని సమాధానం చెప్పుకున్నాడు శేఖర్—అంతే.

అంతటితో ఆ విషయం వదిలివేయాలనుకున్నాడు.

అనవసరం అయిన వాటికి ప్రాధాన్యం యిచ్చి బాధపడడం ఎందుకు?

మనస్సంతా వ్యధ చేసుకోవడం ఎందుకు ? లేనిపోని పని.

తొమ్మిది గంట లయింది.

తనకింకా గంటన్నర టైం వుంది.

భోజనం చేయడం, బడికి వెళ్ళడం – —యివే పన్లు.

సాయంత్రం దాకా కాలం ఎట్లా గడుస్తుందన్న ప్రశ్నలేదు.

ఐదు గంటల దాకా యిబ్బంది లేదు.

ప్రపంచంలో తనవంటి అదృష్టవంతులు యెందరోవుండరు.

ఏమిటో,రోజులు సజావుగా యే బాదరబందీలేకుండా దొర్లిపోతున్నాయి. అంతా సక్రమంగా జరిగిపోతోంది.

గడ్డుతనం లేకుండా నింపాదిగా సరసంగా దొర్లిపోతోంది కాలం.

నిజానికి యింతకంటే కావలసింది యేముంది ?

ఎవరుమటుకు యింకేం కోరుకుంటారు ?

అందరిసంగతీ తనకు తెలియదు. అందరి విషయమూ తను వకాల్తా పుచ్చుకోలేదు. తన విషయం మటుకు క్షుణ్ణంగా తెలుసు.

ఎంతవరకు తెలుసు ?

ముందుమాత్రం ప్రత్యేకించి విశేషంగా చెప్పుకోవలసింది యేముంది ?

ఏమీ యిబ్బంది వుండదు — అనుకున్నాడు శేఖర్.

ఆలోచించుకుంటూ వుంటే కళ్ళు బరువుగా తోస్తున్నాయి.

కళ్ళు నిజంగానే బరువుగా వున్నాయి.

ఎందుకని ? నిద్ర లేక.

రాత్రంతా దాదాపు జాగారం చేయవలసి వచ్చింది.

అవును. సీత కోసం.

స్టేషన్‌కు వెళ్లడంవల్ల ఆలస్యం అయింది.

సీతను తలుచుకుంటే జాలివేస్తుంది.

వెర్రిపిల్ల—అనిపిస్తుంది.

ఏమీ తెలీనిది. ఎలా బతుకుతుంది ? అని కూడా అనిపిస్తుంది.

ఆ ! అవును ! ఇప్పుడు గుర్తుకు వచ్చింది.

రాత్రి రైల్లో తను సీతను చూచాడు.

టెలిగ్రాం యిచ్చినందుకు స్టేషన్‌కు వెడితే—రైలు ఆలస్యంగా రావడం—దాని కోసం తను ప్లాట్‌ఫారమ్‌మీద పచార్లు చేయడం. చివరకు రైలు రావడం— ఓ పెట్టెలో నుంచి సీత కేకవేయటం—ఇద్దరూ రెండు నిమిషాలు మాట్లాడుకోవడం—అంతా వరసగా గుర్తుకు వచ్చింది.

ఇదంతా జరిగి ఎన్నాళ్ళయింది ?

కనీసం ఒక శతాబ్దం అయినా అయివుంటుంది అనిపించింది శేఖర్‌కు. ఛ...కాదు రాత్రేగా. ఇంకా యిరవయినాలుగు గంటలయినా కాలేదు. అప్పుడే యివన్నీ చెరిగిపోయిన సంఘటనలలా అనిపిస్తున్నాయే?

రాత్రేగా సీత తనతో మాట్లాడింది.

ఆ మాటలు రెండూ చెవిని వేసుకుని యింటికి వచ్చి చేరుకున్నాడు. హాయిగా మంచం మీదకు చేరి కునుకుతీశాడు. తెల్లవారి తొమ్మిది గంటలకు లేచాడు. ఇదీ జరిగింది !

ఇంతలో ఈ విషయాలన్నీ యెలా మరుపుకు వచ్చినాయి ?

నిజంగా మరుపేనా? అసలు జరగనేలేదా ? అంత మతిమరుపు వుంటుందా ?

అబ్బే ఇదంతా భ్రమేమో! ఊరికే అనుకుంటున్నాను, అంతే. ఈ ఊళ్లో సీత ఎలా కనిపిస్తుంది ?—అనుకున్నాడు శేఖర్

బల్లమీద టెలిగ్రాం.

రాత్రి రైలు. కళ్లబరువు. అవును.

రాత్రిరైల్లో సీత వెళ్లిన మాట నిజమే. రెండునిమిషాలు మాట్లాడుకున్నారు.

సీత యేం చెప్పింది ?

ఏమిటో గొడవగా చెప్పింది. వివరంగా అడిగితెలుసుకుందు కయినా తన కంత విరామం ఎక్కడ వుంది గనుక ? ఊరికే చిత్తరువులా వుండి విన్నాడు. అంతే.

సీత యిదివరకు అలాగే వుంది.

తనను చూడగానే నవ్వింది.

'ఏం మేష్టారూ కులాసాగా వున్నారా?' అంది ముందుగానే తను.

'ఆ ! నువ్వు ?' అన్నాడు చిరునవ్వు చిందిస్తూ.

'కనపడడంలా? ' అంది సీత.

వెంటనే 'ఇంతకూ మాష్టారూ ఎలావుంది ఈఊరు? అంది.

'బాగానే వుంది. నాకు ఎక్కడయినా ఒకటే' అన్నాడు.

సీత మళ్లీ 'నన్ను మరచి పోయారా ?' అంది.

'టెలిగ్రాం యిచ్చావుగా అందుకు వచ్చాను' అన్నాడు శేఖర్.

'రైలు అట్టేసేపు ఆగదు. అందుకని నిన్ననే ఉత్తరం వ్రాశాను. రేపు టపాలో మీకు అందుతుంది. సావకాశంగా చదువుకోండి. ఇంతకూ నేను వెళ్ళి పోతున్నాను మేష్టారూ. మళ్లీ మనం ఒకళ్ల నొకళ్లం చూచుకుంటామో లేదో. చివరిసారి నాకు సెలవు యివ్వండి' అంది.

తనకేం అర్థం కాలేదు.

అయినా 'అట్లాగేలే సీతా. ఎక్కడున్నా ఉత్తరాలు రాస్తు వుండు. మళ్ళీ ఎక్కడోక్కడ కలుసుకోకుండా వుంటామా? ' అంటూ జవాబు చెప్పుతున్నాడు తను.

ఇంతలో రైలు కూత వేసింది.

ఇంజను ముందుకు నడుస్తోంది.

రైలుపెట్టెలన్నీ ఒకదాని వెనుక ఒకటి బిరబిర ముందుకు వెడుతున్నాయి. తను ప్లాట్‌ఫారమ్‌మీద మిగిలిపోయాడు.

సీత కిటికీ లోంచి తల ముందుకు పెట్టి కుడిచేయి ఊపుతోంది.

తమా చేయి పైకెత్తాడు.

ఒక్క నిమిషం.

సీత మాయమయింది.

ప్లాట్ ఫారమ్ ఖాళీ అయింది.

తను యింటికి వెళ్ళిపోయాడు.

ఇప్పుడంతా గుర్తుకు వచ్చింది. ఏమిటో సీత తత్వం. మొదటినుంచి అంతే. ఒట్టి అడవి గొడవ. ఏమీచెప్పదు. చెయ్యదు ఒక వేళ యేదయినా చేసినా తనకు అర్థంకాదు.

ఇవాళ టపాలో ఉత్తరం వస్తుందట.

ఈ సంగతి చెప్పటానికేనా తనను రాత్రిపూట యింత యాతన పెట్టి పిలిపించింది!

ఉత్తరం వస్తుంది కద, ఫరవాలేదు.

వెంటనే జవాబువ్రాసి పడేయాలి.

వ్రాసిపడేస్తే మళ్లీ ఉత్తరం వచ్చే వరకూ తనకేమీ బెంగ వుండదు. తనకేమీ బాదరబందీ వుండదు.

శేఖర్ బయలు దేరాడు.

అద్దంలో ఒకమారు ముఖం చూచుకున్నాడు.

బాగానే వుంది· చొక్కా సవరించుకున్నాడు.

హోటలుకు వెళ్లి నాలుగు మెతుకులు నంజాడు.

ఏమిటో ఆ హోటలు ; ఆ లోకం.

ఎంతసేపూ ఆవకాయ, చింతకాయ పచ్చడి తన హోటలులో అనవరతమూ పంచిపెడుతూ వుంటానని మేనేజరు ఒకటేవాగుడు.

ఆ రెండూ వుంటే యింటిదగ్గర భోజనం చేసినట్లే వుంటుంది గనుక, అందరూ తన హోటలుకే వస్తారంటాడు. వాడిబొంద. వాడి కబుర్లు వింటూవుంటే ఎక్కడలేని అసహ్యం పుట్టుకు వస్తుంది — తనకు.

భోజనం అయిందనిపించుకుని కిళ్లీనములుకుంటూ బడికి వెళ్ళాడు. హెడ్‌మాస్టర్ వక్ర్యం పీటుస్తూ తనవేపు వంకరగా చూచాడు.

'గుడ్‌మాణింగ్' అంటూ పుస్తకంలో సంతకం పడేశాడు తను.

వెనక్కు వెళ్లిపోతూంటే జవాను 'సార్-సార్' అంటూ దగ్గరకు వస్తున్నాడు.

శేఖర్ వాడిని చూచాడు.

'మీకో ఉత్తరం సార్ — ' అంటూ కవరు అందించాడు.

శేఖర్ తాపీగా చిరునామా పరిశీలించాడు. తనదే.

తిన్నగా జేబులో వేసుకున్నాడు.

క్లాసుకి వెళ్లిపోయాడు.

పిల్లలకు పాఠం చెప్పడంలో మునిగిపోయాడు

రెండు పీరియడ్లు గడిచిపోయి, మూడోగంట కొట్టారు.

ఇప్పుడు శేఖర్‌కు యేమీ క్లాస్ లేదు.

స్టాఫ్ గదిలోనికి వెళ్లాడు.

ఒక్కడే అక్కడ. ఏవో న్యూస్ పేపర్లు బల్లమీద పడి వున్నాయి.

వాటిని పక్కకు నెట్టివేశాడు.

హాయిగా కుర్చీలో మేను వాల్చాడు.

జేబులోనుంచి ఉత్తరం తీశాడు.

కవరు చింపాడు. సీత రాసిన ఉత్తరమే. సందేహం లేదు.

అబ్బ చాల పేజీలు వుంది ఉత్తరం.

ఇంత ఉత్తరం ఎంత ఓపికగా వ్రాసింది !— అనుకున్నాడు.

అయినా పిచ్చిగాని యింత ఉత్తరం యేమిటి — చేదస్తం మనిషి. నిన్ననేగా కనిపించింది. ఇంతలో ఉత్తరం ఎందుకు ?— అనుకున్నాడు.

పదహారు పేజీలు.

చదవడానికయినా చాల ఓపిక కావాలి. సీత రాసిన ఉత్తరం.

చదవకపోతే యేమనుకుంటుందో, పోనీ, ఓపికగా చదువుదాం, అనుకున్నాడు.

మొదలెట్టాడు.

ఏమిటో గొడవ.

ఒక్కటీ అర్థం కాదు.

అసలు ఉత్తరాలు రాసే భాష అంటూ ఒకటి ఉందేమో, ఆ భాష తనకు రాదేమో అనుకున్నాడు.

ముఖ్యంగా సీతరాసే ఉత్తరాలు తనకెప్పుడూ అర్థం కావు.

ఏదో గందరగోళంగా వుంటాయి.

అయినా తప్పదుగా !

ఓపికగా చదువుకు పోతున్నాడు.

మనసుకు ఎక్కడం లేదు.

అక్కడక్కడ కాస్త సులభంగా వుంది.

పేజీలు తిరుగవేశాడు.

ఉత్తరం అయిపోయింది.

శేఖర్‌కు యేమీ అర్థం కాలేదు.

ఇన్ని పేజీల ఉత్తరంలోను తనకోసం, తనకు అర్థం అవడం కోసం ఒక్కటయినా మాట లేదా ?

మళ్లీ మొదలుపెట్టాడు.

మధ్య మధ్య బాగా కనిపిస్తున్న ముక్కలు బిగ్గరగా చదువుకోసాగాడు.

"మీరు మారతరేమోనని చాలకాలం చూచాను. నా శ్రమంతా వృధా. నా ప్రయాసంతా వ్యర్థం అయింది. మీరు నాకు అర్థం కారు. నన్ను మీరు అర్థం చేసుకోలేరు —

'వేసెన్నో ఆశలు పెట్టుకున్నాను. అవన్నీ మీరు తీరుస్తారని తలపోశాను. ఇదేమీ మీ కర్థం కాదు. నన్ను సరిగ్గా చెప్పనివ్వరు. అప్పుడప్పుడు మీకు యివన్నీ చెప్పినా మీరు పట్టించుకోరు—

'ఎన్ని సంవత్సరాలు యిలా మీ కోసం కనిపెట్టుకు వుండేది ? మీనుంచీ ఒక్కమాట, ఒక్క పలుకు, ఒక్క ఓదార్పు వస్తుందేమోనని ఎంతకాలం యిలా చిన్నపిల్లలాగ కాచుకుని కూర్చోను ? నాకేం కావాలో మీకు తెలియదు. మీకేం కావాలో మీకు తెలియదు —

'మొదట్లో నేను యిదంతా భ్రమేమో అనుకున్నాను. మీరు నిజంగా పరిపూర్ణులు, పైకి తేలరు — అనుకున్నాను. సమయం వచ్చినప్పుడు మీరే ఆ ముక్క కాస్తా అంటారు — అని ఆశపెట్టుకున్నాను. ఆ సమయం ఎప్పుడు వస్తుంది ? ఈ జన్మకు రాదేమో ననుకుంటున్నాను—

'మీరు నన్ను మరచిపోలేదు. అందుకు మాత్రం థాంక్స్. కాని మిమ్మల్ని నేను మరచిపోలేకుండా వున్నాను. అలా మరచిపో గలిగితే బావుండును. భగవంతుడిని కోరుతున్నాను. ఎలా జరిగినా మీకు ఒకటే. కనుక మీరు కోరవలసింది యేమీలేదు.

'నన్ను మీరు అన్యాయం చేసినందుకు నాకేం కోపం లేదు. ఇలా నిష్ఠూరాలు వ్రాస్తున్నానని మీరేం మరోరకంగా అనుకోకండి. నాకు యింతే ప్రాప్తం — అని సరిపెట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నాను. అంతే !

'ఇంతవరకూ నిరీక్షణలో గడిపిన యీ జీవిత కాలాన్ని మరో మలుపుతిప్పి కనీసం చేరువలో వున్న సుఖాలనయినా అనుభవ యోగ్యం చేసుకుందామని నిశ్చయించుకున్నాను. క్షమించండి. మిమ్మల్ని మరచిపోతున్నాను.

ఋణం వుంటే యింకెప్పుడయినా ఉత్తరం వ్రాస్తాను."

... ...

ఇలా ముగిసిపోయింది ఉత్తరం.

మొదటి మాటు చదివినప్పుడే బాగుంది. అప్పుడసలేమీ అర్థం కాలేదు. ఇప్పుడు ఇదేదో కాస్త అక్కడక్కడా అర్థం అయినట్లూ కానట్లూ వుంది.

సీత తనను యేమంటోంది ?

ఏమిటో కోప్పడుతోంది.

ఎందుకనో ఉత్తరం రాయనంటూంది. ఇంక మరచిపోతానంటోంది.

మొదటి నుంచి తనకు తెలుసు సీత వొట్టి అఘాయిత్యం మనిషని !

ఏమిటో రాస్తుంది.

ఏమిటో చేస్తుంది.

తనకు యీ గొడవలన్నీ యెట్లా తెలుస్తాయి ?

శేఖర్ ఉత్తరం మడిచి కవర్లో వుంచి చొక్కా జేబులో వేసుకున్నాడు.

ఇంతలో గంట మోగింది.

ఈ పీరియడ్ తనకేదో క్లాసు వున్నట్లుంది.

వెళ్లాలి — అనుకున్నాడు.

స్టాఫ్ రూం దాటి బయటకు నడిచాడు.

అతని మనసు క్షణాలపాటు మళ్లీ నిర్లిప్తంగా తయారయింది.

తుఫాను బాధితుల

పునరావాసానికి నిరంతర కృషి

1979 మే **12**న కోస్తా ఆంధ్ర జిల్లాలను తాకిన పెను తుఫాను అనేక మంది ప్రాణాలు బలిగొన్నది. మరణించిన వారి సంఖ్య **600** వరకు వుంది. సంభవించిన ఆస్తినష్టం రు. **681** కోట్లుగా అంచనా వేయబడింది. యుద్ధప్రాదిపథకస్తై, పునరావాసం, సహాయ కార్యక్రమాలు నేడు చురుకుగా సాగుచున్నాయి.

సహాయ కార్యక్రమాలకు యిప్పటివరకు రు. **853-48** లక్షలు వెచ్చించడం జరిగింది.

12,386 టన్నుల బియ్యం, **5** లక్షల ధోవతులు, చీరలు, తుఫాను భాధితులకు పంచడం జరిగింది.

ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో రైతులకు తిరిగి పంటలు వేయ డానికి రు. **17.83** కోట్ల రూపాయలు ఋణాలు పంచబడినవి.

ప్రథమ దశలో ఒక లక్ష గృహాలు కోస్తా తీరం వెంబటి రు. **25** కోట్ల వ్యయంతో నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో నిర్మించుటకు చర్యలు తీసుకొన బడినవి.

సమాచార, పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదు.

సముద్రం!... సముద్రం!!

శ్రీ సోమసుందర్

దిగంతాల కావల మెరిసే పిలిచే
కన్నుల మూగ సైగలకు తాళలేక సాగరం
పెడుతోంది ఘోష—నిరంతరాయంగా!
ఓర్వలేని జలధి ఆర్తారవ ఘోషకు
ప్రసరిస్తోంది అనునయంగా
దయాహృదయిని చంద్రిక —
శీతల కరుణామృత వర్షిణి!

కాలం ఘనీభవించిన కాంక్ష ...
తీరం సైకతరూపం ధరించినదీక్ష ...

ఎన్నెన్నో చుక్కలు ముక్కలు ముక్కలై
అక్షీణ బింబ సమాహారమై
కడలి గళాన వ్రేలుతున్నాయి దిక్కులేక!
ఒంటరిగా నిలచి సాగరాన్ని
కాపలా కాస్తున్న నీరవ క్షణాలు
రగిలే మంటల్లా విఱ్ఱవీగుతూ —
చలి భవితవ్యాన్ని నిరోధిస్తూ—

నిరంతర చంచలత్సముద్రం
వాలో నిలుపుతుంది నిశ్చల ముద్రలు ...
చిరనిద్రా వివశమైన పర్వతం మాత్రం
గంభీరంగా నిలచిన దారుఢ్య గురుత్వం...

2

ఇంతకాలంగా రోదిస్తూన్న సముద్రం!
ఎప్పటికి చల్లారుతుంది నీ ఘోష?
వెండి నవ్వుల పిచ్చి రత్నాకరం!
నీకసలుందా సముజ్జ్వల జీవం?
యుగాంతం వరకూ ఆగుతుందా ని శ్వాసం?
కెరటాలందించే ప్రణయ లేఖల భాష
విశదం చేసేదెవరురా సవ్యాఖ్యానంగా!
హిమవంతుని తోడ్కొనిరానా?
అతని వజ్రహస్తాలతో నిన్నుబంధించనా?
ఎగిరెగిరి పడతావేం తీరదా నీ ఆగడం?

3

సముద్రం! ... సముద్రం!
నువ్వంటే నాకు సముద్రమంత అసహ్యం!
నీ ఒడ్డున కూర్చున్న నిద్రలేని రాత్రిలో
చిద్రుపలు చిద్రుపలుగా కలలు
కాళ్ళక్రింద పడి నలిగే నత్తగుల్లలు ...!
ఓహరి సాహరిగా ఊహలు —
కనులెత్తిచూసి జారిపోయే గులకరాళ్ళు!
తెడ్లువేస్తూ, తెరచాపలు తెరుస్తూ
జ్ఞాపకాల నౌకలు—శారద పూర్ణిమానిశలు...

సముద్రం! ... సముద్రం!
నువ్వంటే నాకు సముద్రమంత అసహ్యం!
నీ అంతు కనుక్కుందామని
పట్టుదలతో ప్రయత్నించిన నరులందరికీ
కవులందరికీ, ఋషులందరికీ
నాయకమణి మా షెల్లీ!
సముద్రం! ... సముద్రం!
నీ అసంఖ్యాక నేరాలను క్షమిస్తానుకాని
మరి నా యీ ఒక్కకోరికా తీర్చవూ?
ప్రతిమాలుకుంటాను నా షెల్లీని నాకీయవూ?
అతన్నెక్కడ దాచావో చెప్పవూ?

నాస్తికుడని ఆక్స్‌ఫర్డు తరిమింది —
అరాచకవాది అని దేశం తరిమింది —
అందగాడని మూర్ఖులు తరిమారు —
ప్రేమ తరిమింది, భూమీ తరిమింది —
మరి నువ్వూ తరిమి అతన్ని నాకివ్వవూ?
నా కవిని, షెల్లీని-కవులలో తొలి హీరోని!
హేతువాద కాసారంలో
ఎన్నడూ వాడని లిల్లీని!
నా ప్రియతమ కవిని నాకివ్వవూ షెల్లీని!

4

మత్స్యకన్య మృదు దరహాసంలో
చావబోయే తిమింగలాలను చూశాను;
కాళ్ళక్రింద మూలిగే ఇసుకరేణువులలో
చచ్చిన శత్రు సహస్రాలను చూశాను;
కరిగే మబ్బుతునక తుది బాష్ప బిందువులో
కనుగొన్నాను నింగి కన్నుల రవ్వల మెరుపు !
పది తెలుగు మల్లెల పరిమళంలో
ఐదుకోట్ల ఆనందాలు ఆకట్టుకొన్నాను.
గుండెల్లో దాగిన జననాంతరశోకాలను —
అనుసరించి వచ్చిన జవనాల వాసనలను
వెదుక్కుంటున్నా నీ సాగర తీరంలో ...
స్మృతుల ఝంఝా ప్రభంజనాలలో
ఉతుక్కుంటున్నాను సహస్ర అచేతనత్వాలు ...
ఆగామివైపుచూస్తూ
అరుణోదయానికి ఆశ్చర్యపోతున్నాను ...
విడిచిపోని పాతకాలాల పిరికితనాలతో
పారిపోతున్నాను పాప పరంపరల చీకటిలోకి ...
చేతికందకుండా కవ్వించే వెన్నెలరేక
కెరటాలతో చెప్పుకొనే మూగవేదన
లాలకిస్తున్నాను ! మథించుకొంటున్నాను
కన్నీటితో జలదరించే గతజీవన జడధిని !
తీరం ముఖాన నొసటి ముడతలలో
చదువుకుంటున్నాను భవిష్యత్సుందరగీతం ! !

5

పాపం ! వెర్రి వెన్నెల ఒంటరిగాకూర్చుందిక్కడ
తెల్లవార్లూమేలుకొని...పైకెగసే కాముక సాగరాన్ని
ఎలాగయినా కౌగలించుకుందామనుకొని ...
ఇసుక తిన్నెలు జ్యోత్స్నాభిసారికలై
సరుగుడు నీడల మాటున
నిరీక్షిస్తున్నాయి, యెవరికోసమో !
అనంత ఆలాపనగా...నితాంతసాలోచనగా...
ఆకాశం బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని
ఆవులిస్తూ ఆశాశల వెదుక్కుంటోంది.
సైకత తీరంపై నడచి వెళ్ళిన
సుందరీపాద ముద్రలకోసం
వెలుగురవ్వల అశ్రుశీకరాంజలి
అభిషేకిస్తున్నాయి కెరటాలు ...
అలలపై తేలివచ్చిన ఉదయినికి
పసిడి సెల్లాలు పరుస్తోంది కడలి ...
చిరిగి పేలికలై వ్రేలుతున్న ఇరులకి
తలలు విరబోసుకున్న దరిద్రాలవంటి
ఈత తుప్పల యిరుకులు చూపిస్తోంది నింగి !

6

హేనిద్రా !
భద్రంగా వేంచేస్తున్నావిప్పుడా ?
నా తీరని కోరికల కోలాహలం
అప్పుడే శాంతించిందనుకుంటున్నావా ?
నా కనురెప్పలమధ్య నలిగి ఛిద్రమైపో !

హే నిర్నిద్రసముద్రా !
తరుమవేరా, నిష్కరుణగా ఈ మాయాసుప్తిని !
చాంద్రీపులకిత సాగర వేలా నీహారికలో
నీ కెన్నటికీ తావులేదు, వెళ్ళిపో !

తరగలను ముక్కలుగా కొరికితినే
వెన్నెలముగ్ధా !
తొలగించవే నిద్దుర తెరల్ని...
వలపుపూల నావలపై
తేలిపోవే అనంత ఆశాంచలాలకు !
పుడమికప్పుకొన్న రంగుకలల దుప్పటి క్రింద
హృదయ తల్పం దాచుకొన్న
కనరాని మూగవేదనలను గలగలరాల్చిపోవే !
ఎన్నో సుతిమెత్తని ఆమనులు
నీకోసం వేచి వేచి బెంగటిల్లి
నిట్టూర్పు గాడ్పుల నీరవ గ్రీష్మంలో కలిశాయే !
వాటి నిరుపేద గుండెల్ని నిమిరి
అభయముద్ర అందించి సాగిపోవే...!
తంద్రాలసమై ఊగే నాజాతికి
చైతన్యకేతన మందించి మరీపోవే...!
దొంగనిద్ర కొనగోళ్ళతో చీల్చిన
కనుపాపల మంటలపై—ఓహో వెన్నెలా,
నీ చనుబాల పన్నీటి బిందువులు పిండిపోవే !

డా. కోర్లపాటి శ్రీరామమూర్తి

శాలివాహన శకము

ఇక శాలివాహనశకము. ఇదొక ఉత్థాపిత సమస్య.

అసలు శాలివాహనశకము, క్రీస్తుశకము 78వ సంవత్సర మున ఒక శాతవాహనరాజు స్థాపించినట్లు దక్షిణా పథములోని అనూచానమైన సంప్రదాయము. కాని, శాలివాహనశకము శకనిర్ణీత మని జైన గ్రంథము లందు కలదు. ఆ విషయ మిది[1] –

'శకానాం వంశముచ్ఛేద్య కాలేన కియతాపిహ
రాజా శ్రీవిక్రమాదిత్యః సార్వభౌమోపమోஉభవత్
సచోన్నతమహాసిద్ధిః సౌవర్ణపురుషోదయాత్
మేదినీ మనృణాం కృత్వా చాకరోద్వత్సరం నిజమ్
తతో వర్షశతే పఞ్చత్రింశతా సాధికే పునః
తస్య సంజ్ఞా న్వయం హత్వా వత్సరః స్థాపితఃశకైః'

ఇందు విక్రమాదిత్యుడు శకవంశమును ఛేదించి శకమును స్థాపించిన 135 సంవత్సరములకు శకులు మరల విక్రమాదిత్యుని వంశీయులను జయించి మరొక శకమును స్థాపించినట్లు కలదు. విక్రమాదిత్యుడు స్థాపించెనను విక్రమశకమునకు ఆరంభము క్రీస్తుపూర్వము 57వ సంవత్సరము. కనుక శకులు స్థాపించిరను శకమునకు ఆరంభము క్రీస్తుశకము 78వ సంవత్సరము (135–57=78). ఇది శాలివాహనశకమునకు సంవదించునది. కనుక శాలివాహనశకము శకనిర్ణీతము కావలయును. ఇట్లు ప్రభాచంద్ర సూరి రచించిన ప్రభావకచరితములోని కాలకాచార్య కథానకము నందు కలదు. ఇంకను అర్వాచీనకాలికములైన ఇతర జైన గ్రంథము లందును కలదు.[2] ఇంతకు ప్రభావకచరితము రచనా కాలము క్రీ శ. 1277వ సంవత్సరము.[3] అయిదవ శతాబ్ద కల్ప సూత్రమునకు సంబంధించిన కాలకాచార్య కథానకము నందు విక్రమశక విషయము వినా శాలివాహనశక విషయము లేదు.[4] అనగా ప్రభావక చరితములోని శాలివాహనశక విషయము అర్వాచీనకాలిక మని అవగాహకము. అంతేకాదు. అతః పూర్వకాలికములైన బ్రాహ్మణ గ్రంథము లందు శాలివాహనశకము మ్లేచ్ఛరాజులైన శకులను విక్రమాదిత్యుడు సంహరించిన శకసంబంధి కాలమని కలదు. ఆ విషయ మిది:[5]

'శకానామ్ మ్లేచ్ఛరాజానస్తే యస్మిన్ కాలే విక్రమాదిత్యేన
వ్యాపాదితః స శకసంబన్ధీ కాలః శాక ఇత్యుచ్యతే'

ఇది ఏడవ శతాబ్దిలోని బ్రహ్మగుప్తుని ఖండఖాద్యక మను జ్యౌతిష గ్రంథమునకు ఆమరాజు రచించిన వాసనాభాష్యటీకలోని వివరణము. వాసనాభాష్యటీక రచనాకాలము క్రీ. శ. 1180వ సంవత్సరము.[6] ఇట్లు పృథూదకస్వామి వ్యాఖ్యానము నందును కలదు.[7] ఆ వ్యాఖ్యానము రచనా కాలము క్రీ. శ. 864వ సంవత్సరము.[8] అంతేకాదు. బ్రహ్మగుప్తుని బ్రహ్మస్ఫుట సిద్ధాంత మను గ్రంథమున 'శకాన్తేஉబ్దాః' అని, 'శకనృపాణాం పఞ్చశత సంయుక్తైర్వర్షశతైః పఞ్చభిరతీతైః' అనియు కలదు.[9] అనగా శకనృపరాజ్యాంత కాలమని అర్థము వచ్చును. అంతేకాదు. ఆరవ శతాబ్ది ఆరంభములోని వరాహమిహిరుని బృహత్సంహితకు భట్టోత్పలుడు సంతరించిన వ్యాఖ్యానము నందును అట్లే కలదు.[10] ఇదియెల్ల జైన గ్రంథములలోని కథాకథనము కంటె ప్రాచీన సమాచారము. కనుక విక్రమాదిత్యుని విషయము కథార్థమైనను, శకసంహారము యథార్థము కావచ్చును.

ఇట్లు క్రీ. శ. 1030వ సంవత్సరము నందలి ఆల్‌బెరూనీ గ్రంథము నందును కలదు. ఆ విషయమిది :[11]

"శకకాలము విక్రమకాలమునకు 135 సంవత్సరముల తర్వాత మొదలగును. శకకాలమునకు సంబంధించిన శక నృపుడు ఆర్యావర్తమున అధివసించిన తదుపరి ఆసింధు సముద్రము భయోత్పాతము కలిగించెను. శకులము కాదని భావించు, ప్రకటించు హిందువులను వెలివేసెను. తూర్పు దిశ నుండి విక్రమాదిత్యుడు దండెత్తి వచ్చి, 'ముల్తాన్'కు 'లోనికోట'కు మధ్య కరూర్ ప్రాంతమున శకనృపుని సంహరించువరకు హిందువులు అనేక బాధలు అనుభవించిరి. క్రూర శకనృప సంహారవార్తకు ప్రజలు ఆనంద తన్మయత్వము చెందిరి అది మొదలు కాలపరిగణనమును ఆరంభించిరి. ముఖ్యముగ జ్యోతిష్కులు. శక సంహర్త పేరునకు శ్రీకారము చేర్చి శ్రీ విక్రమాదిత్యుడని గౌరవించిరి. విక్రమ కాలమునకు, శకనృప సంహార కాలమునకు ఎక్కువ వ్యవధాన ముండుట వలన విక్రమకాల సంబంధి విక్రమాదిత్యుడు, శకసంహర్త విక్రమాదిత్యుడు ఒకరు కారు. కేవలము సనాములు మాత్రమే."

ఇందు శకనృప సంహారము ఇదమిత్థముగ కలదు. అది క్రీ. పూ 57వ సంవత్సరమునకు 135 సంవత్సరముల అనంతరము, అనగా క్రీ శ. 78వ సంవత్సరమున జరిగినట్లు స్పష్టము. కనుక శాలివాహన శకము శకనృపసంహార మూలకమని కరతలామలకము. తన్నిమిత్తమైన శకారి విక్రమాదిత్యుడు శాలివాహన విక్రమాదిత్యుడని డా॥ కె. పి. జయస్వాల్ గారి సమన్వయము. ఆ విషయ మిది :[12]

"పంజాబునందు సర్వత్ర రాజా సర్‌కాప్ గురించి ప్రసిద్ధముగ ఉన్న జనశ్రుతిని జనరల్ కన్నింగుహాము గ్రంథస్థము కావించెను. ఆ జనశ్రుతి నేటికిని వ్యవహార ప్రసిద్ధము. నేను విన్న జనశ్రుతిలో సర్‌కాప లేక సర్‌కాప్‌ను సహోదర సమేతముగ శాలివాహనుడు ఓడించెననుటకు బదులు శాలివాహనుని కుమారుడు రాసాలు ఓడించెనని కొంచెము భేదము కలదు. కర్నల్ అబ్బాట్ గ్రంథస్థము కావించిన జానపద వీరగాథయందు రుసాలు అని కలదు. ఆ జనశ్రుతి సారాంశ మిది —

'లాహోర్ సమీపములోని అంబాకపి నివాసి అయిన సర్‌కాప్ మహాక్రూరుడు. అతడు సోదరీసోదరులు ఆరుగురితోను (వారు భూతములు, రాక్షసులు అని ఒక పాఠము. మానవులని మఱొక పాఠము) మణిక్‌పూర్ (మాణిక్యాల) ఉడినగర్ లేక అంబాకపి యొద్ద నివసించి ప్రజలను శిరచ్ఛేదము సేయుచుండెను. శాలివాహనుడు లేక అతని కుమారుడు రాజారాసాలు లేక రూసాలు వారిని నాశనము చేసి, ప్రజలను సర్‌కాప్ క్రూరపరిపాలన నుండి విముక్తులను కావించెను. సర్‌కాప్, సర్‌సుఖ్, అంబ సోదరులు. కాపికల్పి, ముండ, మందేహి సోదరీమణులు.'

పయి జనశ్రుతిని బట్టి సర్‌కాప్ సహోదరులు సింధు, జీలం నదుల మధ్య పరిపాలకులని మహాక్రూరులని తెలియుచున్నది. సర్‌కాప్ అనువాడు సిరికాప లేక కద్ఫిసెస్ కాక మఱొకడు కాడు. అంబ అనువాడు విమ లేక వమ. కాపికల్పి (=కద్ఫిసెస్), ముండ (=మురుండ) అను బిరుదులు అక్కసెల్లెండ్రుగ మార్పబడినవి. విమ సోదరుడైన సర్‌సుఖ్ బహుశః శాసనములను బట్టి, నాణెములను బట్టి పేరు తెలియరాని జిహోనిక మేనమామ కావచ్చును.

*　　　*　　　*

ఒక శాలివాహనరాజు క్రీ.శ. 78వ సంవత్సరమున శకులను ఓడించినట్లు కల సంప్రదాయవచనము ఖచ్చితముగ చారిత్రికము. జానపద వాఙ్మయమున ప్రవేశించిన తొలి కుషాణుల క్రూరత పరిపాలన యథార్థము. తూర్పుదిశ నుండి రూసాలు శాలివాహన విక్రమాదిత్యుని ద్వారా, సహాయము, నాయకత్వము లభించినను అక్కడ ప్రాయికముగ జాతీయ వికాసము కలదు.

*　　　*　　　*

పంజాబుదేశము నందలి మంట్‌గ్మరి మండలములోని కరోర్హా (కరోడ్), ఆల్‌బెరూనీ తెలిపిన కరూర్, సమీపము జన్మస్థలమైన శ్రీ జయచంద్ర విద్యాలంకార్, ఒక వృద్ధ గ్రామీణుడు శాలివాహనుడు రాజాసర్‌కాప్‌రిసాలును ఓడించినట్లు చెప్పెనని, నాకు వ్రాసిరి. దీని ప్రకారము ఓడిపోయిన సర్‌కాప్ పేరు రిసాలు కాని, శాలివాహన రాజు పేరు రిసాలు కాని రాసాలు కాని కాదు. ఇది ఆల్‌బెరూనీ కంటె ప్రాచీన కాలికమైన అరబ్ ఆధారము సమర్థింపని పక్షమున తిరస్కరించి యుందును."

ఇందు జనశ్రుతి, జానపద వీరగాథ రెండు కలవు. రెండును పంజాబుదేశము నందు ప్రసిద్ధములు. అరబీ వృత్తాంతమునకు అనుకూలము. ఆల్‌బెరూనీ గ్రంథమునకు అనుగుణము. జనశ్రుతిలోను, జానపద వీరగాథలోను ఒక శాలివాహనరాజు క్రూరుడైన సర్‌కాప్‌ను ఓడించినట్లు కలదు. కనుక ఆల్‌బెరూనీ వివరణములోని విక్రమాదిత్యుడు శాలివాహనరాజు అగును. అనగా శాతవాహన రాజు. కాని శాతవాహన రాజులకు కనీసము విక్రమాదిత్య బిరుదము కానరాదు. అంతేకాదు. ప్రతిష్ఠానములోని శాతవాహన రాజు పంజాబులోని అంబాకపి లేక కరూర్ వఱకు దండయాత్ర సాగించి, శకసంహారము చేయుట సంశయావకాశము. కథా సరిత్సాగరము తుదిని, గ్రంథకర్తృ ప్రశస్తి యందు శాతవాహన వంశీయులు కాశ్మీర ప్రభువులని కలదు. ఆపిషయ మిది—

> 'శ్రీ సాతవాహన కులామ్బుధి పారిజాతః
> స్రజ్ఞామరాజ ఇతి భూమిపతిర్బభూవ
> యేనావతీర్య వివిధై ర్విబుధైః శ్రితేన
> కశ్మీరమణ్డల మనీయత నన్దనత్వమ్' — శ్లో. 1

ఇందు అనంతవర్మ తండ్రి అయిన సంగ్రామరాజు శాతవాహన వంశీయుడని కలదు. కథా సరిత్సాగరమును సంతరించిన సోమదేవభట్టు అనంతవర్మ ఆస్థానకవి. అనంతవర్మ కాలము క్రీ.శ. 1029 వ సంవత్సరము మొదలు 1064 వ సంవత్సరము వఱకు.[13] శాతవాహనులు కాశ్మీర దేశమును పరిపాలించినట్లు కల్హణుని రాజ తరంగిణి యందును కలదు. పదునొకండవ శతాబ్దిని శాతవాహన వంశీయులు కాశ్మీరదేశ పాలకులు కాఁగా, ప్రథమ శతాబ్దిని శాతవాహనరాజు పంజాబుదేశ జైత్రయాత్ర కావించుట అసంభవము కాదు. సుసంభవమును కాదు. అంతేకాదు. పంజాబుదేశ జనశ్రుతిలోని, జానపద వీరగాథలోని సర్‌కాప్ అను క్రూరపాలకుడు కద్ఫిసెస్ అయిన, కుజులకద్ఫిసెస్ అగును.[14] కుజులకద్ఫిసెస్ కుషాణుడు. కుషాణులు అసలు శకులు.[15] కుజుల కద్ఫిసెస్ క్రీ.శ. 78వ సంవత్సరమున మరణించినట్లు పూర్వ సమన్వయము.[16] కాని, కుజుల కద్ఫిసెస్ రాజ్యాంతకాలము అతః పూర్వమని అద్యతన సమన్వయము. అది వక్ష్యమాణము. కనుక శాతవాహనరాజు సంహరించిన శకనృపుడు కుజుల కద్ఫిసెస్ అగుట నిరవకాశము. జనశ్రుతులు, జానపద వీరగాథలు యథార్థము రూపాంతరము చెందిన కథార్థములగుట సహజము. శాలివాహన రాజకృత శకనృప సంహారము యథార్థము కావచ్చును.

శకనృప సంహారమును యథార్థము కాదని, శాలివాహన శకము కనిష్క నిర్ణీతమని ఒక సమన్వయము కలదు అది ఫెర్గుస్సన్, ఓల్డెన్‌బర్గ్, వడ్డెన్, రేప్సన్, థామస్, బెనర్జీ, టార్న్, బచ్ఛోఫెర్, హరిచరణఘోష్, రాయ్‌చౌధురి, లోహుఇజెన్-డి—లీవ్, సర్కార్ ప్రభృతుల అభిప్రాయము.[17] అందుకు ప్రధాన హేతు విది—

'కనిష్కుని రాజ్యారంభకాలము క్రీ. శ. 78వ సంవత్సరము కావలయును. కారణము, కనిష్కుడు మొదలు వాసుదేవుని వఱకు, కుషాణుల శాసనము లందు నాణెము లందు సంవత్సర క్రమము కలదు.'

మఱి కనిష్కుని రాజ్యారంభకాలము బహువాద బంధురము. క్రీ.పూ. 58వ సంవత్సరమని లెవీ, క్రీ. శ 78వ సంవత్సరమని ఫెర్గుస్సన్ ప్రభృతుల, 120వ సంవత్సరమని స్మిత్, పాండేల, 125వ సంవత్సరమని మార్షల్, 128 లేక 129 లేక 134 లేక 200వ సంవత్సరమని కొనొవ్, 144వ సంవత్సరమని, గ్రిష్మన్, దీక్షిత్, పూరీల, 220, 248, 249, 278వ సంవత్సరములని ఇతరుల అభిప్రాయములు.[18] ఇందు కనిష్కుని రాజ్యారంభకాలము క్రీ. పూ. 58వ సంవత్సర మనుట విక్రమ శకమును, క్రీ.శ. 78వ సంవత్సరమనుట శాలివాహన శకమును కనిష్కునికి కట్టఁబెట్టు ప్రయత్నమే. కనిష్కునికి పూర్వము కుజల కద్ఫిసెస్, విమ కద్ఫిసెస్ అను ఇద్దఱు మాత్రమే తొలి కుషాణులు పరిపాలించినట్లు ఇతఃపూర్వ సమన్వయము.[19] 'సోటెర్ మేగస్' అను పేరులేని కుషాణరాజు కుజల కద్ఫిసెస్ అని, విమకద్ఫిసెస్ రాజప్రతినిధి అని సమన్వయము. కాని కుజల కద్ఫిసెస్, సోటెర్ మేగస్, విమకద్ఫిసెస్ ముగ్గురును క్రమపరిపాలకులని ఆద్యతన సమన్వయము. అది నాణకప్రమాణమును బట్టి మేక్డొవాల్ గారు చేసిన నిర్ణయము. అవిషయమిది[20] —

> 'సోటెర్ మేగస్ (పేరులేని కుషాణరాజు) నాణెములు ఒకే రకము. అవి పశ్చిమోత్తర భారతదేశమున, వారణాశి, ఘజిపూర్ లందు; దక్షిణ రష్యాదేశములోని హిందూకుష్ పర్వతమునకు ఉత్తరమున లభించినవి ...
>
> రష్యన్ విద్వాంసుడు ఎం.ఇ. మస్సన్ ప్రస్తరించి వివరించిన ప్రకారము, సోటెర్ మేగస్ నాణెములకు విమకద్ఫిసెస్ నాణెములకు మాత్రమే [illegible]క, సోటెర్ మేగస్ నాణెములకు తొలి కుషాణరాజు కుజల కద్ఫిసెస్ నాణెములకు క్రమణిక కలదు...
>
> సోటెర్ మేగస్ ప్రత్యేకముగ ఒక కుషాణరాజు అనుట మఱి అనివార్యము. పేరులేని రాజు, రాజాధిరాజు, మహావ్యక్తి, త్రాత, మఱల జయించి పశ్చిమోత్తర భారతమున కుషాణ రాజ్యమును కూడఁబెట్టిన, తక్షశిలను నాశనము చేసిన కుషాణరాజు అయిన సోటెర్ మేగస్‌కు మనము చూపఁగలిగిన నాణక సందర్భము, నాణెముల వలె బిరుదావళి మాత్రమే కలిగి నామధేయములేని శాసన సముచ్చయము – 184వ సంవత్సరపు విమకద్ఫిసెస్ ఖాలస్తె శాసనముకంటె ముందు కల 122వ సంవత్సరపు పంజ్‌టార్ శిల, 134వ సంవత్సరపు కలవాన్ తామ్రఫలకము, 136వ సంవత్సరపు తక్షశిలా రజత వలయము—నిజముగా ఒకటే.'

ఇది గమనార్హమైన విశేషము ఇందు పేర్కొన్న పేరులేని కుషాణరాజు నాణెములమీద 'మహరజస రజతిరజస మహతస త్రతరస' (=మహారాజస్య రాజాధి రాజస్య మహతస్య త్రాతుః) అని కలదు.[21] మఱి, పంజ్‌టార్ శిలాశాసనమున 'మహరయస గుషణస రాజ/మి/' (=మహారాజస్య కుషాణస్య రాజ్యే) అని కలదు.[22] కలవాన్ తామ్రశాసనమున అట్లు లేదు.[23] తక్షశిలా రజతవలయ శాసనమున 'మహరజస రజతి రజస దేవపుత్రస ఖుషణస' (=మహారాజస్య రాజాధి రాజస్య దేవపుత్త్రస్య కుషాణస్య) అని కలదు.[24] పేరులేని కుషాణరాజు నాణెములు, శాసనములు ఒకరివగుట సంగతము. అంతేకాదు. నాణక సందర్భమునుబట్టి, పేరులేని కుషాణరాజు కుజులకద్ఫిసెస్ కాని, విమకద్ఫిసెస్ ప్రతినిధి కాని అగుటకంటె 'సోటెర్ మేగస్' అగుట సుసంగతము. ఇక శాసనము లందలి సంవత్సర సంఖ్యలు విక్రమశకమునకు సంబంధించినవి. కనుక, పంజ్‌టార్ శాసనకాలము క్రీ. శ. 65వ సంవత్సరము (122–57=65). తక్షశిలా రజతవలయ శాసనకాలము క్రీ. శ. 79వ సంవత్సరము (136–57=79). కాఁబట్టి సోటెర్ మేగస్ రాజ్య కాలము క్రీ. శ. 65–79. సోటెర్ మేగస్ అనంతరము విమ కద్ఫిసెస్ పాలకుడు. ఖాలస్తె శాసనమున 'మహరజస ఉవిమికస్త (ఁటు) సస' (=మహారాజస్య ఉవిమికస్తుస్య) అని కలదు.[25] ఉవిమిక నామము విమకద్ఫిసెస్‌కు వర్తించునని సమన్వయము.[26] ఖాలస్తె శాసన కాలమును విక్రమ శకమునకు సంబంధించినది. కనుక ఖాలస్తె శాసనకాలము క్రీ. శ. 127వ సంవత్సరము (184-57=127) లేక 130వ సంవత్సరము (187-57=130). కాఁబట్టి విమకద్ఫిసెస్ కాలము క్రీ. శ. 79 – 127 లేక 130. విమకద్ఫిసెస్ అనంతరము కనిష్కుడు పాలకుడు. అనగా కనిష్కుని రాజ్యారంభకాలము క్రీ. శ. 127 లేక 130వ సంవత్సరము కంటె అనంతరమగుట అపరిహార్యము. అది కనిష్కుని రాజ్యారంభకాలము క్రీ. శ. 144వ సంవత్సరమను సమన్వయమునకు సన్నిహితము. కనిష్కుని రాజ్యారంభకాలము విమకద్ఫిసెస్ రాజ్యాంతకాలము. విమకద్ఫిసెస్ రాజ్యారంభ కాలము క్రీ శ. 79వ సంవత్సరము, రాజ్యాంతకాలము క్రీ. శ. 144 వ సంవత్సరము అయిన రాజ్యకాలము 65 సంవత్సరము లగును (144–79=65). అది కేవలము అసహజము. కనుక విమకద్ఫిసెస్ రాజ్యారంభకాలము క్రీ. శ. 79 వ సంవత్సరము కంటె అనంతరమగును. అది స్థూలముగ క్రీ. శ. 89వ సంవత్సరమయిన రాజ్యకాలము 55 సంవత్సరము లగును (144–89=55). శ్రీ శాతకర్ణి రాజ్యకాలము 56 సంవత్సరములు కనుక విమకద్ఫిసెస్ రాజ్యకాలము 55 సంవత్సరము లగుట అసాధారణమైనను అసహజము కాదు. అప్పుడు సోటెర్ మేగస్ కాలము క్రీ. శ. 65–89 అగును. ఖాలస్తె శాసనములోని ఉవిమకనామము విమకద్ఫిసెస్‌కు వర్తించని పక్షమునను కనిష్కుని రాజ్యారంభకాలము క్రీ. శ. 78వ సంవత్సరము కాదు. కారణము క్రీ. శ 79వ సంవత్సరము విమకద్ఫిసెస్ రాజ్యారంభకాల మగును. విమకద్ఫిసెస్ శకనిర్ణేత అనుటకు సంవత్సర క్రమ సాధనములేదు. సంవత్సర క్రమసాధనము కల కనిష్కుని

రాజ్యారంభకాలము ఎట్లును క్రీ. శ. 78వ సంవత్సరముకాదు. క్రీ. శ. 144వ సంవత్సర మగును. అయిన కనిష్కుడు మొదలు వాసుదేవుని వఱకు కుషాణుల శాసనములందు, నాణెములందు కల సంవత్సర క్రమము కుషాణశకము లేక కనిష్కశక మగును. కాఁబట్టి శాలివాహనశకము కనిష్క నిర్ణీతము కాదని స్పష్టము.

పయి సమన్వయమునుబట్టి సోటెర్ మేగస్‌కు పూర్వుడైన కుజులకద్ఫిసెస్ రాజ్యాంతకాలము క్రీ. శ 65వ సంవత్సరము. కుషాణుడైన కుజులకద్ఫిసెస్ పహ్లవుడైన గండోఫెర్నెస్‌ను జయించి కాబూలు ప్రాంతమును ఆక్రమించిన కాలము క్రీ.శ.45వ సంవత్సరము తర్వాత అని బి. ఎన్. పూరీగారి అభిప్రాయము.[27] 20 వ సంవత్సరము తర్వాత అని బల్‌దేవ్ కుమార్‌గారి అభిప్రాయము.[28] కనుక కుజులకద్ఫిసెస్ రాజ్యకాలము క్రీ.శ. 2‍0 లేక 45వ సంవత్సరమునుండి క్రీ. శ. 65వ సంవత్సరము వఱకు అగును. అతడు సర్‌కాప్ అయినను, ఒకానొక శాలివాహనరాజు అతనిని సంహరించినను, కుజులకద్ఫిసెస్ రాజ్యాంతకాలము క్రీ. శ. 65వ సంవత్సరము కనుక అతడు శాలివాహనశక సంబంధి శక నృపుడు కాడని పర్యవసానము. ఇది వక్ష్యమాణమన్న విషయము.

ఇక శాలివాహనశక నిర్ణేత చష్టనుడని మఱొక సమన్వయము కలదు. అది జ్యోతిప్రసాద్ జైన్‌గారి అభిప్రాయము. ఆ విషయ మిది :[29]

> 'అసలు క్రీ. శ. 176వ సంవత్సరమున రచింపఁబడిన తిలోయపణ్ణతి అను గ్రంథమున స్పష్టముగ గంధర్వులు లేక గర్దభిల్లులు వందసంవత్సరములు పరిపాలించిరని, వారి తర్వాత నహపానుడు నలభై సంవత్సరములు పరిపాలించెనని, ఆ తర్వాత రెండువందల నలభై రెండు సంవత్సరములు 'భచ్చట్ఠాణులు' పరిపాలించిరని కలదు ... తిలోయపణ్ణతిలోని 1508వ, 1503–4వ పద్యములను కలిపి చదివిన భచ్చట్ఠాణులు శకులని నిస్సందేహముగ తెలియగలదు...చష్టనుడు, అతని తొలివారసులు, మఱి శాతవాహనులకు మహాప్రతిస్పర్ధులు. అయినను చష్టన వంశము చంద్రగుప్త విక్రమాదిత్యుని కాలము వఱకు కలదు. అది క్రీ శ. 320వ సంవత్సరమునాటి గుప్త సామ్రాజ్యము అవతరణ మొదలు క్షీణింపసాగినది. తిలోయపణ్ణతిలో చష్టనవంశము పరిపాలించిన కాలము 242 సంవత్సరములు. అది క్రీ శ. 78వ సంవత్సరమునుండి లెక్కించిన క్రీ. శ. 320వ సంవత్సరమగును. ఇది సరిగా తిలోయపణ్ణతి భద్రచష్టనుల తదుపరి తెలిపిన గుప్తుల ఆరంభమునకు సరిపడును. కనుక ప్రసిద్ధమైన క్రీ. శ. 78వ సంవత్సరమునాటి శకకాలము భద్రచష్టనులు లేదా చష్టనవంశీయులైన పశ్చిమ క్షాత్రపుల రాజ్యారంభకాలము నుండి ప్రారంభమైనదనుటకు సందేహములేదు.'

ఇందు పేర్కొన్న తిలోయపణ్ణతి అను జైనగ్రంథము ఆదిని క్రీ. శ. 176వ సంవత్సరమున రచితమైనను అది నేడు అనుపలబ్ధము. సముపలబ్ధమైన తిలోయపణ్ణతి రచనా కాలము ఎనిమిదవ శతాబ్ది[30] (710–90). అందలి 'భచ్చట్ఠాణులు' భద్రచష్టనులు అనగా చష్టనవంశీయులు అనుట సమంజసము. చష్టనవంశీయులు 242 సంవత్సరములు పరిపాలించిరని, వారి అనంతరము గుప్తులు పరిపాలించిరని కల విషయము చరిత్రకు విరుద్ధము. చష్టనవంశీయులు మూడువందల సంవత్సరములు పరిపాలించినట్లు శాసన ప్రమాణము, నాణక ప్రమాణము కలదు. చష్టనవంశీయుల చరమకాలము క్రీ. శ. 388వ సంవత్సరము.[31] గుప్తవంశీయుల ప్రారంభకాలము కనీసము క్రీ. శ. 320వ సంవత్సరము.[32] అంతే కాదు. చంద్రగుప్తవిక్రమాదిత్యుని రాజ్యారంభకాలము క్రీ.శ.375వ 380వ సంవత్సరముల మధ్యకాలము.[33] చష్టనవంశీయుల పరిపాలన కాలము 242 సంవత్సరములయిన చష్టనుని రాజ్యారంభకాలము క్రీ. శ. 146వ సంవత్సరమగును (388–242=146). కాని అతఃపూర్వమే చష్టనుని శాసనములు కలవు. అంతేకాదు. టోలమీ గ్రంథమున చష్టనుని ప్రసక్తి కలదు.[34] ఆ గ్రంథరచనా కాలము స్థూలముగ క్రీ. శ. 140వ సంవత్సరము.[35] ఆ సంవత్సరమున చష్టనుడు ఉజ్జయిని పాలకుడని అందు కలదు. అది పూర్వోదాహృతము. చష్టనుని రాజ్యాంతకాలము 140వ సంవత్సరము, రాజ్యారంభకాలము 78వ సంవత్సరము అయిన రాజ్యకాలము 62 సంవత్సరములగును (140–78=62). అది కేవలము అసహజము. చష్టనుని శాసనములు క్రీ. శ. 89వ సంవత్సరమున, క్రీ. శ. 130వ సంవత్సరమున కలవు.[36] కనుక చష్టనుని రాజ్యకాలము స్థూలముగ క్రీ. శ. 89-140 అగును. అనగా 51 సంవత్సరము లగును (140–89=51). ఇది అసాధారణము కాని అసహజముకాదు. కాని టోలమీ గ్రంథము రచనాకాలము క్రీ. శ. 145వ సంవత్సరమని ఒక అభిప్రాయము కలదు.[37] అంతేకాదు. చష్టనుని అనంతరము చష్టనుని మనుమడు రుద్రదాముడు పాలకుడు. రుద్రదాముని శాసనము క్రీ. శ. 150వ సంవత్సరమున కలదు.[38] కనుక చష్టనుని రాజ్యాంతకాలము క్రీ. శ. 140వ సంవత్సరముకంటె అనంతరము కావచ్చును గాని రాజ్యారంభకాలము క్రీ. శ. 89వ సంవత్సరముకంటె పూర్వము కాదు. కాఁబట్టి క్రీ. శ. 78వ సంవత్సరమునాటి శాలివాహన శకము చష్టనకృతము కాదని స్పష్టము.

ఇక నహపానునికి సంబంధించిన శాసనములందలి సంవత్సర సంఖ్యలును శాలివాహనశకమునకు సంబంధించినవి. కనుక నహపానుడు శకనిర్ణేత కావచ్చునని తోచుట సహజము. కాని నహపానునికి సంబంధించిన శాసనములు క్రీ. శ. 119–124 సంవత్సరములమధ్య కలవు.[39] అందు 124వ సంవత్సరము నహపానుని రాజ్యాంతకాలము. నహపానుడు 40 లేక 42సంవత్సరములు పరిపాలించినట్లు జైనగ్రంథములందు కలదు.[40] అంతకంటె ఎక్కువ సంవత్సరములు పరిపాలించెననుటకు ఆపాటి ఆధారమును లేదు. కనుక నహపానుని రాజ్యారంభకాలము క్రీ.శ.82వ సంవత్సరము లేక 84వ సంవత్సరముకంటె పూర్వముకాదు (124–42=82; 124–

40–84). కాబట్టి క్రీ. శ. 78వ సంవత్సరమునాటి శాలివాహన శకము నహపానకృతమును కాదని స్పష్టము.

నహపానుడు క్షహరాత వంశజుడు.[41] చష్టనుడు కార్దమక వంశజుడు.[42] నహపానుడు శకనిర్ణేత అయిన క్షహరాత శకమని, చష్టనుడు శకనిర్ణేత అయిన కార్దమక శకమని ప్రసిద్ధము కావలయును. కాలేదు. సరికదా శాలివాహనశకమని ప్రసిద్ధమయినది. అంతేకాదు. చష్టన, నహపానులు క్షాత్రపులు. క్షాత్రపులనగా రాజప్రతినిధులు కనుక స్వయము శకనిర్ణేతలుకారని ఒక సమన్వయము కలదు. అది డా॥ డి. సి. సర్కార్‌గారి ప్రతిపాదనము. ఆ విషయమిది:[43]

> 'క్షాత్రప బిరుదము రాజప్రతినిధి అను అర్థము కల ప్రాచీన పారశీకపదమునుండి నిష్పన్నమయినది. కనుక చష్టనుడు, నహపానుడు ఒకానొక సార్వభౌమ గృహమునకు విధేయులు. ఆ సార్వభౌములు ఒక్క కుషాణులుమాత్రమే కాగలరు. చష్టన, నహపానులు కొంత హోదాను అనుభవించినను, కుషాణులు తమ ద్రవ్యసంబంధమైన వ్యవహారములకు సమృద్ధిగ ఉపయోగించిన స్వర్ణముకంటె భిన్నమైన లోహములందు నాణెములు వెలయించుటకు అనుమతింపఁబడినను, రాజప్రతినిధులు (వైస్రాయ్) తమ శాసనములను తమ రాజ్యవర్షముల కాలపరిగణనమును ప్రకటించుటకు అనుమతింపఁబడిరని నమ్ముట కష్టము.

*　　　*　　　*

ఈ పరిస్థితులలో చష్టన, నహపానులు శాసనములను తమ సార్వభౌముల కాలపరిగణనమున అనగా కనిష్కుని కాలమానమున ప్రకటించిరను సమన్వయము మాత్రమే సంభావ్యము. ఇది క్రీ. శ. 78వ సంవత్సరమున ప్రారంభమైన కాలమానము కనిష్కుని రాజ్యారంభకాలమునుండి ప్రారంభమైన కాలమానమని స్ఫురింపఁజేయును.'

ఇందు చష్టనుడు, నహపానుడు రాజప్రతినిధు లనుటకు ఆధారమెల్ల ప్రాచీన పారసీక పదము. ఇతరాధారములను బట్టి రేప్సన్, భండార్కర్ ప్రభృతులు చేసిన ఇట్టి సమన్వయము సమంజసము కాదని డా॥ సుధాకర్ చట్టోపాధ్యాయ ప్రతిపాదనము.[44] ప్రాచీన పారసీకపదము క్షత్రపశబ్దమునకు ఆద్యప్రకృతి కావచ్చును. నహపానునికి సంబంధించిన జున్నార్ గుహా శాసనమున మహాక్షత్రప శబ్దము కలదు.[45] చష్టనుని మనుమడు రుద్రదాముని వెండి నాణెముల మీదను మహాక్షత్రప శబ్దము కలదు.[46] క్షత్రప శబ్దమునకు రాజప్రతినిధి అని అర్థమైన,మహాక్షత్రప శబ్దమునకు మహారాజప్రతినిధి అని అర్థము వచ్చును. రాజప్రతినిధి, మహారాజ ప్రతినిధి అను వ్యవహారము అప్రసిద్ధము. క్షత్రప శబ్దమునకు సామంతరాజని అర్థమైన, మహాక్షత్రప శబ్దమునకు మహా సామంత రాజని అర్థము వచ్చును. సామంతరాజు, మహాసామంత రాజు అను వ్యవహారము సుప్రసిద్ధము. అంతేకాదు. రాజప్రతినిధులు రాజన్ శబ్ద వ్యవహృతులు కారు. సామంతరాజులు రాజన్‌శబ్ద వ్యవహృతులు కాకపోరు. నహపానునికి సంబంధించిన శాసనములందు,[47] చష్టనుని శాసనము లందు,[48] రాజన్‌శబ్ద వ్యవహారము కలదు కనుక చష్టన, నహపానులు సామంతరాజులు, మహాసామంతరాజులు మాత్రమే అగుదురు. సామంతరాజులు శాసనములు, నాణెములు వెలయించుట సావకాశము. కాలమానమును కల్పించుట నిరవకాశము. కాబట్టి చష్టన, నహపానులు శకనిర్ణేతలు కారని స్పష్టము. ఇంత మాత్రమున కనిష్కుడు శకనిర్ణేత కావలసిన ఆవశ్యకము లేదు. చష్టన, నహపానులు స్వయముగ శకనిర్ణయము చేయుట సమర్థనీయము కాదు గాని, ప్రాంతీయ కాలమానమును పాటించుట సార్వభౌమ ధిక్కారము కాదు. అంతేకాదు. చష్టన, నహపానుల కాలమున కుషాణరాజు కనిష్కుడుకాడు. విమకద్ఫిసెస్ అగును. విమకద్ఫిసెస్ రాజ్యారంభ కాలము క్రీ. శ. 89వ సంవత్సరము లేక 79వ సంవత్సరమని పూర్వోక్తము. విమకద్ఫిసెస్ శకనిర్ణేత అనుటకు సాధన సంపత్తిలేదు. కనీసము సంవత్సరక్రమ సాధనము కానరాదు. సంవత్సరక్రమ సాధనము కల కనిష్కుని రాజ్యారంభకాలము క్రీ. శ. 78వ సంవత్సరము కాదని, క్రీ. శ. 144వ సంవత్సరము కాకపోదని పూర్వోక్తము. కాబట్టి చష్టన, నహపానులు పాటించిన కాలమానము కనిష్కశకము కాదని, శాలివాహన శకమని స్పష్టము.

జనశ్రుతులు, జానపద గేయములు, జైనగాథలు – పురాణ వచనముల వలె – స్వతఃప్రమాణములు కావు. ఇతఃపూర్వ చారిత్రిక సమన్వయములును 'ఇదమిత్థ' సిద్ధాంతములుకావు. కనుక నిర్ధారక సాధనములైన శాసనము లందలి శాలివాహన శక విషయము పరిశీలనావశ్యకము. ఏవం విధమైన శాసన పరిశీలనము క్రీ.శ. 1883వ సంవత్సరమున జరిగినది. అది జె. యఫ్. ఫ్లీట్‌గారి పరిశోధనము. అందు మఱి అవశ్య గమనార్హమైన ఆదిమ విశేష మిది[49] –

> 'ఈ కాలమానమునకు శాసనము లందు ప్రసక్తమైన నిస్సందిగ్ధమైన ప్రప్రథమ పారిభాషిక పదము కేవలము,
>
> సంవత్సర
>
> శబ్దము. అది – 1. ఘూర్జర ప్రభువు రెండవ దడ్డని మొదటి కైరా శాసనమున కలదు. శాసనకాలము అక్షరములందు, అంకెలందు కూడ, "సంవత్సర శతా శీత్యధిక కార్తిక శుద్ధ పఞ్చదాశ్యాం ... సం॥ 380" అని కలదు. అదే విధముగ 2. రెండవ దడ్డని రెండవ కైరా శాసనమునందును 'సంవత్సర శతత్రయే పఞ్చాశీత్యధిక కార్తికపూర్ణిమాస్యాం...సం॥ 385 కార్తిక భు (శు) 15' అని కలదు. ఇవి, అదే రాజు శాసనములు క్రింది 3, 4 సంఖ్యల వానిని బట్టి శకకాలమునకు సంబంధించినవని నిర్ధారకము. తరువాతి పారిభాషిక పదము,
>
> శకనృపకాల
>
> శబ్దసంపుటి. 3. అదే ఘూర్జరరాజు రెండవ దడ్డని ఉమేత దాన శాసనమున 'శకనృప కాలాతీత సంవత్సర శత చతు

ష్టయే వైశాఖ పౌర్ణిమాస్యాం' అని కలదు. 4. అదే విధముగ ఆ రెండవ దడ్డని ఇలావా దాన శాసనమున 'శక నృప కాలాతీత సంవత్సర శత చతుష్టయే సప్తదశాధికేయే (జ్యే) ష్ఠ (ష్ఠా) మ (మా) వాస్య (స్యే) సు (సూ) ర్యగ్రహే' అని కలదు.

ఇందు ప్రప్రథమ పారిభాషిక పదము 'సంవత్సర' మనుట ఇదమిత్థము. రెండవ పారిభాషిక పదము 'శకనృపకాల' మనుట ఇదమిత్థము కాదు. 3, 4 శాసనములందు 'శకనృప కాలాతీత సంవత్సర'మని కలదు ఇది గమనార్హమైన విశేషము. ఇంతకు ఘూర్జర ప్రభువు రెండవదడ్డని కైరాశాసనములందు 'సంవత్సర' వ్యవహారము, ఆతని ఉమేత, ఇలావా శాసనములందు 'శకనృప కాలాతీత సంవత్సర' వ్యవహారము కలదని స్పష్టము. అనగా కైరాశాసనములందలి 'సంవత్సర' వ్యవహారము, 'శకనృప కాలాతీత సంవత్సర' వ్యవహారమని అవగాహకము. మొదటి కైరా శాసనము కాలము క్రీ. శ. 458వ సంవత్సరము. రెండవ కైరాశాసనము కాలము క్రీ. శ 463 వ సంవత్సరము. ఉమేత శాసనము కాలము క్రీ. శ. 478 వ సంవత్సరము. ఇలావా శాసనము కాలము 495వ సంవత్సరము. కాబట్టి అయిదవ శతాబ్దిని, క్రీ. శ. 78వ సంవత్సరమున ప్రారంభమైన కాలమానము 'శకనృప కాలాతీత సంవత్సర' వ్యవహారమని స్పష్టము.

ఇక ఘూర్జరప్రభువు రెండవ దడ్డని కైరాశాసనములందు 'సంవత్సర' వ్యవహారము వలె, మాళవ ప్రభువు మూడవ రుద్రసింహుని వెండినాణెము లందు 'వర్ష' వ్యవహారము కలదు.[50] వర్ష, సంవత్సరశబ్దములు పర్యాయపదములు. మొదటి కైరా శాసనమున సంవత్సరసంఖ్య 380. రుద్రసింహుని వెండినాణెము లందు వర్ష సంఖ్య 310. రెండిటికిని అంతరము 70 సంవత్సరములు (380−310=70). అనగా మొదటి కైరాశాసనము రుద్రసింహుని వెండినాణెములు సమీపకాలికములు. అంతేకాదు. ఘూర్జర, మాళవ దేశములు సమీపస్థానికములు. రుద్రసింహుని వెండినాణెములమీది వర్ష సంఖ్య, క్రీ.శ. 78వ సంవత్సరమున ప్రారంభమైన కాలమానమునకు సంబంధించిన పక్షమున, ఆ 'వర్ష' వ్యవహారము కైరాశాసనములందలి 'సంవత్సర' వ్యవహారము వలె 'శకనృపకాలాతీత వర్ష' వ్యవహారమగును. మూడవ రుద్రసింహునికి మూలపురుషుడు చష్టనుడు. చష్టనుని మొదటి అంథౌ శాసనము మొదలు రుద్రసింహుని వెండినాణెముల వఱకు సంవత్సరక్రమము కలదు 'వర్ష' వ్యవహారము కలదు. కనుక 'వర్ష' వ్యవహార మదియెల్ల 'శకనృపకాలాతీత సంవత్సర' వ్యవహారమగును. అంతేకాదు. సౌరాష్ట్రప్రభువు నహపానునకి సంబంధించిన దక్షిణాపథములోని శాసనములందును 'వర్ష' వ్యవహారము కలదు. వర్ష సంఖ్యలు 41 నుండి 46 వఱకు కలవు.[51] చష్టనుని వర్ష సంఖ్యలు 11 నుండి 52 వఱకు కలవు.[52] అనగా నహపానునికి సంబంధించిన వర్ష సంఖ్యలు చష్టనుని వర్షసంఖ్యలకు మధ్యస్థములు. ఆ వర్ష సంఖ్యలును క్రీ. శ. 78వ సంవత్సరము నుండి ప్రారంభమైన కాలమానమునకు సంబంధించిన పక్షమున, ఆ 'వర్ష' వ్యవహారమును 'శకనృపకాలాతీత సంవత్సర'వ్యవహారమగును. అయిన 'శకనృప కాలాతీతసంవత్సర' వ్యవహారము క్రీ.శ.89వ సంవత్సరము నుండి క్రీ. శ. 463 వ సంవత్సరము వఱకు అధ్యాహార్యముగను, క్రీ.శ.478వ సంవత్సరము నుండి స్పష్టముగను కలదని అర్థము. అంతేకాదు. ఆ వ్యవహారము, మొదట మాళవ, సౌరాష్ట్ర, దక్షిణాపథ, ఘూర్జర దేశములకు సంబంధించినదని కూడ అవగాహకము. ఇది కూడగమనార్హమైన విశేషము.

మఱి, క్రీస్తుశకము 806, 903, 923, 968, 1000, 1022, 1024, 1026, 1044, 1062, 1077, 1094, 1109, 1154, 1156, 1178, 1198, 1213 వ సంవత్సరము లందలి శాసనము లందును 'శకనృప కాలాతీత సంవత్సర' వ్యవహారము కలదు.[53] అవి రాష్ట్రకూట, గాంగ, పశ్చిమ చాళుక్య, శిలాహార, కళాచూరి, దేవగిరి, రాజుల శాసనములు.[54] సంస్కృత కర్ణాటభాషా సంగ్రథితములు. క్రీ.శ. 1060 వ సంవత్సరము నందలి ఆంధ్రభాషాశాసనము నందును 'శకనృపకాలాతీత సంవత్సర' వ్యవహారము కలదు.[55] అంతేకాదు మాళవ, ఘూర్జర, సౌరాష్ట్రేతరమైన ఉత్తరాపథములోని క్రీ.శ. 1075వ సంవత్సరము నందలి శాసనమునందు 'నృపకాలాతీత సంవత్' వ్యవహారము. క్రీ.శ. 1111, 1383, 1394, 1483 వ సంవతర్సము లందలి శాసనము లందు 'శకనృపకాలాతీత సంవత్సర' వ్యవహారము కలదు.[56] క్రీ.శ. 610 వ సంవత్సరము నుండి 'శకకాల' వ్యవహారము, 620 వ సంవత్సరమునుండి 'శకనృపతి సంవత్సర' వ్యవహారము, 689 వ సంవత్సరము నుండి 'శకవర్ష' వ్యవహారము, 1007 వ సంవత్సరము నుండి 'శకాబ్ద' వ్యవహారము, 1114 వ సంవత్సరమునుండి 'శాకాబ్ద' వ్యవహారము కలదు.[57] ఆ యీ వ్యవహారములెల్ల 'శకనృపకాలాతీత సంవత్సర' వ్యవహారమునకు నామైకదేశగ్రహణము. ఇందుకు భిన్నముగ క్రీ. శ. 1002, 1062 వ సంవత్సరము లందలి శాసనము లందు 'శకనృప కాలాక్రాంత సంవత్సర' వ్యవహారము, 1192వ సంవత్సరమునందలి శాసనమునందు 'శకనృపకాలాదారభ్యవర్ష' వ్యవహారము, 578వ సంవత్సరము నందలిశాసనమునందు 'శకనృపరాజ్యాభిషేక సంవత్సర'వ్యవహారము కలదు.[58] అంతేకాదు. 1148 వసంవత్సరము నందలి ఆంధ్రశాసనము నందు 'శకరాజాభిషేక సంవత్సర' వ్యవహారము కలదు.[59] 1342వ సంవత్సరమునందలి ఆంధ్రశాసనము నందు 'శకరాజ్యాభిషేకవత్సర' వ్యవహారముకలదు [60] కాని తత్పూర్వము, తదనంతరము, నిరంతరముగ 'శకనృపకాలాతీత సంవత్సర' వ్యవహారము కలదు గాన, అర్వాచీనమైన, క్వాచిత్కమైన శకనృపకాలాక్రాంత, శకనృపకాలారంభ, శకనృపరాజ్యాభిషేక, శకరాజాభిషేక ప్రభృతి వ్యవహారములకంటె, 'శకనృపకాలాతీత సంవత్సర' వ్యవహారము ప్రామాణికము.

'శకనృపకాలాతీత సంవత్సరము' అనగా ఏమి? శకనృపకాల సంవత్సరమైన, 'అతీత' శబ్దము వ్యర్థమగును. అతీతశబ్దమునకు

కడచిన అనగా గతించిన అని మాత్రమే అర్థము. రెండవ దద్దని రెండుశాసనము లందును 'శకనృపకాలాతీతసంవత్సరశతచతుష్టయే' అని కలదు. అంతేకాదు. క్రీ.శ. 478వ సంవత్సరము నందలి ధర సేన దేవుని వలభిశాసనము నందును 'శకనృపకాలాతీత సంవత్సర శతచతుష్టయే' అనియే కలదు.[61] అనగా 'శకనృపకాలముగతించిన సంవత్సర శతచతుష్టయము నందు' అని కదా అర్థము. 'శక నృపకాలము గతించిన 400 వ సంవత్సరము నందు' అని తాత్ప ర్యము· శకనృపకాలము అనగా శకనృపునియొక్క కాలమని అర్థము. శకనృపుని రాజ్యకాలమని తాత్పర్యము. మొత్తముమీద 'శకనృపకాలా తీత సంవత్సరము' అనగా శకనృపరాజ్యాంతకాలమని నిష్కృష్టా ర్థము. అనగా క్రీ.శ. 78 వ సంవత్సరము శకనృపరాజ్యాంత కాలము కాని, శకనృపరాజ్యారంభకాలము కాదని పర్యవసానము. రాజ్యాంతకాలమునుబట్టి కాలమాన మేర్పడుటకు ఆ రాజు మహా త్ముడు కాని దురాత్ముడు కాని కావలయును. క్రీ.శ. 78 వ సంవ త్సరమున మహాత్ముడైన శకనృపుడు కానరాడు. దురాత్ముడైన శక నృపుడు కానరాకపోడు. దురాత్ముడైన శకనృపుని రాజ్యాంతకాలము కాలమాన మగుట తన్నిర్ణీతముకాదు. తన్నిర్మూలక నిర్ణీతమగును. కనుక శకనృపనిర్మూలకుడైన రాజు మాత్రమే. క్రీ.శ. 78 వ సంవత్సరము నుండి ప్రారంభమైన కాలమానమునకు కారకుడు. ఆ రాజు స్వదేశీయుడు కాని విదేశీయుడు కాడు. అట్టి రాజు ఆ కాలమున శాలివాహనరాజు కాకమరొకడు భారతావని మొత్తముమీద కావరాడు. కాబట్టి క్రీ.శ. 78 వ సంవత్సరము నుండి ప్రారంభ మైన కాలమానమునకు శాలివాహనరాజు కారకుడని స్పష్టము. అనగా శకనిర్ణేత శాలివాహనరాజని అర్థము. శకనిర్ణేత శాలివాహన రాజు కనుక శాలివాహనశకమని ప్రసిద్ధమైనది. ఇందుకు శాసన ప్రమాణమును కలదు. ఆ ప్రమాణవాక్యమిది: [62]

> 'ఏకాదశ శత వర్షాణ్య తదధికవ్ షోడశంచ విక్రయే /0/
> క్రదేశవ్. సంవత్ 1116. నవసత ఏకాసీతి సకగత
> శాలివాహన చ నృపదీస శాకే 981.'

ఇది గ్వాలియర్ సంస్థానములోని పరమారరాజు ఉదయా దిత్యుని ఉదయపూర్ శాసనములోని ఇతోధిక విశేషము. ఇందు 'నవసత ఏకాసీతి సకగత శాలివాహన చ నృపదీస శాకే' అను పంక్తికి, 'నవశత-ఏకాశీతి శకగత శాలివాహన చ నృపాధీశ శాకే' అని సుష్ఠురూపము. శాకము అనగా శకసంబంధము. అనగా శక సంవత్సరము. అది శకగత సంవత్సరమని, శాలివాహన నృపాధీశ సంవత్సరమని శాసనమున కలదు. 'శకగత సంవత్సరము' అనగా శకనృపుడు గతించిన సంవత్సరమని అర్థము. అనగా శకనృపుడు మరణించిన సంవత్సరమని తాత్పర్యము. 'శాలివాహన నృపాధీశ సంవత్సరము' అనగా శాలివాహన నృపాధీశుని యొుక్క సంవత్సర మని అర్థము. అనగా శాలివాహనరాజు నిర్ణయించిన కాలమానమని తాత్పర్యము. శకనృపుని మరణమునకు, శాలివాహనరాజు కాల నిర్ణయమునకు శాసనము నందు యుగ పద్భావము కలదు కనుక శకసంవత్సరవ్యవహారము శకనృప సంహారమూలకమైన, శాలివాహన రాజనిర్ణీతమైన కాలమానమని ఫలితార్థము.

ఇది క్రీ. శ. 1058వ సంవత్సరము నందలి శాసనములోని ఇతోధిక విశేషము· అర్వాచీనశాసనమని అప్రమాణమనుటకు వీలులేదు. ఇందు పూర్వ భాగములోని శకగత విషయము అనగా శకసంహార విశేషము బహుపూర్వ శాసన బాహాటము. ఉత్తర భాగములోని శాలివాహన నృపాధీశ విషయము అనగా శాలివాహన రాజ నిర్ణీత కాలమాన విశేషము బహూత్తర శాసన బాహాటము. అంతేకాదు. శాలివాహన శకమునకు సంబంధించిన శాలివాహనుడు ఆంధ్రరాజు. ఉదయపూర్ శాసనమునకు సంబంధించిన ఉదయా దిత్యుడు పరమారరాజు. ఉత్తరా పథములోని పరమారరాజు నిర్నిమిత్తముగ దక్షిణా పథములోని ఆంధ్రరాజునకు శకనిర్ణయ మును ఆపాదించుట జరుగదు. పరంపరా గతమైన, ప్రమాణ సహితమైన, ప్రసిద్ధ వ్యవహారములేనిది శాలివాహనరాజ నిర్ణీత కాలమాన విశేషము ఉత్తరాపథ శాసనమున ఉట్టంకితము కాదు. అంతేకాదు. శాలివాహనరాజు చారిత్రిక వ్యక్తి. కల్పిత పురుషుడు కాడు. శాలివాహనరాజు పరముగ విక్రమాదిత్యుని గురించివలె కథా వాఙ్మయము సక్పన్మాత్రమును లేదు. 'లీలావతీ' కావ్య మున్నది కాని అది విజయగాథ కాదు. లీలావతీహాల శాతవాహనుల ప్రేమగాథ. అందు మ్లేచ్ఛ సంహారము గాని, శకసంహారము గాని లేదు. అంతేకాదు. లీలావతీ కావ్యరచనా కాలము ఉదయపూర్ శాసనకాలము కంటె పూర్వము కాదు. సమకాలికము లేదా సమీప కాలికము. కనుక ఉదయపూర్ శాసనములోని శాలివాహన విశేషము ఆగంతుకము కాదు· కాబట్టి శాలివాహనరాజ నిర్ణీత కాలమాన విషయము కాలక్రమ కల్పనా కథనము కాదని స్పష్టము.

> ఇక విరూపాక్షుని సోమలాపుర శాసనమున ఇట్లు కలదు:[63]
> 'శాలివాహన నిర్ణీత శకవర్ష క్రమాగతే'

ఇందు శకవర్ష వ్యవహారము శాలివాహన నిర్ణీతమని ఇదమిత్థముగ కలదు. ఈ శాసనము కాలము క్రీ.శ. 1467వ సంవత్సరము. పరమార్వాచీనము. పైగా దక్షిణాపథ శాసనము. కనుక ప్రమాణము కాదనవచ్చును. కాని ఉదయపూర్ శాసనము కాలము క్రీ.శ. 1059వ సంవత్సరము. అందు శాలివాహననృపాధీశ శాకమని కలదు. కనుక ప్రాచీన కాలికమైన ఉదయపూర్ శాసన మునుబట్టి, పరమార్వాచీన కాలికమైన సోమలాపుర శాసనము ప్రమాణ పూర్వకము. కాబట్టి శాలివాహన శకము శకనృపసంహార మూలకమైన, శాలివాహనరాజ నిర్ణీతమైన కాలమానమని నిర్ధారకము.

మఱి 'శాలివాహన శక' వ్యవహారము ప్రథమతః దేవగిరి యాదవరాజు రామచంద్రుని 1272వ సంవత్సరము నందలి ఒక తాంబ్రదాన శాసనమున, తదుపరి ఆ రామచంద్రుని 1289వ సంవత్సరము నందలి మరొక రాణా దానశాసనమున కలదు.[64] రెండు శాసనము లందును 'శాలివాహనశకే' అని సంవత్సరసంఖ్యలు

కలవు. ఆ తర్వాత, విజయనగర రాజుల అనేక సంస్కృత కర్ణాట శాసనము లందు 'శాలివాహన శకవర్ష' వ్యవహారము కలదు.[65] ఆంధ్ర శాసనము లందును అట్లు కలదు.[66] అన్యుల శాసనము లందును అట్లు కలదు.[67] అసలు శకము అనగా కాలమానమని అర్వాచీన వ్యవహారము. ప్రాచీన వ్యవహారము కాదు. అయిదవ శతాబ్ది అమరకోశము నందు అసలు శకశబ్దము లేదు. పదునొకండవ శతాబ్ది వైజయంతి నిఘంటువు నందు శకశబ్దము కలదు గాని, దేశము, రాజోద్యోగి, షేడ అని మాత్రమే అర్థములు కలవు.[68] పండ్రెండవ శతాబ్ది విశ్వకోశము నందు రాజు, దేశము అని మాత్రమే అర్థములు కలవు.[69] పదమూడవ శతాబ్ది నానార్థ రత్నమాల యందు దేశము, గోమయము అని మాత్రమే అర్థములు కలవు.[70] కనుక పదమూడవ శతాబ్ది శాసనమునందలి 'శాలివాహనశకే' అను వ్యవహారమునందు 'వర్షే' అను పదము అధ్యాహార్యము. 'శాలివాహన శకేవర్షే అను వ్యవహారము 'శాలివాహనశకవర్ష' వ్యవహారమగును. కనుక శాలివాహన శకవర్షము అనగా శాలివాహన రాజునకు, శకనృపునకు సంబంధించిన సంవత్సరమని ప్రాచీనార్థము. ఏతదర్థమున శాలివాహనశక పదసంపుటి ద్వంద్వసమాసము. 'అల్పాచేతరమ్' అను పాణిని సూత్రమును అనుసరించి శకశాలివాహన పదసంపుటి నిష్పన్నము కావలయును. కాలేదు. 'అభ్యర్హితం పూర్వంచ' అను వరరుచి వార్తికమును అనుసరించి శాలివాహనశక పదసంపుటి నిష్పన్నమయినది. అనగా శకనృపునికంటె శాలివాహనరాజు అభ్యర్హుడని అర్థము. సంహృతుడైన క్రూరశకనృపునికంటె సంహారకుడైన వీరశాలివాహనరాజు విధిగా అభ్యర్హుడు. కాబట్టి 'శాలివాహన శకర్షము' అనగా అభ్యర్హుడైన శాలివాహనరాజునకు, అభ్యర్హుడు కాని శకనృపునకు సంబంధించిన సంవత్సరమని స్పష్టము. అనగా శకనృపసంహారమూలకమైన, శాలివాహన నిర్ణీతకాలికమైన, సంవత్సరమని అర్థము. తన్నామైకదేశ గ్రహణమైన శకవర్ష, శక కాలాది సర్వవ్యవహారమునకును అదియే అర్థము. శకనృపరాజ్యారంభ కాలమని, శకనిర్ణీతకాలమని చెప్పుట అనుచితము. మూలవిరుద్ధము. శకవర్షము అనగా శాలివాహన శకవర్షము. అథవా, శకనృప కాలాతీత సంవత్సరము. శకశబ్దమునకు కాలక్రమరూఢమైన కాలమానమనెడి అర్థమునుబట్టి, శాలివాహనశక పదబంధమునకు శాలివాహన నిర్ణీత కాలమానమని అర్థము చెప్పుట అనుచితముకాదు. రూఢి బలీయము. అంతేకాదు. అది ఎట్లును శాలివాహన నిర్ణీత కాలమానమే అయినందున మూలవిరుద్ధముకాదు. కాబట్టి శకనృపకాలాతీత సంవత్సర కారకుడు అనగా శాలివాహన శకనిర్ణేత శాలివాహనరాజు అని స్పష్టము.

శాలివాహనరాజు అనగా శాతవాహనరాజు. శాతవాహనరాజులందు గౌతమీపుత్త్ర శాతకర్ణి శకనిషూదనుడు. అంతేకాదు. క్షహరాతవంశ నిరవశేషకరుడు. శకక్షత్త్రపుడు, క్షహరాతవంశజుడు అయిన నహపానుని గౌతమీపుత్త్రశాతకర్ణి సంహరించుట చరిత్రప్రసిద్ధము. కనుక గౌతమీపుత్త్ర శాతకర్ణి శకనిర్ణేత అని డా॥ కె. పి. జయస్వాల్ గారి అభిప్రాయము.[71] కాని, గౌతమీపుత్త్ర శాతకర్ణి నహపానుని సంహరించిన కాలము క్రీ. శ. 124వ సంవత్సరము. క్రీ. శ. 78వ సంవత్సరముకాదు కాబట్టి గౌతమీపుత్త్రశాతకర్ణి శకనిర్ణేతకాడని స్పష్టము. హాలుడు శకనిర్ణేత అని కూడ అర్వాచీన కథలందు కలదు. కథలు ప్రమాణము కాదు. అంతేకాదు. క్రీ. శ. 78వ సంవత్సరము హాలుని రాజ్యాంతకాలము. కాబట్టి హాలుడు కూడ శకనిర్ణేత కాడని స్పష్టము. అయిన శాలివాహన శకనిర్ణేత అయిన శాతవాహనరాజు ఎవరు?—శాతవాహనరాజులందు శకశబ్దము శాశ్వత ముద్రపడిన శాతవాహనరాజు మాఢరీపుత్త్ర శివస్వాతి శకసేనుడు మాత్రమే. మాఢరీపుత్త్ర శివస్వాతి శకసేనుడని భవిష్యోత్తర పురాణమున కలదు. ఆ శ్లోకము పూర్వోదాహృతము. అంతేకాదు. 'రఞొమాఢరి పుతససామి సకసేనస' (రాజ్ఞః మాఢరీపుత్త్రస్యస్వామి శకసేనస్య) అని కన్హేరీ శాసనమున కలదు.[72] అనగా మాఢరీపుత్త్రస్వామి శకసేనుడని అర్థము. అంతేకాదు. మాఠరీపుత్త్ర, శకసేన, శకశాత, శకశాతకర్ణి, నామాంకితములైన నాణెములు కలవు.[73] అవి మాఢరీపుత్త్ర శివస్వాతి శకసేనుని నాణెములగును. మాఢరీపుత్త్ర పదబంధమునకు మాఠరీపుత్త్ర పదబంధము సాధురూపము. పతంజలి మహాభాష్యమునందు మాఠర కౌండిన్య న్యాయము కలదు. కౌండిన్యశబ్దము ఋషినామమువలె, మాఠర శబ్దము ఋషినామము. మాఠరీశబ్దము స్త్రీనామము. మాఠరీపుత్త్ర శివస్వాతికి శకసేనసంజ్ఞ నిర్నిమిత్తముకాదు. అది సార్థకమైన, స్వార్జితమైన బిరుదనామము కాక మఱొకటికాదు. శకసేనుడు అనగా శకసేన కలవాడని అర్థము. మాఠరీపుత్త్ర శివస్వాతి శకవిజేత కాకుండ శకసేన కలవాడగుట సంభవముకాదు. అంతేకాదు. శకసేనసంజ్ఞకల మాఠరీపుత్త్ర శివస్వాతికి మాత్రమే శకశాత, శకశాతకర్ణి, అను నాణక వ్యవహారములు సంగతము కాబట్టి మాఠరీపుత్త్ర శివస్వాతి శకసేనుడు శకవిజేత అని స్పష్టము. శకవిజేత శకనృప సంహారముచేయుట నిరాఘాటము. అయిన సంహృతుడైన శకనృపుడు ఎవరు?— నహపానునికి పూర్వముసౌరాష్ట్ర మాళవోభయ ప్రభువైన శకనృపుడు భూమకుడు. భూమకుని నాణెములు సౌరాష్ట్రమాళవదేశములందు లభించినవి.[74] భూమకుడు నిశ్శంకముగ శకనృపుడు. అంతేకాదు. అజ్ఞాతకర్తృకమైన 'పెరిప్లస్ ది ఇరిత్రేయియన్ సీ' అను గ్రంథమునందు 'కల్యాణి రేవుపట్టణమున పొరబాటున ప్రవేశించినను, గ్రీకు నౌకలను రక్షకభటవర్గము భరుకచ్ఛమునకు తరలించునట్లు' కలదని పూర్వోక్తము. కల్యాణము మహారాష్ట్రములోనిది. భరుకచ్ఛము సౌరాష్ట్రములోనిది. సౌరాష్ట్ర పాలకుడు శకనృపుడు. కనుక గ్రీకు నౌకలను సౌరాష్ట్రమునకు తరలించు రక్షకభటవర్గము శకసేన కాక మఱొకటికాదు. భూమకుని సంహరించి, శకసేనను స్వాధీనము చేసికొనుటవలన మాత్రము మాఠరీపుత్త్ర శివస్వాతికి శకసేన బిరుదము శాశ్వతముద్రకాగలదు. అన్యథాశరణం నాస్తి. కాబట్టి మాఠరీపుత్త్ర శివస్వాతి శకసేనుడు సంహరించిన శకనృపుడు భూమకుడని స్పష్టము. నహపానుని రాజ్యారంభకాలము క్రీ. శ. 82 లేక 84వ సంవత్సరమని ప్రసక్తము. 'పెరిప్లసు' గ్రంధరచనాకాలము స్థూలముగ క్రీ. శ. 70వ

సంవత్సరమని పూర్వోక్తము. అందలి మొంబానస్, భూమకుడని పూర్వోక్తము. కనుక భూమకుని రాజ్యాంతకాలము క్రీ. శ. 78వ సంవత్సరమగుట సావకాశము. మరి నహపానుని రాజ్యాంతకాలము అనగా గౌతమీపుత్ర శాతకర్ణి నహపానుని సంహరించిన కాలము క్రీ. శ. 124వ సంవత్సరము. అది గౌతమీపుత్రశాతకర్ణి 18వ రాజ్యవర్షము నందలి నాసిక శాసనమున ప్రతిఫలించినది.[75] అనగా గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యారంభకాలము క్రీ. శ. 106వ సంవత్సరము (124–18=106). గౌతమీపుత్ర శాతకర్ణికి మాఠరీపుత్ర శివస్వాతి శకసేనుడు అవ్యవహితపూర్వుడని వాయు, మత్స్య, విష్ణు, బ్రహ్మాండ, భాగవత, భవిష్యోత్తర పురాణము లారింటను కలదు. అంతేకాదు. మాఠరీపుత్ర శివస్వాతి శకసేనుని రాజ్యకాలము 28 సంవత్సరములని వాయు, మత్స్య, బ్రహ్మాండ, భవిష్యోత్తర పురాణములు నాల్గింటను ఏకవాక్యత కలదు. కనుక మాఠరీపుత్ర శివస్వాతి శకసేనుని రాజ్యారంభకాలము క్రీ. శ. 78వ సంవత్సరము (106–28=78). ఇది మఱొక విధముగ నేను నిర్ణయించిన శాతవాహనరాజ్యకాలమునకు సంవదించునది. మాఠరీపుత్రశివస్వాతి శకసేనుని రాజ్యకాలము క్రీ. శ. 78వ సంవత్సరము నుండి 106వ సంవత్సరమువరకు అని పూర్వోక్తము. కాబట్టి క్రీ. శ. 78వ సంవత్సరమున మాఠరీపుత్ర శివస్వాతిశకసేనుడు భూమకుని సంహరించి, శాలివాహనశకమును స్థాపించుట సుసంగతము.

శకనృప సంహార మూలకమైన శాలివాహన శకమును శక నృపులైన చష్టన, నహపానులు అనుసరించుట శంకనీయముకాదు. శాలివాహన శకము ప్రారంభమైన పదొకండు సంవత్సరములకు చష్టనుడు, నలుబదియొక్క సంవత్సరములకు నహపానుడు అనుసరించినట్లు శాసన ప్రమాణము కలదు. మాఠరీపుత్ర శివస్వాతిశకసేనుడు భూమకుని సంహరించిన నాలుగు లేక ఆరు సంవత్సరములకు నహపానుని రాజ్యారంభము. పదొకండు సంవత్సరములకు చష్టనుని రాజ్యారంభము. అంతకాలము సౌరాష్ట్రము, మాళవ దేశము అరాజకము కాదు. శకవిజేత మాఠరీపుత్ర శివస్వాతి శకసేనాధీనములు కాగలవు. ఆ ప్రాంతమున తన్నిర్ణీత శాలివాహన శకము వ్యవహారప్రసిద్ధమగుట సహజము. అదిచష్టన, నహపానులు అనుసరించుట ప్రాంతీయ వ్యవహార ప్రభావము. కాబట్టి చష్టన, నహపానుల అనుసరణమునుబట్టి, మాఠరీపుత్ర శివస్వాతిశకసేనుని శాలివాహన శక కర్తృత్వము శంకనీయము కాదని స్పష్టము.

శాతవాహనుల శాసనము లందు శాలివాహనశక వ్యవహారము లేకపోవుట కూడ శంకనీయముకాదు. మాఠరీపుత్ర శివస్వాతి శకసేనుని కన్హేరీ శాసనమున సంవత్సర సంఖ్య 8కలదు.[76] అది రాజ్యవర్షము. అతఃపూర్వము నాగనిక నానాఘాట్ శాసనమున సంవత్సర సంఖ్య ఉండవలసిన స్థలము శిథిలము.[77] అంతకు బహుపూర్వము అశోకుని శాసనములందు రాజ్యవర్ష వ్యవహారముకలదు.[78] అది శాతవాహనులు అనుసరించుట పూర్వ సంప్రదాయ పురస్కారము. నవ్యసంప్రదాయ తిరస్కారము కాదు. శాసన వ్యవహారము పూర్వ సంప్రదాయము. దేశ వ్యవహారము నవ్య సంప్రదాయము. కాబట్టి శాతవాహనుల శాసనము లందు శాలివాహన శక వ్యవహారము లేకపోవుటనుబట్టి కూడ, మాఠరీపుత్ర శివస్వాతిశకసేనుని శాలివాహనశక కర్తృత్వము శంకనీయము కాదని స్పష్టము.

సమష్టిపై శాలివాహన శకము మాఠరీపుత్ర శివస్వాతిశకసేన నిర్ణీతమని సిద్ధాంతము.

సూ చి క లు :

1 Vikramaditya of Ujjayini, p. 33 – f. n. 3.
2 The Jaina Sources of the History of Ancient India, p. 63.
3 Ibid – p. 220.
4 Ibid – pp. 60 – 62.
5 Ibid – p. 74.
6 Ibid.
7 Ibid.
8 Ibid.
9 Ibid.
10 A) Ibid.
B) History of classical Sanskrit literature – Introduction – IX.
11 A) Alberuni's India, Ed., E. C. Sachaw, Vol. II, p. 49.
B) The Journal of the Bihar and Orissa Research Society, Vol. XVII, p. I, p. 10.
C) The Jaina Sources of the History of Ancient India, p. 73.
12 The Journal of the Bihar and Orissa Research Society – Vol. XVIII, pt. I, pp. 7–16.
13 History of classical Sanskrit Literature-p.419.
14 India under Kushanas – p. 18.
15 Ibid – p. 7.
16 Ibid – p. 10.
17 The Early Kusanas – pp. 71–72.
18 Ibid – p. 58.
19 India under Kushanas–pp. 24–26.
20 The Journal of the Numismatic Society of India–Vol. XXX–1968, pp. 28–48.
21 Ibid – pp. 29 – 35.
22 Select Inscriptions – pp. 126–127.
23 Ibid – pp. 127 – 128.
24 Ibid – pp. 128 – 129.
25 Ibid – p. 130.
26 India under Kushanas – p. 20.
27 Ibid – p. 16.
28 The Early Kusanas – p. 28.
29 The Jaina Sources of the History of Ancient India – pp. 77 – 80.

30 Ibid – p. 189.
31 The Sakas in India – p. 71.
32 A History of India – p. 111.
33 Ibid – p. 115.
34 Ancient India as described by Ptolemy – pp. 152, 175.
35 Select Inscriptions – p. 157, f. n. 1.
36 A) Journal of Indian History – Vol. XLVIII, pt. II – 1970, p. 253.
B) Select Inscriptions – pp. 167 - 169.
37 Ancient Malwa and the Vikramaditya Tradition – p. 87.
38 Select Inscriptons – pp. 169 – 174.
39 Ibid – pp. 157 – 166.
40 A) Vikramaditya of Ujjayini - pp. 25 – 27
B) The Jaina Sources of the History of Ancient India – pp. 60 – 64 & 99.
41 Select Inscriptions – pp. 157, 160, 164, 165.
42 Chronology of Gujarat Historical & Cultural – pp. 98 – 99.
43 Journal of Indian History – Vol. XLVIII – pt. II, 1970, pp. 255, 256.
44 A) The Sakas in India – pp. 33 – 34.
B) Early History of India – p. 83.
45 Select Inscriptions – p. 165.
46 Ibid – p. 175.
47 Ibid – pp. 157, 160, 164. 165, 166.
48 Ibid – pp. 167, 168, 170.
49 The Indian Antiquary–Vol. XII–August 1883– p. 208.
50 Select Inscriptions – p. 182.
51 Ibid – pp. 157 – 166.
52 A) Journal of Indian History – Vol. XLVIII – pt. II, p. 253.
B) Select Inscriptions – p. 167.
53 The Indian Antiquary–Vol. XII–pp. 208–209.
54 Ibid.
55 Early Telugu Inscriptions – p. 113.
56 A) Epigraphia Indica – Vol. XX, pp. 148 - 154.
B) Appendix to Epigraphia Indica – Vols. XIX – XXIII – pp.
57 The Indian Antiquary–Vol. XII–pp. 210–214.
58 Ibid – p. 209.
59 South Indian Inscriptions – Vol. IV, p. 200, No. 700.
60 Ibid – Vol. X – p. 298, No. 550.
61 Appendix to Epigraphia Indica – Vols. XIX – XXIII, p. 144, No. 1078.
62 A) Epigraphia Indica – Vol. XX – Northern Inscriptions, p. 22, No. 134.
B) Appendix to Epigraphia Indica – Vols. XIX – XXIII, p. 22, No. 134.
63 Epigraphia Indica – Vol. XVII – p. 199.
64 Indian Antiquary – Vol. XII – pp. 124 – 215.
65 Ibid.
66 South Indian Inscriptions – Vol. IV – pp. 214, 218, 219, 224, 228,231–Nos 684, 698, 699 702, 709, 711.
67 South Indian Inscriptions – Vol. X – pp. 389, 391, 393, 396, 397, 398, 400, 401, 402, 403, 404– Nos.746, 749, 753, 755, 756, 757, 758, 763, 765, 766, 767, 768, 769, 790.
68 'శకోవిష్ఠ పశునాం స్యాద్దేశేచ గవయూ శకాః' –శ్లో. 91 – నానాలిఙ్గాధ్యాయః.
'కరణో లేఖకో రాజ్ఞాం వారకశ్శక నామకః'– శ్లో. 74– మనుష్యాధ్యాయః.
'ఖురశ్శ ఫశ్శకోవిష్ఠ ఘాసస్తు యవసశ్శిరిః'–శ్లో. 74– పశుసంగ్రహాధ్యాయః.
69 'శకో రాజన్య దేశయోః'–శ్లో. 5, కాన్త ఏకద్వివర్ణా.
70 'శకో గోమయ దేశయోః' – శ్లో. 9, కాన్తాః.
71 The Journal of the Bihar and Orissa Research Society, Vol. XVI, pp.
72 A) Luder's List – no. 1001.
B) Burges – Inscriptions from the cave temple of Western India – p. 60.
C) సాతవాహన సంచిక – అనుబంధము – పు. 11.
73 A) Satavahana Coins in the Andhra Pradesh Government Museum – p. 21.
B) Coinage of the Satavahanas and coins from Excavations – pp. 14, 20, 90.
74 The Sakas In India, p. 35.
75 A) Epigraphia Indica - Vol. VIII – Nasika Inscription No. 4.
B) సాతవాహన సంచిక – అనుబంధము – పు. 4.
76 As 72.
77 A) Select Inscriptions - p. 187.
B) సాతవాహన సంచిక - అనుబంధము – పు. 1.
78 Select Inscriptions – pp. 59, 70, 71, 79.

శ్రీ సర్దేశాయి తిరుమలరావు

గురజాడకు అర్థమయిన భారతీయ సంస్కృతి

శ్రీ పులిచెర్ల వారి సమాధానం (భారతి జనవరి 1979) యుక్తి యుక్తంగా, సమంజసంగా లేదు. వారి వాదంలోని బలహీనతను చర్చిస్తాను :

1) గిరీశం మధురవాణిని లంజ అనుటను బూతుగ పరిగణించినారు శ్రీ పులిచెర్లవారు. నేను నా "కన్యాశుల్క నాటక కళ" (గ్రంథం)లోనూ, "కన్యాశుల్కంలో అసభ్యత ఉన్నదా?" (భారతి, నవంబరు 1978)లోనూ చెప్పిన విక్టోరియన్ రెస్పెక్టబిలిటీని, మిడిల్ క్లాసు మెంటాలిటీని కనబరచినారు శ్రీ పులిచెర్ల వారు. "లంజ"అనే తెలుగు మాటకు బదులు "కులట","వేశ్య", "పణ్యాంగన" లాంటి దేవభాషా పదాలను వాడి వుంటే శ్రీ పులిచెర్ల వారభ్యంతరాన్ని చెప్పివుండరు. "దొంగలంజ సరస్సుణ్ణి దాచిందోయ్"కి మారు, "ఈ చోర పణ్యాంగన సరసుని గుప్తము గావించినది" అని వుంటే శ్రీ పులిచెర్ల వారు ఒప్పుకొని వుండే వారు. ఇంకొక విషయం మిండడు మిండెతను "లంజ" అంటే అది సహజత్వమే అవుతుంది. ప్రాచీన ప్రక్రియలయిన ప్రహసనము, వీథి, భాణంలలో అశ్లీలత వుందంటున్నారు శ్రీ పులిచెర్ల వారు. సంఘంలోని కుళ్ళును బహిర్గతం చేసి, ఇదయ్యా మీబండవాళం అని చాటే అద్భుత రూపక రీతులివి. నాటక, ప్రకరణాల కంటే వీని ఇమ్‌పాక్ట్ గొప్పది. తెలుగులో ప్రాచీన గ్రంథాలన్నింటి పైకి సంఘాన్ని అద్దంలోవలె చూపింది "క్రీడాభిరామం" అనే వీథి నాటకం. అచటి అసభ్యత, అశ్లీలతలు గ్రంథానికి సంబంధించినవి కావు. తత్కాలీన సంఘానికి సంబంధించినవి. స్వతహాగ ఏమాటా అసభ్యమూ కాదు. అశ్లీలమూ కాదు. అదే అయితే ఒక సమగ్ర నిఘంటువు నిషేధ్య గ్రంథం అవుతుంది. పదం, వాక్యంలో అసభ్యతను కానీ, అశ్లీలతను కానీ సంపాదించుకొంటుంది. అదిన్నీ, ఆ వాక్యం చెప్పేవారి మనోధర్మం బట్టీ, అల్టీరియర్ మోటివ్ బట్టీ. ఈ దృక్పథంతో, వాల్మీకి రామాయణంలో భరతుడు కైకేయిని తిట్టేందుకుపయోగించిన, సీత లక్ష్మణుణ్ణి తిట్టేందుకు ఉపయోగించిన పదజాలాలను పరీక్షించండి. మిత్రుడు కొంపెల్ల జనార్దనరావుపై శ్రీశ్రీ వ్రాసిన "ఎలిజి" లోని "దొంగలంజకొడుకులసలే మెసలే ఈ లోకంలో" అను వాక్యాన్ని పరిశీలించండి. నాటకంలో మాత్రం అటువంటి పదాలు సన్నివేశాలు తీసుకరారాదు అంటే, అది సంస్కృత రూపక భేదాలైన "నాటక", "ప్రకరణ"ముల కట్టడి, "కన్యాశుల్కం" ఇవి రెండూను కాదు అని నా సమాధానం. "కన్యాశుల్క" ఫక్కి వంటి దాన్ని తర్వాతి యూరోపీయ నాటక కర్తలూ అనుసరించిరి. స్ట్రిండ్‌బర్గ్, ఇబ్సెన్, షా, ఓనీల్, హౌఫ్‌మన్, గోర్కి, ట్యూరిటాను, చెహోవు వంటి ఎందరో? ఎనిమిదిలను కొంచెము మార్చితే — స్ట్రియలిస్టు నాటకాలు చూడండి. ఈ కారణం చేతనే కన్యాశుల్కాన్ని వర్ల్డ్‌డ్రామా అంటే శ్రీ పులిచెర్ల వారు నేను "పాత మాటలు". చెబుతూన్నానని కొట్టివేసినారు. కన్యాశుల్కంను వర్ల్డ్ డ్రామా అని ఇంతకు ముందే ఎవరో అన్నారన్నమాట! నాకా కాస్త క్రెడిట్ పోయింది! కొన్ని అక్షరముల సాంగత్యం వలననే బూతు శబ్దం వినవస్తే, నిత్యజీవితం దుర్భరమే అవుతుంది మరి. ఇంతకు ముందు నేను వాడిన "యూరోపీయ" అనే పదంలోనూ, తిక్కన కవితాక్షర సాగరంలోని "తామొడ్లకు", "ఆతులువ" వంటి అక్షర సంగతిలోనూ అసభ్య శబ్దం వినబడవచ్చు. అంటే, శ్రీ పులిచెర్ల వారు "అదిసరేనయ్యా, గిరీశం వాడిన ఆ మాట అసభ్యపు కూత అవునా కాదా" అని నిలదీసి అడుగుతారు. లంజకాని దాన్ని లంజ అంటే అశ్లీలం అవుతుంది కానీ, ఉన్నదున్నట్లు అంటే అశ్లీలం ఎట్లవుతుంది? నాటకం ఎంత ఉదాత్తాశయం కలదైనా, "కన్యాశుల్కం"లో వచ్చే పాత్రల. సాంఘికస్థాయి, నైతిక విలువలు గమనించండి! మిండగాండ్లు, మిండకత్తెలు, లక్ష్మణవజ్ఝల ఇంటిలోని వంటిపూటకూళ్లమ్మలు, డాఫరు మామలు, అగ్నిపుల్ల మాస్టరులు, దొంగ జాతకాలు సృష్టించే సిద్ధాంతులు, కోర్టుపకులు, వకాల్కు వకీళ్లు, లోఫరులు, ఆశపాతకులు—లిస్టు పెరుగుతూంది – ఈ పాత్రలను "సంఘ గసి" అనవచ్చు. నాటకం చివర్లలో సంఘపుటథోలోకం కూడా వస్తుంది. ఇక నాటక కాలం ఎలాంటిది? సౌష్ఠవమయిన పాత్ర ఆచార నియమాలు పోయి, ప్రాతకాలపు చేదస్తాలుమాత్రమే మిగిలి, ఆధునిక కాలపు శాస్త్రీయపు విలువలు రాక, కేవలం ఫేషనులు మాత్రం దాపురించిన సంధికాలం అది. "వేయిపడగలు" కాలం కూడా అట్టిదే. అటువంటి "సోషల్ మిల్యూ" లో వ్రాసిన ఒక పెద్ద ప్రహసనప్రాయ రూపకంలో జుగుప్సాకర పాత్రలు రాక ఏమిచేస్తాయి? వారు ఏ పరిభాషలో మాట్లాడవలె? దేవీ, ఆర్యపుత్ర అంటే బాగుంటుందా? అటువంటి పరిభాషలో ఉండినందు వలననే "వేయి పడగలు" తన రిప్రెసెంటే

టివ్ కారెక్టర్‌ని పోగొట్టుకుంది. ఏది ఎట్లుండాలో, అదిఅట్లుంటే ఔచిత్యం అంటాడు క్షేమేంద్రుడు. శాస్త్రీయ రంగంనే తీసి కొందాం. ''అశుచులు'', ''కాలుష్యం'' అనే పదాలను నిర్వచించిన రీతి చూడండి. ఒక పదార్థం ఉండరాని చోట ఉంటే దాన్ని కాలుష్యం అన్నారు. సాంబారు మల్లెపూల వాసన, కాఫీ కరివేపాకు వాసన వేస్తే అది పొల్యూషన్ అవుతుంది. అందుకే, కాల, దేశ, పాత్రలబట్టి, కన్యాశుల్కనాటకంలో గల సంభాషణలు, సన్ని వేశములు, సంఘటనలు బూతుకాదన్నాను. ''లంజ'' ఉంటే బూతు పో అవి శ్రీ పులిచెర్లవారు ఘట్టించి అనవచ్చును. జవాబివ్వక తప్పతుందా ?

వాల్మీకి కృతరామాయణం గాయత్రీ మంత్రి వ్యాఖ్యానం అని పెద్దలన్నారు. ఆ రామాయణాన్ని ''శ్రీమద్రామాయణ కల్ప వృక్షము'' అనే పేరుతో శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాసినారు. అందులో ఈ క్రింది పద్యం ఉంది

''కోరి ప్రత్యక్ష మన్మథ గురువ వైతి
కోరక పరోక్ష వైరాగ్య గురువవైతి
లంజియా ! యెంత క్రిందికి గుంజినావొ
యంత పైకినీ జను మార్గమరసినావు''

[రామా. కల్ప వృ. బాలకాం. ప. 209]

ఇదనేవాడు అప్పటికి ఒకసాటి రుషిఅయిన విశ్వామిత్రుడు. అనబడేది, ఈప్రబుద్ధనివల్ల చూతాలై, (''నీయందు నా దోసంబున్నది గర్భ రూపమున'') ''నిలువెల్ల వణంకి పోయి బీతున, గనుదోయి వాలిచి యధోముఖియై కరయుగ్మ మంజలింగొని నిలుచున్న'' సురవధూటి మేనక. ఆమె గర్భంలో ఉండేది శకుంతల. శకుంతలకు పుట్ట బోయేవాడు భరతుడు. ఈతని పేరుతోనే మనదేశం పిల్వబడుతూ వుండి అని కొందటి సిద్ధాంతం. వంశానికీ, దేశానికీ అంతటికీ తగిలే తిట్టు అంటే ఇట్లుండవలె. గ్రంథం అంటారా, భారతీ యులు దేవుని మందసాన ఉంచి నిత్యం పూజించేది (తులసీ, కృత్తివాసుల రామాయణాలు హిందీవారూ, బంగాళీవారు పూజిస్తారు), మన విశ్వామిత్రుని వచవంవల్లా, సంబోధనవల్లా వినువారి ''జీవుని వేదన'' ఎక్కువౌతుంది. ఇచటి కవి సమ్రాట్టు వ్రాతను శ్రీ పులిచెర్ల వారు ఎట్లు పరిగణిస్తారో చూడవలసి వుంది. ఇదికావ్యం ఒక మూలకూర్చొని ఒకరే చదువుకోవచ్చు అన డానికీ వీలులేదు. ఇది పుణ్యకావ్యం. భాగవతుడు కాని, పౌరాణికుడు కాని, ఈ ఘట్టాన్ని హరికథగ, పురాణంగా చెప్పే డేంజరువుంది. అమాయక భక్తులను ఆ శ్రీరాముడే కాపాడవలె.

2) ''మధురవాణి వేశ్యావృత్తిని వదలి వసంతసేనలాగా మంచివాణ్ణి ఒకణ్ణి ప్రేమించవచ్చు'' అని శ్రీ పులిచెర్ల వారు సలహా ఇస్తున్నారు. అందుకే కద వీరు కన్యాశుల్కం చదువ కుండా విమర్శిస్తారనింది నేను. ఎట్లంటారా ? మధురవాణి పాత్రోన్మీలనంలో పతాకస్థాయి, ఆమె వేశ్యావృత్తి విడనాడి సౌజన్యా రావు పంతులు ఇచ్చిన భగవద్గీతను స్వీకరించి బ్రహ్మచారిణిగ ఉండిపోవడం. ఈ విషయంలో మధురవాణి ఈశకృష్ణుని ఆదేశం మేరకు పింగళ, ఈసక్రీస్తు ఆశీర్వాదం మేరకు మగడాలమేరీవలె పాపకూపం నుండి విముక్తిపొందిన పశ్చాత్తప్తజీవి. శ్రీ పులిచెర్ల వారిచ్చిన సలహావంటి సలహానే సౌజన్యారావుపంతులు మధురవాణికి ఇస్తాడు. ఇప్పుడు ఫ్లాష్‌బాక్ :

సౌజ : వేశ్యలు విద్యలు నేర్చి, యితర వృత్తులవల్ల సత్కాల క్షేపం చెయ్యరాదా.

మధు : అట్లాచేస్తే తమవంటివారు వాళ్లను వివాహమాడుదురా?

సౌజ : యేం ప్రశ్న నేను యెన్నడూ వేశ్యను పెళ్లాడను.

మధు : పెళ్లి చేసుకోగోరిన వేశ్యలకు కోరతగిన వరులు దొరకడం యెలాగండి?

సౌజ : యీ సంగతి యింకా నేను బాగా ఆలోచించలేదు.

ఇదీవరుస, బాగా ఆలోచించకుండ ఇతరులకు శ్రీరంగ నీతులు బోధించేవారికి ఆంగ్లంలో ఒక పదం కద్దు అది ప్రిగ్. సౌజన్యారావుపంతులును ప్రిగ్ అనే అన్నారు శ్రీ సూరిగారు (దూ. భారతి డిసెంబరు 1978) అభ్యుదయ వాది యగు సౌజన్యారావు పంతులే వెనుకంజ వేసినప్పుడు ఇక వేరే ''మంచివాడు'' మధురవాణికి ఎక్కడదొరుకుతాడని శ్రీపులిచెర్లవారినడుగుతున్నాను. ఒక మంచివాడు వద్దంటే ఇంకొక మంచివాణ్ణి వెదుకుకొంమూ పోయే స్త్రీని ఏమంటారో శ్రీ పులిచెర్లవారే సెలవీయవలె. వసంత సేనకు మొదటనే తటస్థపడ్డ చారుదత్తుడనే మంచివాడు దొరికి నాడు. మధురవాణి సౌజన్యారావు పంతులును కేవలం ముద్దుపెట్టు కోవాలని ప్రయత్నించడం ''శరీర సంబంధమైన తుచ్ఛవాంఛ తొంగి చూడ''డమట! అప్పటికే సంసారి, పిల్లోణ్ణి కన్నవాడు, దివాలా వ్యాపారి పంతులు చారుదత్తుణ్ణి వసంతసేన కామించుటను ఏమనవలె? మధురవాణి ఎవరెవర్నుంముకోవిందో శ్రీ పులిచెర్ల వారెత్తి చూపిస్తున్నారు. అయ్యా! మధురవాణి సీతకాదు, అన సూయకాదు. కేవలం వేశ్య. నాటకాంతం అప్పుడు మధురవాణి ఏలా పరిణితి పొందిందో చూడండని మనవి చేస్తున్నాను. ''చింతామణి'' ఇంకొక ఉదాహరణ. ఋషుల్లోవలె వేశ్యల్లో పరిణితే ప్రమాణం.

3. ''చెడని వారిని చెడగొట్టవద్దని మా తల్లి చెప్పింది అని మధురవాణి సౌజన్యారావు పంతులును ముద్దుపెట్టుకొన నీయ లేదు. తల్లి చెప్పకపోతేమాత్రం అందుకు సిద్ధమే'' అని శ్రీ పులి చెర్లవారంటారు. అత్తపోరు అనే నానుడి ఇట్టిదే అనుకుంటాను. తల్లి చెప్పినమాట వింటేకూడ దెప్పలేనా? మాతృదేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ. తండ్రి ఎవరో చెప్పలేం- సత్యకామ జాబాలకథ (ఛాందోగ్యోపనిషత్తు)లోవలె చదువా అంతంతకే. మధురవాణికి గుర్విత్లే. ఆ మాటకువస్తే చదువు, తల్లి మోకాళ్ల

మీదనేకదా మొదలు పెట్టేది. పై మంత్రంలో కూడ ప్రథమ స్థానం తల్లిదే. తల్లిదండ్రుల, శ్రీ పులిచెర్లవంటి ఆచార్యులమాట విననందువలననే విద్యార్థిలోకం అస్తవ్యస్తమయింది.

4. ''ఏదో సౌజన్యారావు పంతులు ఒక్కడూ ఈ నాటకంలో ముద్దుల్లేని బుద్ధిమంతుడనుకుందామా! కుదరదే. నీవు సొగసరివి. ముద్దు చేదనికాదు. వ్రతభంగం కదా అని దిగులు. అని తన వెధవబుద్ధిని వెళ్లబెట్టుకున్నాడు. ఇక ఎవరు ఆదర్శ వ్యక్తులిందులో'' అని శ్రీ పులిచెర్లవారి సవాలు. శ్రీ పులిచెర్లవారి ఆదర్శవాదిత్వం మాననీయమైందే అయినా, వారి ఆదర్శభావం విడ్డూరమై వుంటుంది. ఒక రాజర్షికూతురును, ఆమెను పోషించే మహర్షి లేనపుడు, వారి ఆశ్రమానికి అనాహూత గెస్టుగా వచ్చి, అశ్లీలాలు కూయుచు, సెడ్యూస్‌చేసి పలాయన మంత్రం పఠించిన రౌడీరాజు దుష్యంతుడు వారి కాదర్శం. వేశ్యతో ''నీవు బాగానే వున్నావు నిన్ను ముద్దు పెట్టుకోవడానికి నాకేమీ వేఱే అబ్జెక్షను లేదు. కాని నాదొక వ్రతం వుంది. నేను, పరాయి ఆడదాన్ని ముద్దు పెట్టుకొనరాదని నియమం చేసుకొన్నాను'' అనిన ఒక రెస్పాన్సిబుల్ జెంటిల్‌మాన్‌ది వెధవ బుద్ధట! మంచిచెడ్డల సమ్మిశ్రణమే మానవత్వం. మనం చర్చిస్తూ వుండేది, డెకాడెంట్ సొసయిటీలోని మానవీయ పాత్రలు. ''అందఱు యోగ్యులౌటరిది, అందఱుయోగ్యులు కూడకాదు''. రామాయణ భారతాల్లోని పాత్రలగురించిన్నీ శ్రీ పులిచెర్లవారి ప్రశ్న అడుగవచ్చును అంటే వారు అది ''పాత మాట'' అని కొట్టి పారవెయ్యవచ్చు. సౌజన్యారావు పంతులుకు వేశ్యాసంబంధం కూడదను వ్రతం వుంది. ఆ వ్రతమేలేకుంటే సొగసరి యయిన మధురవాణిని ముద్దుపెట్టుకొనేవాడే. ఇతరులేర్పరచినట్టివో, లేక మనకు మనమే నియమించుకొన్న వ్రతాలు, నియమాలు నీతులు ఉండబట్టేకదా సంఘంలో ఎథిక్స్ ఉంది! దీన్ని కూడా శ్రీ పులిచెర్లవారు ఆక్షేపిస్తే ఎట్లా? ఇక సౌజన్యారావు పంతులు మధురవాణిని ముద్దు పెట్టుకోవడానికి ఒప్పుకొన్నాడు. ఎందుకు? లుబ్ధావధాని నిర్దోషిత్వంరుజువుచేసే రహస్యంమధురవాణి దగ్గరుంది. దాన్ని తెల్పేందుకామె అడిగిన ఫీజు ముద్దు. ఒక అమాయక వృద్ధబ్రాహ్మణ్ణి ''గల్లు''నుండి రక్షించేందుకు వ్రతభంగానికి కూడా ఒప్పుకొన్నాడు. ఒప్పుకొన్నాడు పో ''నీవు సొగసరివి ముద్దు చేదని కాద''న ఎందుకన్నాడు అని శ్రీ పులిచెర్లవారు అడుగవచ్చును. సౌజన్యారావు పంతులు హిపొక్రిట్‌కాదు కాబట్టి అన్నాడు. మనస్సు ఎట్లుపోయినా, చేతల్లో నిలుకడ కలిగిన సౌజన్యుడితడు. మనస్సుదేముంది? ''హృదయ కపిమత్యంత చపలం''. ''సదా మోహాటవ్యాం చరతి''. శ్రీ పులిచెర్ల వారంత అభ్యంతరం తెలిపే ''ముద్దు''ను గుఱించి కొంచెం ముచ్చటించుకొందాం. మధురవాణి ముద్దును నిస్సహాయులను కాపాడే ఆయుధంగా ఉపయోగించింది. ''లుబ్ధావధాన్లు పెళ్ళి తప్పిస్తేగాని ముద్దుపెట్టుకోనివ్వను'' అని రామప్పంతులుకు షరతు పెడుతుంది. కరటకశాస్త్రి శిష్యుడు (12 ఏండ్లు) మాయా సుబ్బివేషంలో వున్నప్పుడూ, వాణ్ణి రామప్పంతులు, లుబ్ధావధాన్లు భరతం పట్టించేందుకు ప్రయోగించేందుకు ముందూ ముద్దుపెట్టుకొన్నందుకు శ్రీ పులిచెర్లవారి విమర్శ. ఈ శిష్యుణ్ణిగురించే కరటకశాస్త్రికి ''యిక యితణ్ణి నాటకాలాడించి ముండలిళ్ల తిప్పి చెడగొట్టకండి'' అని భవిష్యదర్థం వుపదేశిస్తుంది. ''నీది గురూపదేశం, మధురవాణి'' అని కరటకశాస్త్రి వినమితుడౌతాడు. ఇట్టి పవిత్ర సంబంధాన్ని శ్రీ పులిచెర్లవారెంత అపార్థం చేసుకొన్నారు! ఖోస్లా కమిటీ వారిటీవల సినిమాలలో ముద్దును చూపించవచ్చును అని సిఫారసు చేసినారు.

5. ''మృచ్ఛకటిక నాటకాన్ని గురజాడ అనుసరించదలచి అయ్యవార్ని చేయబోతే కోతి అయినట్లు కన్యాశుల్కం తయారయింది చివరకు'' అని శ్రీ పులిచెర్లవారు. ''కన్యాశుల్కం'' కోతి పిల్ల మాత్రమే అని నేనంటాను. కోతి ఎవరబ్బా? అంటే గురజాడే! సంఘ దుష్టులు అనే రావణుల్ని కొక్కిరిస్తూ, ఎద్దేవాచేసే మహాకవి (కపి) గురజాడ కన్యాశుల్కంకు, మృచ్ఛకటికంకు పోలికే లేదని శ్రీ పులిచెర్లవారే ఒప్పుకొంటూన్నారు. కావున కన్యాశుల్కం అనుసరణాకాదు. అనుకరణాకాదు. మృచ్ఛకటికా కర్తే అనుసరణ యందు సాటిలేని మేటి, భాసమహాకవి ''చారుదత్తం''కు మక్కికి మక్కియే మృచ్ఛకటికం. మృచ్ఛకటికం గొప్పనాటకంకాదని నేనడంలేదు. అనుసరణ కూడా కళే. చార్లీ చాప్లినును అనుకరించిన వానికి ఫస్టుప్రయిజు, చార్లీచాప్లినుకే రెండవ బహుమతి వచ్చిన కథ ఒకటుంది. శర్విలకుడు దొంగతనానికి పోయినప్పుడు జంధ్యం గురించి అనుకొన్న మాటలనే కన్యాశుల్కంలో గిరీశం అంటాడని శ్రీ పులిచెర్లవారు. ''పారడి'' (Parody) అనే సాహిత్య ప్రక్రియ ఒకటుంది. శర్విలకుడు మంచివాడయ్యునూ జంధ్యాన్ని దుర్వినియోగం చేసినాడు. గిరీశం చెడ్డవాడు కనుకనే జంధ్యాన్ని ''సద్వినియోగం'' చేసినాడు. శర్విలకుడు జంధ్యాన్ని వినియోగించినఘట్టం కృతకంగానూ, నివార్యంగానూ వుంది. కన్నం వేసేందుకు, కొలతలు తీసికొనేందుకు జంధ్యాన్ని వాడుతాడు. అట్లా చేసేటప్పుడు పతనమయిపోయిన తన బ్రాహ్మణ్యాన్ని గురించి వాపోతాడు. మూరలతోనూ, జానులతోనూ, బెత్తెములతోను కన్నపు కొలతలు వేయవచ్చును. మరి జంధ్యాన్ని ఉపయోగించినట్లు నాటకకర్త ఎందుకు వ్రాసినాడు? ప్రేక్షక రంజనానికి వ్రాసివుంటాడు. బ్రాహ్మని జందెం, పిలక ఏనాటికీ హాస్యభాజనాలే. ఉత్తుత్తి నూలుపోగులేం ప్రయోజనం? దాన్ని విద్వాంసులు వదలివేస్తారంటుంది ఒక ఉపనిషత్తు ''బహిఃసూత్రత్యజేత్ విద్వాన్'' (బ్రహ్మోపనిషత్తు). బ్రాహ్మల్లో విశ్వాసంపోయినా, బ్రాహ్మణేతరులలో యజ్ఞోపవీతంపై విశ్వాసం పోలేదు కాబట్టి, గిరీశం వంటివాళ్ళు బతికిపోతూ వుంటారు. గిరీశం మానసంరక్షణార్థం జంధ్యంమీద ఒట్టు పెట్టుకొని, కొన్ని మాటలంటాడు. అప్పుడు థియోసఫిస్టులపై కూడా కొన్ని విసుర్లు వేస్తాడు. ఇది ప్రహసనం ఆయె. మృచ్ఛకటికంలోని శర్విలకునివి సందర్భ శుద్ధిలేని మాటలూ, చేతలూను. ''శకారుని ద్వారా కవి మనోహరమైన హాస్యాన్ని తొణికిసలాడేటట్లు చేశాడు కవి'' అని శ్రీ పులిచెర్లవారు ఆనందిస్తూ వున్నారు. రామాయణ భారత కథల్లోని విషయాలను అవకతవకగా బొగిలితే అది మనో

హారమైన హాస్యమా? వాని తప్పుడు మాటలను ప్రేక్షకులర్థం చేసుకోగలరట. ఎందుకంటే ఆయా విషయాలన్నీ సామాన్యుని అందుబాటులో వుండడమే అట. ఆ "సామాన్యులు" భారత రామాయణాలు క్షుణ్ణంగా చదివి వున్నవారై వుండవలె. అన్నీ తెలిసిన వారికి శకారుని "మిక్స్ అప్" హాస్యం ఏం రుచిస్తుంది? ఏమీ తెలియని వారు శకారుడు చెప్పే "దుశ్శాసనుడు సీత వెంట్రుకలుపట్టి యీడ్చినట్లు" అనేది కరక్టేనేమో అనుకొంటారు. ఇకహాస్యం ఎక్కడుంది. కానీ శకారుని చూచి అందఱూ నవ్వుతారుకాదా అంటే గిరీశంను చూచి కూడా నవ్వుతారని నేనంటాను. ఇక "వీథులతో వాసననేమో వినగల్గుచున్నాను కాని చీకటియున్నందున ముక్కుతో నేమియు జూడలేకుంటిని" వంటివి విని శ్రీ పులిచెర్ల వారే ఆనందించవలె. గిరీశం అవకతవక మాట్లాడేది అమాయకులైన వెంకటేశం, బుచ్చమ్మలవద్దనే. అగ్నిహోత్రావధాని, కరటక శాస్త్రి, సౌజన్యారావుపంతులువంటి ఘటికుల ఎదుట పిల్లివలెనక్కి వుంటాడు. వెంకమ్మతో ఎంతో గౌరవంగా మాట్లాడుతాడు. వెంకమ్మ బావిలో పడితే రక్షిస్తాడు. అన్నవరుస అయిన లుబ్ధావధానితో వినయంగా ఇచ్చకాలు మాట్లాడుతాడు. శకార సంభాషణమూ, గిరీశం ఉపన్యాసాలను పరీక్షిస్తే, గిరీశంవి "విట్టీ"గా వుంటాయి, శకారునివి "గ్రోటెస్క్"గా వుంటాయి. శకారుడు మాట్లాడేదాంట్లో ఏ ఉద్దేశమూ ఉండదు. గిరీశం మాట్లాడేదాంట్లో ఏదోఒక ఉద్దేశం, అల్టీరియర్ మోటివ్ వుంటుంది. రెండువేల యేండ్లక్రిందటి సాంఘిక పరిస్థితుల్లో శకారపాత్ర ఎంత చెల్లుబడికలదో, పందొమ్మిదవ శతాబ్దం తుది దశాబ్దంలోని గిరీశం పాత్రఅట్టిదే. కారణం? అవి మూలనమూనా పాత్రలు (ఆర్కిటయిపల్ కారెక్టర్స్) కావడమే. సన్నివేశాల్లోనూ, ఇతివృత్తాల్లోనూ ఆర్కిటయిప్స్ ఉన్నాయి. వివిధ దేశ సాహిత్యాల్లోను చరిత్రలోను ఉండే ఆర్కిటయిప్స్ ఇస్తున్నాను.

(I)	మంచి వేశ్యలు	:	పింగళ, వసంతసేన, ఆమ్రపాలి, వాసవదత్త (బౌద్ధ వాఙ్మయం), మధురవాణి, నానా, కామిల్.
(II)	విరాగిణులైన వేశ్యలు	:	చింతామణి, థయిస్.
(III)	నిషిద్ధ ప్రేమ	:	లేడీ చాటర్లీస్ లవర్, బద్దెన్న - బాదమ్మ, చండీదాసు—రామి, విద్యాపతి — శివసింహుని రాణి, అన్నా కెరానినా.
(IV)	అమాయకురాల్ని చెడగొట్టుట	:	టెస్ (థామస్ హార్డీ) ఊన్ వీ (మొపాసాం).
(V)	ప్లేటోనిక్ ప్రేమ	:	ఎబిలార్డ్ — హీలియోస్, జెబున్నిసా — శివాజి, డాంటి — బియాట్రెజ్.
(VI)	విషాదాంత ప్రేమికులు	:	లైలా - మజను, రోమియో — జూలియటు, సోహిని — మహీవాల్, హీర్ — రాంజా, షిరిన్ — ఫర్హాద్, చంద్ర వదన — మోహియార్, అనార్కలి - సలీం.
(VII)	ఒకరి భార్యను ఇంకొకడు ఎత్తుకొనిపోవుట	:	రామాయణం, ఇలియడ్, బాలనాగమ్మ కథ, పద్మావత్.
(VIII)	సాధ్వికి సమీపవర్తితో అంకు కట్టుట	:	డెస్డిమోనా, లక్ష్మమ్మ.
(IX)	తల్లి కొడుకును మోహించుట	:	ఊర్వశి — అర్జునుడు, తిష్యరక్షిత — కుణాలుడు, చిత్రాంగి — సారంగధర.
(X)	యువతి మొదట ఒక దుర్మార్గుని వలలో పడి తరువాత పశ్చాత్తాపం చెందుట	:	రత్నావళి (చెలియలికట్ట), ఎమిలి (డేవిడ్ కాపర్ ఫీల్డ్), కమలమ్మ (మాలపల్లి), నతాషా (వార్ ఎండ్ పీస్), నాయిక ("నారాయణరావు")
(XI)	దుష్టప్రకృతిగల హాస్యగాళ్ళు	:	శకారుడు, జింగిల్, ఫాల్స్టాఫ్, గిరీశం, గణపతి ("గణపతి" నవల).
(XII)	శిష్టప్రకృతిగల హాస్య పాత్రలు	:	డాన్ క్విగ్జోటు, గర్గాంట్వా ముంఛాసెన్, హుడిబ్రాస్, బారిస్టరు పార్వతీశం, స్ట్రూవెల్ పీటరు.
(XIII)	అన్నదమ్ముల వైరం	:	వాలి — సుగ్రీవ, రావణ - విభీషణ, కౌరవ — పాండవులు.
(XIV)	దాయ భాగం తగాదా	:	మహాభారతం - పల్నాటి వీరచరిత్ర.
(XV)	పశువుల మేత రగడా	:	ఉత్తర గోగ్రహణం — కాటమరాజు కథ.
(XVI)	ఒక నియమం మేరకు వనవాసం	:	రామాయణం, మహాభారతం, నల చరిత్ర.

(XVII)	మొదట భార్యా వ్యామోహంలో వుండి తర్వాత జ్ఞానోదయమై గొప్పవాడగుట	: సుందరీ నందులు (బౌద్ధ వాఙ్మయం) ధనుర్దాసు (వైష్ణవ వాఙ్మయం) తులసీదాసు.
(XVIII)	తల్లిదండ్రుల నుండి పరారయి తుదకు మహాత్ముడగుట	: బుద్ధుడు, ఆదిశంకరుడు, చైతన్యుడు.
(XIX)	ఒద్దికకల అన్నదమ్ములు	: దాశరథేయులు, పాండవేయులు, ధార్తరాష్ట్రులు.
(XX)	మంచి కొడుకు — "చెడ్డ తల్లి"	: భరతుడు — కైకేయి, హామ్లెటు — గెర్ట్రూడు, దయానిధి — తల్లి ("చివరకు మిగిలేది"), ఒరెస్టెజ్ — క్లయిటెంనెస్ట్రా, కర్ణ — కుంతి.
(XXI)	చెడ్డ తండ్రి — మంచి కూతురు	: లియరు—కార్డీలియా, నికోలాయ్ బాల్కాంస్కీ—మేరి, (వార్ ఎండ్ పీస్).
(XXII)	సోదరులలో ఒకడు శత్రుపక్షం చేరుట	: సుగ్రీవుడు, విభీషణుడు, విదురుడు.

డికెన్సు, విశ్వనాథ నవలల్లోకూడా మూలనమూనాలున్నాయి. ఇదంతా డాక్టరేటు కయ్యేంత మేటరు. అటువంటప్పుడు ఈ పాత్రను ఆ రచయిత అనుకరించినాడు అనడం సరికాదు.

6. గురజాడపైని శ్రీ పులిచెర్లవారి వ్యక్తిగత ఆరోపణలు చూస్తాము :

"గురజాడ తన పుస్తకాన్ని ఎవరికి అంకితమిచ్చాడు ? గురజాడను అనవసరంగా ఆకాశానికెత్తిన రాజకీయ పక్షం వాళ్ళు ఎప్పుడైనా ఆలోచించారా? ఊటీలో కూర్చొని సామాన్యుల కోసం ఇంగ్లీషులో పీఠికలు రాశాడు 'మహాకవి'! గురజాడ దృష్టిలో సామాన్యులు జమీందారులు ఇంగ్లీషువాళ్ళేమో."

ఇరవైయవ శతాబ్దం నడుమ ముక్త్యాల సంస్థాన అధిపతులను ప్రబంధ ఫక్కీలో ఇంద్రుడు, చంద్రుడు రాజర్షి వంటి వందిమాగధ పరిభాషలో "రామాయణ కల్పవృక్ష" కర్త పొగిడితే లేని ఆక్షేపణ, పందొమ్మిదవ శతాబ్దం చివరలో విజయనగరం మహారాజాకి "కన్యాశుల్కం" Dedicate చేస్తే ఆక్షేపణా? విజయనగరం రాజా మొదలుపెట్టిందేకదా బాల్యవివాహ నిర్మూలనోద్యమం! ఈ విషయాన్ని గురజాడే నాటకపు ప్రథమ ముద్రణానికి పీఠిక (Preface to the first Edition)లో స్పష్టీకరించినాడు. రాజావారి ఉద్యమానికి "ఉడుతాభక్తి"గా (ఈ ప్రసిద్ధనానుడి గురజాడ డెడికేషన్‌లో "the faithful squirrel brought at the end of its tail a few grains of sand) "కన్యాశుల్కం" వ్రాసి అంకితమిచ్చినాడు. విజయనగరం మహారాజా ఋగ్వేదాన్ని మొట్టమొదట అచ్చువేయించినాడు. గురజాడ ఆయనకు స్నేహితుడు, సహచరుడు. కుడిభుజం. పండితుడు, సంస్కారి, అభ్యుదయవాది అయిన విజయనగరం రాజును, ఆయన స్నేహితుడు గురజాడను హిస్టారికల్ పెర్‌స్పెక్టివ్‌లో చూడకుంటే, వీమరు సంస్థానానికి (జర్మని) మంత్రి పదవిచేసిన గెటే గతి గురజాడ గతివంటిదే అవుతుంది. శ్రీ పులిచెర్లవారు చెప్పడానికి జంకిన కమ్యూనిస్టుపార్టీవారు, గెటే గురజాడలలోని విశ్వజనీనత వలననే ఇద్దరినీ ఆకాశానికెత్తుతూన్నారు.

గెటే గురించి ఆర్నాల్డు ఇట్లా వ్రాసినాడు :

Goethe has done his pilgrimage
He took the suffering human race
He read each wound, each weakness clear
And struck his finger on the place
And said - Thou ailest here and here
(Memorial Verses by Matthew Arnold)

పై పద్యంలో Goethe బదులు Gurazada అని వుంచి చదివితే కూడ సమంజసమే.

ఫ్రెంచి విప్లవానికి దారి తీసిన రచనలు చేసిన వారిలో వోల్టేర్ ఒకడు. హేతువాది. ఇతను ఒక జమీందారిణి పోషణలోనూ జర్మన్ చక్రవర్తి ఫ్రెడరిక్ ది గ్రేటు ఆశ్రయంలోను జీవించినాడు. గెటే వోల్టేరుల విషయంలో చూపించే సహనమైనా, గురుజాడకు చూపించండని శ్రీ పులిచెర్లగారికి మనవి. గురజాడ ఆరోగ్యం సున్నితమైంది. పైగా మహారాజాగారికి తోడుగా వుండడానికి ఊటీ వెళ్లేవాడు. అచ్చటకూడా రచనలు చేసేవాడు. విశ్వకవి రవీంద్రుడు హిల్ రిసార్ట్‌స్‌లో రచనలు చేసేవాడు. గురజాడ 'నీలిగిరి పాటలు' వ్రాసినాడు. గురజాడను విప్లవవాదులు మెచ్చుకుంటున్నారు కాబట్టే, ఆయన విప్లవకారులవలె నినాదాలుచేస్తూ విప్లవం ఎందుకు తీసుకరాలేదు అని శ్రీ పులిచెర్లవారి తొందర. కౌంటు అయిన టాల్‌స్టాయి రచనలు, ప్రిన్స్ ("యువరాజు") అయిన క్రోపాట్కిన్ రచనలు విప్లవకారులకు ఆదర్శాలుగా వున్నాయి. ఆధునిక విప్లవాలన్నిటికీ మూలభూత రచనలు చేసిన మార్క్స్ బ్రిటిషు మ్యూజియంలో ఒకమూల కూర్చొని వ్రాసుకొనేవాడు. ఈయన, ఎంగెల్స్ గతించిన తర్వాత ఒక తరంనాటికి విప్లవం వచ్చింది. అటులనే బాల్యవివాహ నిషేధచట్టం ("శారదా బిల్లు") గురజాడకు తరం తర్వాత చేయబడింది. ఏ ఉద్యమానికైనా భావోత్పత్తి, భావ ప్రచారం, భావక్రియ అనే మూడు దశలుంటాయి. గురజాడది మొదటి రెండు దశలు. "ఆకులందున అణగిమణగి కవిత కోకిల పలుకవలెనోయ్" అన్న తత్వమాయనిది. ఆయన సంస్కారవాది. సంస్కారం విద్యాధికుల (ఎలీట్స్)నుండి ప్రారంభమవుతుంది.

విప్లవం జన సామాన్యుల నుండి ప్రారంభమవుతుంది. అందుకే గురజాడ ఎలీటిస్‌కోసం ఇంగ్లీషులో పీఠికలు వ్రాసింది. గిరీశం వాడే ఇంగ్లీషు పదాలు కష్టమయితే, శకారుని విపరీత శాస్త్రపురాణాలను సరిచేసి చెప్పడానికి శ్రీ పులిచెర్లవారి వంటివారు రన్నింగ్ కామెంటేటర్‌గా ఉండాల్సివస్తుంది. ఇకజమీందారులా? ఈవర్గము గురజాడ రచనల్లో ఎక్కడారారే! విశ్వనాథ రచనల్లో వీరు మస్తుగా వస్తారు.

7. ''కన్యాశుల్క నాటకం ప్రదర్శనకు అయోగ్యంగా ఉన్న దెందుకని'' అన్న శ్రీ పులిచెర్లవారి వాక్యం ''కన్యాశుల్క నాటక ప్రదర్శనానికి ఈనాటి ఆంధ్రదేశం అయోగ్యం ఉన్నదెందుకని'' అని వుండవలె. ఆంధ్రదేశంలోని గొప్పనటులు కన్యాశుల్కంలో ఏదో ఒకపాత్ర భూమికను ధరించినవారే. ''అగ్రగామి'' (అవాన్‌ట్ గార్డే) డ్రామాలు వేయడం సుళువుకాదు. ''కన్యాశుల్కం'' ఈనాటికీ అగ్రగామే. ఇక తెలుగులో, తెలుగుదేశంలో బ్రెహ్ట్ నాటకాలూ, స్రియలిస్టు నాటకాలూ, అసంబద్ధతా నాటకాలు చూచేదెప్పుడు? ప్రతాపరుద్రీయం, సత్యహరిశ్చంద్ర, రాధాకృష్ణ, శంబూకవధవంటి కన్యాశుల్కేతర సాహిత్య పర నాటకాలైనా ఎవరైనా వేస్తున్నారా నేడు?

8. కడపటగా గురజాడ గురించి ఏదైనా చెడ్డది అందామని కాబోలు శ్రీ పులిచెర్లవారు సంగతి సందర్భాలు లేకుండా ''గురజాడకు భారతీయ సంస్కృతి అర్థంకాలేదు'' అన్నారు. గోగోలు ''కోటు''నుండి రష్యన్ కథ ఆవిర్భవించిందట. ఆలాగుననే, ఆధునిక నాటకం, ఆధునికగేయం, ఆధునిక కథానిక గురజాడనుంచే వచ్చినాయి. బంకిమచంద్రుని ''వందేమాతరం''. రవీంద్రుని ''జనగణమన'', ఎక్బాలు ''సారేజహాంసె అచ్ఛా''కంటె విస్తృత పరిధికల దేశభక్తి గేయం వ్రాసినాడు గురజాడ. అది ఫ్రెంచి రచయిత పాటియర్ వ్రాసిన 'ఇంటర్నేషనల్' అనే అంతర్జాతీయగీతంలాంటిది. గురజాడకు ''దేశం'' అంటే ప్రపంచమంతానూ, థామస్ పెయిన్‌కు వలె, వాల్‌టు విట్మనుకువలె. ''ఉదార చరితానాం తు వసుధైవ కుటుంబం''లో పేర్కొన్నబడ్డ ఉదారచరితుడాయన. దేశం అంటే మనిషి అని మానవత్వ ప్రాముఖ్యాన్ని చాటినాడు. ఇదీ చాలా ''పాత మాటే''. ''నమానుషాత్ శ్రేష్ఠతరం హి కించిత్'' అని మహాభారతం అంటుంది. ''పాతమాటల'' నేనంటే శ్రీ పులిచెర్లవారికి సరిపోదు. అది, రామప్పంతుల మాటల్లో చెప్పవలెనంటే, వేఱే కథ. గురజాడ అన్ని జాతులూ ఒకటే అన్నాడు. ''మంచి యన్నది మాలయయితే మాలనే అగుదున్'' అంటాడు. ఇట్టిదే జగజ్జ్యోతి బసవేశ్వరుడూ అన్నాడు. వైవాహిక వ్యవస్థ, స్త్రీ దురవస్థ, బాల్య వివాహాలవల్ల శిశువితంతువుల మూగగోడు, నరమాంస విక్రయం ద్వారా తల్లిదండ్రుల పశుప్రవృత్తి, సంసారుల దొంగచాటు వ్యభిచారం, సానుల బాహాటపు వ్యభిచారంతో పోటీ, బ్రాహ్మణా బ్రాహ్మణాలకూ, బ్రాహ్మణ శాఖలకూ ద్వేష దురభిమానాలూ, తాగుళ్ళూ, జూదాలూ, కోర్టులకెక్కి ఇల్లు గుల్ల చేసుకోవడాలూ (మిత్రుడు రమణారెడ్డిగారి పదజాలం వాడుకుంటూన్నాను) నిరసించినాడు. అంచక్కగా ఇంక ఎవరూ నిరసించని విధానంలో నిరసించినాడు. పై దుర్లక్షణాలు ఏ సంస్కృతిలోనైనా వుంటాయి. అవి మనలోకూడ ఉన్నాయి. అవి వద్దన్నాడు. గేలిచేసినాడు. ఏడ్చినాడు. ఏడ్పించినాడు. నవ్వినాడు నవ్వించినాడు. మహారాజావారికి సలహాదారై వుంటూ రిటయరై ఉండడానికి ఇల్లులేకుండ ఉండినాడు. ''ముద్రారాక్షస'' నాటకంలోని కౌటిల్య మంత్రి కుక్కి ఇంటి వర్ణన చదవండి. మంచితనం అనేది జాతి, మతములపై ఆధారపడదు అనినాడు. మనం చెడ్డ అని కొట్టిపారవేసే వారిలో కూడా మంచి ఉంటుందన్నాడు.

తెలుగు సంస్కృతి పెంపొందించుకొండి. పెఱ సంస్కృతి (బంగాళి)ని గుడ్డిగా అనుకరించకండి అని భంగ్యంతరాన చెప్పించినాడు. ఆనాటి ఏకైక నాయకుడు సురేంద్రనాథ బెనర్జీని ఆదర్శవంతంగా ధ్వనిపూర్వకంగా ప్రచారం చేసినాడు. ''ఆ పీనుగులు (పూర్వులు)మనలాగే యేడుస్తూ వుండేవారు అంతకం టె అర్ధాన్నం'' అని ఒక పెంకె పాత్ర (''మీ పేరేమిటి'') తో చెప్పించి ''పురాణమిత్యేవ న సాధు సర్వం'' అనే కవి కులగురు మతాన్ని ప్రతిధ్వనించినాడు. ఇది భారతీయ సంస్కృతి అనుకొన్నాం. ఇది గురజాడ అర్థం చేసుక మనకు చెప్పిన సంస్కృతి అనుకొన్నాం. కాదని శ్రీ పులిచెర్ల వారంటూన్నారు. శ్రీ మద్రామాయణ కల్పవృక్షం'' లోని విశ్వామిత్రుడు ''లంజ'' అని పిలిచిన ఆమెయొక్క మనుమని పేరుతో చెలామణి అవుతున్నది అని కొందఱనే ఈ దేశంయొక్క సంస్కృతి వేఱే వుందేమో? శ్రీ పులిచెర్లవారు సెలవిస్తారా?



కలగూరగంప

'ప్రజాకవి' - అర్థంలేనిపదం

ఎవరినో 'ప్రజాకవి' అని నిర్వచించడంద్వారా అసలైన ప్రజా కవికి అవమానం జరిగిందని ఆవేశపడ్తూ శ్రీ ముడార్ వేణు వ్రాసిన లేఖచదివిన తరువాత ఈ ''ప్రజాకవి'' అన్నపదానికి ఏదైనా అర్థముందా అని యోచించాను. ప్రజల కష్టాలను కేవలం స్పృశించడం ఆ అర్హతనివ్వదని, వారిలో ఒకడిగా వుండి వారి కష్టాలను తానూ అనుభవించి వారిని వుద్ధరించగల్గేవాడు ప్రజాకవి అని వారి వుద్దేశ్యం కవిలోవున్న ప్రధాన అంశం ఊహాశక్తి. తాను పూరి గుడిశెలో వుండికూడా ''అంబర చుంబిత హర్మ్యాలను వూహించగలడు.'' చలిని వర్ణించడానికి తాను బయటకువచ్చి చలి గాలిలో నిల్చుకోవలసిన పనిలేదు. ప్రజల కష్టాలను గుర్తించి, వాటిని ఉల్లేఖించడానికి, కవికూడా నికృష్ట దరిద్రుడు కావాలా? నాకు తెలిసినంతవఱకు శ్రీ.శ్రీ గాని, దాశరథి కాని, మరీ అంత నిరుపేద జీవితం గడపలేదే? అయినప్పటికీ ఏవిధంగా, దరిద్రుల బాధలను కండ్లకు కట్టినట్టు చిత్రించారో జగద్విదితముగదా! ఎంత మంది కిరాతకులను వేటాడుతూ చూడలేదు. కానీ ఒక్క వాల్మీకినోటి నుండే శ్లోకం ఎందుకుద్భవం కావాలి! కవి అన్నవానిలో కవితా సంపదవుంటే, తాను ఆ కష్టాలు అనుభవించకున్నా తన పాఠకులతో అనుభవింపకల శక్తివంతుడు కాగలడు.

అసలు 'ప్రజలు' అన్న పదానికి సిసలైన అర్థం ఎవరన్నా చెప్పగలరా? ఫ్రెంచ్ విప్లవం తరువాత ఈ ''ప్రజలు'' అన్న పదానికి విశేష ప్రాధాన్యం యివ్వబడింది. రూసో రచించిన అనేక రాజకీయ గ్రంథాలలో ప్రజాభిప్రాయం, ప్రజావిప్లవం, వంటి పదాలు విశేషంగా దొర్లినాయి. ఫ్రెంచి విప్లవం ముందున్న రాజరికపు వారసులు, లమ ప్రజలను నిర్లక్ష్యం చేసారు. అప్పుడు జరిగిన రక్తకాండలో, పరిపాలకులను వారిబంధుమిత్రులను పూర్తిగా మట్టుపెట్టడమే కాక, ఆ అధికారవర్గం దేనిని ఆప్యాయంగా కాంక్షించేదో వాటిపట్ల తీవ్రద్వేషాన్ని వెల్లకక్కింది. ఫ్రెంచ్ విప్లవం తరువాత కొన్నిరోజులు, సాహిత్యాన్ని చర్చించడం, కళాసాంస్కృతికలపట్ల ఆసక్తి చూపడం, తాత్విక చర్చలు జరపడం, ''విప్లవద్రోహం''గా జమకట్టబడింది. శిష్టవ్యావహారికాన్ని వుపయోగించడం, సంభాషణలలో సంస్కృతిని చొప్పించడం, 'ప్రజల'పట్ల ద్రోహంగా పరిగణింపబడింది. కారణం, అట్టడుగున వశించే ప్రజల భాష, సంస్కృతివేరు. వారికి పై పేర్కొన్నవి బుఱ్ఱకెక్కవు. కాబట్టి మరీ బజారు భాష వాడేవారు ప్రజాకవులుగా పరిగణింపబడ్డారు. ఈ విపరీత, విప్లవ భావాలు, సంఘ సంస్కృతి బునాదులనే కదిల్చి వేసిందని తరువాత రచయితలు భావింపసాగారు ముఖ్యంగా ఎడ్మండ్ బర్క్, రచనలలో మనకిది స్పష్టం అవుతుంది.

అసలింతకూ చెప్పేదేమంటే, ఇటువంటి పదాలకు స్పష్టత వుండదు. మనం ఎవరిపట్ల వుంటే, వారినేప్రజలుగా భావింపవొచ్చు. మన కిష్టంలేని వారిని ప్రజా ద్రోహులుగా చిత్రీకరించవొచ్చు. ఇది రాజకీయాలలో సర్వసాధారణంగా జరిగేదే. అయితే దీన్ని సాహిత్యంలో యిరికించే అవసరముందా అనేదే నా అనుమానం. కవి ముఖ్యంగా రసికుడు. అతని కవిత్వాన్ని విభిన్నస్థాయిలోని వ్యక్తులు విభిన్నంగా అనుభవం పొందుతారు. ఇంతలో, అతని కవిత్వాన్ని విశ్లేషించి, ఇది ఏ 'జాతి'కి చెందింది అని, అతన్ని ప్రజాకవా, కాకుంటే విప్లవద్రోహా అని రభసచేసే తతంగం, సాహిత్యానికి ఎంతమాత్రం వుపకరిస్తోందో అనే నా అనుమానం. అట్టి విభజన అసాధ్యమని నేనను అయితే అది అనవసరమంటాను.

ఇకపోగా ప్రజలలో విభిన్న వర్గాలున్నాయి. ఒక వర్గంవారికి మరోవర్గం వారికి చుక్కెదురు. కమ్యూనిస్టులప్రకారం కవియొక్క ముఖ్యమైన వర్గ ఘర్షణను మరింత పెంపొందించి, విప్లవానికి దోహదమిచ్చే రచనలు చేయడం అసలు, సందేహమేమిటంటే ఎటువంటి రచనలు విప్లవాన్ని యిస్తాయి అని నిర్ణయించేది ఎవరు? విప్లవ నాయకులా? వారిలో వారికి భేదాభిప్రాయాలు వచ్చినప్పుడు, ఒక నాయకునికి నచ్చిన కవిత్వం మరొక నాయకునికి విరసనగా తోచవొచ్చు. తుదకు కవీశ్వరులు ఫుట్‌బాల్‌వలె, ఒకప్పుడు విప్లవ కవులగానూ, మరోకప్పుడు ప్రజాద్రోహులుగానూ, విప్లవ నాయకుల భేదాభిప్రాయాలమధ్య తన్నబడ్తారు. ఇది మనకప్పుడే అనుభవమైంది. ఇకపోతే, వర్గరహిత సమాజం ఏర్పడినప్పుడు కవి పని ఏమి? మార్క్స్ సిద్ధాంతాన్ననుసరించి, 'రాజ్యం' ఏవిధంగా రాలిపోతుందో అదేవిధంగా కవి, కవిత్వం, కళాసంస్కృతులూ రాలిపోతాయా? నాకు నిజంగా ఆ సమాజాన్ని తలచుకొంటేనే భయమేస్తుంది.

మరో విషయం. ఆకలి, ఆర్థిక అసమానత్వం, దగాకోరుతనం, సమాజంలోని శాపాలే. కాదనలేం. కానీ ఈ సమస్యలను ఆలాగుంచి, జీవితంలోని యితర విషయాలపై ధ్యానాన్ని కేంద్రీకరించడం, ప్రజా ద్రోహమా? వట్టి ఆర్థిక సమస్యలే మన జీవితాలు నింపివేయాలా? కరుణ, జాలి, ప్రేమ వంటి మానవతా విలువలను స్పృశించడం కూడా ప్రజా కవిత్వమే కాగలదు కదా!

తమ జాతికి ఒక భాషను అందజేసి, దాన్ని సుసంపన్నంగా, తీర్చిదిద్ది, ఒకరీతిని నేర్పి, ఆ భాషలో గ్రంథాన్ని రచించిన నన్నయ ప్రజాకవి కాడా? పది కాలాలపాటు తన జాతివారు చెప్పుకొనేటటువంటి రచనచేసి ప్రజలలో సాహిత్యాభిలాషను రేకెత్తించిన తిక్కన ప్రజాకవి కాడా! తన సుమధుర కావ్య లక్షణాలతో, అక్షర జ్ఞాన మెఱుగని, పల్లెటూరి వారు సైతం గొంతెత్తి పాడేటువంటి రచనల నొసర్చిన పోతనగారు ప్రజాకవి కాడా! ఏమిటో ఈ వెఱ్ఱి విభజన. అసలు ఇటీవల 'భారతి'లో ప్రచురింపబడే, అభ్యుదయపు పేరుతో రచించిన కవిత్వాలు, తలా తోక లేని రచనలుచూస్తే పాత కాలపు కవిత్వాలు ఎన్నో రెట్లు నయమనిపిస్తుంది. అసలు రచయిత ఏమి చెప్పదలచుకొన్నాడో, కొద్దిగా జ్ఞానముకల (సోత్కర్షా కాదు

సుమండీ), మనవంటి వారికే తోచకపోతే, దీన్ని ప్రతినిత్యం పొలాల్లోనూ, ఫ్యాక్టరీలో శ్రమ పడసి, అలసి సొలసిన శ్రమజీవులకు అర్థం చేసుకొనే ఓపిక ఎక్కడుంది? ఈ రచనలను వారి ముందు చదివితే విప్లవం సంగతి అటుండనివ్వండి, చిరాకుతో కవీశ్వరుని లెంపలకు శుద్ధి చేయకుంటే చాలు!

ఇట్టి విభజనలలో చాలామంది పేర్కొన్నటువంటి గురజాడ, ప్రజాకవి ఎలా కాగల్గాడు అన్నది నా అనుమానం. వలస రాజ్యాలకు వంతపాడి, ఏ వర్గాన్నైతే వీరు ప్రజాద్రోహులుగా చిత్రిస్తున్నారో అదే జమీందారుల దగ్గర విశ్వాసపాత్రుడిగా మెదల్తూ, ఏదో ఒక వర్గాన్ని బాధించే సమస్యపై రచించిన ఒక్క నాటకం, ఏ విధంగా గురజాడను ప్రజాకవిని చేసిందో దూరూహ్యం. ప్రజలను ఆనాడు ముఖ్యంగా బాధించింది బ్రిటీష్ పాలన (కన్యాశుల్కం కాదు). ఆ వలసదార్ల దోపిడీని మన అదృష్టంగా కీర్తించిన మహనీయుడు ప్రజాకవా! అసలు అతన్ని జమీందారుల ఆస్థాన విదూషకుడనడం సమంజసమేమో!

ఇటువంటి వారికన్న, ఇపుడు అభివృద్ధి నిరోధకుడని · ఇతర 'బిరుదులు' పొందిన కీ॥ శే॥ కవి సమ్రాట్టు విశ్వనాథ ఎంతో మేలు. తమ ఆంధ్రాభిమానంతో, ప్రాచీన భారతీయ సంస్కృతి అభిమానంతో నిద్రాణమైన జాతిని మేల్కొలిపిన దేశాభిమాని **అతడు.**

తన జాతి, తన దేశం విదేశ సాంస్కృతిక బానిసత్వం నుండి బయలు పడాలని అకుంఠిత దీక్షతో పోరాడిన వ్యక్తి విశ్వనాథ. ఈ బానిసత్వమే మన పాలిట బంగారు బ్రదుకని గళమెత్తినవాడు గురజాడ. ఇదే కోవకు చెందినవాడు వీరేశలింగం. వీరికి, విశ్వనాథకు పోలికెక్కడ!

సమాజంలో విప్లవం రావొచ్చు. నాకూ అది సమ్మతమే! అయితే ఆ విప్లవం వచ్చేవఱకు స్వేచ్ఛా విహంగాలుగా తిరిగే కవీశ్వరులను సిద్ధాంత ఉక్కు పంజరాలతో బంధించి, మీరు ప్రజలకోసం ఈ విధంగానే పాడాలి అని శాసించే అనాగరికత తత్త్వంపై నాకు జుగుప్స.

డా. **మురళీధర్**

తెలుగులో మొట్ట మొదటి పిహెచ్. డి. పట్టము

సంప్రదింపు గ్రంథాలైన 'మహతి', 'తెలుగు పరిశోధన సంహిత'లలో తెలుగులో మొట్టమొదటి పిహెచ్. డి. పట్టము పొందిన ప్రాతః స్మరణీయులు చిలుకూరి నారాయణరావుగారి పేరు, పరిశోధన వివరాలు పేర్కొనబడకుండుట విచారకరం. సంప్రదింపు గ్రంథాలలో అప్రామాణిక విషయాలకు ప్రాధాన్యం లభించి, ప్రామాణిక విషయాలకు చోటు లభించకపోవటం గర్హించతగిన సంగతి.

డా. జి. ఎస్· మోహన్‌గారు తెలుగులో మొట్ట మొదటి పిహెచ్. డి. పట్టం పొందిన పరిశోధకులు చిలుకూరి నారాయణరావుగారే అని సోపపత్తికంగా నిరూపించినారు. కాకర్ల వెంకటరామ నరసింహంగారిని ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగులో పిహెచ్.డి. పొందిన వారిలో ప్రథములుగా అంగీకరిస్తూ, వారి సిద్ధాంత వ్యాసం తెలుగులో వ్రాయబడిన మొట్టమొదటి పరిశోధకవ్యాసమని మోహన్ గారు అభిప్రాయ పడినారు. కాగా ఒ. వి. గారు ''సిద్ధాంతవ్యాసాన్ని తెలుగులో వ్రాసి అచ్చు వేయించుకొన్న వారిలో కూడా డాక్టరు రావు గారే ఆద్యులు'' అని ప్రమాణపూర్వకంగా నిరూపించి పుణ్యం కట్టుకొన్నారు.

తెలుగులో అకాడమీ దశమ వార్షికోత్సవ సందర్భంగా డా. ముకురాల రామారెడ్డిగారు ''తెలుగు భాష ఆధునికీకరణ'' (ఆంధ్రప్రభ, రాయలసీమ ఎడిషన్ మార్చి 27, 1979) అనే వ్యాసంలో 'తెలుగు పరిశోధన సంహిత' పరిష్కృత ముద్రణకూడా రాబోతున్నదని వ్రాసినారు. ఈ మలి ముద్రణలో సంపాదకులు డా. చిలుకూరి నారాయణరావు గారిని తెలుగులో మొట్ట మొదటి పిహెచ్. డి. పొందినవారుగా (1927? 28?) వివరాలతోసహా పేర్కొంటారని ఆశిస్తున్నాను.

ఈ సందర్భంగా మరొక ముఖ్య విషయాన్ని 'తెలుగు పరిశోధన సంహిత' సంపాదకులకు మనవి చేస్తున్నాను. సంహితలోని 'ప్రవేశిక'లో ''దేశీయ విదేశీయ విశ్వ విద్యాలయాలలో తెలుగు భాషా సాహిత్యాల గూర్చి జరిగిన, జరుగుతున్న పరిశోధన కృషిని రేఖా మాత్రంగా ఈ సంహిత వివరిస్తుంది'' అని వ్రాయబడి వున్నది. తెలుగుభాషా సాహిత్యాలగూర్చి తెలుగులోను, ఇంగ్లీషులోను సిద్ధాంత వ్యాసాలు వ్రాసి డిగ్రీలు పొందినవారి (1975 వరకు) సిద్ధాంత రచనకు పేర్లు నమోదు చేసుకొన్నవారి పేర్లు, (1974 వరకు) వివరాలు సంహితలో ఇయ్యబడినాయి. తెలుగు భాషా సాహిత్యాల గూర్చి తెలుగు, ఇంగ్లీషులలోనే కాక ఇతర భాషలలోకూడ సిద్ధాంత గ్రంథాలు వ్రాయబడి వుండవచ్చునన్న ఆలోచన సంహిత సంపాదకులకు కలిగినట్లు తోపదు. తెలుగు భాషా సాహిత్యాల గురించి ఏ భాషలో పరిశోధన జరిగినా అది 'తెలుగు పరిశోధన సంహిత'లో పేర్కొనదగిన నలసినదే కదా!

శ్రీ కర్ణ రాజశేషగిరిరావు గారు 'ఆంధ్ర కే లోక్ గీత్' (తెలుగు జానపద గేయాలు) అనే సిద్ధాంత వ్యాసాన్ని హిందీలో వ్రాసి ఆగ్రా విశ్వ విద్యాలయానికి పిహెచ్. డి. నిమిత్తమై 1965 లో సమర్పించినారు. కొంత కాలానికే వీరికి పిహెచ్. డి. డిగ్రీ లభించటమే కాక, వీరి పరిశోధనను హిందీ జానపద విద్వాంసులు ముక్త కంఠంతో ప్రశంసించినారు. ఈ విశిష్ట పరిశోధనా గ్రంథము ఆంధ్ర విశ్వ విద్యాలయము ద్వారా 1974 మార్చిలో ముద్రింపబడినది కూడా. (పేజీలు IX+322; వెల: రు. 34-50).

తెలుగు పరిశోధన సంహిత 1975లో అచ్చయినది. దీనిలో ఈ విషయము ప్రస్తావింపబడకుండటం విచారకరం. సంహిత పరిష్కృత ముద్రణలో ఈ పరిశోధన గురించి పేర్కొనబడగలదని ఆశిస్తున్నాను. తెలుగుభాషా సాహిత్యాల గురించి ఏభాషలో జరిగిన,

జరుగుతున్న పరిశోధన కృషిని కూడా సంపాదకులు సేకరించి, ప్రచురించెదరని ఆశిస్తున్నాను.

మరొక మనవి: తెలుగు—హిందీ భాషా సాహిత్యాల గూర్చి హిందీలో తులనాత్మక పరిశోధన ఎక్కువగా జరిగింది; జరుగుతున్నది కూడా ఎన్నో విలువైన సిద్ధాంతవ్యాసాలు హిందీలో అచ్చయినాయి. హిందీవారు ఇటువంటి తులనాత్మక పరిశోధనలకు పిహెచ్. డి., డి. లిట్ డిగ్రీలు ప్రసాదించి చేతులు కడుక్కొన్నారు! మరి మన తెలుగువారో? కట్టుకొన్న చేతులు విప్పి ఆ గ్రంథాలను తాకిన పాపాన పోని పుణ్యాత్ములు!! హిందీ — తెలుగు తులనాత్మక పరిశోధనలను కూడ 'తెలుగు పరిశోధన సంహిత'లో చేర్చే అవసరమున్నదని నేను భావిస్తున్నాను.

ఈనాడు తెలుగు భాషా సాహిత్యాల గురించే తెలుగులో ఎక్కువగా పరిశోధన సాగుతున్నది. తులనాత్మక సాహిత్య పరిశీలన తెలుగులో జరిగింది చాలా తక్కువ; జరుగుతున్నది మరింత తక్కువ. జాతీయ సమైక్యత దృష్ట్యా, తెలుగు సాహిత్య వికాస రీత్యా తులనాత్మక పరిశోధన ఎంతో అవసరం. తెలుగులో ద్రావిడ భాషా సాహిత్యాలతో తులనాత్మక పరిశోధన కొంత జరిగింది, జరుగుతున్నది తెలుగువారిలో తమిళము, కన్నడము, మలయాళము తెలిసినవారికంటే హిందీ తెలిసినవారు చాలామంది ఉన్నారు.

హిందీ సాహిత్యాధ్యయనానికి సౌలభ్యాలు కూడ ఎక్కువ. కాన తెలుగు—హిందీ సాహిత్య తులనాత్మక పరిశోధనద్వారా తెలుగు సాహిత్య పరిశోధన కొత్తరూపు సంతరించుకోకలదు. హిందీలో తెలుగు—హిందీ భాషా సాహిత్యాల గూర్చి జరిగిన, జరుగుతున్న పరిశోధన వివరాలను సంహితలో ప్రకటిస్తే తెలుగు పరిశోధకులకు, పర్యవేక్షకులకు మార్గదర్శనం లభించగలదని విశ్వసిస్తున్నాను. ఈ విషయమై తెలుగు సాహిత్య పరిశోధకులు, పర్యవేక్షకులు ఆలోచించవలసిన సమయం ఆసన్నమైనట్లు నేను భావిస్తున్నాను.

శ్రీ ఘట్టుమరాజు అశ్వత్థనారాయణ

శాతవాహనులాంధ్రదేశీయులేనా?

తొలి ఆంధ్రదేశ రాజులుగా పరిగణింపబడుతున్న శాతవాహనుల స్వస్థలం మహారాష్ట్ర ప్రాంతమని చిరకాలంగా వాడుకలోవున్న విషయం. అయితే యిటీవలి కాలాలలో మన రాష్ట్రంలో జరుగుతున్న త్రవ్వకాలనుబట్టి శాతవాహను లాంధ్రదేశీయులనే భావన అనుమానం స్థాయినుంచి నమ్మకంలోకి వస్తున్నది. ధూళికట్ట ప్రాంతంలో శాతవాహనుల మృణ్మయపాత్రలు దొరికిన వైనాన్నిబట్టి ఆ ప్రాంతమంతా శాతవాహనుల జన్మస్థలంకాని, లేదా కనీసం తొలినివాస ప్రాంతంగాని అయివుంటుందని వూహ. అంతకుపూర్వం మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతమని భావించిన భ్రమలు తొలగుతున్నాయి.

చారిత్రికుల నిర్ణయాలనుబట్టి కరీంనగర్ జిల్లాలో నాటి శాతవాహన స్థావరాలుగ పరిగణింపబడిన అనేక స్థలాలున్నాయి. వాటిని త్రవ్వకపోతేనే అడపా దడపా కొన్ని నాణేలు బైటపడుతున్నయట. త్రవ్వితే మరెన్ని విషయాలు వెలికివస్తాయో? ఇటీవల పురావస్తు శాఖ డైరెక్టరుగారికి దొరికిన కొన్ని నాణేలలో ఒకటి శ్రీముఖ శాతవాహనుని కాలంనాటిదట. నానాఘాట్ శాసనాన్నిబట్టి శ్రీముఖుని వివరాలు కొన్ని తెలియగా, ఈ నాణాలబట్టి మరికొన్ని విశేషాలు తెలుస్తున్నవట. ఈ నాణాలలో కొన్ని మిశ్రలోహానివి, కొన్ని రాగివి. వాటిపైన "జ్యోసిరి ఛిముక సాతవాహినీ" అని వున్నదట. "జ్యోసిరి" అంటే ప్రాకృత భాషదృష్ట్యా "రాజశ్రీ" అనవచ్చు. ఛిముక-అనేది శ్రీముఖుని వికృతిరూపం కావచ్చునని, పురాణాలలో,నానాఘాట్ లోనూ వున్న శ్రీముఖ బదులుగా "సిముక" అని వున్నదాన్నిబట్టి విజ్ఞులు వూహించారు 'సి'కి 'చి'కి వర్ణ వ్యత్యాసం ఆట్టే లేదు కనుక వర్ణపరిణామరూపంలో నాణెంలో అలా వుంచబడింది. ఈ వర్ణపరిణామాన్నిబట్టి కూడా శ్రీముఖుని కాలాన్ని క్రీ పూ. 50వ సంవత్సరానిదిగా భావించారు. అంటే శాతవాహనుల కాలంకూడ కొంత మారుతుంది.

ఈ నాణాలలో కొన్ని యిప్పటివరకూ ఎక్కడా దొరకని సుంగ వంశపు రాజుల నాణాలు కూడవున్నాయట. వీటిలో కొన్ని ఆ రోజులలో ప్రశస్తుడైన భద్రఘోషుని కాలపువి. ఈ రాజులు శాతవాహనులకు సమకాలికులని చరిత్రకారుల భావన. కనుకనే వెలికి రావటంలో కూడ సమానాంతరత కనబడింది. వారు పాలించిన విదర్భ రాజ్యపు నాణేలు కరీంనగర్ ప్రాంతంలో దొరకటంవల్ల ఆ రాజ్య వ్యాప్తిని యిది సూచించవచ్చు. లేక శాతవాహన రాజ్యానికి, విదర్భ రాజ్యానికి చక్రవర్తి, సామంత భావాలుండేవా? ఇవి యింకా పరిశోధనలో తేలాల్సిన అంశాలు.

గుంటుపల్లి శాసనాన్నిబట్టి ఖారవేలుడు నాసిక్‌పై దండయాత్ర చేశాడని అంతకు పూర్వంవున్న భావన తొలగిపోతున్నది. ఖారవేలుడు కనుక సుంగవంశపురాజు అని బుజువైనట్లయితే అతడు శాతవాహనుల స్థావరమైన కోస్తా ఆంధ్రపైననే దాడి చేశాడని నిరూపించవచ్చు. అప్పడే నాణేల పరస్పర సంబంధంకూడ పునరుద్ధాపితం అవుతుంది. అప్పుడు శాతవాహనుల ఉనికి, ప్రభుస్థానం, అన్నీ ఆంధ్రదేశానికే అన్వయించవచ్చు

ఆరవ శతాబ్దంలో భారతదేశానికి వచ్చిన హ్యూయన్‌త్సాంగ్ తన యాత్రా విశేషాల వివరాలు చెబుతూ దక్షిణ కోసల, అక్కణ్ణించి "అన్‌టోలో"కు, దాని ప్రధాన నగరం "పింగ్‌కిలో"కు అక్కణ్ణించి 'ధనకడ'కు వెళ్ళాననటంలో "అన్‌టోలో" అంటే ఆంధ్ర అనీ, పింగ్‌కిలో అంటే ఫణిగిరిఅనీ, అక్కణ్ణించి ధాన్యకటకమని ధనకడను భావించుకోవచ్చు. ఈ సమన్వయం కుదిరితే శాతవాహనుల తొలిస్థావరం కరీంనగర్ ప్రాంతమనీ, తరువాత వారు చొచ్చుకు వచ్చి ధాన్యకటకాన్ని రాజధానిగా బృహత్సామ్రాజ్య పాలకులైనారని భావించవచ్చు.

కనుకనే ప్రముఖ పరిశోధక ప్రభువులు కొమర్రాజువారు నిజాం రాజ్యంలోని ఆంధ్ర జిల్లాలలోనే శాతవాహనుల ఆది చరిత దొరుకుతుందని అరవై సంవత్సరాల క్రిందటనే తెలిపారు. గత సంవత్సరం జనవరిలో మద్రాసులో జరిగిన పురావస్తుశాఖ కాంగ్రెస్ సభలో ఈ నాణేల విశేషాలను, వివరణలను రాష్ట్ర పురావస్తుశాఖ డైరెక్టరుగారు వివరించిన తదుపరి జరిగిన కృషి, త్రవ్వకాల పరిశోధనలు వెల్లడి అవుతే శాతవాహనుల ఆంధ్రత్వం తప్పనిసరిగా నిర్ధారణ అవుతుంది. ఈ రంగంలో యింకా విశేషకృషి జరగగలదని ఆశిద్దాం. కోస్తా ఆంధ్ర ప్రాంతంకన్న, తెలంగాణా ప్రాంతంలోనే ఈ పరిశోధనల కవకాశం యెక్కువగా వుంది.

సుచంద్ర

మత్తేభ వృత్త వివరణ

'భారతి' – ఏప్రిల్ 1978 – శ్రీ మల్లినాథ సూరిపై ముత్యంపేట సాంబారాధ్య శాస్త్రిగారు వ్రాసిన శ్లోకాలు – మత్తేభ వృత్త నామకరణ చర్చ :

సూచికలు – (1) 'భారతి' – డిసెంబరు '78 – కలగూర గంపలో నా చర్చ ''పద్య విద్య : ఛందస్సు'' – (5 వ అంశం).

(2) 'భారతి' – ఏప్రిల్ '79 – లేఖల్లో (చివరిది)లో ముత్యంపేట సాంబారాధ్య శాస్త్రి ఇచ్చిన వివరణ (శీర్షిక లేదు).

ముత్యంపేట సాంబారాధ్య శాస్త్రిగారు ''త–భ–య–జ–స–ర–న–గ'' అనే గణాలతో నడిచే తమ మొదటి శ్లోకాన్ని ''మత్తేభ వృత్తమ్'' అని పేర్కొన్నారు. తర్వాత, సూచిక 2 లో వారు చెప్పిందే ఒప్పు.

అయితే మత్తేభ మంటే మామూలుగా తెలుగులో వాడుక ప్రకారం 'మత్తేభ విక్రీడిత'మని అభిప్రాయం ''మత్తేభ విక్రీడితం కానేకాదు''అని నేను వ్రాసివుంటే, పేరును గురించి నాపొరపాటును శాస్త్రిగారు సవరించి వుందురు; వారు వ్రాసింది మత్తేభ విక్రీడితం కాదని, ''మత్తేభ'' మనబడే మరొకరకం (22వ ఛందస్సులోనిది) పద్య మని వారు చెప్పిం తర్వాత గుర్తిస్తున్నాను. మత్తేభ విక్రీడిత వృత్తం (20 వ ఛందస్సు : స–భ–ర–న–మ–య–వ గణాలతో నడిచేది), మత్తేభ వృత్తం వేరు వేరు అన్నది సారాంశం. నా పొరపాటును గుర్తించి సవరించుకొంటున్నాను. ఈసందర్భంగా శాస్త్రిగారికి కృతజ్ఞుడిని.

శాస్త్రిగారు వ్రాసిన శ్లోకాలలోనే 13 వది ''శార్దూలమ్'' అన్న వృత్తం ''శార్దూల విక్రీడితమ్'' అని వుండవలసింది. అయితే శార్దూల విక్రీడితాన్ని మామూలు వాడుక ప్రకారం శార్దూల మని అంటాము. శార్దూల విక్రీడితాన్ని శార్దూలమని శాస్త్రిగారన్నట్టు, మత్తేభ విక్రీడితాన్ని మత్తేభ వృత్తమని పేర్కొన్నారని, కాని అది మత్తేభ విక్రీడితం కాదని, నేనసలు చెప్పదల్చుకొన్నది. నామకరణం వల్ల జరిగిన పొరపాటు ఇది.

శాస్త్రిగారు పేర్కొన్న మత్తేభ వృత్తాన్ని నేను 'అశ్వధాటి' వృత్తమని చెప్పారు అని సూచించడం 'శ్రుత పాండిత్యం' తోనే. చదివిన గుర్తో, విన్న గుర్తో స్పష్టం చెయ్యలేక పోతున్నాను. మన్నించ ప్రార్థన.

శ్రీ బండి నాగరాజు

లేఖ

''పొగడ దండ''

'భారతి' జనవరి సంచికలో శ్రీ క్రరా చంద్రశేఖరశాస్త్రిగారి ''దీనారటంకాలు'' సమీక్షించుచు శ్రీ అంగిరస 'పొగడ దండ' శబ్దముపై కొంత సందేహమును వెలిబుచ్చిరి. దానిపై నా యభిప్రాయమును వ్యక్తము చేయుచున్నాను.

శబ్దరత్నాకరము 'దండ'ను విడిచి 'పొగడ–బొగడ' శబ్దములకు సముచితార్థములనే ఉదహరించెను. కాని దండతోడి సమాస పదమును స్వీకరింపనేలేదు. ఇక సూర్యరాయాంధ్ర నిఘంటువు పరుషాదిగనే దానిని గ్రహించి (పొగడ + దండ=పొగడ పువ్వుల దండ వైచికొనుచోట వేయునది అని వ్యు ?) వ్యుత్పత్తిలో సందేహమునే వెలిబుచ్చెను. పరుష–సరళాదుల రెండిట దీనికి అపరాధుల కాలికి–మెడకు తగల్చెడు ఒక దండన సాధనమనుట నిశ్చయమే! సూ. ని. సందేహ వ్యుత్పత్తి కంటె సరళాది పద వ్యుత్పత్తిలో కొంత సామంజస్యము ఉండవచ్చు. ఏలనన – బొగడ= (మొనగా నుండు) గుబ్బ అని యర్థమున్నది గదా! కోట తలుపులకు, ఇంటి తలుపులకు ఇట్టి గుబ్బలుండుట లోకసహజము. ఏనుగులు కుంభములతో కవాటములను బ్రద్దలు చేయకుండుటకై దీనినిఆదిలో ఉపయోగించిరి. అది యిళ్లకు కూడ రివాజైనది. కాగా ఇది గ్రుచ్చుకొను సాధనమన వచ్చును. ఈ సరళ వ్యుత్పత్తితోడి సరళాది (బొగడ దండ) ని విడిచి ప్రామాణికములగు 1. '......దురెండం బొగడ దండ' (శ్రీనా. చాటువు); 2. '......నా పొగడ దండయు మీమ్మైతే, ... వెలదీ! నినుం బొగడ దండ వేయింతుం జుమీ'; 3. 'మెడను మీం గాలికిం బుడమికిం గొనసేయం బొగడ దండలతోన పొలియువారు' (రామాభ్యుదయము).

ప్రయోగములలో ద్రుతముపై వచ్చిన సంధి సరళమగుటచే ఈ పదమును సూ.ని పరుషాదిగనే నిర్ణయించెను. శ్రీ శాస్త్రిగారు నిఘంటు నిర్మాణములో కొంత శ్రమించిన కారణాన పరుషాది పదమునే ప్రామాణికముగ గ్రహించియుందురు. పై ప్రామాణిక ప్రయోగములలో గరసున్న తొలగించినచో సరళాదిగ వ్యుత్పత్తికి సన్నిహితమగునేమో విజ్ఞులరయుదురు గాక!

శ్రీ క్రరా కార్తికేయశర్మ

గ్రంథవిమర్శలు

జీవిత లహరి

[పొట్నూరి స్వామిబాబు జీవిత చరిత్ర-సంకలనకర్త విద్వాన్ వాసా కృష్ణమూర్తి, డెమ్మీ 179 పుటలు. వెల : **అమూల్యము.** గ్రంథము శ్రీ సత్యసాయి బాబాగారి ఆశీస్సుల నందినది.]

ఉత్తరాంధ్ర రాష్ట్రమున — శ్రీకాకుళము మండలమున శ్రీ పొట్నూరి స్వామిబాబుగారి పేరు వినని వారలులేరు. వారి నివాస స్థానము నరసన్నపేట. నరసన్నపేట యన్నను స్వామిబాబుగారన్నను నొక్కటియే. వాస్తగ్రామమునకు నిజనామమునకు నవినాభావ సంబంధము.

శ్రీ స్వామిబాబుగారిని గూర్చి ఇప్పటికి నలుబది యొుదేండ్ల క్రిందట నేనును నా మిత్రుడు కీర్తిశేషుడగు గంటి శాస్త్రియు (గంటి సూర్యనారాయణశాస్త్రియు) కల్యాణి పత్రికయందు వ్రాసి యున్నాము. సకల ప్రజాహిత సంస్థలయందును, సంస్కృతాంధ్ర భాషా కవి పండిత పోషణమునను శ్రీ స్వామిబాబుగారు స్వామిత్వము వహించి యున్నారనుట స్వాభావికమే. అతిశయోక్తి ఆవంతయులేదు.

కళింగ వైశ్యులైనను — ఉత్తరాంధ్రప్రాంతము వారైనను శ్రీ స్వామిబాబుగారు యావదాంధ్ర దేశమునకు సంబంధించిన మహా పురుషులు నిష్కలంక ప్రవర్తన, నిరంతర పరోపకార పారీణత వీరి వైజధర్మములు.

"హృదయవచశ్శరీరముల నెంతయు పూర్ణసుధా ప్రపూర్ణులై
ముదముబహోపకారములు మూడు జగంబులకున్ ఘటింపుచున్
మది నవికారయుక్తులగు" మాన్యులు కొందఱీలో
శ్రీ పొట్నూరి స్వామిబాబుగారొకరు.

శ్రీ స్వామిబాబుగారిని గూర్చి నేను రచించిన రెండు పద్యములు (1934) నిట నుదాహరించుచున్నాము.

శ్రీ రమణీ మనోహర విరించి దిగీశ్వర సర్వదేవతా
వారనుపూజితుండగు శివారమణుండిడి శ్రీలు చాల పొ
ట్నూరి కులాబ్ధి చంద్రుడు కడుం గడుమించినయార్యవైశ్యజా
హారసుహీరుడైన నముదంచితుడే నలస్వామి బాబుకున్

అడిగిన వారికి యర్థమ్ము వెంటనే
ప్రియమున గూర్చెడి పెద్దజేబు
సకల ప్రజావ్యవస్థలను చక్కగ తాను
సంతన జేసెడి సరి షరాబు
అందఱు నాల్కలం దాడునట్టి వచోవి
కాసితుడయినట్టి ఘన గరీబు
పేర సాహూజిక వ్రాతంబు సరిదిద్ది
జాణతమించెడుసరి జవాబు
కోరువారల కెల్ల బంగారు నేబు—
ప్రకటమే నరసన్నపేటకు మతాబు
కరుణమించెను నాతమ్మికంటిబాబు
ప్రథితుడైనట్టి పొట్నూరి స్వామిబాబు

స్వామిబాబుగారు 95 యేండ్లవయసున శివానుగ్రహమున ఆరోగ్యవంతులై యున్నారు. శివుడు వారికి శతావర్షములాయువు ప్రసాదించుగాత.

వారి శిలావిగ్రహము నరసన్నపేటలో స్థాపించుట ఆ పేట వాసుల కర్తవ్యము.

మధుర నాయకరాజులు

[మధుర నాయకరాజులు-చల్లా రాధాకృష్ణశర్మ, పుటలు 124. క్రౌను-వెల 5-00. లక్ష్మీనారాయణ గ్రంథమాల, 5, నాగార్జున నగరము, మదరాసు-24.]

తమిళనాడులో తెనుగు తమిళ సాహిత్య సేతువుగా ప్రసిద్ధికెక్కిన డాక్టరు చల్లా రాధాకృష్ణశర్మగారు రచించినదీ గ్రంథము.

తమిళ నాటిని మూడువందల యేండ్లవిచ్చిన్నముగా పరిపాలించిన తెనుగు నాయక రాజులలో ప్రధానులైనవారు, తంజావూరు మధుర తెనుగు నాయకరాజులు. వీరిలో మధుర నాయక రాజులను గూర్చి తెలిపెడిది యీ గ్రంథము. ఇందలి విషయములు పందొమ్మిదేండ్ల క్రిందట క్రీ. శ. 1960లో మదరాసు విశ్వవిద్యాలయము వారు ప్రకటించిన దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయము అను గ్రంథమున సవిస్తరముగా తెలుపబడినవి.

గ్రంథకర్త ప్రస్తుత సమీక్షాకర్తయే. దీని 3వ ముద్రణము క్రిందటి యేడు వెలువడినది.

ఇందు సంగ్రహముగా, సరళమైన రీతిని మధురనాయక రాజచరిత్ర చెప్పబడినది. సాహిత్యముతో చరిత్ర తెలుసుకొనుట యావశ్యకమే. అందుచేత నీ గ్రంథము నభినందనీయము. మధుర తెనుగు సాహిత్య విశిష్టతతోపాటు తమిళ సాహిత్య చరిత్ర కవులు కూడ తెలుపబడిరి. ఆనాటి సాంఘిక వ్యవస్థ ముఖ్యముగా తమిళ దేశమున క్రైస్తవమత వ్యాపనము గూర్చి వ్రాసినది ఎన్నదగినది.

కవులకృతులు

ఇందు కవుల పేళ్లున్నవి కావ్యములు పేర్కొనబడలేదు. కుందుర్తి వేంకటాచలకవి మిత్రవిందా పరిణయము, వెలగపూడి కృష్ణయార్యుని భానుమద్విజయము లేవు. ఈ భానుమద్విజయము తమిళభాషలోని కనువదింపబడినది.

విగ్రహముల ఛాయాచిత్రములు

మధురలోని వసంత మండపమున మన్న నాయకరాజుల విగ్రహముల ఛాయా చిత్రములు పుస్తకములో ఆయా చోట్ల చేర్చినచో తెలుగు ప్రజలకు వారి కీర్తిమూర్తులను జూచు భాగ్యమబ్బెడిది. మలిముద్రణముననైనను వీటిని చేర్చెదరని నమ్ముచున్నాను.

శాసనములు

మధురనాయక రాజులు తెలుగుభాషలో శాసనములు వ్రాయించుట విశేషము. వీని వివరములు సంగ్రహముగా నిచ్చిన బాగుండెడిది. ఇన్ని తెలుగు శాసనములను ఇతర నాయక రాజులు వేయించలేదు. లేఖలు గూడ తెలుగున గలవు. ఇవిపై మదరాసు విశ్వవిద్యాలయ గ్రంథము గలవు. జాతీయ సమైక్యత పెంపొందించు నీ నాడిట్టి గ్రంథమును తెనుగు వారాదరింతురుగాక.

కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు

డమరుధ్వని

[కవితాసంపుటి — సీరపాణి. 48 పొరటలు; వెల రూ. 3/ ప్రతులకు : సీరపాణి, యం. సీతారాంపురం, శ్రీకాకుళం జిల్లా –532461]

డమరుధ్వనివలెనే ఈ కవి రచనలో గంభీరపదబంధాలు, భావోద్వేగాలు వినబడుతున్నవి. ఈయన విద్యా ప్రౌఢి కవిత్వ పాటవం ముకురంలోవలె ఈ రచనలో ప్రతిబింబిస్తుంది. బలరామనాయుడు—సంకేతనామంలో సీరపాణి కావడం—రైతుబిడ్డ కాబట్టి సీరాన్ని (నాగలిని) ధరించడం ఉచితంగా ఉన్నది. బలరాముడు సీరపాణేగదా! నేటి యువకవి సందోహంలో ఇట్టి భాషాప్రౌఢి-నవ్యపద బంధ రీతి—భావ గాంభీర్యము చాలా అరుదుగా కనబడుతున్నవి. ఊహాలతలకు మారాకుబెట్టి పైకి అల్లించగలిగిన భాష-అచ్చతెనుగు సొంపు ఈ చిన్న కబ్బానికి మేలిమి గుణాలు. కాబట్టే రచనకు ప్రైజు వచ్చినది. పేలవంగాని శైలిలో భావి తరాన్ని ప్రబోధిస్తున్నాడు.

పదాలలో బిగువు పొంకము చూడండి:— చిట్టెం గట్టిన చీకటి; ప్రళయ ఘంటికలు మ్రోగెను; రుధిరంలో అనలద్యుతి, ధమనుల్లో డమరుధ్వని; క్షుభిత మానవుల అశ్రువార్నిధులు జలప్రళయమై లేచేవేళ; దిగ్భిత్తికలు ప్రతిధ్వనించే ఆర్తగీతులు; ఈ భీకర వర్తమాన పంచానన వదన గహ్వరం నాకోసం తెరచుకుందని; పాడలేనే అమ్మ కన్నీటిపాట, విప్పలేనే అమ్మ కష్టాల మూట — సుకుమార సరసభావం!; తడియారని బిడియం. కాలాన్ని గురించి ఐన్‌స్టీన్ సిద్ధాంతంవలె లోతుకు దిగి వివరించినాడు. ప్రకృతి సందేశ ఖండిక చదువు ఒంటబట్టిన సంస్కారంతో గంభీరంగా ఉన్నది. ''ఆకలి'' గూడ విషయపూర్ణంగా ఉన్నది. ఇంతెందుకు? కవికి భావుకత ఉన్నది—ఆ భావాన్ని ప్రదర్శించగలిగిన భాష — రచనానైపుణ్యం ఉన్నవి.

ముత్యంపుట్టను, స్వాతి చినుకు చిప్పలోపడవలసిన అగత్యం లేదని నేటి పరిశోధన—ప్రయోగము. కాని కవి సమయాన్ని గ్రహించి ముత్యపు చిప్పను కవి గుండెతో పోల్చడం చాలా రమ్యంగా ఉన్నది.

మరో ప్రపంచంకోసం

[కవితా సంపుటి—రాధేయ. 48 పొరటలు; వెల : 4/-; ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్; రాష్ట్రపతి రోడ్; సికిందరాబాదు—3.]

ఆవేదనకు తగిన భాషలో అనుకొన్న సంగతి చెప్పగలిగిన రచయిత—ఈయన. నేటి సమాజమనే శ్మశానాన్ని కల్యాణ మండపంగా చేయాలని, సోమసుందరంగారన్నట్లు—ఆధునిక కవిత్వానికి ప్రజాభ్యుదయమే ప్రాణస్పందనమని, ఆర్తనాదాలను ఆనందగీతికలుగా మార్చాలని శుభాన్నికోరే ఆశావాది. క్రాస్‌రోడ్స్ శీర్షికలో, ఈరసార్ద్ర హృదయునికి ధర్మకోపం వస్తున్నది. ''ఊరంతా మాటుమణగిందని తెల్సుకొని టవర్‌క్లాక్‌లోని రెండు ముళ్ళూ ఆవేశంతో కవుగలించుకొన్నవి'' అని, రానున్న కథావిషయాన్ని కవితాస్ఫూర్తితో సూచిస్తున్నాడు. పూట గడుపుకోను పరువును అమ్ముకోదలచిన అభాగిని పట్ల—''కన్నీటిధారను సిరాగా మార్చిన'' సన్నివేశం బాగున్నది. ''నీతికి ప్రాణభిక్ష పెట్టాల''ని ఉత్సాహపడుతూ ''దీనికై నిరంతరాన్వేషిని'' అంటున్నాడు.

''యజ్ఞాలు హోమాలు స్వేచ్ఛకు కాంక్షకు పునాదులు'' (వేలంపాట) అంటాడు ఆధునిక యుగానికి సరిపొయ్యే మాటేనా ఇది? సంపాదకులు—''ప్రేమకవిత్వాలు భావకవిత్వాలు వ్రాసేవాళ్లు రాధేయను చూచి సిగ్గుతెచ్చుకో'' మంటాడు; దురుసు మాట! ప్రేమరసం ఇంకిపోయి బీడుబడిన మానసాలవారు నవ్యకవులు అయితే మునిగిపొయ్యేది లేదుగాని, భావకవులు తెనుగు సాహిత్యానికి ఒక నూతన పంథాను అందాన్ని గూర్చినవారేగదా.

డాక్టర్ నారాయణరెడ్డి అన్నట్లు – రాధేయకు కవిత్వం వ్రాయాలనే తపన ఉన్నది. పనికొచ్చే రచనలు చేయగలడు.

కాలాన్ని నిలిపిన క్షణం

[మాదిరాజు రంగారావు, 42 పేజీలు; వెల : రూ. 2/– ప్రతులకు–రసధునీ ప్రచురణలు, క్వార్టర్ 14, కాకతీయ యూనివర్సిటీ, విద్యారణ్యపురి, వరంగల్లు–1.]

ప్రపంచ నదుల తీరాన నిలబడి విశ్వమానవతను వీక్షించే ఈ కవి భాష చాలా బాగున్నది. కాని, కొన్నిచోట్ల భావం భాషం కొంత క్లిష్టంగా ఉన్నది. ''ఏమీ ఎరుగనట్లు పడిఉన్నాయి గిరిలు ఆకాశంవైపు చూస్తూ'' అన్నది ప్రకృతి చిత్రానికి మంచివ్యాఖ్య. ''మానవతా తీరాలు స్పృశిస్తూ వర్తమానతరంగా లోలంతో కదిలే సంస్కృతీ ఝరీ తీరాన ఉంది–మానవ చరిత్ర సర్వం'' అనిన మానవ చరితా నిర్వచనం అర్థవంతంగా ఉన్నది.

ముక్తకాలు–మినీకవితలో కొన్ని రమ్యభావ శబలలను కలిగియున్నవి.

తెలుగులో కవితా విప్లవాల స్వరూపం :

[వెల్లేరు నారాయణరావు, 300 పేజీలు; ధర రూ. 20/– ప్రతులకు : విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ–4.]

ఏ ఒక్క కవి–ఏ ఒక్క పుస్తకంమీదనే థీసీస్ వ్రాసి డాక్టరేట్ పట్టంపొందే ఈ కలికాలంలో, ఇంత సమగ్ర పరనం విపుల రచన చేసిన విమర్శాత్మకమైన థీసిస్ అరుదనవచ్చు. ఇప్పటికి వచ్చిన ఎన్నదగిన పుస్తకాలలో ఇది ఒకటి. వివిధ విషయాలతో నిండి, ఇది ఒక పెద్ద చెరువు మాదిరి ఉన్నది ... ఈ నీటిని ఉపయోగించుకొనే పాఠకుడు, మంచి నీరుకటుకాడై చదువులపంటను పండించుకోవచ్చు.

నారాయణరావు ప్రాగల్భ్యానికి రఘుపతి వెంకటరత్నం నాయుడు బంగారు పతకం వచ్చినది; దేశాలు తిరిగిన అనుభవం సముపార్జించిన గుణాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నవి. తమ మొదటి థీసీసును పెంచి ఈ రూపానికి తెచ్చినామంటారు; అంటే–పాఠక లోక బాహుళ్యానికి పనికి వచ్చేటట్లు చేసినారనుట

ఎన్నో విషయాలు ఏరి ఒప్పుబుపోసి, సమయ సందర్భమెరిగి వాటిని ఔచిత్య మెరిగి ఉపయోగించినాడు. ఇదే ఇందు పనితనం– అంటే ఊబ మగనికి ఊర్వశి దొరకినట్లు కాదనుట. విషయ వైశాల్యం నిమ్నతలకు తగినట్లు భాష పటిష్ఠంగా స్పష్టంగా సూటిగా ఉన్నది. ఇదేగదా రచనకు ప్రాణం. నిర్వచనాలు పైస్థాయి భాషలో అర్థం అవుతున్నవి.

ఇక్కడ విప్లవ పదాన్ని, మా బోటి మితవాదులు యుగమని అన్వయించుకొంటే సరిపోతుంది. ప్రకరణ విభాగాన్ని విషయ గ్రహణశక్తి చేయించినది.

ఆశుసాహిత్యం–ఓరల్ ట్రెడిషన్ అనే దానికి మంచిపేరు. మౌఖిక వాఙ్మయం అన్నాడు–ఆచార్య తూమాటి దొణప్ప. నన్నయకు ముందున్న రచనల స్వరూపం ఇందు విపులంగా చర్చించబడినది. నన్నయకు కన్నడపు పలుకుబడి ఉన్నదంటారు, ఇప్పుడు కొందరు నన్నయ తమిళుడంటున్నారు; విమర్శకులు తేల్చవలసిన విషయం.

''భాష లేఖనంకన్న బహుప్రాచీనమైనది–అన్న అంశం కొత్తగా ఋజువు చెయ్యవలసిన పనిలేదు'' అన్నదే ఈ ప్రకరణానికి కీలకం. లిపితో భాష నడక నేర్చుకొన్నదంటే; అచ్చుకూటంతో పరుగెత్తనారంభించినదనవచ్చునుగదా! ఇందలి ప్రతి ప్రకరణము విషయపూర్ణము, వివరణ కళాశోభితము.

భావకవిత్వాన్ని గూర్చి గుణ లుబ్ధత్వంతో సరితూక చెప్పబడి ఉన్నది. రాయప్రోలు సుబ్బారావు, అబ్బూరు రామకృష్ణరావు ఈ విధానాన్ని ప్రవేశపెట్టినారన్నది బహుజనాంగీకారమైన చారిత్రక సత్యం. కాని, ఈ ఇద్దరిని వీపుదట్టి ముందుకు నడువమనిన, ఆంధ్ర విమర్శక విధాన జనకుడు–కట్టమంచి రామలింగారెడ్డిని విస్మరించడం మంచి పనికాదు; ఇది పొరపాటనుకొంట

కొటేషన్లు ఏ కొద్దిమందికో పరిమితం చేయబడినవి. జాషువా వదలిపెట్టవలసినవాడు కాదుగదా!

విషయ గురుత్వం గలిగిన అనుబంధ సూచికలు, ఏ పే ఆ పేజిక్రిందవేసి ఉంటే చదువుటకు సులభంగా ఉండేది. ఇప్ప పలుమారు వెనుకకు ముందుకు తిప్పవలసి వస్తున్నది. ఇంత చదువరి సాంప్రదాయక (యిక) అని వ్రాయడం వ్రాత పొర కొంటా.

ఈ గ్రంథం ఆంధ్రవాఙ్మయ విమర్శకక్షేత్రంలో ఒక పఠనీయ గ్రంథంగా నిలిచిపోగలదు.

శ్రీ ఎదుపూరు కోదండరామరెడ్డి

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.